

ఈనాడు



విజయవాడ 4-1-2026 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 145

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 18+28 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎదురుకాల్పులు


సచిన్ మంగడు

14 మంది మావోయిస్టుల మృతి..

మృతుల్లో కుంట ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు

11లో

మావోయిస్టులకు మరో గట్టి ఎదురుదెబ్బ

లొంగిపోయిన బడ్సె సుక్క, కంకణాల రాజిరెడ్డి

రూ.20 లక్షల నగదు, 48 ఆయుధాల అప్పగింత

17కు పడిపోయిన తెలంగాణ అజ్ఞాత క్యాడర్

బుద్ధుడు అందరివాడు

• ప్రధాని మోదీ 12లో



వెనెజువెలాపై దాడి.. అధ్యక్షుడి నిర్బంధం

తెల్లవారుజామున విరుచుకుపడిన అమెరికా



పేలుళ్లతో దద్దరిల్లిన రాజధాని కారకాస్

న్యూయార్క్‌కు మదురో దంపతుల తరలింపు

దేశంలో అత్యవసర పరిస్థితి • ప్రభుత్వ బాధ్యతలపై అయోమయం

కారకాస్: దక్షిణ అమెరికా దేశం వెనెజువెలాపై శనివారం తెల్లవారుజామున ఉరుములేని పిడుగులా అమెరికా మెరుపు దాడులకు దిగింది. ఊహించని ఈ దాడులతో రాజధాని కారకాస్ దద్దరిల్లింది. రాజధాని గగన తలంపై అమెరికా యుద్ధ విమానాలు చక్కర్లు కొట్టాయి. పేలుళ్లకు జనం భయపడి బయటకు పరుగులు తీశారు. సైనిక స్థావరాల్లో పొగ, అంధకారం అలముకున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. కారకాస్‌లోని లా కార్లోటా ఎయిర్‌ఫీల్డ్, ఫ్యూర్టే లియునా మిలిటరీ బేస్, లా గ్వైరా నౌకాశ్రయం మొదలైన కీలక సైనిక స్థావరాలపై అమెరికా దళాలు దాడులు చేశాయి. దేశం మేల్కొనేలోగా అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్‌ను అమెరికా సైన్యం.. బంధించి న్యూయార్క్‌కు తరలించింది. అయితే అంతకుముందే దేశంలో అత్యవసర పరిస్థితిని మదురో విధించారు. మరోవైపు దేశాధ్యక్ష బాధ్యతలను ఎవరు చేపట్టారన్న అంశం తేలలేదు. వెనెజువెలా చట్టాల ప్రకారం ఉపాధ్యక్షులుగా ఉన్నవారు అధ్యక్షులవుతారు. కానీ తాను బాధ్యతలు చేపట్టినట్లు ఉపాధ్యక్షురాలిగా ఉన్న డెల్సీ రోడ్రిగ్స్ ప్రకటించలేదు.

ముందస్తు అనుమతి లేకుండానే..

వెనెజువెలాపై దాడుల వివరాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్'ద్వారా శనివారం తెల్లవారుజామున 4.30 గంటల తర్వాత ప్రకటించారు. అయితే ఈ దాడులకు ఆయన కాంగ్రెస్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోలేదు. శనివారం ఆ ప్రక్రియను ప్రారంభించారు. (మిగతా 3లో)



అమెరికా దాడి అనంతరం కారకాస్‌లో ఎగసిపడుతున్న మంటలు

బెల్టులతో కట్టేసి, కళ్లకు గంతలు కట్టి అమెరికా యుద్ధనౌక 'యూఎస్ఎస్ ఇవో జిమా'లో మదురో తరలింపు

వెనెజువెలాను మేమే పరిపాలిస్తాం

అధికారాల బదిలీ జరిగేదాకా అక్కడ ఉంటాం

అవసరమైతే మరింత పెద్ద దాడి

అమెరికా కంపెనీలు చమురు వ్యాపారం చేస్తాయి

ట్రంప్ స్పష్టీకరణ

అగ్గి రాజేసింది చమురే!

12లో

నాడు మిత్ర దేశాలు నేడు బద్ధ విరోధులు

చావెజ్ అధికారంలోకి రావడంతో మారిన వెనెజువెలా-అమెరికా సంబంధాలు

మాతృభాషతోనే గౌరవం

అదే మన గుర్తింపు

ఒక ప్రపంచాన్ని సృష్టించే బలం భాషకు ఉంది

అది వాడుకలో లేకుంటే శరీరం మాదిరే క్షీణిస్తుంది

తెలుగు ఉపాధ్యాయుల కాళ్లు కడిగి దండం పెట్టాలి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ



ఈనాడు, అమరావతి: 'భాషంటే కేవలం భావ వ్యక్తీకరణే కాదు.. ఒక ప్రపంచాన్ని సృష్టించే బలం దానికి ఉంది. పుస్తకాల్లానే భాష మనతో పాటు మన మనసులో, ఆత్మలో ఉంటుంది. వాడుకలో లేకపోతే మనిషిలాగే క్షీణిస్తుంది. మాతృభాష వాడుకలో ఉన్నంత కాలం మనకు గౌరవం, మర్యాద, గుర్తింపు లభిస్తాయి. ఆ పరిస్థితి లేని నాడు ఏమీ మిగలదు' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ అన్నారు. గుంటూరులో శనివారం అట్టహాసంగా ప్రారంభమైన మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలుగు భాష గొప్పతనాన్ని (మిగతా 3లో)

భాషా పరిమళం సంప్రదాయ సౌరభం

గుంటూరులో అట్టహాసంగా ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభలు

అందరి నోట.. తెలుగు మాట

6లో

తల్లి ఒడిలోనే పిల్లలకు భాషపై ఇష్టాన్ని పెంచాలి

మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రముఖ వక్తల మనోగతం

లోపలి పేజీల్లో

ద్రౌపదీముర్ము జీవితం.. ఒక దిక్సూచి

సామాన్య మహిళగా ఆరంభించి అత్యున్నత స్థానానికి చేరారు

ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు

కొండగట్టు అంజన్న రుణం తీర్చుకుంటున్నా

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ధర్మసత్రం, మాల విరమణ క్షేత్రం నిర్మాణాలకు భూమిపూజ



తెలంగాణలోని కొండగట్టులో కారుపై నుంచి అభివాదం చేస్తున్న పవన్

మత్తు వదిలేలా.. మార్పు తెచ్చేలా

'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ పోలీసుల ప్రచారం

ఇచ్ఛాపురంలో ముగిసిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర'





గుంటూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ. వేదికపై ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, మహా సహస్రావధాని కడిమిళ్ల వరప్రసాద్, మహాసభల సమన్వయకర్త రామచంద్రరాజు, తానా పూర్వ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ పూర్వ డైరెక్టర్ జస్టిస్ రఘురామ్, ఏపీ శాసన సభాపతి సీహెచ్ అయ్యన్నపాత్రుడు, సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ, చలసాని ఆంజనేయులు, కొప్పరపు పీఠం వ్యవస్థాపకుడు మాశర్మ తదితరులు

మాతృభాషతోనే గౌరవం

(మొదటి పేజీ తరువాయి)

వివరిస్తూ, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఆయన ప్రసంగంలో ప్రధానాంశాలివీ..

రెండు బంధాలతో పుడతాం

'మనం పుట్టినప్పుడు రెండు బంధాలతో పుడతాం. ఒకటి మాతృబంధం, ఇంకొకటి భాషాబంధం. మాతృ బంధం రక్తబంధమైతే, భాషా బంధం భాషానురక్తంతో ఉంటుంది. భాషంటే కేవలం ఒకరితో ఒకరు మాట్లాడుకునేందుకు, భావ వ్యక్తపరిచేందుకు మాత్రమే కాదు. దానికి ఒక ప్రపంచాన్ని సృష్టించగలిగే బలం ఉంది. భారత రాజ్యాంగంలో మూడు ముఖ్యమైన విష యాల గురించి చెప్పారు. మొట్టమొదటిది స్వేచ్ఛ, రెండోది సమానత్వం, మూడోది రాజ్యాంగంలో పదం వాడినా వాడకపోయినా మనం తెలుగులో బంధుత్వం అని చెప్పుకోవచ్చు. బంధుత్వం అంటే అది మనందరినీ బంధిస్తుంది. అలాగే మనందరం మాతృభాషా వల్ల బంధువులం. ఈ బంధం ఎప్పటికీ వదులుకోలేం. బంధుత్వం వల్ల ఒక గుర్తింపు కలుగుతుంది. వీరెవరు అంటే మా తెలుగువాళ్లు అంటాం. అలా మనకు భాష ద్వారా మర్యాద, గౌరవం, గుర్తింపు లభిస్తాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆ గౌరవం మనకు లభిస్తోందా లేదా అన్న దానిపై ఇప్పటికే చర్చ జరిగింది. భాషను కాపాడుకోవాలంటే ముఖ్యమైనది దాని వాడుక. వాడుక లేనిదే భాష ఉండదు. మనకు గౌరవం, గుర్తింపు, బంధం ఏమీ మిగలవు.



ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరైన భాషాభిమానులు

తప్పనిసరిగా అమలు చేయాలి

భాషను వాడుకలో ఉంచాలంటే పరిపాలన, అధికార వ్యవహారాల్లో తప్పనిసరిగా అమలు చేయాలి. న్యాయ స్థానాల్లో జడ్జి, అడ్వకేట్ తమ కేసు గురించి సరిగ్గా చర్చిస్తున్నారా లేదా అనే విషయం కోర్టుకెళ్లిన ప్రతి ఒక్కరికీ తెలియాలి. అది మన బాధ్యత. అందుకే జిల్లా స్థాయి వరకు న్యాయస్థానాల వ్యవహారాల్లో తెలుగును వాడాలి. దానివల్ల న్యాయాన్ని ప్రతి ఒక్కరి గడప వరకు తీసుకెళ్లాలనే డిక్లరేషన్ సార్థకమవుతుంది. పాఠశాలల్లో తప్పనిసరిగా మాతృభాషలో బోధన ఉండాలి.

తెలుగు ఉపాధ్యాయులను గౌరవించండి

తెలుగువాళ్లమైన మనం తెలుగు ఉపాధ్యాయుడికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వడం లేదనే భావన నా మనసును కలచివేస్తోంది. ఆ గౌరవం ఇవ్వనందువల్లనే ఇవాళ ఈ పరిస్థితి ఉంది. తెలుగు ఉపాధ్యాయులకు [illegible] కాళ్లు కడిగి దణ్ణం పెట్టాలి. వారిని గౌరవించని సమాజం సమాజం కాదు. ఈ రోజు నుంచే గౌరవించి, మన భాషను కాపాడుకోవాలి. ఈ వేదికపై నుంచి నేను చెప్పదలుచుకున్న ముఖ్యమైన విషయమిదే.

నిత్యజీవితంలో అలవరుచుకోవాలి

మన ప్రవర్తన (క్యారెక్టర్ పార్శ్వేషన్)కు దేనికి చాలా పెద్ద అను బంధం ఉందని అంబేడ్కర్ అన్నారు. ఆ క్యారెక్టర్, భాషకు అనుబంధం ఉంది. భాషల్లో మాతృభాషతో ఉండే అనుబంధమే ప్రత్యేకం. ఇవన్నీ పెద్దపెద్ద సభల్లో మాట్లాడుకునే విషయాలు కావు. చిన్నచిన్న పనుల్లో, క్రియల్లో ఉంటాయి. వాటిని మన జీవితంలో చేర్చుకుని తు.చ. తప్పకుండా పాటిస్తూ ఉంటే భాష సార్థకమవుతుంది. తద్వారా మనమూ సార్థకత పొందుతాం. మంచి పద్యాలకు జవాబు నిశ్శబ్దమే. అయ్యన్నపాత్రుడు తన వ్యక్తిగత అనుభవాలతో తెలుగు పరిస్థితిని వివరించారు. జిల్లా న్యాయస్థానాల వరకు తీర్పులు తెలుగులో ఉండాలని జస్టిస్ రఘురామ్ స్పష్టం చేశారు. విశ్వంజీ ప్రవచనంతో పాటు మనస్సుల స్వేచ్ఛను పంచారు. పాఠశాలల్లో తెలుగును తప్పనిసరి చేయాలని లక్ష్మీనారాయణ చెప్పారు. అవధాన ప్రాశస్త్యం, తెలుగుతో దానికున్న అనుబంధాన్ని మాశర్మ చక్కగా వివరించారు. విశ్వామిత్రుడి కుమారుడు ఆంధ్రుడని నాకు ఈ సభావేదికపైనే తెలిసింది. ఇక్కడికి వచ్చి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను.

భాష మన వ్యక్తిత్వాన్ని వృద్ధి చేస్తుంది. 'ఇంత పెద్ద రాజ్యాంగాన్ని మనం రాత్రింబవళ్లు కష్టపడి సిద్ధం చేశాం. ఇంత మంచి రాజ్యాంగం ఉన్నా దీన్ని నడిపించే మనుషులు సరైనవారు కాపోతే ఇది ఉండీ లాభం లేదు. మన దగ్గర మంచి ప్రవర్తన కలిగిన మనుషులుంటే ఇంత పెద్ద రాజ్యాంగం అవసరం లేదు...' రాజ్యాంగ రచన పూర్తి చేశాక అంబేడ్కర్ అన్న మాటలివి. ఆయన ఉద్దేశం సత్ప్రవర్తనకు మించింది ఏదీ లేదని.

భాషతోనే మంచి ప్రవర్తన

ఇంజినీరింగ్, మెడిసిన్, పీహెచ్‌డీలు, సైన్స్, గణితం.. ఇలా దేని వెనక పరుగెడుతున్నామో అవి డబ్బును ఇస్తాయేమో కానీ మంచి నడవడికను నేర్పలేవు. అది తల్లిదండ్రుల పెంపకాన్ని బట్టి వస్తుంది. దానికి భాష తోడవుతుంది. చిన్న పుట్టి నుంచి చక్కటి తెలుగులో మాట్లాడేలా ప్రేరేపించేటట్లుగా జీవనం సాగాలి. చందమామ రావే అన్నా, గోరు ముద్దలన్నా.. నిజము చెప్పదలచుకొని చెప్పినా, పరువు సొమ్ము పాముపాంటిది అని పలికినా వాటిని సామెతలుగా తీసుకుంటాం. కానీ ఈ చిన్న సామెతల్లో పెద్దతత్వం ఉంది. మన వ్యక్తిత్వాన్ని రూపొందించడంలో అవి కీలకపాత్ర పోషిస్తాయి.

నేను సమ్మతిస్తున్నాను

సుప్రీంకోర్టులో ఇద్దరు కంటే ఎక్కువ జడ్జిలు ఉంటే మా పని సులువవుతుంది. మేం వేర్వేరు తీర్పు రాయాల్సిన అవసరం లేకుండా.. 'నేను సమ్మతిస్తాను' అని చిన్నగా రాస్తే సరిపోతుంది. మీరన్న ప్రతి అంశాన్ని, వాగ్దానాన్ని నేను పూర్తిగా సమ్మతిస్తున్నాను. ఇంత పెద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన గజల్ శ్రీనివాస్‌కు ధన్యవాదాలు. ఆయన ప్రతి పాటలో తెలుగు భాషపై అనురాగం, ప్రేమ కనిపిస్తున్నాయి' అని వివరించారు. వందేమాతరం అంటూ జస్టిస్ శ్రీనరసింహ ప్రసంగం ముగించగానే.. సభికులందరూ లేచి నిలుచుని చప్పట్లతో అభినందనలు తెలిపారు.

కొండగట్టు అంజన్న రుణం తీర్చుకుంటున్నా

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



96 గదుల ధర్మసత్ర భవన నమూనా ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న పవన్‌కల్యాణ్. చిత్రంలో బీఆర్ నాయుడు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు

ఈనాడు, కరీంనగర్‌- మల్యాల, కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు అంజన్న అంటే తనకిష్టమని.. ఆయన తనకు పునర్జన్మనిచ్చారని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. గతంలో తన వాహనానికి హైటెన్షన్ విద్యుత్తు తీగలు తగిలినప్పుడు తాను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ తెలియదని.. ఇది ముమ్మాటికీ కొండగట్టు అంజన్న దయేనని చెప్పారు. అందుకే స్వామి పట్ల అపార భక్తిని, కృతజ్ఞతను కనబర్చేందుకు తన వంతు సేవ చేస్తున్నానన్నారు. శనివారం తెలంగాణలోని జగిత్యాల జిల్లా కొండగట్టు పుణ్యక్షేత్రంలో తితిదే నిధులు రూ.35.19 కోట్లతో నిర్మించ తలపెట్టిన 96 గదుల ధర్మసత్ర భవన సముదాయంతోపాటు మాల విరమణ క్షేత్ర నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భూమి పూజ నిర్వహించి మాట్లాడారు. "గతంలో ఈ ఆలయానికి వచ్చినప్పుడు భక్తుల సౌకర్యార్థం వసతి సముదాయాన్ని నిర్మించాలని అర్చకులు కోరారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటవడంతో ఈ విన్నపాన్ని తితిదే బోర్డు సభ్యుల ముందు పెట్టగా వారు ఆమోదించడంతో ఈ నిధులు వచ్చాయి. ఇందుకు సహకరించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడులకు కృతజ్ఞతలు. మోదీ, చంద్రబాబుల సహకారంతో ఇలా అంజన్న దేవుడి రుణాన్ని తీర్చుకుంటున్నా. కొండగట్టు అంజన్న విశ్వాంతర్యామి. ఆయనకు సేవ చేసుకునే అవకాశాన్ని భాగ్యంగా భావిస్తున్నా. తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరిన విధంగా ఇక్కడ గిరి ప్రదక్షిణ వసతికి నా వంతు సహకారం అందిస్తా. నేను కూడా వచ్చి అందు కోసం కరసేవ చేస్తా. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్లూరి లక్ష్మణ్ కుమార్, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు పాల్గొన్నారు. అంతకుముందు ఆలయంలో పవన్‌కల్యాణ్ ప్రత్యేక పూజలు చేశారు. ఉప ఆలయాల్ని కూడా దర్శించుకున్నారు.

రాజ్యాంగానికి మాత్రమే కొమ్ముకాస్తా..

● తెలంగాణలో పోరాట శక్తి ఉన్న యువతకు కొదవ లేదని.. అలాంటి యువతకు జనసేన సిద్ధాంతాలు బలాన్నిస్తాయని పవన్‌కల్యాణ్ అన్నారు. జగిత్యాల జిల్లా నాచుపల్లి సమీపంలోని ఓ రిసార్ట్‌లో తెలంగాణ నలుమూలల నుంచి వచ్చిన పార్టీ ముఖ్య నాయకులతో అంతర్గత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ 'జనసైనికులు తెలంగాణకు భవిష్యత్తు కావాలి. డబ్బున్న నాయకులు నాకు వద్దు.. దమ్మున్న యువత కావాలి. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితోనే నేను పార్టీ పెట్టాను. నాకు సిద్ధాంతం లేదని కొందరు విమర్శిస్తుంటారు.. సిద్ధాంతపరంగా లెఫ్టో, రైటో ఏదో ఒకటి తెల్చుకోవడం తేలిక. కానీ నిలకడగా ఉండటమే కష్టం. అందుకే జనసేన పరంగా నేను సెంట్రలిస్టుని. దేశంలో మెజారిటీ శాతం ప్రజలు పాటించే హిందూ ధర్మం గురించి మాట్లాడినంత మాత్రాన నేను ఇస్లాంను వ్యతిరేకించినట్లు కాదు. నేను ఏ వర్గానికి, మతానికి కొమ్ముకాయను. కేవలం రాజ్యాంగానికి మాత్రమే కొమ్ముకాస్తా. ఏపీ నుంచి తెలంగాణకు వలసలు పెరిగితే ఇక్కడ ఉన్న వారికి ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయి. అక్కడ ప్రగతి కనిపిస్తే వలసలు తగ్గి తెలంగాణ యువతకు కూడా మేలు జరుగుతుంది' అని పేర్కొన్నట్లు పార్టీ నాయకులు ప్రకటనలో తెలిపారు. సమావేశంలో జనసేన రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రామ్, ప్రచార కార్యదర్శి సాగర్‌తోపాటు రాష్ట్ర మహిళా నాయకులు శిరీష, స్వాతిరెడ్డి, లిఖిత పాల్గొన్నారు.

అభివాదం చేస్తూ.. తీగను చూసి అప్రమత్తమై..



పార్టీ నేతలతో సమావేశానంతరం పవన్ కల్యాణ్ హెలిప్యాడ్ వద్దకు వెళ్లడానికి కారులో రిసార్టు నుంచి బయటకు వస్తుండగా గేటు బయట వందల సంఖ్యలో అభిమానులు గుమిగూడారు. వారి కోసమని వాహనంపై కూర్చుని అభివాదం చేస్తూ వచ్చారు. వాహనం ముందుకు కదులుతున్న సమయంలో పైన కేబుల్ టీవీకి సంబంధించిన తీగలు కనపడగానే అప్రమత్తమైన పవన్‌కల్యాణ్ ఒక్కసారిగా వాహనంపైన పడుకున్నారు. తర్వాత లేచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

గ్రహం అనుగ్రహం


4–1–2026 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్యమాసం, బహుళపక్షం
పాడ్యమి: మ. 2-29 తదుపరి విదియ
పునర్వసు: సా. 5-40 తదుపరి పుష్యమి
వర్జ్యం: ఉ. 7-48 వరకు
తిరిగి రా. 1-22 నుంచి 2-54 వరకు
అమృత ఘడియలు: మ. 3-24 నుంచి 4-55 వరకు
దుర్ముహూర్తం: సా. 4-07 నుంచి 4-51 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6.36; సూర్యాస్తమయం: సా.5.35

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	24.0
రాజమహేంద్రవరం	17.0	32.5
అనంతపురం	17.2	32.0
శ్రీకాకుళం	18.0	28.0
గుంటూరు	19.0	29.0
కడప	19.0	29.0
విశాఖపట్నం	19.0	29.4
తాడేపల్లిగూడెం	19.0	30.0
కర్నూలు	19.2	30.9
హైదరాబాద్	19.6	27.3
విజయవాడ	21.2	28.3
ఒంగోలు	21.4	29.5
తిరుపతి	22.0	29.8
నెల్లూరు	22.7	30.8
నరసాపురం	22.8	30.0


ఇదీ సంగతి!



తప్పదు మరి.. ఏం చేస్తాం!
మేమూ అలాగే ప్రతిసారీ ఓటు వేయడానికి వెళ్తూనే ఉన్నాం!!

వెనెజువెలాపై దాడి.. అధ్యక్షుడి నిర్బంధం

(మొదటి పేజీ తరువాయి)



రాజధాని కారకాస్‌లో పలు చోట్ల పేలుళ్లు జరిగాయని, తక్కువ ఎత్తులో విమానాలు చక్కర్లు కొట్టాయని, ఆ వెంటనే పౌరులు, సైనిక స్థావరాలపై అమెరికా దాడులకు పాల్పడిందని వెనెజువెలా ప్రభుత్వం ప్రకటించింది. ఇది అమెరికా సామ్రాజ్యవాద దాడని, ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు నిర్వహించాలని కోరింది. వెనెజువెలాపై అమెరికా దాడిని కొన్ని దేశాలు ఖండించగా.. మరికొన్ని మధ్యవర్తిత్వం వహిస్తాయని ముందుకొచ్చాయి. మరికొన్ని సమర్థించాయి. దాడిని మన దేశంలోని లెఫ్ట్ పార్టీలైన సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఖండించాయి.

■ 2013లో హ్యూగో చావెజ్ మరణానంతరం దేశాధ్యక్షుడిగా మదురో బాధ్యతలు చేపట్టారు. 2018లో మళ్లీ ఎన్నికయ్యారు. అయితే ప్రతిపక్షాలు పోటీ చేయకుండా నిషేధం విధించడంతో ఆ ఎన్నికపై తీవ్ర విమర్శలొచ్చాయి.

■ 1990లో పనామాపై దాడిచేసి అప్పటి అధ్యక్షుడు మాన్యుయెల్ ఆంటోనియో నోరీగాను బందీగా చేసుకున్న 36 ఏళ్ల తర్వాత మళ్లీ ఓ దక్షిణ అమెరికా దేశంపై అమెరికా దాడి చేయడం ఇదే కావడం గమనార్హం.

ఏడుచోట్ల పేలుళ్లు

కారకాస్‌లో తెల్లవారుజామున ఏడు చోట్ల పేలుళ్లు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రజలు భయంతో వీధుల్లోకి వచ్చారు. పేలుడు శబ్దాలను విన్నట్లు కొంతమంది సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. ఈ దాడుల్లో ఎవరైనా మరణించారా అన్న సమాచారం తెలియరాలేదు.

అత్యవసర పరిస్థితి

'బాహ్య శక్తుల నుంచి కల్లోల స్థితి'ని అధ్యక్షుడు మదురో ప్రకటించారని, అన్ని రక్షణ ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించారని వెనెజువెలా ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన వెల్లడించింది. అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో పౌరుల హక్కులను సస్పెండు చేస్తామని, అధ్యక్షుడికి అన్ని అధికారాలను కట్టబెడతామని తెలిపింది. .

■ మదురో, ఆయన భార్యను ఎక్కడికి తరలించిందీ వెల్లడించాలని రోడ్రిగ్స్ డిమాండు చేశారు. వారు బతికే ఉన్నారనే ఆధారాలను చూపించాలని కోరారు.

■ మదురో చివరిసారిగా శుక్రవారం టీవీలో కనిపించారు. కారకాస్‌లో చైనా ప్రతినిధి బృందంతో ఆయన భేటీ అయ్యారు. ఈ దాడులను వెనెజువెలా రక్షణ మంత్రి వ్లాదిమిర్ పాడ్రినో ఖండించారు. ఇది సామ్రాజ్యవాద దాడిగా అభివర్ణించారు. మదురోను వెనక్కి పంపించాలని డిమాండు చేస్తూ కారకాస్‌లో మేయర్ కార్మెన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఫ్లోరిడాలోని వెనెజువెలా జాతీయులు మాత్రం సంబరాలు చేసుకున్నారు. స్వేచ్ఛ లభించిందంటూ నినాదాలు చేశారు.

దాదాపు 30 నిమిషాలపాటు దాడులు కొనసాగాయి.

దాడుల అనంతరం కారకాస్ శివార్లలోని అధికార పార్టీ బలంగా ఉన్న ప్రాంతంలో శనివారం సైనికులు, పౌర మిలీషియా సభ్యులు వీధుల్లోకి వచ్చారు. మిగిలిన ప్రాంతాల్లోని వీధులు నిర్మానుష్యంగా కనిపించాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. అయితే వాహనాలు యథావిధిగా తిరిగాయి.

■ ఒక సైనిక స్థావరంపై పొగ కమ్ముకున్న దృశ్యాలు, మరో సైనిక స్థావరం చీకట్లో ఉన్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారమయ్యాయి.

న్యూయార్క్‌లో విచారణ

మదురో, ఆయన భార్య సిలియాను అమెరికా చట్టాల ప్రకారం న్యూయార్క్‌లోని కోర్టుల్లో విచారిస్తామని అమెరికా అటార్నీ జనరల్ పామ్ బోండీ తెలిపారు. మదురోపై అమెరికా 2020లో 'నార్కో-టెర్రరిజం' కుట్ర అభియోగాలను మోపింది. తాజాగా మరోసారి వారిపై అదే కేసులను మోపారు. దాడుల నేపథ్యంలో అమెరికా పౌర విమానాలు వెనెజువెలా గగన తలం నుంచి వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

'బెడ్‌రూం నుంచి లాక్కెళ్లారు'

వెనెజువెలాపై దాడి చేసిన అమెరికా బలగాలు సైనిక స్థావరంలోని ఇంట్లో ఉన్న మదురో దంపతులను పట్టుకుని.. వారిని బెడ్‌రూం నుంచి లాక్కెళ్లినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో వారు నిద్రిస్తుండగా ఒక్కసారిగా అమెరికా బలగాలు దాడి చేశాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వారిని అమెరికా యుద్ధ నౌక ఐవో జిమా ఎక్కించారు. అది న్యూయార్క్‌కు బయలుదేరింది.

ఎందుకీ దాడి?

వాస్తవానికి డ్రగ్స్ సరఫరాను అడ్డుకోవాలంటూ గత కొన్ని నెలలుగా మదురో ప్రభుత్వంపై అమెరికా ఒత్తిడి తెస్తోంది. అదే సమయంలో తూర్పు పసిఫిక్, కరీబియన్ సముద్ర జలాల్లో సైన్యాన్ని అమెరికా మోహరిస్తోంది. ఇటీవలి కాలంలో పలుమార్లు వెనెజువెలా ఓడలపై దాడులు చేసింది. డ్రగ్ స్మగ్లర్లకు సహకరించే డాకింగ్ ప్రాంతంపై గత వారం దాడులకు దిగింది. శనివారం ఏకంగా ఆ దేశంపైనే దాడులు చేసింది.

దాడుల్లో డెల్టా ఫోర్స్

వెనెజువెలాపై దాడులతోపాటు అధ్యక్షుడు మదురోను బందీగా పట్టుకున్న ఆపరేషన్‌లో అమెరికా డెల్టా ఫోర్స్ పాల్గొంది. మదురోను బంధించడానికి వీలుగా కొన్ని రోజుల ముందే అధ్యక్షుడు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆయన ఎక్కడ ఉన్నాడన్నదీ గుర్తించే బాధ్యతలను సీఐఏకు అప్పగించారు.

చమురు నిల్వల కోసమే కుట్ర: మదురో

'అమెరికాకు కావాల్సింది డ్రగ్స్ నియంత్రణ కాదు. వెనెజువెలాలో ఉన్న అపారమైన చమురు నిల్వలను దక్కించుకోవడమే వారి అసలు లక్ష్యం. అందుకే నా ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తున్నారు' అని గురువారం ఓ ఇంటర్వ్యూలో మదురో స్పష్టం చేశారు.

బాధ్యతలు ఎవరికి?

అధ్యక్షుడు మదురోను అమెరికా బందీగా చేసుకున్న నేపథ్యంలో వెనెజువెలా అధ్యక్ష బాధ్యతలను ఎవరు చేపడతారన్న దానిపై స్పష్టత రాలేదు. ఉపాధ్యక్షురాలిగా ఉన్న డెల్సీ రోడ్రిగ్స్ చేపట్టాల్సి ఉంది. అయితే ఈ రేసులో ఆమెతోపాటు హోం మంత్రి డియోస్‌డాడో కాబెల్లో, రక్షణ మంత్రి పాడ్రినో ఉన్నారు. దాడులు జరిగిన కొన్ని గంటల తర్వాత వీరు ముగ్గురూ టీవీ ఛానళ్లలో కనిపించారు.



వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోర్స్ (పాత చిత్రం)




వెనెజువెలాలోని కారకాస్‌లో పేలుడు సంభవించిన అనంతరం భయంతో పరుగు తీస్తున్న ప్రజలు

జయహో తెలుగు

'అమ్మ భాషతో అనుబంధం ఏర్పడేది ఎప్పుడు?' అనే ప్రశ్నకు 'ఉమ్మనీట బిడ్డ ఉన్ననాడె!' అన్నారు కవులు. శిశువులకు శ్వాస, భాష- అమ్మలనుంచే సంక్రమిస్తుంది. వల అలికిడికి ఉలిక్కిపడే చేపపిల్లల వెన్ను నిమురుతూ నది పాడే నిశ్శబ్దగీతం లాంటిది- ఆ ప్రక్రియ. అదితి కొడుకు వామనుడు. పసిబిడ్డను లాలిస్తూ ఆమె 'నన్ను కన్న తండ్రీ! నాపాలి దైవమా' అంటూ వెన్ను నిమురుతుంది. కన్నకొడుకును- 'కన్నతండ్రీ' అని పిలవడం- మమకారపు నుడికారం. అది తెలుగుభాషకు పోతన అందించిన వరం. అమ్మ స్వరంలోని లాలనను శిశువు గ్రహిస్తాడు. దాన్ని గుర్తించిన తల్లులందరూ 'కన్నా' అన్న పిలుపును భాషకు జోడిస్తారు. 'చందమామ రావె! జాబిల్లిరావె' పాటను ఎన్నో తరాలుగా ఆలపిస్తూ తెలుగుభాషకు అమ్మలు ఇక్షురసాభిషేకం చేస్తూనే ఉన్నారు. 'అది తెలుగుభాష' అని తెలియకపోయినా శిశువులు- ఆ చెరకు తీపిదనాన్ని జుర్రుకుంటూనే ఉన్నారు. ఇది తరతరాల రసప్రవాహం. ఎన్నిసార్లు గుటకేసినా- తీరని దాహం!

'ఏకః స్వాదు న భుంజీత!' రుచికరమైనదాన్ని ఒక్కడే కూర్చుని తినరాదంది వేదం. కాబట్టి ఆ తీపిదనాన్ని జనానికి పంచుతూ, పెంచుతూ వచ్చారు కవులు. 'తెలుగువారల తేటమాటలు, తెలుగువారల తేనెపాటలు, తెలుగువారల మధుర గీతం తెలియ చెప్పర తెలుగుబిడ్డా!' అన్న త్రిపురనేని సూచనతో అమ్మభాషలోని కమ్మదనాన్ని విరివిగా చవిచూపిస్తూ వచ్చారు. 'ఒక్క సంగీతమేదో పాడునట్లు భాషించునప్డు విన్పించుభాష' అంటూ విశ్వనాథ వినిపించిన అమ్మభాషలోని సంగీతలయను తమ వాక్యాల్లో పొందుపరుస్తూ వచ్చారు. దాంతో కలాల్ని ఆకుపచ్చని సిరాలో అద్దిరాస్తే- అక్షరాలు లేలేత గరిక పరకలై పాఠకుల హృదయాలను హరిత వనాలు చేశాయి. నల్లసిరాలో ముంచి రాస్తే- నీలి కలువలై గుండెల్ని బరువెక్కించాయి. ఎర్రసిరాను ఇష్టపడే కలాలు- మంకెన పూలను పూశాయి. 'రుద్రాలిక నయన జ్వాలికలై కలకత్తా కాళిక నాలుకలై' ఆ అగ్నిపూలు కళ్లను ఎరుపెక్కించాయి. ఈ విభిన్న సుగంధాలను ఆస్వాదించే రసజ్ఞులు- కందుకూరి రామభద్రకవిలా 'ఎంత చక్కనిదోయి ఈ తెనుగుతోట! ఎంత పరిమళమోయి ఈ తోటపూలు!' అంటూ మురిసిపోతూ వచ్చారు.

ఆ సృజన వైభవాన్ని, ఆ సౌందర్య విభావరిని పోతనకలంలో దర్శించిన కరుణశ్రీ 'ముద్దులుగార భాగవతమున్ రచియించుచు పంచదారలో అద్దితివేమొ! గంటమును' అని ఆశ్చర్యపోయారు. 'అక్షరాల సత్తా ఎంతటిదో నిఘంటువులు చెప్పలేవు, అది ఉపాసకులకే తెలుస్తుంది' అని తేల్చారు సామవేదం వారు. తెలుగుభాష సొగసుకు ముగ్ధుడైన తమిళ మహాకవి సుబ్రహ్మణ్యభారతి- 'వెన్నెలవేళ పడవ ప్రయాణం చేస్తూ సుందర తెలుంగు గీతాన్ని ఆస్వాదిద్దాం' అని భావుక శ్రేణులకు పిలుపిచ్చారు. పలు భాషలు తెలిసిన కవులు 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని ప్రశంసలు కురిపించారు. 'అమ్మ భాషే మనకు బలం. దాంతోనే లోకాన్ని గెలువగలం' అన్న గట్టి భరోసాను ఇచ్చారు. తరాలు గడిచిపోతున్నా తల్లిభాషతో ముడిపడిన పేగుబంధం ఎప్పటికీ అంటిపెట్టుకునే ఉంటుందని ఎన్నో తరాల కిందటే బర్మా(మయన్మార్)కు తరలిపోయిన తెలుగువారి వారసులు- ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'విశ్వసంఘ్‌శిబిర్‌'లో నిరూపించారు. 'తెలుగుభాష- మా జీవనాడి. అది పేగు ముడి. భాషతో మాది భావోద్వేగ పయనం' అని ముక్తకంఠంతో ప్రకటించారు. తమ తరతరాలకు తెలుగు వెలుగులను పంచుతూనే ఉంటామని శపథం చేశారు. నిజానికి ఆ శపథం- జైత్రయాత్రను కొనసాగిస్తున్న తెలుగురథానిది! జయహో తెలుగు!



నువ్వు చేయాల్సింది చెయ్యి, ఫలితం గురించి ఆలోచించవద్దన్న భగవద్గీతా పాఠాన్ని అనుసరించడం న్యాయరంగంలో ఉన్నవారికి చాలా అవసరం. కేసు పరిష్కరించిన తరవాత లభించే ప్రతిఫలాన్ని ఆశించకుండా న్యాయం తరఫున పనిచేయగలగాలి.

– జస్టిస్ టి.ఎస్.ఠాకూర్

అంగదుడి వివేకం

రామాయణంలోని ప్రతి పాత్ర మనకు ఏదో ఒక జీవిత పాఠాన్ని నేర్పిస్తుంది. వానర రాకుమారుడైన అంగదుడు కూడా అలాంటి పాత్యపుస్తకమే. వాలి కుమారుడైన అంగదుడు శ్రీరాముడి సేవలో తరించి, ధైర్యం, వివేకం, విశ్వాసం కలిగిన నాయకుడిగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు.

అంగదుడు శారీరకంగా బలవంతుడు. మానసికంగా, ఆధ్యాత్మికంగా కూడా శక్తిమంతుడు. సుగ్రీవుడి సైన్యంలో యువ నాయకుడిగా, లంకాదహనానికి ముందు రావణుడి సభకు రాయబారిగా వెళ్లినపుడు అతడి వివేకం స్పష్టంగా తెలుస్తుంది. రావణుడి అహంకారాన్ని, దురాలోచనలను నేరుగా ప్రశ్నించి, సత్యం బోధించడానికి ప్రయత్నిస్తాడు. అంగదుడి మాటల్లో నిగ్రహం, ధైర్యం రెండూ కనిపిస్తాయి.

మరో ముఖ్యమైన అంశం అంగదుడి ఆత్మవిశ్వాసం. తన కాలిని కదిలించగలిగిన వారే తనను ఓడించినట్లు ప్రకటించి, రావణుడి మంత్రులందరికీ సవాలు విసురుతాడు. ఈ ఆత్మవిశ్వాసం కేవలం గర్వం కాదు, అది తన సామర్థ్యాలపై, తాను నమ్మిన ధర్మంపై ఉన్న నమ్మకం. తన తండ్రిని చంపిన శ్రీరాముడి పట్ల ఎలాంటి ద్వేషం లేకుండా, తండ్రి చేసిన తప్పుల పట్ల పశ్చాత్తాపపడి, ధర్మం వైపు నిలబడ్డాడు. ఇది చాలా అరుదైన లక్షణం. అంగదుడు తన కర్తవ్యం పట్ల చూపించిన నిబద్ధత, ఒక ఉన్నత లక్ష్యం కోసం తన వ్యక్తిగత భావాలను పక్కన పెట్టగలగడం నేటి సమాజానికి ఒక గొప్ప పాఠం.



అంతర్యామి

అంగదుడు కేవలం శారీరక బలంతోనే కాకుండా, అనుభవం నుంచి పాఠాలు నేర్చుకుంటూ పరిణతి చెందిన నాయకుడిగా ఎదిగాడు. శ్రీరాముడికి సాయం చేయడానికి వెళ్లినప్పుడు- సుగ్రీవుడు, హనుమంతుడు తదితరుల నుంచి నాయకత్వ లక్షణాలను, దౌత్యనీతిని నేర్చుకున్నాడు. అతడి జీవితం నిరంతర అభ్యాస ప్రక్రియ. రావణుడి సభలో రాయబారి పాత్రలో అంగదుడు ప్రదర్శించిన ధైర్యం, ఆత్మవిశ్వాసం శిక్షణ, అనుభవాల నుంచి సంపాదించుకున్నవే.

అంగదుడి పాత్ర ఒక నాయకుణ్ని మాత్రమే కాకుండా, ఒక ఆధ్యాత్మిక సాధకుణ్ని కూడా సూచిస్తుంది. అతడి ప్రయాణమంతా శ్రీరాముడితో అనుసంధానమై సాగిందే. రాముడి సేవలో తానూ ఒక భాగమని గుర్తించడం, తన జీవితాన్ని ఒక గొప్ప ధర్మం కోసం అంకితం చేయడం అతడిలోని ఆధ్యాత్మిక కోణాన్ని తెలియజేస్తుంది. జీవితంలో ప్రతి పనినీ ఒక ధర్మంగానో లేదా సేవగానో భావించినప్పుడు, అదే ఒక ఆధ్యాత్మిక సాధనగా మారుతుంది.

ధైర్యం, వివేకం, విధేయత, క్షమాగుణం, నిరంతర అభ్యాసం, ఆధ్యాత్మిక చింతనలతో కూడిన జీవితం ఎలా ఉంటుందో అంగదుడు మనకు చూపించాడు. ఈ గుణాలను మనం మన జీవితంలో అలవర్చుకోగలిగితే- సమాజంలోనే కాదు, వ్యక్తిగత జీవితంలో కూడా గొప్ప మార్పులను సాధించగలం. ఆవేశంతో కాకుండా, అంగదుడిలా వివేకంతో వ్యవహరించినపుడే సమాజంలో శాంతి, సుస్థిరత నెలకొంటాయని నేటి నాయకులు కూడా గుర్తించాలి.

– ఎన్.శివనాగేశ్వరరావు



కరెంటు తీగల కథ కంచికి!

విద్యుత్ సరఫరా అనగానే వైర్లే గుర్తుకొస్తాయి. అసలు తీగలు లేకుండానే కరెంటు సరఫరా జరిగితే? రాబోయే కాలంలో దీన్ని సాకారం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. వైఫై తరహాలో వైర్‌లెస్ పద్ధతిలో విద్యుత్‌ను ప్రసారం చేసే పద్ధతులను శాస్త్రవేత్తలు రూపొందిస్తున్నారు. వారి కృషి సఫలమైతే ఆధునిక ఉపకరణాల వినియోగ తీరుతెన్నులే మారిపోతాయి.

ప్రపంచంలోనే తొలి వాణిజ్య సెంట్రల్ పవర్ ప్లాంట్‌ను 1882లో న్యూయార్క్‌లో ప్రఖ్యాత ఆవిష్కర్త థామస్ ఎడిసన్ ప్రారంభించారు. 82 మంది వినియోగదారులకు డైరెక్ట్ కరెంట్ (డీసీ)ను సరఫరా చేశారు. విద్యుత్ శకానికిది నాంది పలికింది. నాటి నుంచి వైర్ల ద్వారానే కరెంటు సరఫరా అవుతోంది. ఇందుకోసం భారీగా స్తంభాలు, టవర్లు, తీగలు వాడాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులకు ముగింపు పలకడానికి వైర్‌లెస్ విద్యుత్ సరఫరాపై శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయత్నాల్లో కొంత పురోగతి సాధ్యమవుతోంది. అంతర్జాతీయ విద్యుత్ సంస్థ అంచనాల ప్రకారం 2030 నాటికి విద్యుత్‌తో సంధానమయ్యే ఉపకరణాల సంఖ్య 250 కోట్లకు చేరుతుంది. దశాబ్దం కిందట వాటి సంఖ్య వంద కోట్లలోపు ఉండేది. వీటికి శక్తిని అందించడానికి వైర్లు అవసరం. దీనికితోడు భూతాపం నేపథ్యంలో శిలాజ ఇంధనాలను తగ్గించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వైర్‌లెస్ విద్యుత్ (పవర్ బీమింగ్) విధానంపై శాస్త్రవేత్తలు ఇప్పుడు తీవ్రంగా కసరత్తు చేయడానికి ఇది కూడా కారణమే.

రకరకాల ప్రయత్నాలు

తీగలు లేకుండా విద్యుత్‌ను బట్వాడా చేయడానికి శాస్త్రవేత్తలు రకరకాల పద్ధతుల్లో ప్రయత్నిస్తున్నారు. ఇందులో ఇండక్టివ్ కప్లింగ్ ఒకటి. ప్రస్తుతం వైర్‌లెస్ ఫోన్ ఛార్జర్లలో ఈ విధానాన్నే వాడుతున్నారు. ఇందులోని ఛార్జింగ్ ప్యాడ్‌లో ట్రాన్స్‌మిటర్ కాయిల్, ఛార్జ్ అయ్యే సాధనంలో రిసీవర్ కాయిల్ ఉంటాయి. తొలుత ఛార్జింగ్ ట్రాన్స్‌మిటర్ కాయిల్‌లోకి విద్యుత్ ప్రవహింపజేస్తారు. ఫలితంగా అక్కడ విద్యుదయస్కాంత క్షేత్రం ఏర్పడుతుంది. గాలి ద్వారా రిసీవర్ కాయిల్ దీన్ని అందుకుని విద్యుత్‌గా మారుస్తుంది. అది ఆ సాధనంలోని బ్యాటరీని ఛార్జ్ చేస్తుంది. రెండోది రెజోనెంట్ ఇండక్టివ్ కప్లింగ్. ఇందులో ట్రాన్స్‌మిటర్, రిసీవర్ కాయిల్స్‌ను ఒకేరకమైన రెజోనెంట్ ఫ్రీక్వెన్సీకి ట్యూన్ చేస్తారు. ఫలితంగా మరింత సమర్థంగా విద్యుత్ బట్వాడా అవుతుంది. మరింత ఎక్కువ దూరం విద్యుత్‌ను పంపాల్సినప్పుడు కరెంటును విద్యుదయస్కాంత తరంగాలు (మైక్రోవేవ్స్, లేజర్లు వంటివి)గా మార్చాల్సి ఉంటుంది. వాటిని గాలి ద్వారా బట్వాడా చేయాలి. ఒక రిసీవర్ వాటిని ఒడిసిపట్టి విద్యుత్‌గా మారుస్తుంది. దిగ్గజ ఆవిష్కర్త నికోలస్ టెస్లా 1890లలో వైర్‌లెస్ విద్యుత్‌పై ప్రయోగాలు చేశారు. భూ ఉపరితలం, ఎగువన ఉండే వాతావరణ పొర అయనోస్ఫియర్‌ను భారీ విద్యుత్ సర్క్యూట్‌గా ఉపయోగించుకుంటూ విద్యుత్, టెలిగ్రాఫ్, రేడియో, కమ్యూనికేషన్ సంకేతాలను ప్రపంచవ్యాప్తంగా ప్రసారం చేయాలని ఆయన తలపోశారు. అయితే దీన్ని సాకారం చేసే పరిజ్ఞానం అప్పట్లో లేదు. ఆ తరవాత వైఫై, వైర్‌లెస్ ఛార్జింగ్, సుదూర కమ్యూనికేషన్, సెల్‌ఫోన్ వంటి ఆధునిక వైర్‌లెస్ పరిజ్ఞానాలకు అది ప్రేరణగా నిలిచింది. 1964 జూన్‌లో అమెరికాకు చెందిన విద్యుత్ ఇంజినీరు విలియమ్స్ బ్రౌన్ నేతృత్వంలోని బృందం మైక్రోవేవ్ పవర్ బీమింగ్‌ను ఉపయోగించి ఒక చిన్న హెలికాప్టర్‌ను గగనవిహారం చేయించింది. ఆ తరవాత సాంకేతిక పురోగతి ఈ రంగానికి అనుకూలించింది. 2017లో డిస్నీ పరిశోధన బృందం క్వాసీస్టాటిక్ కావిటీ రెజోనెన్స్ (క్యూఎస్‌సీఆర్) విధానంతో చేపట్టిన ప్రయోగం విజయవంతమైంది.



విద్యుత్‌ను గాలి ద్వారా బట్వాడా చేయగలిగే సామర్థ్యం అందుబాటులోకి వస్తే అంతరిక్ష ఆధారిత సౌర విద్యుత్ కూడా వినియోగంలోకి వస్తుంది. ప్రస్తుతం సౌరశక్తి పగటి సమయానికే పరిమితమవుతోంది. మేఘావృతమైన రోజుల్లో ఒడిసిపట్టలేం. రోదసిలో 24 గంటలూ దాన్ని పొందవచ్చు. అంతరిక్షంలో సౌరశక్తి తీవ్రత 10 రెట్లు ఎక్కువగా ఉంటుంది. సౌరశక్తిలో 30 శాతాన్ని భూవాతావరణం పరావర్తనం చెందిస్తుంది. మరో నాలుగోవంతును తాను శోషించుకుంటుంది. మిగిలిందే నేలను చేరుతుంది. రోదసిలో ఈ 'వడపోత'లకు తావుండదు. అక్కడ సౌరఫలకాల ద్వారా ఒడిసిపట్టిన శక్తిని మైక్రోవేవ్స్, లేజర్ పుంజాలుగా మార్చి నేలకు బట్వాడా చేసి, కింద యాంటెన్నాల ద్వారా విద్యుత్‌గా మార్చవచ్చని భావిస్తున్నారు. రోదసిలో సౌర విద్యుత్ స్టేషన్ ద్వారా గిగావాట్ సౌరశక్తిని భూమికి బట్వాడా చేస్తే అది ఏడాది పాటు 10 లక్షల ఇళ్లకు సరిపోతుంది.


అపార ప్రయోజనాలు

వైర్‌లెస్ విద్యుత్ వల్ల ఆసుపత్రులు, కర్మాగారాలు, ఇంధన కేంద్రాలు, తడిగా ఉండే బహిరంగ ప్రదేశాల్లో భద్రత మెరుగుపడుతుంది. లోహపు కనెక్టర్లు, వేలాడే కేబుళ్లను తొలగిస్తే ట్రిప్పింగ్, నిప్పు రవ్వలు చెలరేగడం, షాక్ వంటి సమస్యలు ఉండవు. ఆసుపత్రుల్లో వైర్లు తగ్గితే, ఇన్ఫెక్షన్లూ తగ్గుతాయి. ఛార్జర్లు, పవర్ బ్యాంకులు వెంట తీసుకెళ్లాల్సిన పని ఉండదు. ఫోన్లు, ఈవీల ఛార్జింగ్ పోర్టుల్లోని ప్లగ్‌లను పదే పదే అమర్చాల్సిన అవసరం ఉండదు. ఉపకరణాలను పూర్తి స్థాయిలో వాటర్ ప్రూఫ్‌గా మార్చొచ్చు. నీరు, ధూళి లోపలికి చొరబడకుండా చూడొచ్చు. వైరింగ్‌కు ఆస్కారం లేని రిమోట్ సెన్సర్లు సాధ్యమవుతాయి. విద్యుత్ విమానాలు, డ్రోన్ల రోటర్లకు వైర్‌లెస్ పద్ధతిలో విద్యుత్‌ను సరఫరా చేయవచ్చు. పవర్ బీమింగ్‌తో విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కూడా సులువవుతుంది. అయితే, వైర్‌లెస్ కరెంటుకు అవసరమైన భారీ వ్యవస్థల ఏర్పాటు ప్రక్రియ సంక్లిష్టం, వ్యయభరితం కావచ్చు. ఒక మంచివైర్‌తో పోలిస్తే వైర్‌లెస్ ఛార్జింగ్ వ్యవస్థల సమర్థత తక్కువనే చెప్పొచ్చు. కాయిల్స్, ఎలక్ట్రానిక్స్, రిసీవర్లు వేడెక్కినప్పుడు విద్యుత్ ప్రసార స్థాయిపై పరిమితులు ఏర్పడొచ్చు. అప్పుడు అదనపు శీతలీకరణ అవసరం పడుతుంది. ఈ విధానంలో వాడే ఉపకరణాలన్నీ విద్యుదయస్కాంత క్షేత్రాలు, లేజర్లు, రేడియో ఫ్రీక్వెన్సీకి సంబంధించిన సురక్షిత పరిమితికి లోబడి ఉండాల్సిందే. మొత్తానికి తీగల్లేకుండా విద్యుత్‌ను ప్రసారం చేసే వ్యవస్థకు సంబంధించి కొన్ని పరిమితులున్నా, ఇది మానవాళి జీవనశైలినే మార్చివేసే అవకాశం ఉందనడంలో సందేహం లేదు.

– కంభంపాటి సురేష్

కోపం... ఎవరిమీద?

ముక్కు మీద కోపం ముఖానికి అందమో కాదో తెలీదు కానీ అనుబంధాలకు మాత్రం అదో పెద్ద అవరోధమే. తన కోపమే తన శత్రువని చిన్నప్పుడే చదువుకున్నా, కోపం వచ్చినప్పుడు పది లెక్కపెట్టమని పెద్దలు సూచించినా... అవి మాటల వరకే. ఏ మహాత్ముల్లో తప్ప మామూలు మనుషులు వాటిని ఆచరణలో ప్రయత్నించరు. కానీ రానురాను సామాజిక జీవనం సంక్లిష్టమవుతోంది. కోపం తెచ్చుకునే సందర్భాలు పెరుగుతున్నాయి. కట్టలు తెంచుకుంటున్న కోపం ఎన్నో దారుణాలకు కారణమవుతోంది. అందుకే 'నెవర్ గెట్ యాంగ్రీ ఎగైన్' అనే పుస్తకం రాశారు డాక్టర్ డేవిడ్ జె.లైబెర్‌మాన్. సైకోథెరపిస్ట్ అయిన ఆయన అసలు కోపం ఎందుకొస్తుంది? అది మన జీవితాన్ని తన కంట్రోల్‌లోకి తీసుకోకుండా మనసును ఎలా నియంత్రించుకోవాలి... తదితర ఎన్నో విషయాలను ఈ పుస్తకంలో చర్చించారు.



ఎదుటి వ్యక్తులూ వారి చర్యల వల్ల మనకు కోపమొస్తుందనుకుంటాం కానీ, వాస్తవానికి కోపానికి కారణం మనమేనంటారు రచయిత. 'మనం' అంటే ఇక్కడ 'అహం'. అమర్యాద, అన్యాయం, తిరస్కారం లాంటివి ఎదురైనప్పుడు తన ఉనికికి, అభిమానానికి, గుర్తింపునకు హాని జరిగినట్లు ఈగో భావిస్తుంది. మనల్ని గౌరవించరేమో, ప్రేమించరేమో, హక్కును కోల్పోతామేమో... అని భయపడుతుంది. ఆ భయమే కోపంగా బహిర్గతమవుతుంది. 'యాంగర్ మేనేజ్‌మెంట్ అంటారు కానీ నిజానికి మేనేజ్ చేయాల్సింది కోపాన్ని కాదు, ఈగోని' అంటారు లైబెర్‌మాన్. మనిషి ప్రవర్తన పూర్తిగా ఈగో కంట్రోల్‌లోనే ఉంటుంది. ఏదైనా ఒక సంఘటన జరగ్గానే వెంటనే రియాక్ట్ అవుతాం. పుట్టినరోజు నాడు ఫ్రెండ్ విష్ చేయకపోతే కొత్త ఫ్రెండ్స్ మోజులో మనల్ని మర్చిపోయారనీ, మనమంటే ప్రేమ లేదనీ ఇలా ఏవేవో ఊహించుకుంటాం. కోపమొచ్చేస్తుంది. ఆ కోపంలో నిష్ఠూరంగా ఒక మెసేజ్ పెట్టడం, మరొకరి దగ్గర వ్యాఖ్యానించడం లాంటిదేదో చేస్తాం. అది చాలు కదా... స్నేహబంధం బీటలు వారడానికి! అదే కాసేపు ఈగోని పక్కనపెడితే- పనిలో బిజీగా ఉన్నారేమో, తేదీ మర్చిపోయి ఉంటారు- అని లైట్ తీసుకుంటే మన మనసుకీ హాయి. ఆ స్నేహమూ పదిలంగా ఉంటుంది. దీన్నే లైబెర్‌మాన్ రియాక్ట్ కాకుండా రెస్పాండ్ అవడంగా పేర్కొన్నారు. బలహీన మనస్తత్వం ఉన్నవారు మాత్రమే రియాక్ట్ అవుతారన్నది రచయిత మాట.

కోపం మనల్ని నియంత్రించకుండా లైబెర్‌మాన్ ఆరు ముఖ్యమైన విధానాలను అనుసరించమంటారు. జరిగినదాని కన్నా ముందు ఊహించుకున్న దానివల్ల ఎక్కువ కోపం వస్తుంది కాబట్టి వాస్తవాలకు ప్రాధాన్యమివ్వాలి. ఈగోని తగ్గించుకోవాలి- అంటే ప్రతి విషయాన్నీ వ్యక్తిగతంగా తీసుకోకూడదు. రియాక్ట్ అయ్యేముందు ఒక్క క్షణం ఆగాలి. కోపం చాలా వేగంగా వచ్చే ఎమోషన్. అలా ఆగినప్పుడు దాని ప్రభావం నుంచి బయటపడి ప్రవర్తన మన అదుపులోకి వస్తుంది. చాలాసార్లు గతమూ భవిష్యత్తుల గురించిన ఆలోచనలు కోపానికి కారణమవుతాయి. అటువంటప్పుడు వర్తమానం మీదికి దృష్టి మళ్లించాలి. అభద్రత, ఆత్మన్యూనత లాంటి బలహీనతలను అధిగమించాలి. నిండైన ఆత్మవిశ్వాసం ఉన్నవాళ్లకు ఇతరుల చర్యల వల్ల తమ విలువ, గౌరవం తగ్గవని తెలుసు. ఆ ఆత్మస్థైర్యం ఈగో గొంతు నొక్కి మనిషిని బలంగా నిలబెడుతుంది. ఇతరుల ప్రవర్తనని జడ్జ్ చేయకుండా ఏం జరిగిందో తెలుసుకునే కుతూహలాన్ని ప్రదర్శించాలి. అది కోపాన్ని కరిగించేస్తుంది. ఇలాంటి ఎన్నో విషయాలను ఉదాహరణలతో వివరిస్తుందీ పుస్తకం.

– మిహిర

ఆహారంలోనూ అసమానతలు

వ్యక్తులు ఆరోగ్యంగా ఉండాలంటే సరైన ఆహారం తగినంతగా తీసుకోవాలి. సమతులాహారం దక్కాలంటే కొంచెం ఎక్కువగా వ్యయం చేయాల్సి ఉంటుంది. ఆహారంపై ఖర్చు విషయంలో ప్రపంచవ్యాప్తంగా చాలా అసమానతలు నెలకొన్నాయి. 2023లో ఇళ్లల్లో వినియోగం కోసం కొని తెచ్చుకున్న ఆహారం పరంగా ఆయా దేశాల్లో ఒక్కో వ్యక్తికి అయిన సగటు వ్యయం... (డాలర్లలో)



అమెరికా	3,694
యూకే	2,499
చైనా	999
బంగ్లాదేశ్	910
శ్రీలంక	715
దక్షిణాఫ్రికా	616
నైజీరియా	566
మయన్మార్	511
ఇండియా	449
పాకిస్థాన్	406

(ఆధారం: యూఎస్‌డీఏ ఎకనామిక్ రీసెర్చ్ సర్వీస్-2025)



స్త్రీ స్వేచ్ఛకు ఎన్నాళ్లీ సంకెళ్లు?

'ఆ చూపుల్లో ఎప్పుడూ ఒక్కటే సంకేతం ఉంటుంది/ చొంగకార్చే కుక్కలాంటి ఆకలుంటుంది...' అంటూ అచ్చోసిన ఆంబోతుల్లా సమాజంలో తిరుగాడే కొందరి చూపులు మహిళలను ఎంతగా హింసిస్తాయో కవయిత్రి జయప్రభ ఓచోట ఆవేదనాత్మకంగా వివరిస్తారు. చూపులను దాటి చేతల్లో రాక్షసుల వారసులై స్త్రీలను కాల్చుకు తినేవారు అడుగడుగునా పొంచి ఉండటమే దేశం దౌర్భాగ్యం. కరడుగట్టిన పితృస్వామ్య భావజాలాన్ని నరనరానా ఎక్కించుకున్నవాళ్లు 'మగాళ్లం.. మాకేంటి అడ్డు' అన్నట్లు మాటలూ చేష్టలతో ప్రతిచోటా మహిళలను వికృత వేధింపులకు గురిచేస్తున్నారు. తాగి తందనాలాడుతూ, బలాదూర్ తిరిగేవాళ్లు కూడా ప్రేమ పేరిట వెర్రి వేషాలెన్నో వేస్తున్నారు. కాదూ కూడదంటే అమ్మాయిల ఫొటోలను మార్ఫింగ్‌చేసి ఆన్‌లైన్‌లో పెట్టి వారి ఉసురు పోసుకుంటున్నారు. స్త్రీలను ఆటబొమ్మలుగా జమకట్టే కర్కోటకులేమో పసిపిల్లలు మొదలు పండు ముదుసలి వరకూ అందరిపై హేయ అకృత్యాలకు పాల్పడుతున్నారు. ఆలోచనల్లోనే నానా అవలక్షణాలు నింపుకొన్న మరికొందరు... అలా ఉండాలి, ఇలా ఉండకూడదంటూ అమ్మాయిలను ఆంక్షల చట్రంలో ఇరికించడానికి తెగ ఆరాటపడిపోతున్నారు. సామాజిక మాధ్యమాల్లో స్త్రీలపై అసభ్యపు రాతలూ, కూతలతో రెచ్చిపోతున్నారు. ఇక సూడో సంస్కార మూర్తులది మరో పెద్ద కథ. మహిళా సాధికారత, కుటుంబ విలువల గురించి బయటికెన్ని నీతులు చెప్పినా ఇంట్లో భార్యలను రాచిరంపాన పెట్టడం వారికి మామూలు విషయం. మెదళ్లను ఆదిమకాలపు గుహల్లో పూడ్చిపెట్టిన ఇలాంటి ప్రబుద్ధులు యథేచ్ఛగా పేట్రేగిపోతుండటంవల్లే ఇండియాలో స్త్రీలపై దాష్టీకాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. అవి అంతర్జాతీయంగా దేశం పరువును మంటగలుపుతున్నాయి!

తెలంగాణ డీజీపీ వెల్లడించిన లెక్కల ప్రకారం- 2024తో పోలిస్తే నిరుడు రాష్ట్రంలో మహిళలపై నేరాలు మూడు శాతం పెరిగాయి. స్త్రీల ప్రతిష్ఠకు భంగం కలిగించిన కేసులైతే ఏకంగా తొమ్మిది శాతం అధికమయ్యాయి. మహిళల హత్యల విషయంలోనూ దాదాపు మూడుశాతం పెరుగుదల నమోదైంది. ఏపీ డీజీపీ విడుదల చేసిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో గతేడాది 1467 అత్యాచారాలు చోటుచేసుకున్నాయి. మహిళలపై మొత్తం నేరాలు పదహారు వేలకు పైబడ్డాయి. ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం మహిళలపై దాష్టీకాలకు సంబంధించి 2023లో దేశవ్యాప్తంగా 4.48 లక్షల కేసులు వెలుగులోకి



పుణ్యభూమి

వచ్చాయి. వాటిలో ముప్పై శాతం భర్తలు లేదా బంధువుల క్రూరత్వానికి సంబంధించినవే! దేశవ్యాప్తంగా 2012లో 24,519 అత్యాచార కేసులు వెలుగు చూస్తే, పదకొండేళ్లలో అవి 29,670కి పెరిగిపోయాయి. పద్నాలుగేళ్ల కిందట దేశ రాజధాని దిల్లీలో కదులుతున్న బస్సులో 'నిర్భయ'పై జరిగిన ఘోరం యావత్ దేశంతో కంటతడి పెట్టించింది. నిరసనలు పెల్లుబుకిన దరిమిలా చట్టాలకు ప్రభుత్వాలు మరింత పదును పెట్టాయి. అయినా ఒరిగిందేమిటి? ఆ తరవాతా అలాంటి భయంకర ఘటనలు చాలా చోట్ల చోటుచేసుకున్నాయి. వారం రోజుల కిందటా జాతీయ రాజధాని ప్రాంతంలో ఒక వివాహితకు లిఫ్ట్ ఇస్తామని నమ్మించి కారులోకి ఎక్కించుకున్న దుర్మార్గులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. రాత్రంతా ఆమెను వీధుల్లో తిప్పి కదులుతున్న కారులోంచి బయటికి విసిరేశారు. ముక్కుపచ్చలారని చిన్నారులనూ దుష్ట బుద్ధితో చూసేవారికి దేశీయంగా కొదవలేదు. ఇక విద్యాలయాల్లో, పని ప్రదేశాల్లో చాలాచోట్ల స్త్రీలకు వేధింపులు నిత్యకృత్యంగా మారాయి. పిశాచ సంతతి ఇంతగా పేట్రేగుతుంటే మహిళలు నిర్భయంగా బయట తిరిగేదెలా?

సమాజంలో మహిళలు అడుగడుగునా చవిచూస్తున్న పీడన తీవ్రతను తెలుసుకోవడానికి మొన్నామధ్య 31 నగరాల్లో ఒక సర్వే జరిగింది. అందులో పాల్గొన్న స్త్రీలలో 40శాతం మంది తాముంటున్న పట్టణాల్లో తమకు భద్రత లేదని తేల్చిచెప్పారు. రోజూ తాము ఎదుర్కొనే అగచాట్ల గురించి బయటికి చెప్పినా తమ వ్యక్తిత్వాన్నే తప్పుపడతారేమోనని శంకించి, కుటుంబం పరువు పోతుందేమోనని భయపడి, వ్యవస్థపై నమ్మకం కొరవడి చాలామంది మిన్నకుండిపోతున్నారు. బాధితుల్లో కనీసం పాతికశాతం మంది బాధను పంటిబిగువున దాచుకుని తలదించుకుని వెళ్లిపోతున్నారు. అందుకే, మహిళలపై దాష్టీకాలకు సంబంధించి చాలా ఘటనలు వెలుగులోకే రావడం లేదు. బయటికొస్తే నరకయాతనలు తప్పవన్న భయంతో స్త్రీలు నాలుగ్గోడల్లోపలే బందీలైతే దేశార్థికం ఎలా పురోగమిస్తుంది?

మస్తిష్కాల్లో బోలెడంత కుళ్లు నిండినప్పుడు చట్టాల చింతబరికె పుచ్చుకున్నా సరైన ప్రయోజనం ఉండదు. అందుకే స్త్రీని ఆదిపరాశక్తిగా కొలిచే దేశంలో మహిళలపై దుర్మార్గాలు ఆగడం లేదు. స్త్రీలకు భద్రమైన వాతావరణం నెలకొనాలంటే 'వాడికేంటి, మగమహారాజు' అన్న భావనను ఇంటి నుంచే చెరిపేయాలి. అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలు ఎందులోనూ తక్కువ కాదని, స్త్రీలకూ అన్నింటా సమాన హక్కులుంటాయని తల్లిదండ్రులు చిన్ననాటి నుంచే మగపిల్లలకు నూరిపోయాలి. విద్యాలయాల్లో నైతిక చదువులకు ప్రాధాన్యమివ్వాలి. దాంతోపాటు అంతర్జాలం, ఓటీటీల్లో పొంగిపొర్లుతున్న అశ్లీల దృశ్యాల వరదకు అడ్డుకట్ట వేయాలి. స్త్రీలు, బాలికలపై దారుణాలకు పాల్పడుతున్నవారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చూడాలి. స్త్రీల అభ్యున్నతి గురించి మాటలతో సరిపెట్టకుండా లింగ వివక్షను రూపుమాపడానికి ప్రభుత్వాలు నిజంగా రంగంలోకి దిగాలి.

– వేణుబాబు మన్నం

పొగమంచులో తేలిపోదామా!

నేస్తాలూ.. మీరు ఊటీ, మున్నార్, సిమ్లా, అరకు వంటి హిల్‌స్టేషన్లకు టూర్ వెళ్లారా! అక్కడ పర్వతాల మధ్య లోయల నిండా, రోడ్లపైనా, ఎటుచూసినా తెల్లని, చల్లని దట్టమైన పొగలాంటిది కమ్ముకుని ఉండటం గమనించారా! అదే పొగమంచు లేదా ఫాగ్. శీతాకాలంలో మన దగ్గర కూడా పొద్దున్నే పొగమంచు కమ్మేసి ఉంటుంది. ఇంతకీ అదెలా ఏర్పడుతుందో తెలుసుకుందాం.

వాతావరణంలో పైభాగం నుంచి వచ్చే చల్లని గాలి ప్రవాహం భూమి లేదా నీటి ఉపరితలాలపై వేడిగా ఉండే భాగాన్ని కలవడంతో పొగమంచు ఏర్పడుతుంది. చల్లగా ఉండే ఉపరితలంపై వెచ్చగా లేదా తడిగా ఉండే గాలి కదలడంగా దీన్ని చెప్పవచ్చు. రాత్రివేళల్లో భూమి చల్లబడినప్పుడు కింది భాగంలో ఉండే గాలి కూడా చల్లబడుతుంది. ఇలాంటి చల్లని గాలి, పైభాగంలోని వెచ్చని గాలిని కలుసుకున్నప్పుడు కూడా ఫాగ్ ఏర్పడుతుందన్నమాట. పొగమంచు తేలుతూ ముందుకు సాగిపోతున్నట్లు కనిపించడం గమనించారా? మేఘాలు కూడా అలాగే గాలిలో తేలుతున్నట్లుగా వెళ్లిపోతుంటాయి కదా! మరి, పొగమంచుకు, మేఘాలకు తేడా ఏంటి? పొగమంచుకూ మేఘాలకూ పెద్దగా తేడా ఏమీ లేదు. కాకపోతే, మేఘం అనేది వాతావరణంలో బాగా ఎత్తులో తేలుతూ వెళ్తుంది. పొగమంచు కింద ఆవరిస్తుందంతే! ఇంకా చెప్పాలంటే,



హాయ్! బుజ్జీ!!

ఫాగ్ అనేది నేలతో అనుసంధానమై తేలిపోయే మేఘం అనుకోండి. భూమి ఉపరితలంపైగానీ, సముద్రతలంపైగానీ ఏర్పడే మేఘాన్నే పొగమంచు అనుకోవచ్చు. మరైతే, మేఘాలు వర్షం కురిపించినట్లుగా, ఫాగ్‌లోని మంచు వర్షంలా కిందికి ఎందుకు పడదనే అనుమానం వచ్చిందా! పొగమంచులోని బిందువులు వర్షంలా కిందికి పడేంత పెద్దగా ఉండవు. ఫాగ్ అనేది మేఘాల కన్నా దట్టంగా ఉండటం మీరు గమనించే ఉంటారు. నీటి బిందువులు చాలా చిన్నగా ఉండటమే ఇందుకు కారణమన్నమాట. పొగమంచు వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు. అందుకని, లైట్లు వేసుకుని జాగ్రత్తగా వెళ్లాలి మరి!

– శ్రీజన్

పారదర్శక విధానాల వల్లే
పెట్టుబడుల ఆకర్షణలో అగ్రస్థానం
ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి మూడు త్రైమాసికాల్లో పెట్టుబడుల ఆకర్షణలో 25.3 శాతంతో దేశంలో అగ్రస్థానంలో నిలవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు ఇది ఎంతో శుభవార్త అని, కొత్త సంవత్సరాన్ని మరింత ఉత్సాహంగా ప్రారంభించేందుకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం దూరదృష్టితో చేపట్టిన విధాన సంస్కరణలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కి ప్రాధాన్యమివ్వడం, పరిశ్రమలు స్థాపించిన వారికి పెట్టుబడి రాయితీ అందించేందుకు ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేయడం వంటి పారదర్శక విధానాల వల్లే ఇది సాధ్యపడిందని అభిప్రాయపడ్డారు. 'ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్న పెట్టుబడిదారులకు, మా దార్శనికతపై వారు ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారుల కృషిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను' అని చంద్రబాబు శనివారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'ఈ లక్ష్యం గమ్యస్థానం కాదు. నిరంతర పురోగతి ప్రయాణం. మరింత ప్రభావవంతంగా పనిచేసేందుకు, భాగస్వాములు బలోపేతానికి, రాష్ట్ర సుస్థిరాభివృద్ధికి మరింత శ్రద్ధగా కృషి చేస్తాం' అని ఆయన వెల్లడించారు.


మత్స్యం ఆకారంలో భోగాపురం విమానాశ్రయం


ప్రధాన ద్వారం వద్ద నుంచి లోపలికి వెళ్లగానే కనిపించే టెర్మినల్

ఎన్నాళ్లో వేచిన ఉదయం

- నేడు భోగాపురం విమానాశ్రయంలో ట్రయల్ రన్
- రన్‌వేపై దిగనున్న వాణిజ్య విమానం
- జూన్ 26న ఎయిర్‌పోర్ట్ ప్రారంభం

ఈనాడు, విజయనగరం: విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న హరిత అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జూన్ 26న ప్రారంభించనున్నట్లు జీఎంఆర్ సంస్థ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఐ.ప్రభాకరరావు తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం 96 శాతం పూర్తయిందన్నారు. ట్రయల్ రన్‌గా ఆదివారం వాణిజ్య విమానం ఎయిర్‌పోర్టు రన్‌వేపై దిగనుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విమానాశ్రయం ఆవరణలో విలేకర్లతో మాట్లాడారు. దిల్లీ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో ఆదివారం ఉదయం 10.15 గంటలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఇతర అధికారులతో వస్తారని చెప్పారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే విశాఖపట్నం దక్షిణ భారతదేశంలోనే ప్రధాన ఆర్థిక కేంద్రంగా మారుతుందన్నారు.

తుపాన్లను తట్టుకునేలా..

హుద్‌హుద్ వంటి తుపాన్లను తట్టుకునేలా విమానాశ్రయాన్ని డిజైన్ చేశాం. గంటకు 275 కి.మీ. వేగంతో గాలులు వీచినా చెక్కు చెదరదు. 27 సెం.మీ. వర్షం కురిసినా నీరు బయటకు వెళ్లిపోయేలా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశాం. తొలి దశలో రూ.4,725 కోట్లతో ప్రాజెక్టు పనులు చేపట్టాం. జులై తొలి వారం నుంచి అధికారికంగా విమానాల రాకపోకలు ఉంటాయి. రోజుకు 200 విమానాలు దిగే సామర్థ్యం ఉంది. ఏటా 20 వేల టన్నుల సరకు రవాణాకు అవకాశం ఉంది. రాత్రిపూట 18 విమానాలు పార్కింగ్ చేసుకోవచ్చు. ఇక్కడ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల్లో 33 శాతం మంది విశాఖ నగరవాసులు, మిగిలిన 67 శాతం మంది ఉత్తరాంధ్రతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలు ఉంటారు. 14 ఇమిగ్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తాం.


తొలి విమానం ల్యాండింగ్ కోసం సిద్ధం చేసిన రన్‌వే

స్మార్ట్ ఎయిర్‌పోర్టులో ఆధునిక సేవలు

దేశంలో స్మార్ట్ ఎయిర్‌పోర్టుల్లో అంతర్జాతీయ వసతులతో దీని నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని ప్రభాకరరావు తెలిపారు. "కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు పర్యవేక్షణలో పనులు శరవేగంగా చేపట్టాం. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన మౌలిక వసతులు కల్పించి సహకరించింది. 21 ఆధునిక ఏరో బ్రిడ్జిలు నిర్మించాం. గంటకు 10-12 విమానాలు దిగుతాయి. తొలి ఏడాది 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. సెల్ఫ్ బ్యాగేజీ, బోర్డింగ్, సెల్ఫ్ చెకిన్, స్మార్ట్ ట్రాలీలు తదితర ఆధునిక వసతులు ఉంటాయి.

రహదారులు సిద్ధం

విమానాశ్రయానికి విశాఖనగరం నుంచి వచ్చే ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం మూడు ప్రధాన రోడ్లను సిద్ధం చేస్తోంది. ఆంధ్రాలోని ఫార్మా, మెడిసిన్, టెక్స్‌టైల్ ఉత్పత్తులను నేరుగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు భారీ కార్గో టెర్మినల్ సిద్ధం చేస్తున్నాం. విమానాశ్రయం టెర్మినల్ లోపల విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహం, ఏటికొప్పాక బొమ్మలు ఏర్పాటు చేస్తాం. తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా అలంకరణలు ఆకట్టుకుంటాయి" అని ప్రభాకరరావు వివరించారు. కార్యక్రమంలో జీఎంఆర్ ఎయిర్ పోర్టు సీఈవో కేబీఎస్ క్రలా, ప్రాజెక్ట్ హెడ్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

వసతులు ఒనగూరి..
పులకించే భక్తఝరి

- రికార్డు స్థాయిలో తిరుమలేశుడి దర్శనాలు
- 2025లో అన్నింటా మెరుగుదల



తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి సన్నిధిలో పెరిగిన వసతులు, ఉత్తమ నిర్వహణ పద్ధతుల వల్ల భక్తులకు దర్శన భాగ్యం గతంలో కంటే మెరుగ్గా లభిస్తోంది. అంతకుముందు ఏడాదితో పోల్చితే 2025లో స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య, లడ్డూల విక్రయం, ఇతరత్రా సేవలన్నింటిలోనూ మెరుగుదల నమోదైంది. 2024లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. దెబ్బతిన్న వ్యవస్థలను గాడిలో పెట్టే క్రమంలో తిరుమల నుంచే ప్రక్షాళన ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు తితిదే పాలకమండలి కొత్తగా పలు ప్రణాళికలు రచించి, అమలు చేసింది. స్వామివారి దర్శన విధానాల్లో మార్పులు చేసి, వీఐపీ బ్రేక్ సమయాన్ని సవరించడం ద్వారా సామాన్యులకు ప్రాధాన్యం దక్కుతోంది. గతంలో సర్వదర్శనం క్యూలైన్‌లో సకాలంలో అన్నప్రసాదాలు అందక ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తున్నారు. మాతృశ్రీ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, తిరుమలలోని ఇతర అన్నప్రసాద కేంద్రాల ద్వారా నాణ్యమైన ఆహారం సరఫరా చేస్తున్నారు. గతంలో లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి వాడారన్న అభియోగాలు వచ్చిన నేపథ్యంలో.. ప్రసాదం నాణ్యతపై దేవస్థానం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇక వసతి పరంగా కొత్తగా వేంకటాద్రి నిలయం (పీఏసీ-5) అందుబాటులోకి రావడంతో పెద్దఎత్తున భక్తులు ఇక్కడ సేద తీరుతున్నారు. 2026లోనూ పలు సంస్కరణల అమలు దిశగా తితిదే అడుగులు వేస్తోంది. రిలయన్స్ సహకారంతో రూ.100 కోట్లు వెచ్చించి ఏఐ ఇంటిగ్రేటెడ్ అన్నప్రసాద కేంద్రాన్ని నిర్మించనుంది.

గత రెండేళ్లకు సంబంధించి వివరాలు (అంకెలన్నీ కోట్లలో)

విషయం	2024	2025
దర్శనం చేసుకున్న భక్తులు	2.55	2.61
అన్నప్రసాదం స్వీకర్తలు	6.30	7.42
లడ్డూల విక్రయం	12.14	13.51
తలనీలాలు సమర్పించిన వారు	0.99	0.88
హుండీ ఆదాయం (రూపాయల్లో)	1365	1383.90



నిండు చందురుడు!

శనివారం ఆకాశంలో అద్భుత దృశ్యం కనిపించింది. 2026లో తొలి సూపర్ మూన్ కనువిందు చేసింది. చంద్రుడు భూమికి దగ్గరగా రావడంతో సాధారణ పౌర్ణమి రోజుల్లో కన్నా శనివారం రాత్రి పెద్దగా కనిపించాడు. 7 గంటలపాటు ఈ దృశ్యం ఆకట్టుకుంది. డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని నల్ల వంతెన సమీపంలో ప్రకాశవంతంగా కనిపించిన చందమామను చిత్రంలో చూడొచ్చు.

– న్యూస్‌టుడే, కోనసీమ



కెరీర్లో ఈ పొరపాట్లు చేయొద్దు

✦ పని కన్నా ఫిర్యాదులు ఎక్కువ చేయడం ✦ తమ పనితీరు మీద అభిప్రాయాలు తీసుకోకపోవడం ✦ సంస్థ అవసరాలకు అనుగుణంగా మారకపోవడం ✦ సవాళ్లకు భయపడి కంఫర్ట్ జోన్‌లో ఉండిపోవడం.

– టొలులోప్ మైఖేల్, టెక్ ఆంత్రప్రెన్యూర్

'భీమవరం బీట్ సాంగ్'లో రఘురామకృష్ణరాజు స్టెప్పులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉప సభాపతి రఘురామకృష్ణరాజు ప్రైవేటు ఆల్బమ్‌లో ఓ పాటకు నృత్యం చేసి అలరించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాయని స్మిత రూపకల్పన చేసిన 'భీమవరం బీట్ సాంగ్'ను లాంచ్ చేశారు. ఈ ఆల్బమ్‌లో ఓ పాటను ప్రదర్శించగా అందులో రఘురామకృష్ణరాజు డ్యాన్స్ వేస్తూ కనిపించారు. ఈ కార్యక్రమ వేదికపైనా స్మిత బృందంతో కలిసి స్టేజీపై స్టెప్పులు వేసి సందడి చేశారు. 'వేసిన కొన్ని స్టెప్పులే పాటలో ఉంచారు. మరికొన్నింటిని నా కుటుంబ సభ్యులు తొలగించారు' అంటూ రఘురామ నవ్వుతూ తెలిపారు.


వేదికపై స్మిత బృందంతో స్టెప్పులు వేస్తున్న రఘురామకృష్ణరాజు

వయసు మీరుతోంది సార్!

- డిగ్రీ లెక్చరర్ల నియామక ప్రకటనకు రెండేళ్లు
- 2 నెలలుగా రిజర్వేషన్ రోస్టర్ లెక్క తేల్చని సీసీఈ
- 15 వేల మందికిపైగా అభ్యర్థులకు తప్పని ఎదురుచూపులు

ఈనాడు, అమరావతి: కోర్టు కేసులు లేవు.. న్యాయ వివాదాలూ లేవు.. కానీ రెండు విభాగాల మధ్య స్పష్టత కొరవడి ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్(డీఎల్) పోస్టుల భర్తీ రెండేళ్లుగా సాగుతూనే ఉంది. పోటీ పరీక్ష రాసిన అభ్యర్థుల వయసు మీరుతున్నా.. ఉద్యోగాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. నిత్యం అధికారులకు వినతిపత్రాలు సమర్పించడం తప్ప ఏమీ చేయలేని దుస్థితి నిరుద్యోగులది. రాష్ట్రంలో 290 డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీకి 2023 డిసెంబరులో ఏపీపీఎస్సీ ప్రకటన ఇచ్చింది. 2025 జులైలో అభ్యర్థులకు రాత పరీక్షలు నిర్వహించింది. ఇప్పటికీ ఫలితాలు విడుదల కాలేదు. రిజర్వేషన్ రోస్టర్‌పై స్పష్టత కావాలని గత నవంబరులో కళాశాల విద్యాశాఖ(కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్-సీసీఈ)కు ఏపీపీఎస్సీ దస్త్రం పంపించింది. అది అక్కడి నుంచి వెనక్కు రాలేదు. రెండు విభాగాల మధ్య కొనసాగుతున్న జాప్యం కారణంగా 15 వేల మందికిపైగా అభ్యర్థులు ఆందోళన, ఒత్తిడికి గురవుతున్నారు. జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ లెక్చరర్ల పరీక్షల ఫలితాలు ప్రకటించి, డీఎల్ ఫలితాలను పెండింగ్‌లో పెట్టడంతో అభ్యర్థులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఇప్పటికీ అందని వివరాలు

డిగ్రీ లెక్చరర్ పోస్టులకు రాత పరీక్షలు పూర్తి చేసిన ఏపీపీఎస్సీ.. మహిళా, దివ్యాంగ పోస్టుల రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలని కళాశాల విద్యాశాఖకు లేఖ రాసింది. 290 పోస్టులకు రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు కళాశాల విద్యాశాఖ రెండు నెలలకుపైగా సమయం తీసుకుంది. అయిప్పటికీ ఏపీపీఎస్సీకి ఇంకా వివరాలు పంపించలేదు. రిజర్వేషన్ రోస్టర్ వివరాలు పంపించాలని విన్నవించినా అధికారులు స్పందించడం లేదని అభ్యర్థులు వాపోతున్నారు. కళాశాల విద్యాశాఖ నుంచి వివరాలు రానందున తామేమీ చేయలేమని ఏపీపీఎస్సీ సమాధానమిస్తోంది. ప్రధాన నియామకాల్లో నోటిఫికేషన్ నుంచి ఫలితాలు వచ్చేదాకా... ఏళ్లకు ఏళ్లు గడచిపోతున్నాయి. గ్రూప్-1, 2 నియామకాలదీ ఇదే పరిస్థితి.

గంజాయి తాగి పట్టుబడ్డ జమ్మలమడుగు ఎమ్మెల్యే కుమారుడు

- నార్సింగిలోని ఓ విల్లాలో తెలంగాణ ఈగల్ సోదాలు
- పరీక్షల్లో మత్తుపదార్థం తీసుకున్నట్లు నిర్ధారణ


సుధీర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ఏపీలోని జమ్మలమడుగు ఎమ్మెల్యే, భాజపా నేత ఆదినారాయణరెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డి గంజాయి తీసుకుని తెలంగాణ ఈగల్(ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) పోలీసులకు చిక్కడం కలకలం రేపింది. శనివారం నార్సింగిలోని తన విల్లాలో స్నేహితులతో కలిసి పార్టీ చేసుకుంటుండగా పోలీసులు సోదాలు నిర్వహించారు. డ్రగ్ కిట్‌తో పరీక్షలు చేయగా సుధీర్‌కు పాజిటివ్ వచ్చింది. ఈగల్ అధికారుల వివరాల ప్రకారం.. సుధీర్‌రెడ్డి(40) నార్సింగిలోని ఏక్తా హైలాండ్ పార్క్‌లోని ఒక విల్లాలో ఉంటున్నారు. అక్కడ పార్టీ జరుగుతోందని, గంజాయి వినియోగిస్తున్నారని ఈగల్ అధికారులకు సమాచారం అందింది. ప్రత్యేక బృందం శనివారం మధ్యాహ్నం సమయంలో విల్లాలో ఆకస్మిక తనిఖీలకు దిగింది. అక్కడ మొత్తం ముగ్గురుండగా సుధీర్ వ్యవహార తీరు అనుమానాస్పదంగా కనిపించింది. పోలీసులతో వాదనకు దిగారు. దీంతో వారు డ్రగ్ కిట్‌తో పరీక్షించగా గంజాయి పాజిటివ్ వచ్చింది. మిగిలిన ఇద్దరికీ నెగెటివ్ వచ్చింది. వారిలో ఒకరు సుధీర్‌రెడ్డి బంధువు, మరొకరు స్నేహితుడని తేలింది. అనంతరం పోలీసులు విల్లా మొత్తం తనిఖీలు చేయగా.. ఎలాంటి మత్తుపదార్థాలు దొరకలేదు. సరఫరా చేసినట్లు కూడా ఆధారాలు లేకపోవడంతో వినియోగదారుడి కింద పరిగణించి డీఎడిక్షన్ కేంద్రానికి తరలించాలని నిర్ణయించారు. అతని ఫ్యామిలీ డాక్టర్, కుటుంబసభ్యులకు సమాచారమిచ్చి బంజారాహిల్స్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. గంజాయి ఎక్కడి నుంచి వచ్చిందని పోలీసులు ప్రశ్నించగా సమాధానం చెప్పలేదని ఓ అధికారి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఐటీ కారిడార్‌లో ఓ మహిళ అనుచరుల ద్వారా గంజాయి వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

విజయవాడలో తెరుస్తున్న ఖాతాలు..
ఫిలిప్పీన్స్‌లో తేలుతున్నాయ్

- అద్దెకు బ్యాంకు ఎకౌంట్లు తెరిపిస్తున్న సైబర్ ముఠా అరెస్టు
- ఈ ఖాతాలతో వివిధ రాష్ట్రాల్లో బెట్టింగ్, సైబర్ నేరాలు

ఈనాడు, అమరావతి: నిరుద్యోగులు, అమాయకులతో బ్యాంకు ఖాతాలు తెరిపించి, ఆ వివరాలను చట్టవిరుద్ధ లావాదేవీల కోసం ఫిలిప్పీన్స్‌కు పంపిస్తున్న విజయవాడకు చెందిన ముఠాను సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. కరెంటు ఎకౌంట్ తెరిస్తే డబ్బులు ఇస్తామని ఆశ చూపించి, బ్యాంకు ఎకౌంట్లు సేకరిస్తున్న ఈ ముఠాలోని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన అనుమానితుల కోసం గాలిస్తున్నారు. కేసుకు సంబంధించిన వివరాలివి.. విజయవాడకు చెందిన పేరపోగు దేవదాసు.. ఓ నిరుద్యోగి. గతేడాది అతని ఇంటిపక్కన ఉండే కృష్ణారెడ్డి (ఏ3).. దేవదాసును కలిసి బ్యాంకులో కరెంటు ఎకౌంట్ తెరిచి, ఆన్‌లైన్‌లో షేర్ చేస్తే డబ్బులిస్తారని ఆశ చూపించాడు. రూ.10 వేలు వస్తాయన్న ఆశతో కృష్ణారెడ్డితో కలిసి దేవదాసు భవానీపురంలోని సిటీ యూనియన్ బ్యాంకుకు వెళ్లాడు. అక్కడ కరెంటు ఖాతా తెరిచి, కిట్‌ను కృష్ణారెడ్డికి ఇచ్చాడు. తర్వాత బాధితుడి ఫోన్‌పే ఖాతాలకు రూ.7 వేలు జమ చేశారు. ఇటీవల దేవదాసు.. తన ఖాతాను పరిశీలించగా రూ.2 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించాడు. భయపడి విజయవాడలోని సైబర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.


సూర్య నుంచి స్వాధీనం చేసుకున్న కారు


కారు అద్దంపై అద్దంకి ఎమ్మెల్యే స్టిక్కర్

ఫిలిప్పీన్స్‌కు చేరుతున్న ఖాతాలు

కృష్ణారెడ్డిని పోలీసులు విచారించగా కీలక విషయాలు వెలుగుచూశాయి. అతని భార్య సౌభాగ్యలక్ష్మి (ఏ4) కూడా అమాయకులతో బ్యాంకు ఖాతాలు తెరిపించేదని తేలింది. వీరిపై నగరానికి చెందిన సూర్య శ్రీనివాస మణికంఠ ఎలియాస్ సూర్య (ఏ1) పర్యవేక్షించేవాడు. కృష్ణారెడ్డి దంపతులు సేకరించిన ఖాతాలను ఏ1 తీసుకొని.. వాటిని చట్టవిరుద్ధ లావాదేవీల కోసం పార్వతి(ఏ2)కి ఇచ్చేవాడు. ఆమె వీటిని ఫిలిప్పీన్స్‌లో ఉన్న మరో మహిళకు అందించేది. అక్కడి నుంచి ఈ ఖాతాలను బెట్టింగ్‌లు, సైబర్ నేరాల్లో సొమ్ము బదిలీలకు వాడేవారు. ప్రతి ఖాతాకూ వీరికి రూ.30 వేల కమీషన్ అందేది. ఆ డబ్బును అన్ని దశల్లో పంచుకునేవారు. ఈ ముఠా మొత్తం 199 ఖాతాలు తెరిపించగా, వాటిలో 36 ఖాతాల ద్వారా 56 లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, జమ్మూ, కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో జరిగిన మోసాలకు ఈ ఖాతాలను ఉపయోగించారు.

- ప్రధాన నిందితుడు సూర్యను.. 2023లోనూ అద్దె ఖాతాల కేసులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా పోలీసులు అరెస్టు చేశారు. 9 నెలలు జైలులో గడిపాడు. బయటకు వచ్చాక టెలిగ్రామ్ ద్వారా అద్దె ఖాతాలు సేకరిస్తూ దందా కొనసాగిస్తున్నట్లు తేలింది. పోలీసులు సూర్యతో పాటు కృష్ణారెడ్డి, అతని భార్య సౌభాగ్యలక్ష్మిని అరెస్టు చేశారు. వీరి నుంచి రెండు కార్లు, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సూర్య తన కారుపై రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేరుతో 'ఎమ్మెల్యే' స్టిక్కర్ వేసుకున్నారు. దీనిపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. కీలక నిందితురాలు పార్వతి సహా పలువురి అరెస్టుకు ప్రయత్నిస్తున్నారు.

పోలవరం ప్రాజెక్టులో లైడార్ సర్వే

- 7న పోలవరానికి ముఖ్యమంత్రి చంద్రబాబు
- మంత్రి నిమ్మల రామానాయుడి వెల్లడి

ఈనాడు, అమరావతి: 'పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతం చుట్టుపక్కల లైడార్ సర్వే జరుగుతోంది. ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికల కోసం సర్వే చేస్తున్నాం. జనవరి 7న సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు. నిర్మాణ పనులతో పాటు పర్యాటక ప్రాజెక్టుపైనా సమీక్షిస్తారు' అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆయన శనివారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టూరిజం హబ్‌గా అవసరమైన లేఅవుట్ ప్లాన్ తదితర అంశాలపై చర్చలు సాగాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టులో ఎడమ, కుడి వైపున ఉన్న కట్టడాలను అనుసంధానిస్తూ రూ.548 కోట్లతో లింకు రోడ్డును నిర్మిస్తున్నామని, పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. పోలవరం ఎడమ గట్టు రక్షణ పనులు, గండిపోచమ్మ ఆలయం రక్షణకు రిటెయినింగ్ వాల్ నిర్మాణాన్నీ చేపట్టబోతున్నామన్నారు. జాతీయ రహదారులు 365బీబీ, 516ఈలను పోలవరం ప్రాజెక్టుతో అనుసంధానించేలా జాతీయ రహదారుల అధికారులతో సంప్రదింపులు సాగిస్తున్నట్లు మంత్రి వివరించారు.

అందరూ చూస్తుండగా రైలు కింద పడి ఆత్మహత్య

- మృతుడు మాజీ సైనికుడు..
- విశాఖ దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఘటన



నీలాపు వెంకటరమణారెడ్డి

విశాఖపట్నం (కూర్మన్నపాలెం), న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ మాజీ సైనికుడు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు చూస్తుండగా రైలు కింద ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. ప్రమాదం ధాటికి తమ కళ్ల ముందే ఆ వ్యక్తి మొండెం, తల వేరయిపోవడంతో అందరూ భయంతో వణికిపోయారు. విశాఖ సమీప దువ్వాడ రైల్వేస్టేషన్‌లో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మధ్యాహ్నం 1.10 గంటల సమయంలో హౌవ్‌డా-బెంగళూరు ప్రత్యేక రైలు ఒకటో ప్లాట్‌ఫాం మీదకు వస్తోంది. ఇంతలో ప్లాట్‌ఫాంపైన కూర్చున్న ఓ వ్యక్తి గబగబా వెళ్లి పట్టాలపై తల పెట్టి పడుకోవడంతో రైలు అతడి మీద నుంచి వెళ్లిపోయింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుణ్ని విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలం నెల్లిముక్కుకు చెందిన నీలాపు వెంకటరమణారెడ్డి (65) అలియాస్ సైనికుడిగా గుర్తించారు. కొంతకాలం సైన్యంలో పనిచేసిన ఆయన.. పదవీ విరమణ తర్వాత ఉక్కు కర్మాగారంలో ఉద్యోగం చేశారు. గతంలో తెదేపా సైనికుల విభాగం అధ్యక్షుడిగానూ సేవలందించారు. ప్రస్తుతం కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, వివాహితులైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శనివారం మధ్యాహ్నం వరకు కిరాణా దుకాణం నిర్వహించిన వెంకటరమణారెడ్డి.. తర్వాత రైల్వేస్టేషన్‌కు వచ్చి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. గత కొన్నాళ్లుగా ఆయన ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా.. ఆ ఒత్తిడితోనే ఈ ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు.

18 నెలల్లో అన్నదాతలకు..
రూ.1,170 కోట్లు ఇచ్చాం

- జగన్ ఐదేళ్లలో అందించింది రూ.1,400 కోట్లే
- కోడుమూరు సభలో మంత్రి అచ్చెన్నాయుడు
- ఉల్లి రైతులకు రూ.128 కోట్ల పంపిణీ

ఈనాడు, కర్నూలు: రాష్ట్రంలో రైతులకు ఏ నష్టం వచ్చినా వారిని వెంటనే ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు 18 నెలల్లో రూ.1,170 కోట్లు వెచ్చించారని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అకాల వర్షాల కారణంగా కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాల్లోని ఉల్లి రైతులు భారీగా నష్టపోవడంతో... ఎన్నడూ లేనివిధంగా 37,752 మందికి రూ.128.33 కోట్లు పరిహారం చెల్లిస్తున్నామన్నారు. కర్నూలు జిల్లాలోనే 31,352 మంది రైతులకు రూ.99.92 కోట్లను అందించినట్లు చెప్పారు. ఇప్పటివరకు హెక్టారుకు రూ.25 వేల చొప్పున పరిహారం ఇచ్చేవాళ్లమని.. ఇప్పుడు రూ.50 వేల చొప్పున చెల్లించి చంద్రబాబు చరిత్ర సృష్టించారన్నారు. కర్నూలు జిల్లా కోడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో... శనివారం నిర్వహించిన ఉల్లి రైతులకు నష్ట పరిహారం జమ కార్యక్రమంలో అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వైకాపా హయాంలో రైతుల కోసం రూ.7,700 కోట్లు ఖర్చు పెట్టామని జగన్ అసత్యాలు చెప్పారని.. ఆయన ఐదేళ్ల కాలంలో రూ.1,400 కోట్లే పరిహారం కింద వెచ్చించారన్నారు. దీనిపై చర్చకు రావాలని మంత్రి సవాలు విసిరారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కోకో పంట ధర పడిపోతే కిలోకు రూ.50 చొప్పున రూ.20 కోట్ల వరకు చెల్లించి రైతులను ఆదుకున్నామని తెలిపారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ... వైకాపా హయాంలో ఉల్లి రైతులను గాలికొదిలేశారని విమర్శించారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు బటన్ నొక్కి.. రైతుల ఖాతాల్లో పరిహారాన్ని జమచేశారు. కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దస్తగిరి, కేఈ శ్యాంబాబు, బి.వి.జయనాగేశ్వర్‌రెడ్డి, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఉల్లి రైతులకు నష్టపరిహారం నమూనా చెక్కును అందిస్తున్న మంత్రులు అచ్చెన్నాయుడు, టీజీ భరత్, ఎమ్మెల్యేలు జయనాగేశ్వర్‌రెడ్డి, దస్తగిరి, కేఈ శ్యామ్, ఎంపీ నాగరాజు, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత, కలెక్టర్ ఎ.సిరి తదితరులు

ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?

- కూలీలతో ఆర్థిక మంత్రి పయ్యావుల మాటామంతీ


అమిద్యాలలో మహిళా కూలీలతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, న్యూస్‌టుడే: టమాటాకు ప్రస్తుతం ధర ఎంత ఉంది? దిగుబడి ఎంత వచ్చింది? ఎక్కడ విక్రయిస్తున్నారు? తదితర అంశాలపై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం రైతులు, కూలీలతో మాట్లాడారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం కొర్రకోడు- జయపురంలోని 'మెగా బిందుసేద్యం పథకం' పరిశీలనకు వెళ్తూ దారిలోని అమిద్యాలలో పంట చేలల్లో పనిచేస్తున్న వారిని చూసి.. మంత్రి కారు దిగి వెళ్లి వారితో కూర్చుని కలపుగోలుగా మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. తమకు అందుతున్నాయని కూలీలు తెలిపారు. ఆ తరువాత జయపురం సమీపంలో టమాటా రైతుల వద్దకు వెళ్లి పంట దిగుబడిని పరిశీలించారు. మరో ఆరు నెలల్లో 'మెగా బిందు సేద్యం పథకం' ద్వారా నీరిచ్చేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు ఆయన వారికి చెప్పారు.



కవుల వేషధారణలో చిన్నారులు

అచ్చతెలుగు పంచెకట్టు.. నుదుట తిలకం బొట్టు

● మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో అభిమానుల సందడి

ఈనాడు, అమరావతి: అచ్చతెలుగు పంచెకట్టు.. నుదుట కుంకుమబొట్టు.. ఆకట్టుకునేలా పరదలు పట్టుచీరలతో ఆడపడుచులు.. తెలుగుదనం ఉట్టిపడింది. పిల్లల నుంచి పెద్దల వరకు అనేక మంది మన సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ఆహార్యాన్ని ప్రదర్శించారు. గుంటూరులోని మూడో ప్రపంచ తెలుగు మహాసభల ప్రాంగణం అందుకు వేదికైంది. ముంగిట్లో రంగవల్లులు, సంప్రదాయ దుస్తులు, బొమ్మరిల్లులు, గాలిపటాలు, పిండివంటలు... ఇవన్నీ చెప్తూనే మనకు అత్యంత గుర్తుకొచ్చేది తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి. మరో పదిరోజుల్లోనే ఇంటింటా సందడి చేయనుంది. గుంటూరులో మాత్రం శనివారమే పెద్దపండగ వచ్చేసిందా అన్నట్లు కనిపించింది. కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశ, విదేశాల నుంచి వచ్చిన అనేకమంది పంచెకట్టుతో కనువిందు చేశారు. ఇందులో కొందరు పిల్లలు ఉండటం విశేషం. మహిళలు సైతం మన సంస్కృతిని ప్రతిబింబించేలా వస్త్రాలంకరణతో హాజరయ్యారు. ఇక వేదికల వద్ద రంగవల్లులు, గీతాలాపనలు ఆకట్టుకున్నాయి. ఆధ్యాత్మిక వేదిక వద్ద హోమం, ఆత్మీయమూర్తుల కల్యాణం లాంటివి భక్తిభావాన్ని పెంపొందించాయి.

తినరా మైమరచి..

రామోజీరావు హస్తకళల ప్రదర్శన ప్రాంగణంలోని కొన్ని స్టాళ్లలో పురాతన నాణేలు, పుస్తకాలు, బొమ్మలతో పాటు.. పిండివంటలు నోరూరించాయి. ఆర్గానిక్ విధానంలో చేసిన మురుకులు, చక్కిలాలు, వివిధ రకాల అరిసెలు సందర్శకులను గుర్తుచేశాయి.


తెలుగు పరిరక్షణకు నడుం కట్టాలి

- ఉపన్యాసాలకే పరిమితం కావద్దు
- తీర్మానాలు చేసి, అమలుకు నిర్ణయాలు తీసుకోవాలి
- ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్



సభలో ప్రసంగిస్తున్న ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, వేదికపై యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ ఆకుల శేషసాయి, టీడీ జనార్దన్, అయ్యన్నపాత్రుడు

ఈనాడు, అమరావతి: 'మాతృభాషను సంరక్షించుకోవాలనే ఉద్దేశంతో తెలుగు మహాసభలు నిర్వహించడం అభినందనీయం. మూడు రోజుల మహాసభల్లో ఉపన్యాసాలకు పరిమితం కాకుండా తీర్మానాలు, సూచనలు చేసి ప్రభుత్వానికి ఇచ్చి అమలుకు ప్రయత్నిస్తేనే మేలు జరుగుతుంది. ఈ కార్యక్రమం ఇక్కడి నుంచే మొదలుపెడతారని ఆశిస్తున్నా' అని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ పేర్కొన్నారు. గుంటూరులో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో జరుగుతున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో శనివారం సాయంత్రం ఆంధ్రశ్రీ- పూర్ణకుంభ పురస్కారాల సభలో ఆయన ప్రసంగించారు. 'న్యాయమూర్తులకు ఆంగ్లంతోనే ఎక్కువ సంబంధం ఉంటుంది. చట్టాలు, తీర్పులు, వ్యవహారం ఆంగ్లంలోనే చేస్తున్నారు. రాచరిక, జమీందారు పాలనల్లో భాషకు అపాయం కలగలేదు. ఆంగ్లేయుల పాలన వల్ల ఇప్పటికీ ఆంగ్ల భాషలోనే చట్టాలు, వైద్య, న్యాయ విద్య చదువుకోవాల్సి వస్తోంది. గుజరాత్‌లో ప్రభుత్వ ఉత్తర్వులు, ఉత్తర ప్రత్యుత్తరాలు, ఛార్జిషీట్లు గుజరాతీలోనే ఉంటాయి. అందువల్ల అక్కడ భాషను కాపాడుకుంటున్నారు. తెలుగువారు కూడా ఆ విధానాన్ని అనుసరిస్తే కొంత ప్రయోజనం ఉంటుంది' అని పేర్కొన్నారు. తెలుగుభాషకు గత వైభవాన్ని తీసుకురావడానికి ఏం చేయాలో ప్రజాప్రతినిధులు ఆలోచించాలని జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ సూచించారు.



తెలుగు విలువ నాకు తెలుసు

– గోపీనాథ్, పార్లమెంటు సభ్యులు, తమిళనాడు

నేను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు కృష్ణగిరి జిల్లాలో ఉంది. రాష్ట్ర విభజన సందర్భంగా ఎంతగానో ఇబ్బంది పడ్డాం. తెలుగువారైన మా పిల్లలు తమిళంలో ప్రశ్నపత్రాలిస్తే, పరీక్షలు రాయలేరు. అక్కడ తెలుగులో చదువుకోవడానికి పాఠ్యపుస్తకాలు లేకపోతే న్యాయస్థానం ఆదేశంతో తెచ్చుకున్నాం. ఏ పార్టీ కూడా తమిళనాడులోని తెలుగు వారిని ఆదుకోవడం లేదు. తమిళనాడు నుంచి 40 మంది ఎంపీలుంటే నేనొక్కడినే పార్లమెంటులో తెలుగులో ప్రమాణస్వీకారం చేశాను. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి వచ్చిన ఎంపీలు ఎవరూ పార్లమెంటులో తెలుగులో ప్రసంగించకపోవడం బాధాకరం. వారు తెలుగులో మాట్లాడేలా సూచించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరుతున్నా. ఏపీ శాసనసభలో సభ్యులంతా తెలుగులోనే మాట్లాడేలా చూడాలని ఇక్కడే ఉన్న స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తున్నా. రాష్ట్రేతర తెలుగువారి సమస్యలపై ఒక కమిటీ వేసి అధ్యయనం చేసి, వారికి భరోసా కల్పించాలి. నేను సూచించిన అంశాల్లో ఒక్కటైనా జరిగితే మళ్లీ సభలకు వస్తాను. లేదంటే ఇక రాను.



తెలుగు నా తొలి గుర్తింపు

ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు

'నా మాతృభాష తెలుగు. నా ఆలోచనలు, విలువలు, వ్యక్తిత్వాన్ని మలిచిన సంస్కృతి తెలుగు. తెలుగు నా మొదటి గుర్తింపు. నేను తెలుగువాడినని గర్వంతో ఈ విషయాలు చెబుతున్నా' అని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో భాగంగా శనివారం సాయంత్రం ఆంధ్రశ్రీ- పూర్ణకుంభ పురస్కారాల సభలో ఆయన ప్రసంగించారు. 'శతాబ్దాలుగా తెలుగు నాగరికతను నిర్మించి, నిలబెట్టి తరతరాలకు అందించిన మహనీయులందరికీ వినమ్ర నమస్సులు సమర్పిస్తున్నా. తెలుగు సాహిత్యానికి పునాదులు వేసిన కవులు, పండితులు... ఆలోచనలకు లోతులు ఇచ్చిన తత్వవేత్తలు.. రోజువారీ జీవితంలో తెలుగు భాషను జీవింపజేసిన సామాన్య ప్రజలకు నా కృతజ్ఞతలు. జానపద కళాకారులు, నాట్య, రంగస్థల కళాకారులు, రచయితలు, ప్రచురణకర్తలు, సామాజిక ఉద్యమకారులు, ఆధునిక సృజనకారులు వీరందరి అంకితభావం వల్లే తెలుగు ప్రజల హృదయభాష నిలిచింది. తెలుగు శాసనాల ద్వారా వికసించింది. ఇతిహాసాల ద్వారా విస్తరించింది. భక్తి ఉద్యమాల ద్వారా ఆధ్యాత్మిక లోతును పొందింది. జానపద సంప్రదాయాల ద్వారా ప్రజల జీవనంతో ఏకమైంది. సామాజిక సంస్కరణల ద్వారా చైతన్యాన్ని సంతరించుకుంది. సినిమా, సృజనాత్మక కళల ద్వారా విశ్వంతరా ప్రజల వద్దకు చేరింది. నేడు సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచాన్ని తాకుతోంది' అని హరిబాబు పేర్కొన్నారు.

ప్రజల సహకారం అవసరం

'ఏ ప్రయత్నం ఒంటరిగా ప్రజల సహకారం లేకుండా ఒక భాషను జీవింపజేయలేదు. ప్రజలు తమ నిత్య జీవనంలో భాషను భాగం చేసినప్పుడే అది వికసిస్తుంది. ప్రాథమిక స్థాయిలో మాతృభాషలోనే విద్యనందించాలన్న ఆలోచన శాస్త్రీయంగా సరైనది. మాతృభాషలో నేర్చుకున్న పిల్లలు సులభంగా అర్థం చేసుకుని, స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తపరచగలుగుతారు. భారతీయ భాషల గౌరవాన్ని పునరుద్ధరించి, జాతీయ అభివృద్ధికి కేంద్ర బిందువుగా మలిచిన ప్రధాని నరేంద్ర మోదీని అభినందిస్తున్నా. సినీ, రాజకీయ రంగంలో విశేష సేవలతో తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచస్థాయిలో చాటిన ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్నా' అని హరిబాబు పేర్కొన్నారు. 'తెలుగువారు ఎక్కడున్నా తెలుగులోనే మాట్లాడాలి. పిల్లలకు నేర్పించాలి. ప్రభుత్వాలు సైతం ఆంగ్ల మాధ్యమంలోనూ తెలుగు భాషను కచ్చితంగా పాఠ్యాంశాల్లో ఉంచాలి' అని అన్నారు.

తెలుగుభాష అభివృద్ధిపై అసెంబ్లీలో చర్చిస్తాం

– చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఏపీ శాసన సభాపతి

తెలుగు సంప్రదాయాలు మనకు పెద్దలు ఇచ్చిన ఆస్తి. వాటిని కాపాడుకోవాలి. ఇంగ్లిష్ నేర్చుకోవడం తప్పు కాదు. తెలుగు కూడా తప్పనిసరిగా పిల్లలు నేర్చుకోవాలి. తమిళనాడు ఎంపీ గోపీనాథ్ కోరుకున్నట్లు అసెంబ్లీలో సభ్యులంతా తెలుగులో మాట్లాడేలా చూస్తా. అమ్మ చెప్పే లాలిపాటల్లో, కథల్లో తెలుగు ఉంది. దురదృష్టవశాత్తూ నేటి తరం పిల్లలకు సంప్రదాయాలు, సంస్కృతి తెలియడం లేదు. తెలుగుకు పూర్వవైభవం తెచ్చేందుకు అందరూ కృషి చేయాలి. తెలుగుభాష అభివృద్ధిపై ఈ సభలో తీర్మానం చేసి ఇవ్వండి. అసెంబ్లీలో చర్చిస్తా.

భాషతోనే వికాసం

– జస్టిస్ ఆకుల శేషసాయి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి

భాషా సంస్కృతులు మరిచిపోయిన, కళలకు స్థానం లేని సమాజం మనుగడ సాగించలేదు. తెలుగుభాషను పరిరక్షించుకుంటేనే సంస్కృతి, నాగరికత వికసిస్తాయి. అందరికీ అమ్మ తొలి గురువు. అందుకే అమ్మ భాష అంటాం. అమ్మను, అమ్మభాషను గౌరవించేవారు ఎన్నటికీ తప్పు చేయరు. తెలుగు భాషను నేర్చుకుని భావితరాలకు అందించాల్సిన బాధ్యత నేటితరంపై ఉంది.

తెలుగుకు పట్టం.. పూర్ణకుంభ పురస్కారం

తెలుగు భాషకు సేవలందించిన పలువురు ప్రముఖులకు మహాసభల్లో పూర్ణకుంభ పురస్కారాల ప్రదానం జరిగింది. శాసనసభ సభాపతి అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా దర్శకుడు కె.విశ్వనాథ్ తనయుడు నాగేంద్ర, తూర్పుభాగోతం కళాకారుడు శంకర్రావు, సినీనటుడు ఏడిద శ్రీరాం, బుర్రా సాయిమాధవ్, గజల్ కుమార్, తోలుబొమ్మల కళాకారుడు చిదంబరం, పొత్తూరు రంగారావు తదితరులను సత్కరించారు.

అందరి నోట.. తెలుగు మాట

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, గుంటూరు సాంస్కృతికం


అందరి నోట తెలుగు మాట వినిపించింది. తల్లిదండ్రుల ఒడిలోనే పిల్లలకు భాషపై ఇష్టాన్ని పెంచాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. పాలన, అధికారిక కార్యక్రమాల్లో మాతృభాషకు ప్రాధాన్యమివ్వాలని మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో వక్తలు తమ మనోగతాన్ని వినిపించారు.



తెలుగుతల్లికి ఏపీ, తెలంగాణ రెండు కళ్లు

– విశ్వయోగి విశ్వంజీ, ఆధ్యాత్మిక గురువు

రాష్ట్రాలుగా విడిపోయినా ఏపీ, తెలంగాణ తెలుగుతల్లికి రెండు కళ్లు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి చేపట్టబోయే కార్యక్రమాలు విజయవంతం కావాలి. భౌతిక, ఆర్థిక, మానసిక, ఆధ్యాత్మిక శక్తి ప్రతి ఒక్కరిలో ఉండాలి. యువతను సంస్కారవంతులుగా, తేజోవంతులుగా చేయాలి. వ్యవస్థలను సక్రమమార్గంలో నడిపించేలా న్యాయవ్యవస్థ ఉండాలి. ప్రపంచంలోని ప్రముఖ సంస్థలకు సీఈఓలుగా తెలుగువారు సత్తా చాటుతున్నారు.



కొత్త పదాలను కనుక్కోవాలి

– జస్టిస్ రఘురాం, నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ పూర్వ డైరెక్టర్

మాతృభాష వాడుక పెరగాలి. సాంకేతిక, వైజ్ఞానిక రంగాల్లోనూ విరివిగా వినియోగించాలి. జిల్లా స్థాయి న్యాయస్థానాల్లో తీర్పులు తెలుగులో ఇస్తే మంచి ప్రోత్సాహం కలుగుతుంది. న్యాయవాదవృత్తిలో ఉండే సూత్రాలు, పదాలకు తెలుగు పదాలను కనుక్కోవాలి. అప్పుడే న్యాయస్థానాల్లోనూ మాతృభాష వినియోగం సాధ్యం.

రెండువేల సంవత్సరాల ప్రాచీన భాష

– గజల్ శ్రీనివాస్, ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు


రెండు వేల సంవత్సరాల చరిత్ర ఉన్న ప్రాచీనభాష తెలుగు. ప్రభుత్వానికి తెలుగు అధికారభాష కావచ్చు. కానీ అది మనందరికీ మమకార భాష. నన్నయ, తిక్కన, ఎర్రన వంటి కవులు తెలుగుభాషకు పట్టం కట్టారు. తెలుగుభాషకు, స్వాభిమానానికి పేరు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్. తెలుగు వెలుగులు కురిపించిన వ్యక్తి ఈనాడు వ్యవస్థాపకులు రామోజీరావు. ఆంధ్ర సారస్వత పరిషత్తు తరఫున మూడోసారి ప్రపంచ మహాసభలు అమరావతిలో జరుపుకోవడం ఆనందంగా ఉంది. మనం తెలుగువారమని సగర్వంగా చెప్పుకొంటున్నా చాలామందికి దీని చరిత్ర తెలియదు. దశాబ్దాల క్రితం పుట్టిన ఆంధ్ర సారస్వత పరిషత్తు రాష్ట్ర విభజన తర్వాత విడిపోయింది. తెలుగు భాష అమ్మానాన్నల ఒడిభాష. అక్కడ మాతృభాష పాఠాలు మొదలవ్వకపోతే ఏ భాషా బతకదు. 150 భాషల్లో పాడి 3 గిన్నిస్‌రికార్డులు నెలకొల్పిన వ్యక్తిగా చెబుతున్నా. చాలామంది నా దగ్గరకు వచ్చి మా భాషలో పాడే చివరిపాట ఇదే కావచ్చు. గుండెతో పాడమని చెప్పారు. ఆఫ్రికా నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు.. పలువురు తమకు లిపి లేదని, మాట్లాడే వారు కనుమరుగవుతున్నారని చెబుతున్నారు. మనకు లిపి, సౌందర్యం, చరిత్ర అన్నీ ఉన్నాయి. తెలుగుభాష నాకు పెద్దగా రాదు. సంధులు, సమాసాలు తెలియవు. గజల్స్ పాడుతుంటా. తెలుగులోనే నామఫలకాలు ఉండాలని కోరుకుంటున్నా. అరుదైన భాష మనది. అది అరుదుగా మారిపోకూడదు.

పాట పాడి.. ఆకట్టుకుని..

ఈ సందర్భంగా తెలుగు ఔన్నత్యాన్ని వివరిస్తూ గజల్ శ్రీనివాస్ ప్రత్యేకంగా పాట పాడారు.

జీవితాన తీర్చలేని తల్లి రుణం తెలుగు
ఏ గురువూ చెప్పలేని తండ్రి గుణం తెలుగు
పసిబుగ్గల వెలకందని లావణ్యం తెలుగు
భరతమాత సంతతిలో ఘన పుణ్యం తెలుగు
సంగీతపు వేదానికి ఓంకారం తెలుగు
శ్రుతిపక్వపు నాదానికి ఆకారం తెలుగు
అజంతాల పదవీణను తీగ సాగు తెలుగు
చదువులమ్మ గుడి ముంగిట తేనె వాగు తెలుగు
సరసమైన శబ్దాలకు రాసిక్యం తెలుగు
ఆప్తమైన అర్థాలకు హితవాక్యం తెలుగు
పూలవంటి భావాలకు తేటిపాట తెలుగు
తులే లేని పద్యానికి కంచుకోట తెలుగు
వ్యంగ్యానికి ప్రాణమైన గాంభీర్యం తెలుగు
పరభాషకు పంచనిచ్చు ఔదార్యం తెలుగు
శరత్కాల పూర్ణచంద్ర ధావళ్యం తెలుగు
భగవంతుని గుండెలలో వాత్సల్యం తెలుగు


..అంటూ తన గానంతో ఆకట్టుకున్నారు.



తల్లి ఒడి నుంచే పునాది పడాలి..

– తోటకూర ప్రసాద్, తానా పూర్వ అధ్యక్షులు

తెలుగుభాష మనుగడ సాగించలేకపోతోందంటే, మాట్లాడలేకపోతున్నారంటే, పిల్లలు తెలుగు భాష అని గర్వంగా తలెత్తుకుని తిరగలేకపోతున్నారంటే అందుకు తలదించుకోవాల్సింది తల్లిదండ్రులే. వ్యవస్థల్ని, ప్రభుత్వాన్ని తర్వాత నిందిద్దాం. తల్లి ఒడి నుంచే ఈ భాషకు పునాది ఏర్పడాలి. మానసిక శాస్త్రవేత్తల అధ్యయనం ప్రకారం పసివయసులో ఎన్ని భాషలైనా నేర్చుకోగలరు. చైనాలో మాండరిన్, జర్మనీలో జర్మన్, ఇటలీలో ఇటాలియన్, జపాన్‌లో జపనీస్.. వీరంతా ప్రపంచంలో ఎక్కడా వెనుకబడలేదు. వారు విశ్వవిజ్ఞానాన్ని తమ భాషల్లోకి అనువదింపజేసుకుని పిల్లలకు అందజేస్తున్నారు.



విశ్వామిత్రుడి కుమారుడి పేరు ఆంధ్రుడు

– డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్, మహా సహస్రావధాని

శ్రీరామచంద్రమూర్తికి విద్యలు నేర్పిన మహాగురువు విశ్వామిత్రుడు. ఆయన కుమారుల్లో ఒకరి పేరు ఆంధ్రుడు. ఆయన ఉత్తరాది నుంచి దక్షిణాదికి వచ్చి మన ప్రాంతాన్ని పాలించారు. అలా మన ప్రాంతానికి ఆంధ్ర దేశమని, మనకు ఆంధ్రులని, మన భాషకు ఆంధ్రమని పేరు వచ్చింది. అంటే శ్రీరాముని కాలం నుంచి తెలుగు భాష ఉందని గ్రహించాలి.



మాతృభాషతోనే ముందుకు..

– లక్ష్మీనారాయణ, సీబీఐ పూర్వ జేడీ

నేను ఐదు భాషలు అనర్గళంగా మాట్లాడటానికి కారణం నా మాతృభాష తెలుగు బాగా రావడం వల్లే అని గర్వంగా చెబుతున్నా. తెలుగులో చదివితే ఉద్యోగాలు రావని చాలామంది అనుకుంటుంటారు. మనకు ఉద్యోగాలు ఇంగ్లిష్ భాష చూసి ఇవ్వరు. విషయ గ్రాహక శక్తి, పరిజ్ఞానం చూసి ఇస్తున్నారు. అవి పెరగాలంటే మాతృభాష బాగా రావాలి. మాతృభాషకు ప్రాధాన్యమిచ్చే దేశాలు ముందుకెళుతున్నాయి.



తెలుగు భాష పరిరక్షణకు రామోజీరావు విశేష కృషి

స్మరించుకున్న సాహిత్య, భాషాభిమానులు

గుంటూరు (జిల్లాపరిషత్తు), న్యూస్‌టుడే: తెలుగు భాష విస్తృతికి రామోజీ గ్రూపు సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ రామోజీరావు ఎంతో కృషి చేశారని పలువురు ప్రముఖులు గుర్తు చేసుకున్నారు. మాతృభాష పరిరక్షణలో ఆయన సేవలను కొనియాడారు. గుంటూరులో మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో రామోజీరావు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దివంగత రామోజీరావు విగ్రహం వద్ద పలువురు ప్రముఖులు, విద్యార్థులు, సందర్శకులు నివాళులర్పించారు. విగ్రహం వద్ద ఫొటోలు తీసుకున్నారు.

భాషా పరిమళం.. సంప్రదాయ సౌరభం

గుంటూరులో అట్టహాసంగా ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభలు

ఈనాడు, అమరావతి: తెలుగు పరిమళం గుబాళించింది. సంప్రదాయం ఉట్టిపడింది. తెలుగు కళల వైభవం కళ్లకు కట్టింది. మాతృభాషపై మమకారంతో తరలివచ్చిన తెలుగు ప్రేమికులను అమ్మఒడిలా అక్కున చేర్చుకుంది. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శనివారం గుంటూరులో మూడో ప్రపంచ తెలుగు మహాసభలు అమ్మభాషకు పట్టం కట్టేలా అట్టహాసంగా మొదలయ్యాయి. వివిధ రంగాల ప్రముఖుల ప్రసంగాలు, భాషాపండితుల చమత్కారాలు, తెలుగు కవుల నుడికారాలు, అవధానుల ప్రతిభా పాటవాలు, కళాకారుల నృత్యాలు, సంప్రదాయ వస్త్రధారణలు అందరినీ కట్టిపడేశాయి. తెలుగు వైభవం చాటిచెప్పిన మహనీయులను గుర్తుకు తెచ్చుకునేలా తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా కార్యక్రమాలు కొనసాగాయి. సంక్రాంతి సంబరాలు ముందుగానే వచ్చాయన్నట్లు సభా వేదిక అయిన 'సత్యసాయి ఆధ్యాత్మిక నగరి' సరికొత్త శోభతో వెలిగింది. మహాసభలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భాషాభిమానులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న తెలుగు సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులూ పాల్గొన్నారు.

ఐదు తరాల సందడి

మహా సభల వేదికలపై ఐదుతరాలు కనువిందు చేశాయి. మహాసభలకు చిన్నాపెద్దా అన్న తేడా లేకుండా, విభిన్న వయస్సులవారు హాజరు కావడం ఆకట్టుకుంది. ప్రధానవేదిక వద్ద ఉదయం నుంచీ పాఠశాలల విద్యార్థులు సందడి చేయగా.. అన్నమయ్య సంకీర్తనల సందర్భంగా యువతులు గొంతు కలిపి అమ్మభాషను కీర్తించారు. పిల్లలతో కలిసొచ్చిన మాతృమూర్తులు, మాతృభాషపై మమకారంతో హాజరైన అమ్మమ్మలు.. ఇలా అన్ని తరాలూ ప్రాంగణంలో కనిపించాయి. కొన్నిచోట్ల పిల్లలకు తెలుగు భాష గొప్పతనాన్ని వివరిస్తుండటం కనువిందు చేస్తే.. మరికొన్నిచోట్ల తమ బిడ్డలను సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు పరితపించడం ఆకట్టుకుంది.



జానపదాల హోరు... జనంలో జోరు

తెలుగునాట వివిధ ప్రాంతాలకు చెందిన కళలు, జానపదాలకు మహాసభల్లో సముచిత గౌరవం దక్కింది. వయసుతో సంబంధం లేకుండా కళాకారులు ప్రతిభను ప్రదర్శించారు. నృత్యాలు, పాటలు, భజనలు, సంకీర్తనలు తెలుగుభాష వైభవాన్ని చాటిచెప్పాయి. మన చేతివృత్తులు, చేనేత వస్త్రాలు, శిల్ప, చిత్రకళలు... అన్నీ ఒకచోట చేరి తెలుగువారి వారసత్వ సంపద గొప్పతనాన్ని తెలియజెప్పాయి. ప్రధానవేదికపై ఏర్పాటుచేసిన శ్రీవేంకటేశ్వరుని ప్రతిమ, తెలుగుతల్లి, ఎన్టీఆర్ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెనాలి కళాకారుల చేతిలో రూపుదిద్దుకున్న తుక్కు ఇనుము శిల్పాలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. నోరూరించే ఆంధ్రా వంటకాలను వడ్డించారు. చారిత్రక, వారసత్వ సంపదను, విజ్ఞాన సర్వస్వాన్ని ఒకే చోటకు తీసుకొచ్చి నేటి తరానికి పరిచయం చేశారు.

అవధానం తెలుగోడి సొత్తు

– మాశర్మ, కొప్పరపు పీఠ వ్యవస్థాపకులు

ఆంధ్రం అనగానే మనకు గుర్తొచ్చేది అవధానం. ఆ ప్రక్రియ మన తెలుగోడి సొత్తు. అవధానం అంటే జ్ఞాపకశక్తి, ధారణ, ధోరణి, చమత్కారం, ధైర్యం.. ఇవన్నీ ఉండాలి. అలాంటి అవధానం భారతీయ భాషల్లో ఇంకెక్కడా లేదు.

అందరికీ రుణపడి ఉన్నాం

– పి.రామచంద్రరాజు, మహాసభల సమన్వయకర్త


మహా సభలను గుంటూరులో నిర్వహించాలని రెండేళ్ల క్రితం నిర్ణయించుకున్నాం. దేశం, ప్రపంచం నలుమూలల నుంచి ఇక్కడికి విచ్చేసిన అందరికీ రుణపడి ఉన్నాం.



తాళపత్రాలు రాసే ఘంటం

చరిత్రకు సాక్ష్యాలు.. ఈ తాళపత్రాలు

ఈనాడు, అమరావతి– జిల్లా పరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రపంచ తెలుగు మహాసభల్లో కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంకు చెందిన కందుల వెంకటేష్ ఏర్పాటుచేసిన పురాతన నాణేలు, తాళపత్ర ప్రతుల ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటోంది. 14వ శతాబ్ద కాలం నాటి నుంచి నేటి వరకూ నాణేలు, చిత్రాలతో పాటు రాగితో చేసిన లంకె పిండె, పూర్వ కాలంలో రాసిన పెన్ను ఘంటంతో పాటు అప్పటి తాళపత్ర ప్రతులు, శిలలను ప్రదర్శనలో ఉంచారు. సందర్శకులు, విద్యార్థులు వీటిని ఆసక్తిగా చూశారు. వారికి వాటి చరిత్ర గురించి వెంకటేష్ వివరించారు. ఆదికవి నన్నయ ఆంధ్రమహాభారతంలోని సభాపర్వం తాళపత్ర ప్రతి, వనమూలికా శాస్త్రం తాళపత్ర ప్రతిని తమ పూర్వీకులు సేకరించారని, అవి పాడవకుండా పురాతన సంరక్షణ పద్ధతుల ద్వారా దశాబ్దాలుగా పరిరక్షిస్తున్నామని ఈ సందర్భంగా వెంకటేష్ వివరించారు.



లంకె పిండెతో వెంకటేష్

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉష్ణోదక అభిషేకం



ఉష్ణోదక అభిషేకం సందర్భంగా మూసివేసిన గర్భాలయం, తెరపై సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక ఉత్సవమూర్తులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి వారి జన్మనక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకుని మూలమూర్తులకు ప్రత్యేకంగా ఉష్ణోదక (వేడినీళ్ల) అభిషేకాలు నిర్వహించారు. శనివారం స్వయంభు శివలింగమైన స్వామి వారి ప్రధానమూర్తి వద్ద పుష్పి లింగాన్ని ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం శ్రీజ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ప్రధానమూర్తులకు ఏకాంతంగా వేడి నీళ్ల అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా 3 గంటల పాటు గర్భాలయాలను మూసివేశారు. ఈ సమయంలో భక్తులు సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక ఉత్సవమూర్తులను దర్శించుకునేలా అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు.

దూరం.. దగ్గరవుతోంది!



- వచ్చే నెలలో పాక్షికంగా అందుబాటులోకి ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే
- వైరా నుంచి జంగారెడ్డిగూడెం వరకు వాహనాలకు అనుమతి
- సంక్రాంతి వేళ హైవేపైకి మళ్లింపు?

ఈనాడు, అమరావతి: హైదరాబాద్-విశాఖపట్నం మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో నిర్మిస్తున్న ఖమ్మం-దేవరపల్లి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే వచ్చే నెల పాక్షికంగా అందుబాటులోకి రానుంది. ఆటు ఖమ్మం వైపు, ఇటు దేవరపల్లి వైపు ప్యాకేజీల్లో పనులు సాగుతున్నాయి. మధ్యలో నిర్మాణం పూర్తయినందున.. వైరా నుంచి జంగారెడ్డిగూడెం వరకు వాహనాలను అనుమతించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

120 కి.మీ. పూర్తి..

◆ నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేలో ఖమ్మం జిల్లా పరిధిలో 105.22 కి.మీ., ఏపీలోని ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో 56.88 కి.మీ. కలిపి 162.10 కి.మీ. ఉంది.

◆ ఖమ్మం వద్ద మున్నేరు వాగుపై వంతెన, దానికి సమీపంలోని రైల్వే లైన్‌పై వంతెన పూర్తికావాలి. ఇందుకు 3 నెలలు పడుతుంది.

◆ దేవరపల్లి వైపు.. కొయ్యలగూడెం మండలంలోని ఎర్రంపేట, కన్నాయగూడెం వద్ద భూసేకరణ విషయమై కోర్టు కేసు కారణంగా 2 కి.మీ. నిర్మాణం ఆగిపోయింది. కొంతకాలం కిందట కేసు పరిష్కారమైంది. ఇటీవల పనులు మొదలయ్యాయి. పూర్తయ్యేందుకు 3 నెలలు పడుతుందని భావిస్తున్నారు.

◆ మధ్యలో దాదాపు 120 కి.మీ. మేర హైవే పూర్తయ్యింది.

◆ ఖమ్మం దాటాక వైరా నుంచి జంగారెడ్డిగూడెం వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వాహనాల రాకపోకలకు అనుమతించాలని భావిస్తున్నారు.

◆ ప్రస్తుతమున్న హైవేలో వైరా వద్ద నుంచి కిలోమీటరున్నర దూరం వెళ్తే గ్రీన్‌ఫీల్డ్ హైవేలోకి చేరుకోవచ్చు. జంగారెడ్డిగూడెం సమీపంలో ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే నుంచి బయటకు వచ్చి పాత హైవేపైకి చేరుకుని ప్రయాణించొచ్చు.

టోల్ ఏజెన్సీ ఎంపిక కాగానే..

◆ ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేలో 12 టోల్‌ప్లాజాలున్నాయి. ఓ టోల్ గేట్ నుంచి వాహనం హైవేలోకి ప్రవేశించాక.. ఎంత దూరం ప్రయాణిస్తుందో, అంత మేరకే టోల్ వసూలు చేస్తారు. వైరా నుంచి జంగారెడ్డిగూడెం వరకు 8 టోల్‌ప్లాజాలు ఉన్నాయి.

◆ హైవేపై టోల్ వసూలు ఏజెన్సీని ఎంపిక చేసేందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. గుత్తేదారు ఎంపికై, ఎన్‌హెచ్ఏఐతో ఒప్పందం చేసుకున్నాక వాహనాల రాకపోకలను అనుమతిస్తారు.

అనుమతించాలా? వద్దా?

సంక్రాంతి నేపథ్యంలో.. హైదరాబాద్ వైపు నుంచి ఏపీకి పెద్దఎత్తున వాహనాలు వస్తాయి. వీటిని గ్రీన్‌ఫీల్డ్ హైవేలో వైరా నుంచి జంగారెడ్డిగూడెం వరకు అనుమతించాలా? వద్దా? అని అధికారులు పరిశీలిస్తున్నారు. సంక్రాంతి సమయంలో టోల్ వసూలు చేయకుండానే వాహనాలను అనుమతిస్తే ఎలా ఉంటుందా అని ఆలోచిస్తున్నారు. ఖమ్మం, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల అధికారులు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు చర్చించి.. రెండు, మూడు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నారు.

జగన్మాత సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్రీనరసింహ



జస్టిస్ శ్రీనరసింహకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో వెంకటరెడ్డి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాతను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్రీనరసింహ.. కుటుంబసభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఏఈవో వెంకటరెడ్డి ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. మంగళగిరి నృసింహ స్వామిని కూడా జస్టిస్ పి.శ్రీనరసింహ దర్శించుకున్నారు.

చరిత్రకారులు ప్రజల్లో చైతన్యం తేవాలి

- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపు
- వీవీఐటీయూలో రాష్ట్ర హిస్టరీ కాంగ్రెస్ ప్రారంభం



పరిశోధన పత్రాల సంపుటిని ఆవిష్కరిస్తున్న డాక్టర్ మల్లికార్జునరెడ్డి, రామకృష్ణ, మండలి బుద్ధప్రసాద్, ఏఆర్ రెడ్డి

నంబూరు(పెదకాకాని), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ చరిత్రకు సంబంధించి.. పొరుగు రాష్ట్రాల్లో ఉన్న పురాతన వస్తువులు, శిల్పాలు, శాసనాలు, నాణేలు, తాళపత్ర గ్రంథాలు, రాతప్రతులను పూర్తిస్థాయిలో మనం తెచ్చుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. 'నేను తెలుగువాడిని.. నాది తెలుగు జాతి' అనే విధంగా ప్రజల్లో చరిత్రకారులు చైతన్యం తేవాలని సూచించారు. గుంటూరు జిల్లా నంబూరులోని వీవీఐటీయూలో శనివారం ప్రారంభమైన 48వ 'ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్' సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. ఈ సమావేశాలు కొత్త ఆలోచన, దృష్టికి నాంది పలుకుతాయని, చరిత్ర పట్ల తెలుగు జాతిలో చైతన్యం తెస్తాయని అభిప్రాయపడ్డారు. సాంకేతిక, వైద్య విద్యాలయాల్లోనూ 'హిస్టరీ' సబ్జెక్టు ఉండాలని ఆయన చెప్పారు. గతేడాది గూడూరులో నిర్వహించిన 47వ కాంగ్రెస్‌లో సమర్పించిన పరిశోధన పత్రాల సంపుటిని హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ, అధ్యక్షుడు బి.కేశవనారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మొవ్వా శ్రీనివాసరెడ్డితో కలిసి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. 150 మంది చరిత్రకారులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. హెచ్‌సీయూ చరిత్ర అధ్యాపకురాలు అలోక పరాశర్ సేన్ మామిడిపూడి వెంకటరంగయ్య స్మారక ఉపన్యాసమిస్తూ, 6 నుంచి 14వ శతాబ్దం మధ్య గ్రామీణ సామాజిక, ఆర్థిక పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, హిస్టరీ కాంగ్రెస్ పూర్వ అధ్యక్షుడు ఆచార్య ఏఆర్ రెడ్డి, వీవీఐటీయూ పబ్లికేషన్ డివిజన్ సమన్వయకర్త మోదుగుల రవికృష్ణ పాల్గొన్నారు.

సమీకరణలో ఇవ్వని భూములకు భూసేకరణ నోటిఫికేషన్

- ప్రధాన కార్యదర్శులు, మంత్రులు, జడ్జిల బంగ్లాలు మార్చి నెలాఖరుకు పూర్తి
- మంత్రి పొంగూరు నారాయణ



నిర్మాణంలో ఉన్న మంత్రుల భవనాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూ సమీకరణలో ఇవ్వని భూములకు త్వరలో భూసేకరణ నోటిఫికేషన్ జారీచేస్తామని పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం ఆయన రాజధానిలో పర్యటించారు. రాయపూడి సమీపంలో ప్రధాన కార్యదర్శులు, మంత్రులు, న్యాయమూర్తుల నివాసాల కోసం నిర్మిస్తున్న బంగ్లాలను పరిశీలించారు. ఆయా నిర్మాణాలను మార్చి నెలాఖరులోగా పూర్తి చేస్తామని వెల్లడించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. 'అమరావతి మొదటి దశ నిర్మాణానికి ఇంకా 2వేల ఎకరాలు అవసరం. సుమారు 1,300 ఎకరాలు కోర్టుకేసులు, కుటుంబకలహాల కారణంగా, మరో 700 ఎకరాలు వివిధ కారణాలతో భూ సమీకరణలో ఇవ్వలేదు. సీడ్ యాక్సెస్ (ఈ-3) రహదారి పూర్తికి 4.5 ఎకరాలు కావాలి. 2 ఎకరాలు ఇస్తామని రైతులు ముందుకొచ్చారు. ఈ నెల 7న మిగిలిన భూములకు భూసేకరణ నోటిఫికేషన్ ఇస్తాం. తర్వాత అమరావతి మొదటిదశలో మిగిలిన భూములకు మరో నోటిఫికేషన్ ఇస్తాం. రెండోదశ భూసమీకరణకు రైతులు సానుకూలంగా ఉన్నారు' అని మంత్రి నారాయణ తెలిపారు.

రాజధాని అవసరాలకు తగ్గట్టుగా భూ సమీకరణ

అమరావతి రైల్వేస్టేషన్, రైల్వే లైనులు, స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణాల కోసం రాజధాని రెండోదశ భూసమీకరణలో 16,666 ఎకరాలను సమీకరిస్తున్నామన్నారు. 2,500 ఎకరాల భూమిని అందుబాటులోకి తీసుకురావాలంటే సుమారు 16వేల ఎకరాలను సమీకరించాలని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రీస్ కోసం భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా ఎంతవరకు భూ సమీకరణ చేయాలనేదానిపై సమాలోచన చేస్తున్నామని చెప్పారు.

సీబీఎస్ఈ స్కూళ్లు, వైద్యకళాశాలలు, రిక్రియేషన్ క్లబ్‌లు

అమరావతిలో ఉద్యోగులు, మంత్రులు, న్యాయమూర్తుల కోసం 4,026 నివాస భవనాలను నిర్మిస్తున్నామని మంత్రి చెప్పారు. దీనిలో 3,850 ఫ్లాట్లు, 186 బంగ్లాలుగా నిర్మిస్తున్నామని చెప్పారు. ఉద్యోగుల పిల్లల కోసం ఇక్కడి వీఐటీ, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయాల్లో ఈ ఏడాది జూన్ నాటికి సీబీఎస్ఈ స్కూళ్లు, ఒక్కో యూనివర్సిటీలో 50 పడకలతో వైద్య కళాశాలలతో పాటు రిక్రియేషన్ క్లబ్‌హౌస్‌లు, పార్కులు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

అన్నమయ్య జిల్లా కేంద్రం మార్పుపై హైకోర్టులో పిల్

ఈనాడు, అమరావతి: అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ న్యాయవాది బి.వెంకటనారాయణరెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ విషయంలో ఏపీ జిల్లా (ఫార్మేషన్) చట్టం-1974లోని సెక్షన్ 3(5)కి అనుగుణంగా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయలేదని.. ప్రజలు, భాగస్వాముల నుంచి అభ్యంతరాలు స్వీకరించలేదని తెలిపారు. జిల్లా కేంద్రం మార్పుపై రెవెన్యూ శాఖ డిసెంబరు 30న జారీ చేసిన జీవోతో పాటు తుది గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలన్నారు. 2022లో నోటిఫై చేసిన దానికి అనుగుణంగా అన్నమయ్య జిల్లా పరిపాలన కేంద్రంగా రాయచోటినే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ జిల్లా కేంద్రాన్ని మార్చాలనుకుంటే ముందుగా ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసి, ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు తీసుకొని.. చట్ట నిబంధనల మేరకు తగిన నిర్ణయం తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. జిల్లా కేంద్రాన్ని మారుస్తూ జారీ చేసిన జీవో, గెజిట్ నోటిఫికేషన్‌లపై స్టే ఇస్తూ.. అన్నమయ్య జిల్లా పరిపాలన కేంద్రం రాయచోటిగా ఉన్న పూర్వస్థితిని కొనసాగించేలా మధ్యంతర ఉత్తర్వులివ్వాలని అభ్యర్థించారు.

'ఎన్టీఆర్ వైద్యసేవ'లో భారీ పురోగతి

మంత్రి సత్యకుమార్ వెల్లడి

ఈనాడు, అమరావతి: నగదు రహిత వైద్యసేవల్లో వైకాపా ప్రభుత్వం అమలుచేసిన ఆరోగ్యశ్రీ కంటే.. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న ఎన్టీఆర్ వైద్యసేవలో భారీగా పురోగతి కనిపించిందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్యసేవ, 108, 104 వాహనాల సేవలపై శనివారం వర్చువల్‌గా మంత్రి సమీక్షించారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద సేవల సంఖ్యను 3,257కి పెంచి.. పూర్తిస్థాయిలో అమలుచేసిన 2022-23 నుంచి 2023-24 మధ్యకాలంలో ఫలితాలను, గత 19 నెలల కూటమి పాలనలో ఎన్టీఆర్ వైద్యసేవల కింద సాధించిన ఫలితాలు పరిశీలిస్తే.. కూటమి ప్రభుత్వ నిరంతర పర్యవేక్షణతో ఉచిత వైద్యసేవల్లో సానుకూల మార్పు కనిపించిందని పేర్కొన్నారు. వైకాపా సర్కారు ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ కింద రూ.11,577 కోట్లు ఖర్చుచేస్తే.. కూటమి ప్రభుత్వం 19 నెలల్లో రూ.6,530 కోట్లు ఖర్చుచేసిందన్నారు. 2022-24లో ఆరోగ్యశ్రీ ద్వారా 23.08 లక్షల మంది లబ్ధిపొందితే.. కూటమి ప్రభుత్వంలో గతేడాది డిసెంబర్ వరకు 24.19 లక్షల మందికి వైద్యసేవలు అందాయని చెప్పారు. వైద్యసేవలు పొందే లబ్ధిదారుల్లో 21 శాతం వృద్ధి నమోదైందన్నారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద నెలకు సగటున రూ.193 కోట్లు ఖర్చుచేస్తే.. కూటమి పాలనలో నెలవారీ ఖర్చు రూ.310 కోట్లకు పెరిగిందన్నారు.

మారిషస్ అధ్యక్షునికి ఘనస్వాగతం

- నేడు ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరు



మారిషస్ అధ్యక్షుడు ధరమ్‌బీర్ గోకుల్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి కందుల దుర్గేష్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తదితరులు

గన్నవరం గ్రామీణం, గుంటూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: భారత్ పర్యటనలో భాగంగా మారిషస్ అధ్యక్షుడు ధరమ్‌బీర్ గోకుల్ కుటుంబ సమేతంగా శనివారం సాయంత్రం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ముంబయి నుంచి ప్రత్యేక విమానంలో ఇక్కడికి వచ్చిన ఆయనకు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఇతర ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో గుంటూరు బయల్దేరి వెళ్లారు. గుంటూరులోని ఐటీసీ హోటల్ వద్ద కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ వారికి స్వాగతం పలికి, బస ఏర్పాట్లు చేశారు. గుంటూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆదివారం నిర్వహించే కార్యక్రమాల్లో ధరమ్‌బీర్ పాల్గొంటారు. ఈనెల 8 వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన పర్యటించనున్నారు.

రండి.. ప్రకృతి సాగులోకి వెళ్దాం

- విచ్చలవిడిగా ఎరువులు, పురుగు మందుల వాడకంతో నష్టం
- 'సహజ రైతుసదస్సు'లో వక్తల పిలుపు
- ఏపీలో ప్రత్యేక విధానం రూపొందించాలని తీర్మానం



విజయవాడలో శనివారం నిర్వహించిన 'సహజ రైతు సదస్సు'లో మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్. వేదికపై 'రైతు నేస్తం' ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి తదితరులు

ఈనాడు, అమరావతి: నేల తల్లికి, ప్రజారోగ్యానికి హాని కలిగించని ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రతి రైతూ చొరవ చూపాలని వక్తలు పిలుపునిచ్చారు. భాజపా కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అధ్యక్షతన విజయవాడలో శనివారం నిర్వహించిన 'సహజ రైతుసదస్సు'లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల రైతులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు.

విషాన్ని చిమ్మే కుట్రలకు ప్రకృతి సాగుతో సమాధానం

'దేశంలో క్యాన్సర్‌తో పాటు అనేక వ్యాధుల్లో మనం అగ్రస్థానంలో ఉన్నాం. పురుగుమందులు చల్లి పండించే పంటలతో ఆరోగ్యానికి నష్టం కలుగుతోంది. బ్రిటిష్ వాళ్లు వెళ్లిపోయినా మన దేశంలో విషం చిమ్మే కుట్రలు చేస్తున్నారు. ఈ కుట్రలకు సరైన సమాధానం చెప్పాలంటే ప్రతి రైతూ ప్రకృతిసాగు దిశగా కదలాలి' అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

◆ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి మాట్లాడుతూ 'సాగుఖర్చు పెరిగినా ఆశించిన దిగుబడి రావడంలేదు. సేంద్రియ సాగు దిశగా రైతులు కదిలితే నేలతల్లికి, ప్రజలకు మేలు జరుగుతుంది' అన్నారు.

◆ భారతీయ కిసాన్‌సంఘ్ కార్యవర్గ సభ్యులు జె.కుమారస్వామి మాట్లాడుతూ 'సేంద్రియ విధానాలు సమర్థంగా అమలుచేసి, రైతులకు సహకారం అందించే వ్యవస్థ ఏర్పాటుచేయాలి' అన్నారు.

* రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'ఆరోగ్య భారతం సాకారం కావాలంటే ప్రతి రైతూ ప్రకృతిసాగు వైపు వచ్చేలా ప్రభుత్వం ప్రోత్సహించాలి' అని సూచించారు.

◆ ఏపీ గో ఆధారిత రైతుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రామకృష్ణరాజు మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తులు పండించేలా రైతులకు ప్రభుత్వాలు ఊతమివ్వాలన్నారు. సమావేశంలో భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, వ్యవసాయ శాస్త్రవేత్త వి.రామసుబ్బారెడ్డి, రైతు రామరాజు, భాజపా నాయకులు మట్టా ప్రసాద్, కిసాన్ మోర్చా నాయకులు వైవీ సుబ్బారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సభలో చేసిన తీర్మానాలు

◆ బహుళజాతి సంస్థల విత్తనాలపై ఆధారపడడంతో సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. చీడపీడలను తట్టుకునే దేశీయ విత్తనాల్ని సంరక్షించాలి. ప్రతి మండలంలో విత్తనబ్యాంకు ఏర్పాటుచేసి విత్తనాల లభ్యత పెంచాలి. గోఆధారిత వ్యవసాయానికి కావల్సిన వనరులు ప్రతి గ్రామంలో అందుబాటులో ఉంచాలి.

◆ తొలి 3-5 ఏళ్లు దిగుబడి తగ్గే అవకాశం ఉన్నందున.. దిగుబడి స్థిరీకరణ ప్యాకేజీ ప్రకటించాలి. పంటల బీమా పథకాలను సరళతరం చేయాలి.

◆ సేంద్రియ ఉత్పత్తులకు ప్రీమియం ధరలు దక్కేలా మార్కెట్ వ్యవస్థ బలోపేతం చేయాలి. ప్రతి జిల్లా కేంద్రం, ప్రధాన పట్టణాల్లో సేంద్రియ రైతుబజార్లు ఏర్పాటుచేయాలి. దేవాలయాలు, మధ్యాహ్న భోజన పథకం, వసతిగృహాల్లో ఆహార తయారీకి సేంద్రియ ఉత్పత్తులు సేకరించాలి.

◆ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా సేంద్రియ వ్యవసాయ విధానం రూపొందించాలి. రసాయన ఎరువులపై ఇస్తున్న రాయితీలు తగ్గించి, ప్రకృతిసాగు, విలువ జోడింపు యూనిట్లకు మళ్లించాలి.

జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్ కల్పించండి

హైకోర్టులో అఖిలభారత బీసీ సమాఖ్య వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: బీసీ జనాభాను లెక్కించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ అఖిలభారత బీసీ సమాఖ్య ఏపీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి సోమవారం ఈ వ్యాజ్యంపై విచారణ జరపనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ఉద్యోగ నియామకాల విషయంలో అధికరణ 342ఏ (3) ప్రకారం సామాజిక, విద్యాపరమైన వెనుకబడిన తరగతుల(బీసీ) వివరాల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఫిబ్రవరిలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే వెనుకబడిన తరగతుల జాబితాను తయారుచేసేలా రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. 2023లో ప్రారంభించిన సమగ్ర కుటుంబ సర్వేను పూర్తి చేయాలన్నారు. తమిళనాడు ప్రభుత్వం 69% రిజర్వేషన్లు అమలుచేస్తోందని.. బీసీలకు అందులో 50% రిజర్వేషన్ కల్పిస్తోందన్నారు. ఇలాంటి విధానాన్ని ఏపీలోనూ అమలుచేసేలా ఆదేశించాలన్నారు. ఏపీలో బీసీ జనాభా 50% కన్నా ఎక్కువగా ఉన్నా.. స్థానికసంస్థల ఎన్నికల్లో 34% మాత్రమే రిజర్వేషన్ కల్పిస్తున్నారన్నారు. బీసీ జనాభా నిష్పత్తి ఆధారంగా రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ నవంబరు 19న ప్రభుత్వానికి వినతి ఇచ్చినా ఇప్పటివరకు చర్యలు లేవన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టును ఆశ్రయించామన్నారు.

★ సీఎస్, పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, విద్యాశాఖ కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి, ఏపీపీఎస్సీ కార్యదర్శి, కేంద్ర హోంశాఖ కార్యదర్శిని వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్నారు.

రూ.21,105 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీసీ ఆమోదం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 8 సంస్థలు కలిపి రూ.21,105 కోట్ల మేర పెట్టుబడులు పెట్టే ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్ఐపీసీ) ఆమోదించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధ్యక్షతన ఆయన క్యాంప్ కార్యాలయంలో ఎస్ఐపీసీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పెట్టుబడులపై చర్చించింది. అనంతరం ఈ పెట్టుబడుల ప్రతిపాదనలను సీఎం అధ్యక్షతన జరిగే రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ)కి పంపాలని నిర్ణయించింది. వీటి ద్వారా 9,370 మందికి ఉపాధి లభించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. **పూర్తి వివరాలు https://epaper.eenadu.net లో**

మద్యం మత్తులో ఆలయ గోపురంపైకెక్కి హల్‌చల్



ఆలయ గోపురంపైన నిందితుడు తిరుపతి

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి శుక్రవారం అర్ధరాత్రి తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయ గోపురం పైకెక్కి హల్‌చల్ చేశాడు. మద్యం, డబ్బు ఇస్తేనే.. కిందకు వస్తానంటూ మూడు గంటలపాటు భీష్మించాడు. ఎవరైనా పైకి వస్తే దూకేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. చివరకు పోలీసులు చాకచక్యంగా అతడిని కిందకు దించి స్టేషన్‌కు తరలించారు. తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణలోని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పెద్దమల్లారెడ్డికి చెందిన కుత్తడి తిరుపతి (44) కొంతకాలంగా తిరుపతిలో ఉంటున్నాడు. కూలి పనులు చేసుకుంటూ, తితిదే వసతి సముదాయాల్లో తల దాచుకొనేవాడు. శుక్రవారం అర్ధరాత్రి మద్యం మత్తులో అతను శ్రీగోవిందరాజస్వామి ఆలయం బయటి గోపురం నుంచి ప్రధాన గోపురం వరకు వేసిన టెంటు పైనుంచి గుడి లోపలికి ప్రవేశించాడు. భద్రతా సిబ్బంది స్పందించేలోపే ప్రధాన ఆలయ గోపురం పైకెక్కాడు. ఈ సమాచారం అందుకున్న తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, సీఐ శ్రీనివాసులుతో పాటు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అప్పటికే అతను గోపురం చివరి అంచుకు ఎక్కి, అక్కడున్న మూడు ట్యూబ్‌లైట్లను పగలగొట్టాడు. గోపురం కలశాలను ధ్వంసం చేసేందుకు యత్నించాడు. పోలీసులు కిందకు రమ్మంటే.. మద్యం, డబ్బులు కావాలని డిమాండ్ చేశాడు. ఇలా మూడు గంటలపాటు హల్‌చల్ చేశాడు. చివరకు పోలీసులు అతణ్ని మాటల్లో పెట్టి, నెమ్మదిగా పైకి వెళ్లి.. అక్కడ నుంచి కిందకు దించి, స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మత్తులో మహిళపై హత్యాయత్నం



నిందితుడిని నడిపించుకొని వెళ్తున్న పోలీసులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: గంజాయి మత్తులో ఓ యువకుడు మహిళపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన వక్కలగడ్డ వకుళాదేవి(60) కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి వకుళాదేవి ఒక్కరే గదిలో ఉండగా.. అదే ప్రాంతానికి చెందిన కట్టెపోగు కృపాకర్ గంజాయి మత్తులో వచ్చి, ఆమెను బెదిరించాడు. బాధితురాలు అరిచేందుకు యత్నించగా నిందితుడు అక్కడే ఉన్న కత్తెరతో ఆమెను పలుమార్లు పొడిచాడు. ఈ క్రమంలో ఆమె అరుపులు విని చుట్టుపక్కలవారు రాగా.. నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు వెంటనే వకుళాదేవిని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని ఘటనాస్థలికి తీసుకొచ్చి, విచారించి.. అక్కడి నుంచి నడిపించుకుంటూ పోలీసు స్టేషనుకు తీసుకెళ్లారు.

రసాయన పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

త్రుటిలో తప్పించుకున్న 16 మంది కార్మికులు



పరిశ్రమలో ఎగసిపడుతున్న మంటలు

రాంబిల్లి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం నాన్ సెజ్‌లోని ఎస్‌వీఎస్ రసాయన పరిశ్రమలో శనివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. సోడియం హైడ్రాక్సైడ్ తయారుచేసే ఈ పరిశ్రమలో సాయంత్రం ఐదు గంటల సమయంలో భవనం కింది భాగంలో మంటలు చెలరేగాయి. మండే స్వభావంగల రసాయనాల వల్ల వెంటనే భవనం అంతా మంటలు వ్యాపించాయి. విధుల్లో ఉన్న 16 మంది కార్మికులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. రసాయనాల ఘాటు, పొగతో సమీపంలో ఉన్న ఫార్మా, రసాయన కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ఆందోళన చెందారు. కార్మికులు సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

5న రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గ్రామ సభలు

ఈనాడు, అమరావతి: 'స్వచ్ఛ సంక్రాంతి, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు-2026' కార్యక్రమంలో భాగంగా ఈనెల 5న రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో ఒకేసారి ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ ఓ ప్రకటనలో తెలిపారు. 'చెత్త రహిత గ్రామ పంచాయతీ' అనే అంశం ప్రధాన ఎజెండాతో సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల భాగస్వామ్యంతో స్వచ్ఛతను నిరంతరం కొనసాగించేందుకు తీర్మానాలు ఆమోదిస్తారని తెలిపారు. ఉత్తమ పనితీరు కనబర్చిన ప్రతి జిల్లాలోని మూడేసి పంచాయతీలను గుర్తించి, గణతంత్ర దినోత్సవంలో గ్రామ పెద్దలను సత్కరిస్తారని పేర్కొన్నారు.



ఫిట్‌నెస్ అంటే వ్యాయామాలొక్కటే కాదు..

ఓ పిజ్జా తినడం ద్వారా కేవలం 30 సెకన్లలో 300 క్యాలరీలు శరీరంలోకి చేరుతాయి. కానీ వాటిని వదిలించుకోవాలంటే మాత్రం 30 నిమిషాల పాటు రన్నింగ్ చేయాల్సి ఉంటుంది. కాబట్టి ఫిట్‌నెస్ సాధించడంలో వ్యాయామాలు చేయడం ఎంత ముఖ్యమో, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం అంత కన్నా కీలకం.

– చాస్ ఛాంబర్స్, ఫిట్‌నెస్ కోచ్

ఛాంపియన్స్

శ్రేయస్ వచ్చాడు కానీ..

న్యూజిలాండ్‌తో సిరీస్‌కు జట్టు ఎంపిక

- ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే చోటు
- మళ్లీ వన్డేల్లోకి సిరాజ్


శ్రేయస్

దిల్లీ

ఆస్ట్రేలియా పర్యటనలో తీవ్రంగా గాయపడి రెండు నెలలుగా ఆటకు దూరంగా ఉన్న భారత వన్డే జట్టు వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్.. న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ఎంపికయ్యాడు. అయితే ఈ నెల 11న ఈ మూడు వన్డేల సిరీస్ ఆరంభమయ్యే లోపు అతను ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సి ఉంది. లేదంటే శ్రేయస్ స్థానంలో ప్రత్యామ్నాయ ఆటగాడిని జట్టులోకి ఎంపిక చేస్తారు. మెడ గాయం వల్ల దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. ఈ సిరీస్‌కు అందుబాటులోకి వచ్చాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి అతనే ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. విరాట్ కోహ్లి మూడో స్థానంలో ఆడతాడు. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ వన్డే జట్టులోకి పునరాగమనం చేశాడు. గత నెల దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు అతణ్ని సెలక్టర్లు పక్కన పెట్టారు. రిషబ్ పంత్‌ను జట్టులోకి ఎంపిక చేస్తారా లేదా అన్న ఉత్కంఠకు కూడా సెలక్టర్లు తెరదించారు. అతడికి జట్టులో చోటిచ్చారు. వన్డేల్లో కేఎల్ రాహుల్ వికెట్ కీపర్ బ్యాటర్‌గా కొనసాగుతుండగా.. రిషబ్ పంత్ ప్రత్యామ్నాయ కీపర్‌గా జట్టులో ఉంటున్నాడు. కానీ అతడికి తుది జట్టులో మాత్రం అవకాశం దక్కడం లేదు. గత ఏడాదంతా పంత్ ఒక్క వన్డే కూడా ఆడలేదు. టీ20 జట్టుకు పూర్తిగా దూరమైన పంత్.. టెస్టుల్లో మాత్రమే రెగ్యులర్ ఆటగాడిగా ఉన్నాడు. అంతర్జాతీయ క్రికెట్లో ఫామ్ అంత గొప్పగా లేనప్పటికీ ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి సెలక్టర్లు మరో అవకాశమిచ్చారు. వచ్చే నెలలో టీ20 ప్రపంచకప్ ఆరంభం కానున్న నేపథ్యంలో ప్రధాన ఫాస్ట్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యలకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. సిరాజ్‌తో పాటు పేస్ విభాగంలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణలకు అవకాశం దక్కింది. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్ స్పిన్ బాధ్యతలను పంచుకోనున్నారు. కివీస్‌తో మూడు వన్డేలు ఈ నెల 11, 14, 18 తేదీల్లో జరుగుతాయి. వడోదర, రాజ్‌కోట్, ఇండోర్ ఈ మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తాయి. అనంతరం 21 నుంచి అయిదు టీ20ల సిరీస్ జరుగుతుంది. ప్రపంచకప్‌లో తలపడే జట్టే ఈ సిరీస్‌లోనూ ఆడుతుంది.


సిరాజ్

భారత జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్‌దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్.

విజయ్ హజారేలో అయ్యర్

భారత వన్డే జట్టు వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ విజయ్ హజారే ట్రోఫీలో బరిలోకి దిగనున్నాడు. ఈ నెల 6న హిమాచల్ ప్రదేశ్‌తో మ్యాచ్‌లో అతను ముంబయికి ప్రాతినిధ్యం వహించనున్నాడు. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికైన శ్రేయస్.. ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సిన నేపథ్యంలో ఈ మ్యాచ్ ఆడనున్నాడు. నవంబరులో ఆస్ట్రేలియాతో రెండో వన్డేలో ఫీల్డింగ్ చేస్తూ కింద పడడంతో శ్రేయస్ కడుపులో తీవ్ర గాయమైంది. సిడ్నీలోని ఓ ఆసుపత్రిలో రెండు రోజులు ఐసీయూలో ఉండి చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. డిశ్చార్జి అయ్యాక అతను కొన్ని వారాల పాటు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ)లో ఉండి కోలుకున్నాడు.

ముస్తాఫిజుర్‌ను పంపేయండి

కేకేఆర్‌కు బీసీసీఐ ఆదేశం



గువాహటి: బంగ్లాదేశ్ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను జట్టు నుంచి విడుదల చేయాలని కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను బీసీసీఐ ఆదేశించింది. భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. కేకేఆర్ వేలంలో రూ.9.20 కోట్లకు ముస్తాఫిజుర్‌ను దక్కించుకుంది. ఇప్పుడు అతడి స్థానంలో కోల్‌కతా మరొక ఆటగాడిని తీసుకోవడానికి అనుమతిస్తామని బీసీసీఐ చెప్పింది. "జట్టు నుంచి ముస్తాఫిజుర్ రెహమాన్‌ను విడుదల చేయాలని కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను బీసీసీఐ ఆదేశించింది. అవసరమైతే ఆ జట్టు అతడి స్థానంలో మరొకరిని తీసుకోవచ్చు. కోరితే అందుకు అనుమతిస్తాం" అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా శనివారం చెప్పాడు. బీసీసీఐ ఆదేశాల మేరకు ముస్తాఫిజుర్‌ను జట్టు నుంచి విడుదల చేసినట్లు కోల్‌కతా నైట్‌రైడర్స్ ఓ ప్రకటనలో తెలిపింది. ఇటీవల బంగ్లాదేశ్‌లో ఓ హిందువు హత్య నేపథ్యంలో ఐపీఎల్‌లో ముస్తాఫిజుర్‌ను ఆడించడానికి సంబంధించి బీసీసీఐపై ఒత్తిడి బాగా పెరిగింది. కేకేఆర్ యజమాని షారుక్ ఖాన్ కూడా విమర్శలకు గురయ్యాడు. ముస్తాఫిజుర్ 2016 నుంచి 8 ఐపీఎల్ సీజన్లలో ఆడాడు. అతడు సన్‌రైజర్స్, ముంబయి, దిల్లీ, చెన్నై, రాజస్థాన్ ఫ్రాంఛైజీలకు ప్రాతినిధ్యం వహించాడు.

ఆ సిరీస్ అనుమానమే..: భారత్, బంగ్లాదేశ్ మధ్య ద్వైపాక్షిక క్రికెట్ కూడా ఆగిపోయినట్లే. షెడ్యూలు ప్రకారం భారత జట్టు బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లే అవకాశం కనిపించట్లేదు. బంగ్లాలో భారత్ ఆరు పరిమిత ఓవర్ల మ్యాచ్‌లు ఆడాల్సివుంది. సెప్టెంబరు 1, 3, 6వ తేదీల్లో వన్డేలు, సెప్టెంబరు 9, 12, 13వ తేదీల్లో టీ20 మ్యాచ్‌లు జరగాల్సివుంది. నిజానికి ఈ సిరీస్ నిరుడే జరగాల్సినప్పటికీ భద్రత కారణాలతో భారత్ వెళ్లలేదు. ఈసారి కూడా బీసీసీఐ బంగ్లా పర్యటనకు విముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. బంగ్లా ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్‌ను జట్టు నుంచి విడుదల చేయమని కేకేఆర్‌ను ఆదేశించడం దీనికి సూచికగా భావిస్తున్నారు. గత ఆరు నెలలుగా బంగ్లాదేశ్‌లో రాజకీయ హింస చెలరేగుతోంది. ముందు ముందు భారత్-బంగ్లా క్రికెట్ సంబంధాలు కూడా భారత్-పాక్ క్రికెట్‌లాగే మారితే ఆశ్చర్యం లేదు.

భారత్‌లో బంగ్లా ప్రపంచకప్ ఆడుతుందా?: తాజా పరిణామాల నేపథ్యంలో భారత్‌లో బంగ్లాదేశ్ 2026 టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడుతుందా అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. అయితే ఈ విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని బీసీసీఐ తెలిపింది. ఐపీఎల్‌కు సంబంధించి మాత్రమే నిర్ణయం తీసుకున్నామని, ప్రపంచకప్ గురించి చర్చించలేదని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ చెప్పాడు.

ముగింపులో మురిపించేదెవరో?

యాషెస్ చివరి టెస్టు నేటి నుంచే

సిడ్నీ: యాషెస్ ఫలితం చాలా ముందుగానే తేలిపోయినప్పటికీ.. సిరీస్‌లో చివరి టెస్టు ఆసక్తి రేకెత్తిస్తోంది. 0-3తో ఆస్ట్రేలియాకు సిరీస్‌ను కోల్పోయాక, నాలుగో టెస్టులో అనూహ్య విజయం సాధించిన ఇంగ్లాండ్.. మరో విజయంతో యాషెస్‌ను గౌరవప్రదంగా ముగించాలనే లక్ష్యంతో చివరిదైన అయిదో టెస్టులో బరిలోకి దిగుతోంది. సిడ్నీలో జరిగే ఈ మ్యాచ్‌లో గెలిచి సొంతగడ్డపై తన ఆధిపత్యాన్ని చాటాలని కంగారూ జట్టు చూస్తోంది. మెల్‌బోర్న్‌లో నాలుగో టెస్టు రెండు రోజుల్లోనే ముగిసిపోవడంపై విమర్శల నేపథ్యంలో సిడ్నీ పిచ్ సమతూకంతోనే ఉండొచ్చు. మామూలుగానే ఇక్కడి పిచ్ బ్యాటర్లకు ఎక్కువ అనుకూలిస్తుంది. ఆస్ట్రేలియాలోని మిగతా వేదికల స్థాయిలో పేసర్ల ప్రభావం ఉండదు. మరి సిరీస్‌లో ఇప్పటి దాకా ఆశించిన స్థాయిలో రాణించని ఇంగ్లిష్ బ్యాటర్లు ఈ మ్యాచ్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తారో చూడాలి. ఇంగ్లాండ్ పేసర్ గస్ అట్కిన్సన్ గాయపడ్డ నేపథ్యంలో మాథ్యూ పాట్స్ ఈ మ్యాచ్‌లో తుది జట్టులో ఆడే అవకాశాలున్నాయి. సిడ్నీ వికెట్ నుంచి స్పిన్నర్లకూ సహకారం ఉంటుంది. ఈ నేపథ్యంలో స్పిన్నర్ షోయబ్ బషీర్‌కు కూడా జట్టులో చోటు కల్పించినప్పటికీ.. అతణ్ని ఆడించడం సందేహమే. స్పిన్ ఆల్‌రౌండర్లు విల్ జాక్స్, జాకబ్ బెతెల్‌లను ఇంగ్లాండ్ ఉపయోగించుకోనుంది. రెండో టెస్టులో సెంచరీ కొట్టడం తప్పితే.. మిగతా మ్యాచ్‌ల్లో విఫలమైన సీనియర్ బ్యాటర్ జో రూట్ నుంచి ఇంగ్లాండ్ పెద్ద ఇన్నింగ్స్ ఆశిస్తోంది. హ్యారీ బ్రూక్, బెన్ డకెట్ కూడా నిలకడ అందుకోవాల్సిన అవసరముంది. కెప్టెన్ బెన్ స్టోక్స్ బ్యాటుతో, బంతితో రాణిస్తున్నాడు. పేసర్లు జోష్ టంగ్, బ్రైడన్ కార్స్ ఫామ్‌లో ఉన్నారు. మరోవైపు స్టీవ్ స్మిత్ సారథ్యంలోని ఆస్ట్రేలియా జట్టుకు ప్రధాన పేసర్ మిచెల్ స్టార్క్ అతి పెద్ద బలం. అతనీ సిరీస్‌లో 17.42 సగటుతో 26 వికెట్లు పడగొట్టి రెండు జట్లలో మిగతా బౌలర్లెవ్వరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. అతణ్ని ఎదుర్కోవడం ఇంగ్లిష్ బ్యాటర్లకు కఠిన సవాలుగా మారుతోంది. కమిన్స్, హేజిల్‌వుడ్ అందుబాటులో లేనప్పటికీ.. మైకెల్ నీసర్, స్కాట్ బోలాండ్, జే రిచర్డ్‌సన్‌ల రూపంలో ప్రత్యామ్నాయ బౌలర్లు మెరుగైన ప్రదర్శనే చేస్తున్నారు. బ్యాటింగ్‌లో ట్రావిస్ హెడ్ ఆ జట్టుకు కీలకం. స్టీవ్ స్మిత్, మార్నస్ లబుషేన్‌ల నుంచి ఆసీస్ ఇంకా మెరుగైన ప్రదర్శన ఆశిస్తోంది. ఉస్మాన్ ఖవాజాకు ఇదే చివరి టెస్టు కావడంతో అతనెలాంటి ప్రదర్శన చేస్తాడన్నది ఆసక్తికరం.


ఖవాజా

తిలక్ శతకం

విజయ్ హజారే ట్రోఫీ

హైదరాబాద్ బోణీ

రాజ్‌కోట్

కెప్టెన్ తిలక్ వర్మ (109; 118 బంతుల్లో 6×4, 3×6) శతకం సాధించడంతో విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ బోణీ కొట్టింది. ఈ టోర్నీలో వరుసగా నాలుగు మ్యాచ్‌లు ఓడిన హైదరాబాద్.. శనివారం గ్రూప్-బి మ్యాచ్‌లో చండీగఢ్‌ను 136 పరుగుల తేడాతో చిత్తు చేసింది. మొదట హైదరాబాద్ 9 వికెట్లకు 286 పరుగులు చేసింది. తిలక్‌తో పాటు అభిరథ్ రెడ్డి (71) రాణించాడు. జగ్‌జీత్ (3/43), రోహిత్ (2/64), హర్‌తేజస్వి (2/47), విషు (2/58) హైదరాబాద్‌ను కట్టడి చేశారు. బదులుగా చండీగఢ్ 37.4 ఓవర్లలో 150 పరుగులకే ఆలౌటైంది. సన్యమ్ (46) టాప్‌స్కోరర్. రక్షణ్ రెడ్డి (3/34), నితేశ్ రెడ్డి (2/27), మిలింద్ (2/20) ప్రత్యర్థికి కళ్లెం వేశారు.


తిలక్ వర్మ 109

ఆంధ్ర హ్యాట్రిక్ ఓటమి


అక్షర్

ఆంధ్ర ఓటమి బాట వీడట్లేదు. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓడింది. ఆలూర్‌లో జరిగిన గ్రూప్-డి మ్యాచ్‌లో అక్షర్ పటేల్ ఆల్‌రౌండ్ ప్రదర్శన చేయడంతో 7 పరుగుల తేడాతో గుజరాత్ చేతిలో పరాజయం చవిచూసింది. మొదట గుజరాత్ 9 వికెట్లకు 318 పరుగులు చేసింది. అక్షర్ పటేల్ (130; 111 బంతుల్లో 10×4, 5×6) సెంచరీ చేశాడు. విశాల్ (70), రవి బిష్ణోయ్ (31) కూడా రాణించారు. సత్యనారాయణ రాజు (4/53), నితీశ్‌కుమార్ రెడ్డి (2/65), ఆంజనేయులు (2/45) ఆకట్టుకున్నారు. ఛేదనలో ఆంధ్ర పోరాడినా.. 311/7కే పరిమితమైంది. జ్ఞానేశ్వర్ (102; 125 బంతుల్లో 9×4, 3×6) సెంచరీ చేసినా.. జట్టును గెలిపించలేకపోయాడు. రవి బిష్ణోయ్ (3/64), అక్షర్ పటేల్ (2/27), అర్జాన్ (2/69) ఆంధ్రను దెబ్బ కొట్టారు. 5 మ్యాచ్‌ల్లో ఆంధ్రకు ఇది నాలుగో ఓటమి.

హార్దిక్ విధ్వంసం

హార్దిక్ పాండ్య (133; 92 బంతుల్లో 8×4, 11×6) మెరుపు శతకం సాధించినా.. రాజ్‌కోట్‌లో విదర్భతో గ్రూప్-బి మ్యాచ్‌లో బరోడా 9 వికెట్ల తేడాతో ఓడింది. మొదట బరోడా 9 వికెట్లకు 293 పరుగులు చేసింది. ఒక దశలో ఆ జట్టు 71/5తో కష్టాల్లో పడింది. ఈ స్థితిలో ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన హార్దిక్.. విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. ఎడాపెడా బౌండరీలు బాదాడు. స్పిన్నర్ పార్థ్ రేఖడే వేసిన 39వ ఓవర్లో అతడు విశ్వరూపం చూపించాడు. వరుసగా 6, 6, 6, 6, 6, 4తో 34 పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలోనే లిస్ట్-ఎలో తొలి శతకాన్ని అందుకున్నాడు. తొలి 66 పరుగులను 62 బంతుల్లో చేసిన హార్దిక్.. సెంచరీ చేయడానికి మరో 6 బంతులే తీసుకోవడం విశేషం. విదర్భ బౌలర్లలో యశ్ ఠాకూర్ (4/64) ఆకట్టుకున్నాడు. అమన్ (150 నాటౌట్; 121 బంతుల్లో 17×4, 4×6) భారీ సెంచరీ సాధించడంతో విదర్భ 41.4 ఓవర్లలో ఒక్క వికెటే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ధ్రువ్ షోరే (65 నాటౌట్) రాణించాడు.


హార్దిక్ పాండ్య

పడిక్కల్ జోరు

విజయ్ హజారే ట్రోఫీలో దేవ్‌దత్ పడిక్కల్ సెంచరీల మీద సెంచరీలు బాదుతున్నాడు. అయిదు మ్యాచ్‌ల్లో అతడు నాలుగు శతకాలు సాధించాడు. పడిక్కల్ (108; 120 బంతుల్లో 8×4, 3×6) జోరుతో అహ్మదాబాద్‌లో త్రిపురతో గ్రూప్-ఎ మ్యాచ్‌లో కర్ణాటక 80 పరుగుల తేడాతో గెలిచింది. మొదట కర్ణాటక 7 వికెట్లకు 332 పరుగులు చేసింది. అభినవ్ మనోహర్ (79), రవిచంద్రన్ స్మరాన్ (60), కేఎల్ రాహుల్ (35) రాణించారు. అభిజిత్ సర్కార్ (4/40) సత్తా చాటాడు. ఛేదనలో త్రిపుర 49 ఓవర్లలో 252 పరుగులకే ఆలౌటైంది. స్వప్నిల్ సింగ్ (100) సెంచరీ చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. విజయ్ కుమార్ (3/54), శ్రేయస్ గోపాల్ (3/33) ప్రత్యర్థిని కట్టడి చేశారు. మరోవైపు ఝార్ఖండ్‌తో మ్యాచ్‌లో సంజు శాంసన్ (101; 95 బంతుల్లో 9×4, 3×6), రోహన్ కున్నుమ్మల్ (124; 78 బంతుల్లో 8×4, 11×6) శతకాలతో చెలరేగడంతో కేరళ 8 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట ఝార్ఖండ్ 7 వికెట్లకు 311 పరుగులు చేసింది. కుమార్ కుశాగ్ర (143; 137 బంతుల్లో 8×4, 7×6) సెంచరీ సాధించాడు. శాంసన్, రోహన్ శతకాలతో కేరళ 42.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. సర్వీసెస్‌తో మ్యాచ్‌లో దిల్లీ కెప్టెన్ రిషబ్ పంత్ (67 నాటౌట్; 37 బంతుల్లో 4×4, 6×6), ప్రియాంశ్ ఆర్య (72; 45 బంతుల్లో 9×4, 3×6) రాణించడంతో దిల్లీ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట సర్వీసెస్ 178కే ఆలౌటైంది. హర్షిత్ రాణా (4/47), ప్రిన్స్ యాదవ్ (3/28) రాణించారు. బదులుగా దిల్లీ 19.4 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.


పడిక్కల్


హర్‌వంశ్

మెరిసిన హర్‌వంశ్

బెనోని: దక్షిణాఫ్రికా పర్యటనలో భారత అండర్-19 జట్టు శుభారంభం చేసింది. మూడు యూత్ వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 25 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట హర్‌వంశ్ (93; 95 బంతుల్లో 7×4, 2×6), ఆర్ఎస్ అంబ్రిష్ (65; 79 బంతుల్లో 7×4) సత్తా చాటడంతో భారత్ 50 ఓవర్లలో 301 పరుగులు చేసి ఆలౌటైంది. కనిష్క్ (32), ఖిలాన్ పటేల్ (26) పర్వాలేదనిపించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో బసాన్ (4/53) ఆకట్టుకున్నాడు. అనంతరం దక్షిణాఫ్రికా 27.4 ఓవర్లలో 148/4తో ఉన్న దశలో వర్షం వల్ల మ్యాచ్ ఆగిపోయింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆ జట్టు వెనుకబడి ఉండడంతో విజయం భారత్ సొంతమైంది. సఫారీ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ జోరిచ్ వాన్‌షాక్విక్ (60; 72 బంతుల్లో 6×4, 1×6)తో పాటు అమాన్ మనాక్ (46; 59 బంతుల్లో 4×4) రాణించారు. దీపేశ్ దేవేంద్రన్ (2/33) చక్కగా బౌలింగ్ చేశాడు.

శుభ్‌మన్‌కు అనారోగ్యం

చండీగఢ్: భారత జట్టు టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ విజయ్ హజారేలో అనుకున్న ప్రకారం బరిలోకి దిగలేకపోయాడు. శనివారం సిక్కింతో మ్యాచ్‌లో అతను పంజాబ్‌కు ఆడాల్సింది. కానీ విషాహారం కారణంగా అనారోగ్యం బారిన పడిన అతను బరిలోకి దిగలేకపోయాడు "సిక్కింతో మ్యాచ్‌కు ముందు రాత్రి శుభ్‌మన్ అనారోగ్యం పాలయ్యాడు. ముందు జాగ్రత్తగా అతడిని ఆడించలేదు. జనవరి 6న గోవాపై శుభ్‌మన్ బరిలోకి దిగే అవకాశం ఉంది" అని పంజాబ్ జట్టు యాజమాన్యం వెల్లడించింది. కొన్ని నెలలుగా గిల్.. గాయాలతో బాధపడుతున్నాడు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో మూడు బంతులు ఎదుర్కొన్నాక మెడ గాయంతో ఆ మ్యాచ్‌కు.. తర్వాత సిరీస్ మొత్తానికే దూరమయ్యాడు. వన్డే సిరీస్‌కు దూరమైన అతడికి.. టీ20 సిరీస్‌లో పాదం గాయమైంది.

వావ్రింకా శుభారంభం


వావ్రింకా

పెర్త్: వెటరన్ టెన్నిస్ స్టార్ స్టానిస్లాస్ వావ్రింకా (స్విట్జర్లాండ్) తన కెరీర్లో చివరి ఏడాదిని విజయంతో ఆరంభించాడు. ఆస్ట్రేలియా ఓపెన్ సన్నాహక టోర్నీ యునైటెడ్ కప్‌లో మూడు గంటలకు పైగా హోరాహోరీగా సాగిన తొలి రౌండ్లో వావ్రింకా 5-7, 7-6 (7-5), 7-6 (7-5)తో ప్రపంచ 29వ ర్యాంకు ఆటగాడు ఆర్థర్ రిండర్‌నెచ్ (ఫ్రాన్స్)ను ఓడించాడు. మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన వావ్రింకా ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం 157వ స్థానంలో ఉన్నాడు. కెరీర్‌ను ముగించేలోపు టాప్-100కు చేరుకోవాలని అతడు పట్టుదలతో ఉన్నాడు. 2026లో కెరీర్‌కు వీడ్కోలు పలుకుతానని అతడు ముందే చెప్పాడు. 2014లో ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచినప్పుడు అతడు కెరీర్లో అత్యుత్తమంగా మూడో ర్యాంకు చేరుకున్నాడు. "తొలి సారి ఇక్కడ (పెర్త్) ఆడేందుకు వచ్చిన నాకు ఇంతలా మద్దతు లభించడం పట్ల ఆనందంగా ఉంది. రిటైర్మెంట్ నిర్ణయంతో సంతృప్తిగా ఉన్నా" అని వావ్రింకా అన్నాడు. జనవరి 18న ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రారంభం కానుంది.

మయాంక్ 90 శాతం ఫిట్


మయాంక్

దిల్లీ: గాయం కారణంగా దాదాపు ఏడాదిపాటు క్రికెట్‌కు దూరమైన యువ పేస్ సంచలనం మయాంక్ యాదవ్ పూర్తి బౌలింగ్ ఫిట్‌నెస్‌కు చేరువలో ఉన్నాడు. 23 ఏళ్ల మయాంక్ 2024 ఐపీఎల్‌లో తన వేగంతో అందరినీ ఆకర్షించాడు. ఆ తర్వాత టీమ్‌ఇండియా తరఫున కూడా టీ20 క్రికెట్ ఆడాడు. కానీ వెన్ను గాయం కారణంగా 2025 ఐపీఎల్‌లో రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. మయాంక్ ఫిట్‌నెస్ సమస్యలు ఎదుర్కొంటున్నా.. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ అతణ్ని అట్టిపెట్టుకుంది. "మయాంక్ చక్కగా పురోగతి సాధిస్తున్నాడు. బౌలింగ్‌లో 90 శాతం తీవ్రతను సాధించాడు. ప్రస్తుతానికి వారానికి 18 ఓవర్లు బౌలింగ్ చేస్తున్నాడు" అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. మయాంక్ ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఉన్నాడు. వచ్చే కొన్నివారాల్లో అతడు 100 శాతం తీవ్రతతో బౌలింగ్ చేస్తాడని భావిస్తున్నారు. మరోవైపు గాయం నుంచి కోలుకున్న రియాన్ పరాగ్.. నెట్స్‌లో బ్యాటింగ్ చేయడం మొదలు పెట్టాడు. కుడి భుజం గాయం కారణంగా అతడు విజయ్ హజారే ట్రోఫీలో ఆడట్లేదు.

సుసాకికి రూ.60 లక్షలు

ప్రొ రెజ్లింగ్ లీగ్ వేలం

దిల్లీ: ప్రొ రెజ్లింగ్ 2026 వేలంలో జపాన్‌కు చెందిన యు సుసాకి అత్యంత ఖరీదైన రెజ్లర్‌గా నిలిచింది. హరియాణా థండర్స్ రూ.60 లక్షలకు ఆమెను కొనుగోలు చేసింది. అంతిమ్ పంగాల్‌ను రూ.52 లక్షలకు యూపీ డామినేటర్స్ సొంతం చేసుకుంది. పురుషుల విభాగంలో పోలెండ్ రెజ్లర్ రాబర్ట్ బారన్‌కు అత్యధికంగా రూ.55 లక్షలు పలికింది. మహారాష్ట్ర కేసరి జట్టు అతణ్ని సొంతం చేసుకుంది. సుజీత్ కల్కల్ రూ.52 లక్షలకు దిల్లీ దంగల్ వారియర్స్ పరమయ్యాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం పతకం గెలిచిన అమన్ సెహ్రావత్‌ను రూ.51 లక్షలకు ముంబయి దంగల్ చేజిక్కించుకుంది. ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూఎల్) అయిదో సీజన్ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 1 వరకు నోయిడా ఇండోర్ స్టేడియంలో జరుగుతుంది. లీగ్‌లో మొత్తం ఆరు జట్లు పోటీపడతాయి. 2015లో మొదలైన పీడబ్ల్యూఎల్ నాలుగు సీజన్ల పాటు జరిగింది. ఏడేళ్ల విరామం తర్వాత పునరాగమనం చేస్తోంది.

అర్హత ప్రమాణాలు మరింత కఠినంగా..

దిల్లీ: 2026 ఆసియా క్రీడల్లో ట్రాక్ అండ్ ఫీల్డ్ అర్హత ప్రమాణాలను మరింత కఠినతరం చేయనున్నట్లు భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) తెలిపింది. "గత ఆసియా క్రీడల అథ్లెటిక్స్‌లో భారత్ 6 స్వర్ణాలు సహా 29 పతకాలు గెలిచింది. 2026 క్రీడల్లో మన దేశం నుంచి అంతకన్నా మెరుగైన ప్రదర్శనను ఆశిస్తున్నాం. మునుపటి ఆసియా క్రీడలతో పోలిస్తే అర్హత ప్రమాణాలను కఠినతరం చేయబోతున్నాం. పురుషుల 100 మీటర్ల పరుగు, పోల్‌వాల్ట్, పురుషుల 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 110 మీటర్ల హర్డిల్స్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, హ్యామర్ త్రో, జావెలిన్ త్రో, డెకథ్లాన్‌లో గత ఆసియా క్రీడల్లో అయిదో స్థానంలో నిలిచిన ప్లేయర్ ప్రదర్శనను అందుకుంటేనే ఈసారి ఆసియా క్రీడలకు అర్హత పొందుతారు. 4×100 మీటర్ల రిలే, 4×400 మీటర్ల రిలే, మారథాన్‌లో ఆరో స్థానం.. మహిళల విభాగంలో 200 మీ, 400 మీ, 1500 మీ, 110 మీ హర్డిల్స్ తదితర ఈవెంట్లలో అయిదో స్థానాన్ని అర్హత ప్రమాణంగా నిర్ణయించాం" అని ఏఎఫ్ఐ చెప్పింది.

వసుంధర

vasundhara@eenadu.in

పలకరింపు... కొనసాగిద్దామా!



‘హ్యాపీ న్యూ ఇయర్’... ఈ రెండు మూడు రోజుల్లో ఎంతమంది నుంచి ఈ విష్ విన్నామో కదా! మర్చిపోయిన స్నేహితులు, పాత సహోద్యోగులు, ఎప్పుడూ పలకరించనివాళ్లూ చాలామందే! అయితే అయినవాళ్లు, ప్రాణ స్నేహితులు చాలా కాలం తరవాత ఈ సందర్భంగా మెసేజ్ లేదా కాల్ చేయడం మాత్రం మర్చిపోలేని అనుభూతే! ఈ క్రమంలో మాటలు వరదలా పారుంటాయి. కానీ అది ఆ క్షణం వరకే! తిరిగి పనుల్లో పడ్డామంటే ఏ బర్త్‌డేకో, మరింకో ప్రత్యేక రోజుకో తప్ప పలకరించుకోం. మళ్లీ అదే గిల్టీనెస్. అలా కావొద్దంటే...

సహోద్యోగులు, ఆఫీసుకు సంబంధించిన వాళ్లైతే సందర్భాన్ని బట్టి పలకరించినా చాలు. అయినవాళ్లు, స్నేహితులు అలాకాదు. వాళ్లని గుర్తుంచుకుని మరీ పలకరించాల్సిందే. అప్పుడే ఈ గిల్టీనెస్ దరిచేరదు. రోజూ ఫోనే చేసి పలకరించాల్సిన పనిలేదు. ‘హాయ్ ఎలా ఉన్నావ్?’ అనో ఏదైనా వాళ్లని గుర్తు చేసేది కనిపించినప్పుడు ఫొటో తీసి ‘దీన్ని చూడగానే నువ్వే గుర్తొచ్చావ్’ అనో మెసేజ్ చేయండి. అనుబంధం పెనవేసుకుంటుంది. షాపింగ్, ఆఫీసుకి వెళ్లేటప్పుడు అయిదు నిమిషాల ముందే బయల్దేరాలన్న నియమం పెట్టుకోండి. నడుస్తూ ఎవరో ఒకరికి కాల్ చేయండి. వ్యాయామానికి వ్యాయామం. బోర్ కొట్టదు పైగా మాటల సావాసం. ప్రయత్నించండి... బాగుంటుంది. రోజూ అంటే కష్టమే అయితే ఖాళీ దొరికే రెండు రోజులు కేటాయించుకోండి. ఆ రోజుల్లోనే ఇద్దరు చొప్పున పలకరించినా చాలు. లేదంటారా... వాట్సాప్ స్టోరీ, సోషల్‌మీడియాలో పోస్టులు వంటివి గమనిస్తూనే ఉంటాంగా! మీవాళ్లు ఏదైనా పెట్టినప్పుడు ఆ పోస్టుమీద ఫీడ్‌బ్యాక్ ఇస్తూనే చిన్న పలకరింపునీ జత చేస్తే సరి. గృహిణులైనా, ఉద్యోగినులైనా వాళ్ల ప్రపంచమంతా బాధ్యతల చుట్టూనే తిరుగుతుంది. ప్రేమ మనసులో ఉన్నా... పలకరింపుకి వచ్చేసరికే వాయిదా వేస్తుంటారు. దీంతో అయినవాళ్లు తమని మర్చిపోయారనే భావనలోకి వస్తారు. ఇదంతా ఎందుకు చెప్పండి? సందర్భం కోసం ఎదురు చూడకుండా పలకరించండి. గుర్తొచ్చినా, మాట్లాడాలనిపించినా ఒక్క మెసేజ్ చేయడమే! దూరం తగ్గించే ఈ చిట్కా బాగుంది కదా! ఇంకేం కొనసాగించండి మరి.

నేనెప్పుడూ నిత్య విద్యార్థినినే!



సంగీత

పట్టుదల, క్రమశిక్షణ, శ్రమశక్తి... వీటినే ఆయుధాలుగా చేసుకుని కెరియర్‌లో విజయం సాధించారు సంగీత యనమండ్ర. జావా నుంచి ఏఐ వరకూ... ఎన్నో నేర్చిన నిత్య విద్యార్థి. ఓపెన్ టెక్స్ట్ టెక్నాలజీస్ హైదరాబాద్ కేంద్రంలో ‘వైస్ ప్రెసిడెంట్- ఇంజినీరింగ్, సైట్ లీడర్’గా వందలమందికి నాయకత్వం వహిస్తూ, వేలమందికి స్ఫూర్తినిస్తోన్న ఆమె ప్రస్థానం ఇది...

1987... నాకప్పుడు 13 ఏళ్లు. మోపెడ్ నేర్చుకుంటుంటే అడ్డు చెప్పలేదు నాన్న. అదే కాదు, నేనేదైనా కొత్తగా ప్రయత్నిస్తే మౌనంగానే ఆమోదించేవారు. దాంతో నేర్చుకోవాలనే కుతూహలం పెరిగి, బైక్ నడపడమూ నేర్చుకున్నా. ఇప్పటికీ కొత్త ప్రాజెక్టు వస్తే ముందు చేస్తానని చెప్పేసి తర్వాత వివరాల్లోకి వెళ్తా. నాన్న లక్ష్మణరావు, అమ్మ కుసుమ కుమారి హైదరాబాద్, ఈసీఐఎల్‌లో పనిచేసేవారు. ఉదయం ఆరున్నరకే అమ్మ ఆఫీసుకు వెళ్లాలి. అందుకని మూడున్నరకే లేచి వంట చేసేది. ఆమె నుంచే మల్టీటాస్కింగ్ నేర్చుకున్నా.

తన ప్రోత్సాహంతోనే...

బీఎస్సీ ఎలక్ట్రానిక్స్, ఎంసీఏ చేశాను. వై2కే సమస్యవల్ల ఐటీలోకి వెళ్లలేకపోయా. దాంతో బీసీఏ, ఇంజినీరింగ్ విద్యార్థులకు పార్ట్‌టైమ్ క్లాసులు చెప్పేదాన్ని. తర్వాత ఉస్మానియా ఈవెనింగ్ కాలేజీలో చేరి బ్యాచ్ టాపర్‌గా ఎం.టెక్. పూర్తిచేశా. స్కూల్లో ఉన్నప్పుడు మ్యాథ్స్, సైన్స్ అంటే భయం. రోజూ 2గం. అదనంగా చదివి వాటిపై భయం పోగొట్టుకున్నా. కొత్తవాటిని నేర్చుకుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, పట్టుదలతో పరిమితుల్ని అధిగమించొచ్చు అని తెలుసుకున్నా. మావారు మెహర్జీ, అడ్వొకేట్. తన ప్రోత్సాహంతోనే ఎంటెక్, ఎల్ఎల్‌బీ పూర్తిచేయగలిగా.

- హాఫ్ మారథాన్లలో పాల్గొంటా. ఏడాది కిందట మోకాళ్ల నొప్పులు ఎక్కువైతే బ్రేక్ ఇచ్చా. దృఢత్వాన్ని పెంచుకుని... మళ్లీ రన్నింగ్‌ని కొనసాగిస్తున్నా. డ్రైవింగ్ ఇష్టం. బైకులూ, కార్లూ నడుపుతా.
- అమ్మాయిలూ... తాత్కాలిక సమస్యలకు భయపడి కెరియర్‌ను వదులుకోకూడదు. లక్ష్యాన్ని సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర అభ్యాసం అవసరం. ఇది మా అమ్మాయి వైష్ణవి నుంచి నేను నేర్చుకున్న పాఠం.

నా లక్ష్యం అదే...

ఎంటెక్ తరవాత ఐటీలోకి వచ్చా. ప్రస్తుతం ఓపెన్ టెక్స్ట్ టెక్నాలజీస్ ఇంజినీరింగ్ విభాగ పర్యవేక్షణ, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్‌లతోపాటు అనలిటిక్స్, లీగల్ టెక్ విభాగాలనూ పర్యవేక్షిస్తున్నా. లీడర్‌షిప్‌లో ఉంటే ప్రణాళిక రచన నుంచి అమలు దాకా మన బాధ్యతే. జావా, సీ, పైథాన్, డాట్‌నెట్, ఏఐ... ఇలా అన్ని రకాల లాంగ్వేజ్‌లూ, సాఫ్ట్‌వేర్‌లతో ముడిపడిన ప్రాజెక్టులు చేశాను. ప్రాజెక్టుల్లో భాగమవుతూనే కొత్త అంశాల్ని ఒకట్రెండు నెలల్లోనే నేర్చుకునేదాన్ని. నా కెరియర్‌లో నేనెప్పుడూ ఆవిష్కరణలకే ప్రాధాన్యమిచ్చా. ఈ ప్రయాణంలో ఇప్పటివరకూ 5 పేటెంట్లు పొందాను. స్టార్టప్, ఆంత్రప్రెన్యూర్ మైండ్‌సెట్‌తో వేగంగా, నాణ్యంగా ఉత్పత్తులు తెస్తాను. పనులకు ప్రాధాన్య క్రమం నిర్దేశించుకుని, చిన్న భాగాలుగా విభజించుకోవడంవల్ల ఇది సాధ్యమవుతుంది. సమస్యను రివర్స్ ఇంజినీరింగ్ చేసి పరిష్కరిస్తా. రాత్రి ఏ సమయానికి నిద్రపోయినా... తెల్లవారు జామున మూడింటికే నిద్రలేచి చదువుతుంటా. ఐఐటీ హైదరాబాద్ ఏఐ క్లాసులు నిర్వహిస్తుంటే వెళ్లి నేర్చుకున్నా. ఇండిపెండెంట్ డైరెక్టర్ ఫ్రమ్ మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ పరీక్షనీ రాశా. అప్‌స్కిల్లింగ్ కోసం రోజుకు 15 నిమిషాలు కేటాయించినా పురోగతి ఉంటుంది. అయిదేళ్లలో సీటీఓ/సీఈఓ అవ్వాలన్నది లక్ష్యం. ఇటీవల 3ఏఐ, హైసియా ద్వారా అనలిటిక్స్ రంగంలో ‘ఇన్‌స్పైరింగ్ విమెన్ లీడర్’గా గుర్తింపు పొందా. ‘విమెన్ ఇన్ సెర్చ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(వైజ్)-హైదరాబాద్’లో నెలకోసారి సమావేశమై మహిళలకున్న అవకాశాలూ, అవరోధాలనూ చర్చిస్తాం. నాస్కామ్ లాంటి సంస్థల్లో మెంటార్‌గానూ ఉన్నా.

బామ్మ చిట్కా



దుస్తుల్ని ఉతికేటప్పుడు ముదురు రంగులు ఒక్కోసారి లేత రంగు దుస్తులకు అంటుతుంటాయి. ఓ పట్టాన వదలవు కూడా. ఇలాంటప్పుడు ఈ చిట్కా ప్రయత్నించి చూడండి. ముందు రంగు అంటిన భాగంలో కాసిని పచ్చిపాలు పోసి కొన్ని నిమిషాలు నాననివ్వండి. తరవాత నిమ్మచెక్కతో రుద్ది నీటితో కడిగేయండి. రంగు మొత్తం వదులుతుంది.

మీకు తెలుసా!



పసిపిల్లలు ఏడాది నుంచి రెండేళ్ల వయసులో నెలకి ఒకటి నుంచి రెండు సెం.మీ. ఎత్తు పెరుగుతారట. వీళ్లు రోజుకి 11 నుంచి 14 గంటలు నిద్రపోవడంతో ఆ సమయంలో గ్రోత్ హార్మోన్ (సొమాటో ట్రోపిన్) విడుదలవ్వడమే ఇందుకు కారణం అంటున్నాయి అధ్యయనాలు!

జుట్టెందుకు రాలుతోంది?

నా వయసు 30 ఏళ్లు. ఈ మధ్య నా జుట్టు ఊకలా రాలిపోతోంది. గడ్డిలా కనిపిస్తోంది. రెండు నెలలు కాల్షియం ట్యాబెట్లు వాడాను. మందులు వాడటం వల్ల ఇలా అవుతుందా? నేను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? – దేవి, కాకినాడ

డియర్ వసుంధర



- సూరపనేని పద్మావతి
డెర్మటాలజిస్ట్

మీకు అకస్మాత్తుగా జుట్టు రాలడం మొదలైందని అంటున్నారు. ఈ సమస్యను టిలోజెన్ ఎఫ్లూవియం అంటాం. ఈ పరిస్థితికి చాలా రకాల కారణాలు ఉండి ఉండొచ్చు. ఉదాహరణకు తీవ్రమైన జ్వరాలు అంటే మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటివి వచ్చినా... మేజర్ సర్జరీలు జరిగినా, తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నా కూడా ఆ తర్వాత రెండు నెలల పాటు జుట్టు ఎక్కువగా రాలిపోతుంది. ఇది కాకుండా ఐరన్, బి12, విటమిన్ డి... వంటి విటమిన్లు, ఖనిజాల లోపం వల్ల కూడా ఇలా కావొచ్చు. థైరాయిడ్, పీసీఓఎస్... వంటి హార్మోనల్ హెచ్చుతగ్గుల వల్లా శిరోజాలు రాలిపోతాయి. ముందు డెర్మటాలజిస్ట్‌ని కలవండి. డాక్టర్ ఈ సమస్యలు ఏమైనా మీకు ఉన్నాయేమో రక్తపరీక్ష ద్వారా తెలుసుకుని కరెక్ట్ చేస్తారు. హెయిర్ సప్లిమెంట్స్... అంటే, అన్ని రకాల విటమిన్లు, మినరల్లు శరీరానికి అందేలా ట్యాబ్లెట్లు ఇస్తారు. దీనివల్ల జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది. చిట్లదు, రాలదు.

కురులు రాలడాన్ని అరికట్టడానికి ప్రొకాపిల్, కపాక్సిల్, రెడన్సిల్... వంటి పెప్టైడ్ సీరమ్స్ ఇస్తారు. వీటిని ఓ రెండు మూడు నెలలు వాడితే రాలడం తగ్గడమే కాదు... తిరిగి పెరగడం మొదలవుతుంది. అలానే, ఎక్కువ ప్రొటీన్ ఉండే చికెన్, మటన్, గుడ్లు, పప్పులు, మొలకలు, చిక్కుడు గింజలు వంటివి ఆహారంలో చేర్చుకోవాలి. ఆకుకూరలు, పండ్లు వంటివి తినాలి. ఖనిజాలను అందించే డ్రైఫ్రూట్స్, నట్స్‌నీ భాగం చేసుకోవాలి. అప్పుడే శరీరానికి సమతులంగా పోషకాలు అందుతాయి. ఈ జాగ్రత్తలతో కోల్పోయిన మీ జుట్టు తిరిగి వచ్చే అవకాశం ఉంది.

బంగారం - వెండి



3న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,37,950	1,24,900	2,36,649
విజయవాడ	1,34,440	1,24,850	2,43,000
ప్రొద్దుటూరు	1,44,000	1,32,480	2,53,000
రాజమహేంద్రవరం	1,35,820	1,24,500	2,56,000
విశాఖపట్నం	1,35,300	1,24,500	2,35,000
తమిళనాడు	-----	1,26,000	2,57,000

కామెంట్లకు భయపడ్డా!

లక్ష్యం మీద అవగాహన... కాస్త ప్రోత్సాహం... అనుకున్నది సాధించగలను అనే నమ్మకం... ఉండాలే కానీ, మహిళలకు సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. ఇవే విస్లావత్ స్వప్నకు పేరు తెచ్చిపెట్టాయి. ఆమె ఎవరు? ఏం చేస్తున్నారో తెలియాలంటే...





స్వప్న



పుట్టి పెరిగింది నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి. నాన్న వాళ్య, అమ్మ లలిత వ్యవసాయం చేస్తుంటారు. మేము ముగ్గురు పిల్లలం. చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం అంటే ఎంతో ఇష్టం. పాఠ్య పుస్తకాల్లో బొమ్మలు చూస్తూ వాటిని గీసేదాన్ని. స్కూల్లో డ్రాయింగ్ పోటీలు జరిగితే బహుమతి మాత్రం పక్కాగా గెలుచుకునేదాన్ని. ఇంటర్ పూర్తవ్వగానే పెళ్లైంది. మావారు స్వామి ప్రైవేట్ ఉద్యోగి. పెళ్లి తర్వాత ‘డిగ్రీ చదవాలనుంది’ అని ఆయనకి చెబితే కాలేజీలో చేర్పించారు. అనారోగ్య సమస్యల కారణంగా చదువుకి బ్రేక్ పడింది. ఆలోపే ప్రెగ్నెంట్ అని తెలిసింది. తర్వాత పిల్లల బాధ్యతలతో చదువు మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. పిల్లలు కాస్త పెద్దయ్యాక ఇంట్లో ఖాళీగా ఉండటం నచ్చేది కాదు. ఉద్యోగం చేద్దామని ఎక్కడికి వెళ్లినా డిగ్రీ సర్టిఫికెట్ అడిగేవారు. దాంతో ఆ ప్రయత్నాలూ మానేశా. ఒక రోజు అనుకోకుండా యూట్యూబ్‌లో స్నేహితుల కుకింగ్ వీడియోలు కనిపించాయి. వాళ్లని విషయం అడిగితే... నన్నూ ప్రయత్నించమన్నారు. దాంతో నాకు నచ్చిన చిత్రలేఖనాన్నే వీడియోలు చేసి పెట్టాలనుకున్నా. కానీ, కామెంట్ల గురించి ఆలోచిస్తే భయం వేసింది. అప్పుడు ‘నువ్వు చేసే పనిలో తప్పు లేనప్పుడు భయపడకుండా ముందడుగు వెయ్యి’మంటూ మావారు ధైర్యం చెప్పారు. దాంతో వీడియోలు చేయడం మొదలుపెట్టా.

పేపరు... కత్తెర... ఒక కళ..!

డ్రాయింగ్ ఆర్ట్స్ పేరుతో యూట్యూబ్, ఇన్‌స్టా ఖాతాలను తెరిచి పలకపై బొమ్మలు గీసి వీడియోలు పెట్టేదాన్ని తక్కువ వ్యూస్ వచ్చేవి. అందరిలానే నేనూ చేస్తే ప్రత్యేకత ఏముంది అనిపించి ఏదైనా కొత్తగా చేయాలనుకున్నా. పేపరుపై ఆర్ట్ కటింగ్ చేసి వీడియోలు పోస్టు చేశా. కష్టంగా ఉండే బొమ్మల్ని యూట్యూబ్‌లో చూసి నేర్చుకునేదాన్ని. ఒక పేపర్ ఆర్ట్ కట్ చేయడానికి 40-50 నిమిషాలు పట్టేది. అలా నెమ్మదిగా సెలెబ్రిటీల ఫొటోలు కటింగ్ చేసి ఇన్‌స్టాలోనూ వీడియో పెట్టడం మొదలుపెట్టా. వ్యూస్ పెరిగాయి. అంతేకాదు, నచ్చిన వారి ఫొటోలను కట్ చేయమని ఆర్డర్లూ ఇచ్చేవారు. పేపరు కటింగ్‌తోపాటు థ్రెడ్ ఆర్ట్, బ్లడ్ ఆర్ట్‌లూ వేస్తుంటా. సంపాదనా మొదలైంది. మొదట్లో కష్టంగా అనిపించినా ఇప్పుడు అలవాటు అయిపోయింది. అందరిలోనూ ఏదోక ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని గుర్తించడంలో మనం తడబడుతుంటాం. నా బలం చిత్రలేఖనం అని తెలిశాక దాంట్లో నైపుణ్యాన్ని పెంచుకున్నా. ఆ కళే సాధారణ గృహిణిగా ఉన్న నన్ను అందరికీ పరిచయం చేసింది. దీనిలో మరిన్ని మెలకువలు నేర్చుకుని ముందుకు అడుగులు వేయాలన్నదే నా లక్ష్యం.

– సాయి అదపాక, హైదరాబాద్

ప్లాన్ వేస్తే సులువే...



ఉదయం ఆఫీసుకు రెడీ అవుతూనే భర్త, పిల్లలకు లంచ్‌బాక్సులు సిద్ధం చేస్తాం. సాయంత్రం అలసటతో ఇంటికి వచ్చినా... పనులు తప్పవు. ఈ షెడ్యూల్‌లో కిచెన్ గందరగోళంగా ఉంటే మనలో ఒత్తిడి మరింత పెరిగిపోతుంది. మరి దాన్ని స్మార్ట్‌గా ఆర్గనైజ్ చేసుకుంటే రోజూ కనీసం 30-40 నిమిషాల సమయం ఆదా అవుతుందంటారు హోమ్ మేనేజ్‌మెంట్ నిపుణులు.

వారానికి ప్లాన్...

ఏ రోజుకి ఆ రోజే ఇవాళ ఏం వండాలి అని ఆలోచించడంతోనే సమయం వృథా అవుతుంది. అలాకాకుండా వారానికో మెనూ ప్లాన్ చేసుకుంటే స్ట్రెస్ తగ్గుతుంది. ముందే దానికి అనుగుణంగా పనులు పూర్తి చేసుకోవచ్చు. మసాలాలు నూరిపెట్టుకోవడం, కూరగాయలు తరిగి ఉంచుకోవడం చేస్తే... మన పని తేలిక అవుతుంది.

నాలుగు భాగాలుగా...

వంటగదిలో ఎక్కడ పడితే అక్కడ వస్తువుల్నీ, సరకుల్నీ పెట్టేయొద్దు. దాన్ని నాలుగు భాగాలుగా ఉపయోగించి.... సామాన్లు సర్దుకుంటే పనిని సులువుగా చేసుకోవచ్చు. వంటజోన్‌లో - స్టౌ, స్పూన్లు, గిన్నెలు, ప్రిపరేషన్ జోన్- కటింగ్ బోర్డులు, చాకులు, కత్తెరలు, స్టోరేజ్ జోన్‌లో- పప్పులు, బియ్యం, మసాలాలు, క్లీన్ జోన్- సబ్బులు, లిక్విడ్‌లు, కిచెన్ టవల్స్, టిష్యూలు... ఇలా పెట్టుకోవడం వల్ల వెతుక్కోవలసిన అవసరం ఉండదు.

కనిపించేలా కంటెయినర్లు...

ఏ మసాలా ఎంత ఉందో, ఏ డబ్బాలో ఏ వస్తువు ఉంటుందో ... చూడగానే పసిగట్టేయొచ్చు వీటితో. వాటికి లేబుల్స్ అతికిస్తే మీరే కాదు... మీ భర్త వంట చేయాల్సి వచ్చినా మీకు అదనపు శ్రమ తప్పుతుంది. చెంచాలు, కొలత కప్పులు, మసాలా స్పూన్లు అన్నీ కలిసిపోతే సమయం వృథా అవతుంది. డ్రా ఆర్గనైజర్లు వాడితే... వేటికవే పెట్టుకోవచ్చు.

ప్రాక్టికల్‌గా ఆలోచిస్తూ...

ఇతరులను చూసి పోల్చుకోవడం, సామాజిక మాధ్యమాల్లో కనిపించే మార్పులను చేయాలన్న తపనతో కనిపించిన ప్రతి వస్తువునీ కొని వంటగదిని నింపేయకండి. పర్‌ఫెక్ట్‌గా ఉండాలని గందరగోళానికి గురి కావొద్దు. ప్రాక్టికల్‌గా ఉండాలి. మీ సమయాన్ని ఆదా చేయడమే లక్ష్యంగా సింపుల్‌గా తీర్చిదిద్దుకోండి.

మళ్లీ మళ్లీ వాడొచ్చు..!

కిడ్స్ కార్నర్

పిల్లల స్క్రీన్ సమయం తగ్గించడం... తల్లిదండ్రులకు అతిపెద్ద సవాల్‌గా మారింది. డిజిటల్ తెరల్ని చూడటం వల్ల వస్తోన్న సమస్యలకు భయపడి ప్రతి ఒక్కరూ పరిష్కార మార్గాలపై దృష్టి పెడుతున్నారు. ప్రత్యామ్నాయ గ్యాడ్జెట్ల కోసం వెతుకుతున్నారు. అలాంటి వాటిల్లో ఇవి కొన్ని...

రంగు మాయమైపోద్ది...





చిత్రలేఖనం ఇష్టం లేని పిల్లలు ఉంటారా! స్కెచ్‌లు, పెన్సిల్ దొరికితే చాలు, పుస్తకాల్ని డ్రాయింగ్ బోర్డులు చేస్తారు... అవి అయిపోతే గోడల్ని కాన్వాస్‌లుగా మార్చేస్తారు. మరి పిల్లలకు ఇంత ఇష్టమైన కళను స్క్రీన్ టైమ్ తగ్గించుకోవడానికి వినియోగించుకోవాలంటే... ఒకటి రెండు పుస్తకాలు కొనిస్తే సరిపోతుందా? అయిపోయిన వెంటనే వేరేవి కావాలంటూ మారం చేస్తారు. లేదా డైలీ రొటీన్‌లోకి వచ్చేస్తారు. అలా కాకూడదంటే ఈ ‘రీయూజబుల్ వాటర్ డూడుల్ మ్యాట్’ను బహుమతిగా ఇవ్వండి. ఈ మ్యాట్‌పై నచ్చిన చిత్రాల్ని గీయొచ్చు. వాటికి రంగులూ వేయొచ్చు. కాటన్ ఫ్యాబ్రిక్, కలపతో తయారుచేస్తారు కాబట్టి అనారోగ్య సమస్యలూ ఉండవు. పైగా, చిత్రాలు వేసిన మూడు నుంచి 10 నిమిషాల్లో ఆరిపోతాయి. దాంతో పునర్వినియోగించే వీలుంటుంది.

నైపుణ్యాల సాధనకు...





వచ్చినా రాకపోయినా పాట ప్లే అయితే చాలు... కాలు కదిపేస్తారు చాలామంది పిల్లలు. డ్యాన్స్ వాళ్లలో అంత ఉత్తేజం నింపుతుంది మరి. అందుకే, డిజిటల్ తెరలకు బానిసలైన పిల్లల్ని దారి మళ్లించడానికీ దీన్నో సాధనంగా మలిచారు తయారీదారులు. ఈ ‘ఎలక్ట్రికల్ డ్యాన్స్ మ్యాట్’ అందుకు ఉదాహరణ. మ్యాట్‌ను పరచి దానికి అమర్చిన బటన్‌ను ఆన్ చేస్తే చాలు. ఎడమ, కుడి, ముందు, పైన లాంటి సూచనలతో ఓ పాట ప్లే అవుతుంది. దానికి అనుగుణంగా లైట్లు ఆన్ అవుతాయి. ఎక్కడ లైట్ వెలిగితే అక్కడ కాలు పెడుతూ డ్యాన్స్ చేస్తే సరి. ఇది వ్యాయామంగానూ ఉంటుంది. చేయి, కాలు, కంటి సమన్వయానికీ సహాయపడుతుంది.

ఆహ్వానం




సంక్రాంతి ముచ్చట్లు

తెల్లని మేఘాల్లా కమ్మిన పొగమంచు... వణికించే చలి... దాన్ని తప్పించుకోవడానికి కాగే చలిమంటలు... వాటి చుట్టూ పోగుపడే కబుర్లు... ఎన్నో సంప్రదాయాలు, మరెన్నో ఆత్మీయతలు... సంక్రాంతి చుట్టూ అల్లుకునే జ్ఞాపకాలు ఎన్నెన్నో! మారుతున్న కాలానికి తగ్గట్టుగా కొన్ని కొనసాగినా, కనుమరుగైనవే ఎక్కువ. ఒకసారి ఆ జ్ఞాపకాల దొంతరని తట్టి లేపండి. సంక్రాంతికి మీ ప్రాంతానికే పరిమితమైన సంప్రదాయాల్నీ, మర్చిపోలేని అనుభూతుల్నీ మా ‘వసుంధర’తో పంచుకోండి. పేరు, ఊరు వివరాలతోపాటు ఫొటోలనూ పంపడం మర్చిపోవద్దు మరి!

రంగవల్లిక

23 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకూ





బి. విజయలక్ష్మి
కాకినాడ

16 చుక్కలు 4 వరుసలు
12 చుక్కలు 2 వరుసలు
8 చుక్కలు 2 వరుసలు
4 చుక్కలు 2 వరుసలు
వచ్చే వరకూ





దీప
కడప





ముప్పవరపు విజయలక్ష్మి
చెందోడు

17 చుక్కలు
1 వచ్చేవరకూ

9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా:
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in

ఇవీ.. 200 ఏళ్ల నాటి తాళపత్ర, తామ్రపత్రాలండీ!

దాదాపు రెండు శతాబ్దాల చరిత్ర కలిగిన పురాతన తాళపత్ర గ్రంథాలు విజయవాడ పుస్తక మహోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అరుదైన తాళపత్రాలు, తామ్రపత్రాలు, నన్నయ కాలంలో ఉపయోగించిన ఘంటం లాంటి వస్తువులన్నీ రాష్ట్రంలో కొన్ని గ్రంథాలయాల్లో భద్రపరిచారు. వాటిని ఇప్పుడు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవంలో ప్రదర్శనకు ఉంచారు. ఇవి పుస్తక ప్రియులను, ప్రజలను, చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. – ఈనాడు, అమరావతి




పుస్తకాన్ని చదవకుండా వ్యతిరేకించకూడదు



పుస్తకావిష్కరణలో కోటేశ్వరరావు, మురళీకృష్ణ, వరప్రసాద్ తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : మనుస్మృతి అయినా.. ఏ పుస్తకమైనా చదవకుండా వ్యతిరేకించకూడదని డాక్టర్ కోయి కోటేశ్వరరావు అన్నారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవం రెండో రోజు శనివారం బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై ఎంబీకే అధ్యక్షుడు పి.మధు రచించిన 'మనుస్మృతిలో ఏముంది' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత సమాజంపై మనుస్మృతి భావజాలం చూపిన దుష్ప్రభావాలను చైతన్యవంతమైన పౌరులు అర్థం చేసుకోవాలని సూచించారు. మనుస్మృతి భావజాలం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని.. రాజ్యాంగ విలువలను విశ్వసించి, పాటించే వారే నిజమైన దేశ భక్తులని పేర్కొన్నారు. సభాధ్యక్షులు పెన్మెత్స మురళీకృష్ణ, పాత్రికేయులు వరప్రసాద్ తదితరులు.. మనుస్మృతి వల్ల కుల, లింగ వివక్షలు బలపడ్డాయని అభిప్రాయపడ్డారు. భారతీయ సమాజం ఆ భావజాలం నుంచి బయటపడితే కానీ మనం అభివృద్ధిలో ప్రపంచంతో పోటీపడలేమన్నారు. అనంతరం సామాన్య విద్యావంతులకు కూడా అర్థమయ్యే భాషలో 'మనుస్మృతిలో ఏముంది' పుస్తకం రాసిన రచయితను అభినందించారు.




పుస్తక మహోత్సవంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో పుస్తకాన్ని పరిశీలిస్తున్న ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు -ఈనాడు, అమరావతి

పిల్లల ప్రపంచం.. పుస్తకమయం

★ తల్లిదండ్రులతో భారీగా తరలివస్తున్న చిన్నారులు ★ వ్యక్తిత్వ వికాస పుస్తకాలపై యువత మక్కువ

36వ విజయవాడ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో చిన్నారులు, యువత సందడే ఎక్కువగా కనిపిస్తోంది. విద్యార్థులు, యువతీ యువకులే అధికంగా తరలి వచ్చి పుస్తకాలను కొనుగోలు చేస్తుండడం కనిపిస్తోంది. పిల్లల రచనలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాల స్టాళ్ల వద్దే ఎక్కువ రద్దీ ఉంటోంది. ఈ పుస్తకాల కొనుగోళ్లే గత కొన్నేళ్లుగా ఎక్కువగా జరుగుతున్నట్టు నిర్వాహకులు, ప్రచురణకర్తలు వెల్లడిస్తున్నారు. గతంతో పోలిస్తే.. పిల్లలకు సంబంధించిన రచనలు.. ప్రస్తుతం అత్యధికంగా ప్రచురితమవడానికి ఇది కూడా ఒక కారణమే. పుస్తక మహోత్సవ ప్రాంగణంలో.. పిల్లలు, విద్యార్థుల కోసమే ప్రత్యేకంగా పెద్ద సంఖ్యలో స్టాళ్లను ఏర్పాటు చేశారు. కథల నుంచి విజ్ఞాన పుస్తకాల వరకూ పిల్లల మేథో వికాసానికి దోహదపడే సమస్త పుస్తకాలూ అందుబాటులో ఉన్నాయి.







- యువత ఎక్కువగా వ్యక్తిత్వ వికాస పుస్తకాలపై ఆసక్తి చూపిస్తున్నారు. యండమూరి వీరేంద్రనాథ్, పట్టాభిరామ్ లాంటి వారి పుస్తకాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.
- ఆధ్యాత్మిక స్టాళ్ల వద్ద కూడా రద్దీ ఎక్కువగానే ఉంటోంది. ఆధ్యాత్మిక విశేషాలు, రామాయణం, మహాభారతం, భాగవత గ్రంథాలు, ధ్యానం, సత్యోదయం, హృదయపథం, విధిరూపకల్పన, ది హార్ట్‌ఫుల్‌నెస్‌వే, రామానుజాచార్యుల రచనలు, వివేకానంద జీవిత చరిత్ర, రచనలు, సూక్తులు, హిందూ ధర్మం, ధార్మిక కృతుల శాస్త్రాన్ని వివరించే గ్రంథాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి.

అపురూపమైన దృశ్యాలు.. ఖాళీ దొరికితే స్మార్ట్ ఫోన్లలో మునిగి తేలే చిన్నారులు, యువత.. పుస్తక మహోత్సవ ప్రాంగణంలో పుస్తకాలతో సందడి చేస్తున్నారు. ఎటుచూసినా.. చిన్నా పెద్ద, తల్లి.. కొడుకు, తండ్రి.. కుమార్తె కలిసి స్టాళ్లలో నిలబడి పుస్తకాలను చదువుతూ కనిపిస్తున్నారు. పుస్తకాలను ప్రేమతో.. తదేక దీక్షతో చూస్తూ.. కొత్త అనుభూతికి లోనవుతున్న దృశ్యాలే ఎటుచూసినా కనిపిస్తున్నాయి.

10లక్షల వరకూ వస్తారని అంచనా..

ఈ ఏడాది పదకొండు రోజుల్లో కనీసం ఎనిమిది నుంచి పది లక్షల మంది పుస్తకప్రియులు వస్తారని అంచనా వేస్తున్నట్లు విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం(వీబీఎఫ్‌ఎస్) అధ్యక్షులు టి.మనోహర్‌నాయుడు వెల్లడించారు. చాలామంది ఏడాదంతా డబ్బులు దాచుకుని మరీ వచ్చి పుస్తకాలు కొనుగోలు చేస్తుంటారన్నారు. చాలా గ్రంథాలయాలు, విద్యా సంస్థలకు అవసరమైన పుస్తకాలను ఇక్కడే కొంటారని తెలిపారు. – ఈనాడు, అమరావతి

ఆధునిక యుగం వైపు దేశాన్ని నడిపిన సావిత్రీబాయి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : సామాజిక సంస్కరణలలో భారతదేశాన్ని చీకటి మధ్య యుగాల నుంచి ఆధునికయుగం వైపు నడిపించిన తొలి వ్యక్తుల్లో సావిత్రీబాయి పులె ఒకరని పలువురు వక్తలు కొనియాడారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో శనివారం బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై ఆయుధ సభగా.. కత్తి పద్మారావు రచించిన



సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోటేశ్వరరావు, సూర్యకిరణ్ తదితరులు

చిన సావిత్రీబాయి పులె జీవిత చరిత్ర (గ్రంథాన్ని) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా.కొయి కోటేశ్వరరావు, ఎన్.జె.విద్యాసాగర్, శిఖామణి, గద్దర్ ఫౌండేషన్ అధ్యక్షుడు.. గద్దర్ కుమారుడు సూర్యకిరణ్, సరితా సూర్యకిరణ్ తదితరులు మాట్లాడారు. దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె విద్యారంగంలో పోషించిన పాత్ర సమాజంలో గొప్ప మార్పులకు నాందిపలికిందన్నారు. మహిళా విద్య సమాజ అభ్యుదయంలో కీలకమని స్పష్టం చేశారు. సావిత్రీబాయి జీవితం, ఆదర్శాలను ఉత్తేజకరంగా ఆవిష్కరించడంలో రచయిత కత్తి పద్మారావు విజయవంతమయ్యారని ప్రశంసించారు. సభకు గద్దం విజయకుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం రాజేష్ బృందం సావిత్రీబాయి పులె గీతాన్ని శ్రావ్యంగా ఆలపించింది.

యువత ఉన్నత వ్యక్తిత్వం సాధించాలి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : యువత ఉన్నత వ్యక్తిత్వ లక్షణాలు అలవరచుకుని, సమాజంలో కీలకపాత్ర పోషించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవంలో.. శనివారం నాలుగో సభగా ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్ బాబు రచించిన 'మీరు శ్రీలు కావచ్చు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలి మాట్లాడుతూ.. యువతలోని అపరిమిత శక్తులను వెలికితీసే సామర్థ్యం ఈ రచనకు ఉందన్నారు. విద్యనే సాధనంగా చేసుకుని, జీవితాలను మలచుకోవాలనుకునే యువతకు ఈ పుస్తకం మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. పుస్తక సంపాదకులు వల్లీశ్వర్ మాట్లాడుతూ.. చదువు ద్వారా సమాజంలో గుర్తింపు పొందడం, సేవ చేయడం సాధ్యమని వివరించారు. ప్రచురణకర్త దూపాటి విజయకుమార్ మాట్లాడుతూ.. ఐఏఎస్ అధికారుల అనుభవాలు మంచి రచనలుగా మారతాయని చెప్పారు. శ్రీధర్ బాబు తన అనుభవాలను సమర్థంగా పుస్తకరూపంలో మలిచారని ప్రశంసించారు. రచయిత శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తిలోని అంతర్గత శక్తులను వెలికితీయడమే లక్ష్యంగా 36 కథలతో ఈ పుస్తకాన్ని రచించానని, యువతకు ఇది ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.



మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

కాలానికి అనుగుణంగా ప్రచురణ రంగం మారాలి


విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : సమాచార వినియోగంలో వస్తున్న ఆధునిక మార్పులను గుర్తించి ప్రచురణ రంగం విస్తృతిని అర్థం చేసుకుని అందిపుచ్చుకోవాలని పలువురు ప్రచురణకర్తలు పేర్కొన్నారు. ఈ-బుక్‌లు, డిజిటల్ వేదికలను వినియోగిస్తూ ఉత్పత్తి, మార్కెటింగ్ విధానాల్లో మార్పులు తీసురావాలని సూచించారు. తెలుగు పుస్తకాలు చదవడం కొంత తగ్గి ఉండొచ్చుగానీ, తెలుగు చదవడం మాత్రం తగ్గలేదని స్పష్టం చేశారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవం రెండో రోజు శనివారం మూడో సభగా బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై 'పాతికేళ్ల ప్రచురణ రంగం' అనే చర్చాగోష్ఠి నిర్వహించారు. ప్రధానవక్తగా పాత్రికేయులు రెంటాల జయదేవ్, సభాధ్యక్షులు పల్లవి వెంకటనారాయణ మాట్లాడారు. ఎలక్ట్రానిక్ మీడియా విస్తరణతో కాల్పనిక సాహిత్యానికి ఆదరణ తగ్గి.. ఆరోగ్యం, స్వయం సహాయక, వ్యక్తిత్వ వికాస పుస్తకాలకు డిమాండ్ పెరిగిందన్నారు. ఎమెస్కో విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పుస్తకాల ఆదరణలో మళ్లీ పుంజుకునే దశ ప్రారంభమైందని పేర్కొన్నారు. ప్రచారానికి సోషల్ మీడియా ఉపయోగకరంగా ఉందన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజరు మనోహర్‌నాయుడు ప్రభుత్వ గ్రంథాలయాల నిర్వీర్యం, కొనుగోళ్లు తగ్గడం వల్ల ప్రచురణ రంగం నష్టపోయిందన్నారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ మేనేజరు కె.లక్ష్మయ్య స్వాగతోపన్యాసం చేశారు. కరోనా తర్వాత క్షీణించిన ఈ రంగం.. మళ్లీ పునరుజ్జీవం పొందుతోందన్నారు.



ప్రసంగిస్తున్న రెంటాల జయదేవ్

విమలాదేవి సేవలు స్ఫూర్తిదాయకం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : బాధ్యతాయుత పౌరురాలిగా.. దాత సూరపనేని విమలాదేవి సేవలు స్ఫూర్తిదాయకం అని ఆమె కుమార్తె పద్మజ అన్నారు. పుస్తక మహోత్సవ సంఘానికి భూరి విరాళాలిచ్చిన విమలాదేవి సంస్మరణ సభను శనివారం బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై నిర్వహించారు. ఆమె చిత్రపటానికి వక్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మజ మాట్లాడుతూ.. విమలాదేవి సంపాదనతో పాటు జీవితాన్ని కూడా తోటి పౌరుల సంక్షేమానికే అంకితం చేశారని కొనియాడారు. పేద విద్యార్థుల విద్య, ఆరోగ్యం కోసం సమయం, శ్రమ, ధనాన్ని వెచ్చిస్తూ నిరాడంబర జీవనం గడిపారని వివరించారు. సంఘం సమన్వయకర్త దూపాటి విజయకుమార్ మాట్లాడుతూ.. విజయవాడ పుస్తక మహోత్సవం విజయానికి నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పౌరసమాజం ఇస్తున్న బేషరతు మద్దతే కారణమన్నారు. పుస్తక ప్రదర్శనకే పరిమితం కాకుండా.. పూర్తిస్థాయి గ్రంథాలయాన్ని నిర్వహించడం వీబీఎఫ్‌ఎస్ ప్రత్యేకత అని పేర్కొన్నారు. సభకు పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షుడు టి.మనోహర్ నాయుడు అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల సుబ్బారావు వందన సమర్పణ చేశారు. కార్యదర్శి కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.



విమలాదేవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పద్మజ, ఎమెస్కో విజయ్‌కుమార్ తదితరులు

---

aha@eenadu.in

ఆహా! ..ఏమి రుచి

ఫారిన్ కేక్.. వెరైటీ టేస్ట్!

కొత్త సంవత్సరం సందర్భంగా కేక్ తిన్నాక.. పిల్లలు మళ్లీ చేయమని అడుగుతారు. రెడ్ వెల్వెట్, బ్లాక్ ఫారెస్ట్, చీజ్, ఫ్రూట్, చాక్లెట్, వెనీలా.. ఇలా ఏది చేద్దామా అని ఆలోచిస్తున్నారా?! వాటికి బదులు ఇతర దేశాల ఈ రెసిపీలను ప్రయత్నించి చూడండి.. ప్రత్యేకంగా ఉంటుంది.

ప్రాఫిటెరోల్ కేక్



కావలసినవి: వెన్న - అర కప్పు, మైదాపిండి - కప్పు, మలై - ఒకటిన్నర కప్పులు, గుడ్లు - 4, ఉప్పు - చిటికెడు, పంచదార పొడి - 3 టేబుల్ స్పూన్లు, వెనీలా ఎసెన్స్ - అర స్పూన్, డార్క్‌చాక్లెట్ - 175 గ్రాములు, ఫ్రెష్ క్రీమ్ - అర కప్పు

తయారీ: కోడిగుడ్లను గిలకొట్టి పక్కనుంచాలి. ప్యాన్‌లో కప్పు నీళ్లు, వెన్న, ఉప్పు వేసి మరిగించాలి. అందులో మైదా చేర్చి కలియబెట్టాలి. దగ్గరగా అయ్యాక సెగ తీసేయాలి. ఇప్పుడు గుడ్డు సొన వేసి కలపాలి. ఈ మిశ్రమంతో చిన్న బంతుల్లా చేసి.. ట్రేలో ఉంచాలి. అవెన్‌ను 180 డిగ్రీల వద్ద ప్రీ హీట్ చేసి.. 25 నుంచి 30 నిమిషాలు లేత గోధుమరంగులోకి మారే వరకూ బేక్ చేయాలి. ఈలోగా మలై, పంచదార, వెనీలా ఎసెన్స్ కలిపి ఫిల్లింగ్ సిద్ధం చేయాలి. బేక్ చేసిన బాల్స్‌కు చిన్న రంధ్రం చేసి.. క్రీమ్ నింపాలి. వాటిని ప్లేట్లో పిరమిడ్‌లా పేర్చాలి. డార్క్‌చాక్లెట్‌ను వేడిచేసి ప్రాఫిటెరోల్ బాల్స్ మీద పోసి.. ఒక అరగంట ఫ్రిజ్‌లో ఉంచాలి. అంతే.. ఇటలీ కేక్ తిని ఆనందించడమే తరువాయి.

ట్యూనిస్ కేక్



కావలసినవి: వెన్న - 100 గ్రాములు, ఆలివ్ నూనె - స్పూన్, పంచదార పొడి - ముప్పావు కప్పు, గుడ్లు - 2, వెనీలా ఎసెన్స్ - స్పూన్, మైదా పిండి - కప్పు, బేకింగ్ పౌడర్ - స్పూన్, డార్క్ చాక్లెట్ - 150 గ్రాములు, ఫ్రెష్ క్రీమ్ - అర కప్పు, మాజుపాన్ లీవ్స్, స్టార్స్, చెర్రీపండ్లు - అలంకరించేందుకు

తయారీ: వెన్నలో పంచదార పొడి వేసి బాగా కలపాలి. అందులో గుడ్డుసొన, వెనీలా ఎసెన్స్ చేర్చి.. బీట్ చేయాలి. మైదా, బేకింగ్ పౌడర్ కూడా వేసి ఇంకోసారి కలపాలి. ఈ మిశ్రమాన్ని ఆలివ్ నూనె రాసిన కేక్ టిన్‌లో సమంగా సర్దాలి. అవెన్‌ను 170 డిగ్రీల వద్ద ప్రీ హీట్ చేసి.. అరగంట బేక్ చేయాలి. కేక్ చల్లారేలోగా.. క్రీమ్‌లో చాక్లెట్ జతచేసి వేడి చేయాలి. ఈ చాక్లెట్ సాస్‌ను కేక్ మీద పోయాలి. పైన మాజుపాన్ లీవ్స్, స్టార్స్, చెర్రీపండ్లను అమర్చాలి. స్కాట్లాండ్‌లో ప్రసిద్ధమైన ఈ కేక్ చూడటానికి ఎంత రిచ్ లుక్‌తో ఉంటుందో టేస్ట్‌లోనూ అంతే సూపర్.

స్పెకోక్



కావలసినవి: వెన్న - 200 గ్రాములు, పంచదార పొడి - కప్పు, గుడ్లు - 4, వెనీలా ఎసెన్స్ - స్పూన్, మైదా పిండి - కప్పు, మిల్క్ పౌడర్ - 2 టేబుల్ స్పూన్లు, దాల్చినచెక్క పొడి - స్పూన్, లవంగాల పొడి - అర స్పూన్, జాజికాయ పొడి - చిటికెడు, యాలకుల పొడి - పావు స్పూన్

తయారీ: గుడ్డు సొనను బీట్ చేయాలి. అందులో వెన్న, పంచదార, వెనీలా ఎసెన్స్, మైదా, మిల్క్ పౌడర్ చేర్చి క్రీమీగా వచ్చేలా మళ్లీ బీట్ చేయాలి. ఈ కేక్ బ్యాటర్‌ను రెండు భాగాలుగా చేయాలి. ఒక భాగాన్ని అలా ఉంచేసి.. రెండో భాగంలో దాల్చినచెక్క, జాజికాయ, లవంగాల పొడులు కలపాలి. కేక్ టిన్‌కు వెన్న రాసి ముందుగా రెండు మూడు స్పూన్ల ప్లెయిన్ బ్యాటర్‌ను పలుచని లేయర్‌లా వేయాలి. అవెన్‌ను గ్రిల్ మోడ్‌లో ఉంచి.. నాలుగు నిమిషాలు బేక్ చేయాలి. ఇప్పుడు స్పైస్ బ్యాటర్ వేసి మళ్లీ బేక్ చేయాలి. లేయర్స్ అయిపోయే వరకు ఇలాగే చేయాలి. చివరి లేయర్ తర్వాత 160 డిగ్రీల వద్ద 10 నిమిషాలు బేక్ చేయాలి. చల్లారాక.. చిన్న ముక్కలుగా కట్ చేసి సర్వ్ చేయండి. ఒక పొర వెన్న రుచితో, ఇంకో పొర స్పైసీగా ఉండే ఈ ఇండోనేషియా స్పెకోక్ మనసు దోచుకుంటుంది.

బ్యాచిలర్స్ కిచెన్



అన్నప్రాశన.. ఆవకాయ!

భద్రం, నేను ఆఫీసు పనిమీద చెన్నై వచ్చి.. కంపెనీ వాళ్లిచ్చిన గెస్ట్‌హౌజ్‌లో దిగాం. 15 రోజులు ఇక్కడే ఉండాలి. 'పాలప్యాకెట్ తెచ్చేదా? కాఫీ పెడతావా?' అన్నాడు భద్రం. 'నాకు స్టవ్వు వెలిగించడమే రాదు. ఇప్పుడు పాలు కాచి.. కాఫీ కలపాలా? పద.. హోటల్లో తాగివద్దాం' అన్నాను. 'నెలలో పెళ్లి చేసుకోబోతున్నావు.. కాస్తయినా వంట రాకపోతే ఎలా?' అని అతడంటే.. 'అందుకు హోమ్ డిపార్ట్‌మెంట్ ఉందిలే' అన్నాను. టీ తాగుతుంటే కాబోయే శ్రీమతి నుంచి ఫోన్. మాట్లాడేశాక.. 'భద్రం! నీకు వంటొచ్చా?' అనడిగా. 'బ్రహ్మాండంగా వచ్చు. కావల్సినవన్నీ కమ్మగా చేసుకు తింటా' అన్నాడు. 'గెస్ట్‌హౌజ్‌లో ఎటూ స్టవ్వు, గిన్నెలూ ఉన్నాయి.. పప్పులూ ఉప్పులూ కొనుక్కొస్తా.. నాక్కొంచెం వంట నేర్పరా ప్లీజ్' అన్నాను. 'హోమ్ మినిస్టర్ ఆర్డరా?' అని భద్రం నవ్వితే.. 'అదేం కాదుగానీ.. తను హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అడిగితే.. నైట్‌షిఫ్ట్‌లు చేసేట్లయితేనే ఇస్తామన్నారట. రాత్రి డ్యూటీ చేసొచ్చి వంట చేయలేనంది. రోజూ బయటి ఫుడ్డు తింటే తడిసి మోపెడవుతుంది, ఆరోగ్యమూ పాడవుతుంది' అన్నాను బిక్కమొహంతో. 'సర్లే.. ఈ 15 రోజుల్లో నలభీముణ్ని మించిపోయేలా ట్రైనింగ్ ఇస్తా' అన్నాడు భద్రం. 'అన్నప్రాశన రోజే ఆవకాయ అన్నట్టుంది.. నాలుగడుగులు వెయ్యలేని వాణ్ని నలభై మైళ్లేం నడుస్తాలే గానీ.. తోటకూర పప్పు, బెండకాయ వేపుడు, సొరకాయ పులుసు లాంటి మామూలు వంటలు నేర్పితే.. చాలు' అన్నాను. 'అప్పుడిక విడాకులిచ్చేస్తుంది! నువ్వూ నేనూ అంటే అమ్మ చేసినవి బుద్ధిగా తింటాం గానీ.. జనం షజవాన్ రైస్, షాహీ పనీర్, ఆలూ కోఫ్తా లాంటి ఆధునిక వంటలే తింటున్నారు' అన్నాడు భద్రం. 'పోనీ.. అవే నేర్పు' అన్నాను ఏడ్పుగొట్టు మొహంతో.

– పి.ఎస్. నారాయణ, హైదరాబాద్



మునగాకు చట్నీ తిన్నారా!

పాఠక వంట

గోంగూరతోనే కాదు ఆరోగ్యానికి మేలుచేసే మునగాకుతోనూ నోరూరించే చట్నీ చేయొచ్చు..

కావలసినవి: మునగాకు- కప్పు, ఎండుమిర్చి- 10, ఉల్లితరుగు - గుప్పెడు, వెల్లుల్లి రెబ్బలు - 4, చింతపండు- నిమ్మకాయంత, ఉప్పు - తగినంత, వేయించిన నువ్వుల పొడి- 2 స్పూన్లు, నూనె- ఆరు స్పూన్లు, కొబ్బరి తురుము- ఐదు స్పూన్లు, ఆవాలు, మెంతులు, శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర - స్పూన్ చొప్పున, కరివేపాకు- రెండు రెబ్బలు, ఇంగువ- పావు స్పూన్



తయారీ: చింతపండును కడిగి పక్కనుంచితే కొంచెం నానుతుంది. మునగాకును కడిగి నీళ్లు వడకట్టాలి. ప్యాన్‌లో కొద్దిగా నూనె వేడిచేసి.. 8 ఎండుమిరపకాయలను వేయించి తీయాలి. అదే ప్యాన్‌లో ఉల్లితరుగును, అది కాస్త వేగాక.. మునగాకు చేర్చాలి. ఆకు మెత్తబడిందనుకున్నాక సెగ తీసేయాలి. చల్లారాక వెల్లుల్లి, చింతపండు, ఉప్పు జతచేసి గ్రైండ్ చేయాలి. అందులో కొబ్బరి తురుము, నువ్వుల పొడి వేసి కలియబెట్టాలి. కడాయిలో మిగిలిన నూనె వేడి చేసి.. ఆవాలు, మెంతులు, శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, కరివేపాకు, ఎండు మిరపకాయలు, ఇంగువ ఒక్కొక్కటిగా వేయాలి. ఈ తాలింపును పచ్చడిలో కలపాలి. ఇది అన్నం, ఇడ్లీ, దోశలు ఎందులోకైనా బాగుంటుంది.


– ఎం. శ్యాం కుమారి, హైదరాబాద్

హోటల్ స్టైల్లో మటన్ కీమా కర్రీ!

షెఫ్ స్పెషల్

నాన్‌వెజ్ వంటకాలు హోటల్లో చేసినట్లు కుదరవని దిగులు పడుతున్నారా? అయితే మీ కోసమే ఈ కీమా కర్రీ...

కావలసినవి: మటన్ కీమా- అరకిలో, ఉల్లి తరుగు- ఒకటిన్నర కప్పు, టొమాటో గుజ్జు- అర కప్పు, ఉప్పు - తగినంత, అల్లం వెల్లుల్లి పేస్ట్- 2 టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి- 2, నూనె- 4 టేబుల్ స్పూన్లు, కారం- ఒకటిన్నర స్పూన్లు, గరంమసాలా, పసుపు, మిరియాలు, జీలకర్ర పొడులు - స్పూన్ చొప్పున, బిర్యానీ ఆకు- 1, లవంగాలు - 3, యాలకులు - 2, ధనియాలపొడి- 2 స్పూన్లు, కొత్తిమీర తరుగు- పావు కప్పు, పుదీనా - కొద్దిగా, నిమ్మరసం- టేబుల్ స్పూన్, నెయ్యి- ఒకటిన్నర టేబుల్ స్పూన్లు



తయారీ: ప్యాన్‌లో నూనె వేడయ్యాక మసాలా దినుసులను వేయించి.. ఉల్లితరుగు వేయాలి. అది వేగాక.. అల్లం వెల్లుల్లి పేస్ట్, పుదీనా, పచ్చిమిర్చి జోడించాలి. అవీ వేగాక.. టొమాటోగుజ్జు చేర్చాలి. మూడు నిమిషాల తర్వాత కీమా, కొన్ని నీళ్లు, కారం, పసుపు, ఉప్పు, అన్ని పొడులు చేర్చాలి. అడుగంటకుండా మధ్యమధ్యలో కలుపుతూ సుమారు అరగంట ఉడికించాలి. అందులో కొత్తిమీర, గరం మసాలా, నిమ్మరసం కూడా వేసి కలియబెట్టాలి. కొన్ని క్షణాల తర్వాత దించేసి.. నెయ్యి చల్లాలి. ఇది అన్నంలోకే కాకుండా రోటీ, చపాతీల్లోకి కూడా ఎంతో బాగుంటుంది.

రంగూ రుచీ అదుర్స్!

నూనె లేకుండా..

బ్రోకలీతో రుచికరమైన స్నాక్స్ అనేకం చేయొచ్చు. వాటిలో 'బ్రోకలీ బాల్స్' ఒకటి. ఒక్క చుక్కయినా నూనె లేకుండా తయారవుతాయివి. ఎలాగంటారా? చదివేయండి మరి...

ఈ ఆరోగ్యకరమైన రెసిపీ కోసం... బ్రోకలీ - కప్పున్నర, ఉల్లి తరుగు - అర కప్పు, వాము - అర స్పూన్, పుదీనా పొడి, సబ్జాగింజలు - స్పూన్ చొప్పున, మిరియాలు, గార్లిక్ పౌడర్లు - అర స్పూన్ చొప్పున, బ్రెడ్ పొడి - అర కప్పు, ఆల్మండ్ మీల్ - పావు కప్పు, డ్రై యీస్ట్ - టేబుల్ స్పూన్, ఉప్పు - రుచికి తగినంత తీసుకోవాలి. ఎలా చేయాలంటే... బ్రోకలీని సన్నగా తరగాలి. సబ్జాగింజలను కొంతసేపు నానబెట్టాలి.



కడాయిలో ముందుగా ఉల్లి తరుగును.. అది కాస్త వేగాక.. బ్రోకలీ, ఉప్పు జోడించి చెమ్మ పోయే వరకూ వేగనివ్వాలి. అందులో మిరియాలు, గార్లిక్ పౌడర్లు, వాము, పుదీనా పొడి, బ్రెడ్ పొడి, ఆల్మండ్ మీల్ జతచేసి ఇంకాస్త వేయించాలి. చివర్లో నానబెట్టిన సబ్జాగింజలు కూడా వేసి కలియబెట్టి దించేయాలి. ఈ మిశ్రమాన్ని చల్లారనిచ్చి పన్నెండు సమాన భాగాలుగా విడగొట్టాలి. ఒక్కోదాన్ని చేత్తో గట్టిగా నొక్కుతూ బాల్స్ చేయాలి. అన్నీ అయ్యాక.. ప్యాన్‌లో వేయించాలి. నూనె గానీ నెయ్యి గానీ వేయనవసరం లేదు. అంతే.. జీరో ఆయిల్ 'బ్రోకలీ బాల్స్' సిద్ధమైపోతాయి.

ఆమ్లా పానీయం చేద్దామా!

ఇది ఉసిరికాయల సీజన్. ఈ కాలంలో వీటితో చిక్కటి పానీయం చేసి ఉంచితే.. నచ్చినప్పుడల్లా తాగొచ్చు. ఇది రుచి, ఆరోగ్యం కూడా..

కావలసినవి: ఉసిరికాయలు, పంచదార - కిలో చొప్పున, నీళ్లు - 2 కప్పులు, నిమ్మరసం - 2 టేబుల్ స్పూన్లు, డ్రై జింజర్ పౌడర్ - టేబుల్ స్పూన్, ఉప్పు - చిటికెడు, పొటాషియం మెటాబైసల్ఫైట్ - ఒక గ్రామ్

తయారీ: ఉసిరికాయలను కడిగి, గింజలు తీయాలి. కప్పు నీళ్లు చేర్చి మెత్తగా గ్రైండ్ చేయాలి. దాన్ని పల్చటి వస్త్రంలో వడకట్టాలి. ఈ ఆమ్లా రసాన్ని ప్యాన్‌లోకి తీసి.. పంచదార, కప్పున్నర నీళ్లు జతచేసి మధ్యస్థమైన సెగ మీదుంచాలి. పంచదార కరిగాక.. సిమ్ చేయాలి. ఏడెనిమిది నిమిషాల తర్వాత.. సెగ తీసేయాలి. పూర్తిగా చల్లారాక.. నిమ్మరసం, డ్రై జింజర్ పౌడర్, ఉప్పు, పొటాషియం మెటాబైసల్ఫైట్ (దీన్ని స్క్వాష్, సిరప్, కాన్సన్‌ట్రేట్ డ్రింక్స్ మొదలైన వాటిలో త్వరగా పాడవకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు ఉపయోగిస్తారు. ఇది బ్యాక్టీరియా, ఫంగస్ పెరగకుండా అడ్డుకుంటుంది. రంగు మారకుండా, రుచి చెడకుండా కాపాడుతుంది) కలపాలి. ఈ చిక్కటి పానీయాన్ని తడి లేని పొడి సీసాలో నింపి.. రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకోవాలి. ఐదారు నెలలు నిలవుంటుంది. తడి లేని స్పూన్ వాడాలి. తాగదలచినప్పుడు గ్లాసు నీళ్లలో రెండు టేబుల్ స్పూన్ల ఆమ్లా కాన్సన్‌ట్రేట్ కలిపితే సరిపోతుంది.





తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు విరాళం చెక్కు అందజేస్తున్న పీఎంఎస్ ప్రసాద్

శ్రీవారికి రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.3 కోట్ల విరాళం

తిరుమల, తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి మూలమూర్తిని శనివారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్ దర్శించుకున్నారు. అనంతరం వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. అంతకుముందు తితిదేకు చెందిన పలు ట్రస్టులకు రిలయన్స్ ఇండస్ట్రీస్ తరఫున రూ.3 కోట్ల విరాళాన్ని అందించారు. తిరుపతిలోని తితిదే పరిపాలనా భవనంలో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌ను కలిసిన ఆయన విరాళం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఈవో అభినందించారు.



పుస్తకాలు కొంటున్న రామబ్రహ్మం

తొమ్మిది పదుల వయసులోనూ
పుస్తక ప్రేమ

వీల్‌ఛైర్‌లో వచ్చి పుస్తకాలు ఎంపిక చేసుకుంటున్న ఈ పెద్దాయనది కృష్ణా జిల్లా కానూరు. పేరు ఎ.వి.రామబ్రహ్మం (91). చిన్నారులు, యువత ఫోన్లు, సామాజిక మాధ్యమాలతో కాలం గడుపుతున్న నేటి కాలంలో నడవడానికే వీలులేని పరిస్థితిలోనూ ఈయన వీల్‌ఛైర్ ద్వారా సహాయకులతో కలిసి విజయవాడ పుస్తక మహోత్సవానికి వచ్చారు. గతేడాది పుస్తక మహోత్సవంలో రూ.16 వేల విలువైన పుస్తకాలు కొని చదివానని, పుస్తకాలపై మక్కువతో ఈసారీ వచ్చానని 'ఈనాడు'తో తెలిపారు.

– ఈనాడు, అమరావతి

రాయుడి హత్య వెనుక
భారీ కుట్ర

- చెన్నై పోలీసుల కంటే ముందే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఎలా తెలిసింది?
- జనసేన నేత వినుత భర్త చంద్రబాబు సంచలన ప్రకటన

ఈనాడు, తిరుపతి: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన శ్రీనివాసులు ఎలియాస్ రాయుడు హత్య కేసుకు సంబంధించి తమపై జరిగిన అన్యాయం వెనుక భారీ కుట్రకోణం ఉందని, హత్యోదంతం వెనుక కొందరు పెద్దల స్క్రీన్‌ప్లే నడుస్తోందని, రాజకీయంగా ఎదుగుతున్న జనసేన నేత వినుతను అణగదొక్కేందుకే ఈ కుట్రకు తెరలేపారని ఆమె భర్త చంద్రబాబు సంచలన ఆరోపణలు చేశారు. శనివారం ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసిన వీడియోలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పోలీసుల తీరుపై ప్రశ్నలు సంధించారు. అసలు చెన్నై పోలీసు కమిషనర్ అధికారికంగా వివరాలు వెల్లడించక ముందే.. ఇక్కడ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విలేకర్ల సమావేశం పెట్టి తీర్పు చెప్పడమేంటని నిలదీశారు. 'హత్య జరిగిన సమయంలో మా మామగారి వైద్యం నిమిత్తం నేను అపోలో ఆసుపత్రిలో ఉన్నా. ఆ విషయం సాక్ష్యాధారాలతో ఉంది. కానీ ఆంధ్రాలో ఒక వ్యక్తిని హత్య చేసి తమిళనాడులో జనం రద్దీగా ఉండే ప్రాంతంలో మృతదేహాన్ని పడేయడం వెనుక ఆంతర్యమేంటి? ఇది సామాన్యులు చేసే పని కాదు. దీని వెనుక పెద్దల హస్తం ఉంది. కేసు దర్యాప్తులోనూ అనేక అనుమానాలున్నాయి. చెన్నైలో దర్యాప్తు జరుగుతుండగానే ఇక్కడి నుంచి పట్టణ సీఐ గోపిని అక్కడికి ఎందుకు పంపించారు? ఆయన అక్కడ ఎవరితో మంతనాలు జరిపారు? రాయుడు తనకు తమ్ముడి లాంటి వాడని, అంత్యక్రియలు తామే జరిపిస్తామని ఎమ్మెల్యే చెప్పడం.. ఆ వెంటనే మాపై కేసులు బనాయించడం చూస్తుంటే ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారం జరిగినట్లు స్పష్టమవుతోంది. బయటకు వచ్చిన రాయుడి సెల్ఫీ వీడియోలో ఉన్నది కొంతే. అంతకుమించిన నిజాలు, ఆధారాలు మా వద్ద ఉన్నాయి. సమయం వచ్చినపుడు ఆ 'చీకటి నిజాలను' ప్రజల ముందుంచుతాం. న్యాయవ్యవస్థపై మాకు నమ్మకం ఉంది. ఈ కేసులో నిర్దోషులుగా బయటపడతాం. ఓ మహిళకు అన్యాయం జరుగుతుంటే ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణం' అని పేర్కొన్నారు. ఇప్పటికైనా నిజనిర్ధారణ కమిటీ వేసి, వాస్తవాలను వెలికితీయాలని ఆయన వీడియోలో డిమాండ్ చేశారు.



భావోద్వేగాలను అదుపులో పెట్టుకోలేకపోతే..

భావోద్వేగాలను అదుపులో పెట్టుకోగలిగేవారికే తమ భవిష్యత్తుపై నియంత్రణ ఉంటుంది. ఉద్రేకాలకు లొంగిపోతే మన జీవితం పరిస్థితుల చేతుల్లోకి వెళ్తుంది. మనం చేసే ప్రతి పెద్ద తప్పు వెనుక భావోద్వేగాలను జయించలేని స్థితిలో తీసుకున్న తప్పుడు నిర్ణయం ఉంటుంది. మన ప్రతి విజయం.. విచక్షణతో వేసిన అడుగుతో మొదలవుతుంది. అందుకే భావోద్వేగాలపై నియంత్రణ సాధించండి.

– త్రై లోపెజ్, కంటెంట్ డెవలపర్

ద్రౌపదీముర్ము జీవితం..ఒక దిక్సూచి

- సామాన్య మహిళగా ఆరంభించి అత్యున్నత స్థానానికి చేరారు
- ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఒడిశా గవర్నర్ హరిబాబు. చిత్రంలో ఎమెస్కో విజయ్‌కుమార్, కృష్ణారావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, చిగురుపాటి వరప్రసాద్, వేములపల్లి విద్యాసాగర్

ఈనాడు, అమరావతి, విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: 'రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జీవితం నేటితరానికి ఆశాకిరణం. ఆమె జీవితంలోని ప్రతి దశ.. విద్యార్థులు, యువత, మహిళలకు మార్గదర్శనం. ఓ సామాన్య మహిళ.. పట్టుదలతో చదువుకుని, అంచెలంచెలుగా పైకి ఎదిగి.. దేశమే గర్వించే స్థాయికి చేరిన విధానం ప్రతి ఒక్కరికీ దిక్సూచి లాంటిది' అని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు కొనియాడారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రచించిన 'అగ్ని సరసులో వికసించిన కమలం ద్రౌపదీ ముర్ము' పుస్తకావిష్కరణ సభ విజయవాడలోని చిగురుపాటి కృష్ణవేణి పాఠశాలలో శనివారం జరిగింది. ఎమెస్కో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హరిబాబు ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము జన్మించిన రాష్ట్రానికి గవర్నర్‌గా ఉండి.. ఆమె జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు.

అగ్నిసరసులో వికసించిన కమలం అనే ఈ పుస్తకం పేరే.. ఆమె జీవితానికి దర్పణంలా ఉందని హరిబాబు పేర్కొన్నారు. 'మౌనంగా బాధలను భరిస్తూ.. మహోన్నత శిఖరాలను అధిరోహించిన ఒక సాధారణ మహిళ.. అసాధారణ కథకు ఈ పేరు సంపూర్ణ న్యాయం చేస్తుంది. ఒక కుగ్రామంలో జన్మించి.. పరిమిత వనరులు, సామాజిక అడ్డంకులు, కష్టాలతో కూడిన గిరిజన నేపథ్యం నుంచి.. అత్యున్నత స్థానానికి ఎదిగారు. జీవితాన్ని ఎక్కడ ఆరంభించామన్నది కాదు.. ఎంత దూరం వెళ్లామన్నదే ముఖ్యం అనే గొప్ప సత్యాన్ని.. ఆమె జీవితం చాటిచెబుతోంది. కళాశాలలో చదువు పూర్తిచేసిన తర్వాత.. ఒక చిన్న పాఠశాలలో అధ్యాపకురాలిగా ఆరంభించి.. తర్వాత వార్డు కౌన్సిలర్‌గా ప్రజా జీవితంలోకి ప్రవేశించి.. రాష్ట్రపతి స్థాయికి ఎదిగి.. దేశ మహిళలకు అచంచలమైన ఆత్మవిశ్వాసం అందించారు' అని హరిబాబు కొనియాడారు. చదువుతో కుటుంబ స్థితిగతులే కాకుండా రాష్ట్ర ఆర్థికవ్యవస్థ కూడా మారుతుందనడానికి ఆంధ్రప్రదేశ్ ఒక ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ద్రౌపదీముర్ము పుస్తకం ఒక జీవితచరిత్ర మాత్రమే కాదని, ఇది ఎంతోమందికి ప్రేరణ అన్నారు. కార్యక్రమంలో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, సీనియర్ పాత్రికేయులు కృష్ణారావు, చిగురుపాటి కృష్ణవేణి విద్యాసంస్థల అధినేత వరప్రసాద్, వేములపల్లి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనను సందర్శించిన హరిబాబు

36వ విజయవాడ పుస్తక ప్రదర్శనను ఒడిశా గవర్నర్ హరిబాబు శనివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. వందల స్టాళ్లను ఏర్పాటుచేసి అన్నిరకాల పుస్తకాలూ ఒకేచోట ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి ప్రదర్శనలను అందరూ తప్పకుండా సందర్శించాలన్నారు. డిజిటల్ వేదికలపై చదువుకునేందుకు ఎన్నో అవకాశాలున్నా.. పుస్తకం ద్వారా కలిగే తృప్తి వాటిలో ఉండదని పేర్కొన్నారు.





ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్ వద్ద అభ్యుదయం సైకిల్‌యాత్ర ముగింపు పైలాన్‌ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత. చిత్రంలో శ్రీకాకుళం కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు తదితరులు ★ సైకిల్‌యాత్రలో పాల్గొన్న మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు

మత్తు వదిలేలా.. మార్పు తెచ్చేలా

- 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ పోలీసుల ప్రచారం
- ఇచ్ఛాపురంలో ముగిసిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర'

సోంపేట, ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ 25 మంది పోలీసులు నాలుగు జిల్లాలు, 75 మండలాలు, 508 గ్రామాల్లో.. 51 రోజులపాటు 1,300 కి.మీ దూరం సాగించిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర' శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో శనివారం ముగిసింది. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్, విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి, ఈగల్ టీం ఐజీ రవికృష్ణ, శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలు, వేల మంది విద్యార్థులు, పోలీసులు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొని 'డ్రగ్స్ వద్దు బ్రో' అని నినదించారు. తొలుత ఇచ్ఛాపురంలో పోలీస్‌స్టేషన్ వద్ద కేంద్ర, రాష్ట్ర మంత్రులు 'డ్రగ్స్ వద్దు బ్రో' పైలాన్ ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి సాంస్కృతిక ప్రదర్శనలతో రాజావారి మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర మంత్రి, ఇతర ప్రముఖులు సైకిల్ తొక్కగా, హోంమంత్రి ద్విచక్ర వాహనం నడుపుతూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల, నరసన్నపేట, పలాస ఎమ్మెల్యేలు ఎన్.ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై దండయాత్ర: కేంద్ర మంత్రి

ఉక్కు సంకల్పంతో పోలీసులు గంజాయి, ఇతర మత్తుపదార్థాలపై సాగిస్తున్న దండయాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. 'రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం చంద్రబాబు శ్రమిస్తున్నారు. ఆయన సంకల్పానికి దీటుగా గంజాయి రహిత రాష్ట్రంగా మార్చేందుకు పోలీసులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయి, మాదకద్రవ్యాలకు రాజధానిగా మార్చింది. దీనికి అప్పట్లో ఎంపీగా ఉన్న నేను సిగ్గుపడేవాడిని. మాదకద్రవ్యాల నుంచి బయటపడకపోతే ఏపీ కూడా పంజాబ్‌లా మారే ప్రమాదాన్ని గుర్తించి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నాం' అని వివరించారు.

పిల్లల నుంచి రక్షణ కోసం పోలీసులను ఆశ్రయిస్తున్నారు: హోంమంత్రి

గంజాయి, మాదకద్రవ్యాల మత్తులో పిల్లలు తల్లిదండ్రుల పట్ల క్రూరంగా ప్రవర్తిస్తుండటంతో రక్షణ కల్పించాలని వారు పోలీసులను ఆశ్రయిస్తున్నారని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. 'పోలీసులు సామాజిక బాధ్యతతో పనిచేస్తున్నారు. రాబోయే తరాల కోసం సైకిల్‌యాత్ర సాగించి విద్యార్థులు, యువతలో చైతన్యం నింపడం గొప్ప విషయం. ఇప్పటివరకు మాదకద్రవ్యాల కేసుల్లో 95 మందికి శిక్షలు పడ్డాయి. 53 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం' అని వెల్లడించారు.

'స్పీడ్ ట్రయల్ మానిటరింగ్'తో సత్ఫలితాలు: డీజీపీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చేసేందుకు అమలు చేస్తున్న 'స్పీడ్ ట్రయల్ మానిటరింగ్' విధానం సత్ఫలితాలు ఇచ్చిందని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు 470 కేసుల్లో దోషులకు శిక్షలు పడేలా చేయగలిగామని పేర్కొన్నారు. ఆరు కేసుల్లో మరణశిక్ష, 132 కేసుల్లో జీవిత ఖైదు, ఏడు కేసుల్లో 25 ఏళ్లు, 103 కేసుల్లో 20 ఏళ్లు, 56 కేసుల్లో పదేళ్ల పాటు జైలుశిక్షలు పడేలా చేశామని వెల్లడించారు. పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. రాష్ట్రంలో అత్యధికంగా విజయనగరం జిల్లాలో 49, ఎన్టీఆర్ కమిషనరేట్‌లో 37, నెల్లూరులో 32, విశాఖపట్నంలో 31 కేసుల్లో శిక్షలు పడ్డాయని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 79934 85111 శక్తి వాట్సప్ నంబరుకు, 112కు కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎదురుకాల్పులు

- రెండు వేర్వేరు ఘటనల్లో 14 మంది మావోయిస్టుల మృతి

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ డివిజన్‌లోని సుక్మా, బీజాపుర్ జిల్లాల్లో శనివారం జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 14 మంది మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఆరుగురు మహిళలు ఉన్నారు. మరణించిన వారిలో మావోయిస్టు కీలక నాయకుడు, కుంట ఏరియా కమిటీ కార్యదర్శి(డీవీసీఎం) సచిన్ మంగడు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సుక్మా జిల్లాలోని కిష్టారం అడవుల్లో మావోయిస్టులు ఉన్నారని నిఘా వర్గాల ద్వారా సమాచారం అందుకున్న డీఆర్‌జీ(డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) బృందాలు పెద్దఎత్తున ఆ ప్రాంతానికి ఆపరేషన్ కోసం వెళ్లాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య భీకర ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పులు ఆగిన తర్వాత ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టిన బలగాలు 12 మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించాయి. అందులో ఐదుగురు మహిళా మావోయిస్టులున్నారు. ఏకే-47లు, ఇన్సాస్, ఎస్ఎల్ఆర్‌లతోపాటు పెద్ద మొత్తంలో ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. కుంట డీవీసీఎం సచిన్ మంగడు మృతి చెందినట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ బీజాపుర్‌లో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. గత ఏడాది జూన్‌లో ఐఈడీ పేల్చి కుంట ఏఎస్పీ ఆకాశరావు గిరిపుంజే మరణానికి కారకులైన మావోయిస్టులు ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు ఆయన చెప్పారు. కిష్టారం, కుంట ఏరియా కమిటీలో చురుగ్గా పని చేసే 4, 8 ప్లాటూన్లకు చెందిన కీలక మావోయిస్టులు ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారని వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు.

మరో ఘటనలో..: బీజాపుర్ జిల్లా బాసగూడ పోలీసుస్టేషన్ పరిధిలోని గగన్‌పల్లి-ముర్కిపార్ అడవుల్లో తెల్లవారుజామున 5 గంటలకు జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. వారిని పామేడు ఏరియా కమిటీ సభ్యుడు హుంగా మడకం ఎలియాస్ పంచుగ, పార్టీ ప్లాటూన్ కమిటీ సభ్యురాలు ఐతి ముచాకి ఎలియాస్ జోగిగా గుర్తించారు. ఘటనా స్థలిలో ఎస్ఎల్ఆర్, 12-బోర్ కంట్రీ మేడ్ తుపాకీ, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు.

మావోయిస్టులకు మరో గట్టి ఎదురుదెబ్బ

లొంగిపోయిన బడ్సె సుక్కా, కంకణాల రాజిరెడ్డి



లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను వెల్లడిస్తున్న తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి. పక్కన ఇతర పోలీసు ఉన్నతాధికారులు. కిందివరుసలో బడ్సె సుక్క(దేవ), కంకణాల రాజిరెడ్డి, అడ్లూరి ఈశ్వరి, ఇతర మావోయిస్టులు

ఈనాడు, హైదరాబాద్: మావోయిస్టు ఉద్యమానికి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. గెరిల్లా పోరాటంలో ఆరితేరిన దండకారణ్యం ప్రత్యేక జోనల్ కమిటీ సభ్యుడు, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) బెటాలియన్ కమాండర్ బడ్సె సుక్క ఎలియాస్ దేవ ఎలియాస్ దర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి ఎలియాస్ వెంకటేశ్, ఆయన భార్య ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా అరిలోవకు చెందిన అడ్లూరి ఈశ్వరి ఎలియాస్ రాంకోతోపాటు 20 మంది మావోయిస్టులు శనివారం తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఉద్యమం కోసం కూడబెట్టిన రూ.20.30 లక్షల నగదును కూడా అప్పగించడం గమనార్హం. లొంగిపోయిన మావోయిస్టులు పోలీసులకు డబ్బు అప్పగించడం దేశంలో ఇదే ప్రథమం. అంతేకాదు 48 ఆయుధాలు, 93 మ్యాగజైన్లు, 2,206 తూటాలనూ అప్పగించారు. ఇందులో ఇజ్రాయెల్ తయారీ అత్యాధునిక టావర్ ఆయుధం సైతం ఉండటం గమనార్హం. డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ..."ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన బడ్సె సుక్క ఇటీవల మరణించిన హిడ్మా తర్వాత గిరిజనుల్లో రెండో పెద్ద మావోయిస్టు నేత. వివిధ రాష్ట్రాల్లో కలిపి రూ.75 లక్షల రివార్డు ఉంది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన కంకణాల రాజిరెడ్డి 1997 ఏప్రిల్‌లో పీపుల్స్‌వార్‌లో చేరాడు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని కీలక ప్రాంతాలు కలిపి ఏర్పాటు చేసిన డివిజన్ కమిటీకి ఇన్‌ఛార్జిగా పనిచేశాడు. కర్రెగుట్టల్లో గెరిల్లా వ్యవస్థ ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించాడు" అని వివరించారు. "ఇప్పటివరకు తెలంగాణకు చెందిన మావోయిస్టుల అజ్ఞాత క్యాడర్(అండర్ గ్రౌండ్) 52 మంది వరకు ఉండొచ్చని భావించాం. ప్రస్తుతం వీరి సంఖ్య 17 మాత్రమేనని తేలింది'' అని డీజీపీ తెలిపారు.

వైకుంఠ ద్వారాన.. అభిషేక తరుణాన

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీనివాసుడిని వైకుంఠ ద్వారం ద్వారా దర్శించుకుందామని తిరుమలకు వచ్చిన సామాన్యులకు శుక్రవారం అరుదైన అవకాశం లభించిందని, వారు అభిషేక సేవను కూడా చూసి తరించారని తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి తెలిపారు. శుక్రవారం రికార్డు స్థాయిలో 83,0032 మందికి దర్శనం కల్పించినట్లు చెప్పారు. శనివారం ఆయన 'ఈనాడు-ఈటీవీ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'సాధారణంగా శుక్రవారాల్లో స్వామివారి అభిషేక సేవ కారణంగా దర్శన సమయం తక్కువగా ఉంటుంది. గతంలో గరిష్ఠంగా 65 వేల మందికి దర్శన భాగ్యం దక్కేది. అయితే భక్తుల రద్దీ, ముక్కోటి వేడుకల నేపథ్యంలో ఈ వారం అభిషేకం సమయంలోనూ సర్వదర్శనాలకు అనుమతించాం. భక్తులు వైకుంఠ ద్వారం మీదుగా వస్తూ, అభిషేక సేవను కూడా చూసి రెండింతల అనుభూతి పొందారు' అని వివరించారు. రద్దీకి అనుగుణంగా ప్రవేశ క్యూలైన్లు మారుస్తున్నామని, తిరుపతి జిల్లా యంత్రాంగం, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. శనివారం సాయంత్రానికి 45 వేల మంది శ్రీవారిని దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు.

41 మంది డీసీసీ అధ్యక్షుల నియామకం

ఈనాడు, దిల్లీ: ఏపీలో 15 నగరాలు సహా మొత్తం 41 మంది డీసీసీ అధ్యక్షులను నియమిస్తూ ఏఐసీసీ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో ఈ నియామకాలు చేపట్టినట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో


వెనెజువెలాలోని లా గ్వైరా నౌకాశ్రయంలో పేలుళ్ల తర్వాత అలముకున్న పొగ


అమెరికా దాడితో వెనెజువెలాలోని లా కార్లోటా ఎయిర్‌ఫీల్డ్‌లో ధ్వంసమైన వాహనాలు

అగ్గి రాజేసింది చమురే!

• నాడు మిత్ర దేశాలు నేడు బద్ధ విరోధులు

లాటిన్ అమెరికా దేశాలపై పూర్తి ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న అగ్రరాజ్యం అమెరికాకు ఏళ్ల తరబడి కొరకరాని కొయ్యలుగా మారిన వాటిల్లో ఒకటి క్యూబా... మరొకటి వెనెజువెలా. 1961 నుంచి క్యూబాలో, 1999 నుంచి వెనెజువెలాలో సైద్ధాంతికంగా తనకు ఏమాత్రం నచ్చని ప్రభుత్వాలు అక్కడ కొలువుదీరడాన్ని అమెరికా సహించలేకపోతోంది. వాటిని కూల్చడానికి ఎన్నో ప్రయత్నాలు చేసింది. తీవ్రమైన ఆంక్షలు విధించడంతో ఆర్థికంగా కుంగిపోయినప్పటికీ ఆ రెండు దేశాలను అమెరికా తన దారికి తెచ్చుకోలేకపోయింది.

వెనెజువెలాపై ఆగ్రహం ఎందుకంటే...

హ్యూగో చావెజ్ 1999లో వెనెజువెలాలో అధికారంలోకి రాకముందు వరకూ ఆ దేశంలోని చమురు రంగంలో అమెరికా కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. వెనెజువెలా పాలకులు అమెరికా అనుకూల విధానాలను అనుసరించారు. వెనెజువెలా చమురు ఎగుమతులకు అగ్రరాజ్యం అతిపెద్ద విపణిగా ఉండేది. సామ్యవాద సిద్ధాంతంతో, పేదరిక నిర్మూలన నినాదంతో అధికారాన్ని చేజిక్కించుకున్న ఛావెజ్... దేశంలోని చమురు కంపెనీలన్నింటినీ జాతీయం చేశారు. దీంతో ఈ రంగంలో అమెరికా కంపెనీల పాత్ర పూర్తిగా తగ్గిపోయింది. అంతేకాకుండా ఛావెజ్... అమెరికా వ్యతిరేక దేశాలైన రష్యా, చైనా, ఇరాన్, క్యూబాలకు బాగా సన్నిహితమయ్యారు. చావెజ్‌ను పదవీచ్యుతుడిని చేయడానికి అమెరికా మద్దతుతో జరిగిన తిరుగుబాటు 2002లో విఫలమైంది. ప్రజల భారీ మద్దతుతో రెండు రోజుల్లోనే ఛావెజ్ తిరిగి అధికారాన్ని దక్కించుకున్నారు.

చావెజ్ బాటలో మదురో...

అనారోగ్యంతో 2013లో చావెజ్ మృతి చెందగా ఆయన స్థానంలో అధికారంలోకి వచ్చిన మదురో కూడా అమెరికా వ్యతిరేక విధానాలనే కొనసాగించారు. రష్యా, చైనా, ఇరాన్‌ల నుంచి ఆయుధాలు కొనుగోలు చేశారు. చావెజ్ అధికారంలో ఉన్నప్పుడు వెనెజువెలాపై మొదలైన ఆర్థిక ఆంక్షలను బరాక్ ఒబామా, జో బైడెన్, ట్రంప్ ప్రభుత్వాలు మరింత తీవ్రం చేశాయి. దీంతో దేశంలో తీవ్ర ద్రవ్యోల్బణం తలెత్తి నిత్యావసరాల ధరలు భారీగా పెరిగిపోయాయి. ప్రజల్లో అసంతృప్తి ప్రబలింది. అమెరికా అధ్యక్షులు జో బైడెన్ కానీ, డొనాల్డ్ ట్రంప్ కానీ వెనెజువెలా చట్టబద్ధమైన పాలకుడిగా మదురోను గుర్తించలేదు. ఎన్నికల సంస్కరణలు తీసుకురావాలన్న ఒత్తిళ్లకూ వెనెజువెలా అధ్యక్షుడు తలవంచలేదు. చావెజ్ మరణం తర్వాత అధ్యక్ష పదవిని చేపట్టిన మదురో... 2018, 2024 ఎన్నికల్లో విజయం సాధించినట్లుగా ప్రకటించుకోవడం వివాదాస్పదమైంది. అమెరికా సహా 50 దేశాలు వెనెజువెలా అధ్యక్షుడిగా ఆయనను గుర్తించటానికి నిరాకరించాయి.

అమెరికాకు ఎందుకంత ఆసక్తి...

వెనెజువెలాలో చమురు, బంగారం, సహజ వాయువు నిల్వలు దండిగా ఉన్నాయి.

ప్రపంచంలోనే భారీగా చమురు నిల్వలున్న దేశాల్లో ఇదొకటి. సుమారు 30,300 కోట్ల



బ్యారెళ్ల చమురు నిల్వలున్నాయని అంచనా. సౌదీ అరేబియా చమురు నిల్వల కన్నా అధికం. వెనెజువెలా చమురు వనరులు అమెరికా చేతికి వస్తే పశ్చిమాసియా దేశాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది.

చమురు విక్రయాలతో వస్తోన్న ఆదాయంతోనే తీవ్ర ఆంక్షలను సైతం వెనెజువెలా ఈ మాత్రంగానైనా తట్టుకోగలుగుతోంది. పైగా అమెరికా ఆధిపత్యాన్ని వెనెజువెలా పాలకులు తరచూ ప్రశ్నిస్తున్నారు. అమెరికా సైనిక దుస్సాహసానికి పాల్పడితే సమర్థంగా తిప్పికొట్టగలమని మదురో ఇటీవల ప్రకటించడంతో పాటు గత ఏడాది నవంబరు 12న దేశవ్యాప్తంగా సైనిక విన్యాసాలూ నిర్వహించారు.

భారత్‌కు ముడి చమురు ఎగుమతులు

2013లో భారత దేశ ముడి చమురు దిగుమతుల్లో 10.3శాతం వాటా వెనెజువెలా నుంచే ఉండేది. 2019లో ఇది 5.6శాతానికి, 2020లో 3.6శాతానికి తగ్గింది. అయితే, 2024 నుంచి మళ్లీ పెరుగుతోంది. భారత్‌కు ముడిచమురు ఎగుమతి చేసే దేశాల్లో వెనెజువెలా ప్రస్తుతం పదో స్థానంలో ఉంది. – నేషనల్ డెస్క్

బస్సు డ్రైవర్ నుంచి దేశాధ్యక్షుడి వరకు..!



• మదురో ప్రస్థానం ముగిసినట్లేనా?

అమెరికా నిర్బంధించిన నికొలస్ మదురో.. దాదాపు పన్నెండేళ్లుగా వెనెజువెలా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన ప్రముఖ వామపక్ష నేత, మాజీ అధ్యక్షుడు హ్యూగో చావెజ్‌కు అత్యంత సన్నిహితుడు. చావెజ్ మరణం తర్వాత అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. సామాన్య కార్మిక కుటుంబంలో జన్మించిన మదురో.. 90వ దశకంలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. అదే సమయంలో తీవ్ర విమర్శలూ ఎదుర్కొన్నారు.

సాధారణ కుటుంబం నుంచి..

వెనెజువెలా రాజధాని కారకాస్‌లో 1962లో మదురో జన్మించారు. తండ్రి ఓ కార్మిక నాయకుడు. 1990ల్లో మదురో బస్ డ్రైవరుగా పనిచేశారు. అదే సమయంలో వామపక్ష రాజకీయ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. తదనంతర కాలంలో హ్యూగో చావెజ్‌కు అత్యంత సన్నిహితుడయ్యారు. 1999లో చావెజ్ అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తర్వాత మదురో దశ మారింది. ఆయనకు కీలక పదవులు లభించాయి. జాతీయ అసెంబ్లీ అధ్యక్షుడిగా, విదేశాంగమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

చావెజ్ మరణంతో..

క్యాన్సర్‌తో 2013లో చావెజ్ మరణించడంతో దేశ తాత్కాలిక అధ్యక్షుడిగా మదురో బాధ్యతలు చేపట్టారు. అదే ఏడాది జరిగిన ప్రత్యేక అధ్యక్ష ఎన్నికల్లో అతి తక్కువ మెజారిటీతో విజయం సాధించి.. పూర్తిస్థాయిలో అధ్యక్ష పగ్గాలు స్వీకరించారు. ఆ తర్వాత మరో రెండు ఎన్నికల్లో విజయం సాధించారు. కానీ ఆ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని విపక్షాలే కాదు.. చాలా దేశాలు కూడా ఆక్షేపించాయి.

తీవ్రమైన అణచివేత..

మదురో పాలనలో వెనెజువెలా అనేక సంక్షోభాలను ఎదుర్కొంది. ముఖ్యంగా ఆ దేశ ఆర్థిక వ్యవస్థ చితికిపోయింది. ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటింది. తీవ్ర ఆహార కొరత ఏర్పడింది. 2014, 2017లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా భారీ నిరసనలు జరిగాయి. ప్రజలు వీధుల్లోకి వచ్చారు. వాటిని మదురో తీవ్రంగా అణచివేశారు. వేల మంది పౌరులను నిర్బంధించారు. 2025 జనవరిలో మదురో మూడోసారి దేశాధ్యక్ష పగ్గాలను చేపట్టారు. ఆ ఎన్నికలపైనా తీవ్ర దుమారమే రేగింది. మదురోను అధ్యక్షుడిగా గుర్తించడానికి అమెరికా తిరస్కరించింది. విపక్ష నేత ఎడ్మండో గొంజాలెజ్‌నే తాము గుర్తిస్తామని పేర్కొంది.

మదురో వర్సెస్ ట్రంప్

ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష పగ్గాలను చేపట్టినప్పటి నుంచీ కథ మారింది. మదురోను ట్రంప్ లక్ష్యంగా చేసుకున్నారు. తమ దేశాన్ని అస్థిరపరచడానికి వెనెజువెలా అధ్యక్షుడు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపణలు గుప్పించారు. అమెరికాలోకి మాదకద్రవ్యాలు, అక్రమ వలసదారులు రావడానికి మదురోయే కారణమని నిందించారు. వెనెజువెలాలోని డ్రగ్స్ ముఠాలను ఉగ్రవాదులుగా ట్రంప్ ప్రకటించారు. పదవి నుంచి మదురో తప్పుకొంటే.. దేశం నుంచి సురక్షితంగా బయటకు వెళ్లే అవకాశం ఆయనకు కల్పిస్తామని ట్రంప్ ప్రతిపాదన కూడా చేశారు. మదురో దీన్ని తిరస్కరించారు. తమ దేశంలో చమురు నిల్వలపై అమెరికా కన్నేసిందంటూ ఆయన ఎదురు దాడిచేశారు. ఆ ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్యే మదురోను నిర్బంధించాలని ట్రంప్ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

– నేషనల్ డెస్క్



సత్య సాయిబాబా భక్తుడు

మదురో.. పుట్టపర్తి సత్య సాయిబాబా భక్తుడు. ఆయన కార్యాలయంలో బాబా భారీ చిత్రపటం ఉంటుంది. 2005లో విదేశాంగ మంత్రి హోదాలో భారత్ పర్యటనకు వచ్చిన ఆయన పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. సాయిబాబాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

సద్దాం, నోరీగాలకు పట్టిన గతే పట్టనుందా?

వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురో ఆయన భార్య సిలియా ఫ్లోర్‌ను అమెరికా నిర్బంధించిన నేపథ్యంలో తదుపరి ఏం జరగబోతోందన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. మదురో నిర్బంధం 1989లో పనామాపై అమెరికా జరిపిన దురాక్రమణను గుర్తుకు తెస్తోంది. అప్పట్లో తమ దేశ పౌరులకు రక్షణ కల్పించే సాకుతో అమెరికా పనామాపై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడు మాన్యువెల్ నోరీగాను నిర్బంధించింది.


నోరీగా

నోరీగా అప్రజాస్వామిక విధానాలు అవలంబిస్తున్నారని, అవినీతికి పాల్పడుతూ మాదక ద్రవ్యాల వ్యాపారానికి ఊతమందిస్తున్నారని నాటి అమెరికా ప్రభుత్వం ఆరోపించింది. నోరీగా సుదీర్ఘకాలం అమెరికా, ఫ్రాన్స్, పనామా జైళ్లలో మగ్గారు. 2017లో 83 ఏళ్ల వయసులో బ్రెయిన్ ట్యూమర్ కారణంగా మరణించారు. అలాగే ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుసేన్‌ను కూడా అమెరికన్ బలగాలు 2003 డిసెంబరు 13న నిర్బంధించాయి. ఇరాక్ వద్ద భారీ విధ్వంసానికి దారితీయగల ఆయుధాలు ఉన్నాయన్న సాకుతో అమెరికా ఆ దేశంపై దాడి చేసి సద్దాం ప్రభుత్వాన్ని కూల్చి వేసింది. తన సొంత నేల అయిన తిక్రిత్‌లో ఒక సొరంగంలో దాగి ఉండగా అమెరికన్ సేనలు ఆయనను పట్టుకున్నాయి. అమెరికా పేర్కొన్న ఆయుధాలు ఇరాక్‌లో ఏనాడూ లభించలేదు. మానవాళికి వ్యతిరేకంగా నేరాలు చేశారంటూ సద్దాంపై అమెరికా అభియోగం మోపింది. దీనిపై విచారణ అనంతరం 2006 డిసెంబరు 30న సద్దాం హుసేన్‌ను ఉరితీశారు.

ఆ దేశానికి వెళ్లొద్దు : కేంద్రం

దిల్లీ: అత్యవసరమైతే తప్ప వెనెజువెలాకు వెళ్లొద్దని భారతీయులకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ హెచ్చరిక జారీచేసింది. వెనెజువెలా అధ్యక్షుడు మదురోను అమెరికా నిర్బంధించిన నేపథ్యంలో శనివారం రాత్రి ఈ అడ్వైజరీ జారీ చేసింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని పేర్కొంది. "వెనెజువెలాలో ఉన్న భారతీయులు చాలా జాగ్రత్తగా ఉండాలి. ప్రయాణాలను నియంత్రించుకోవాలి. కారకాస్‌లోని భారత రాయబార కార్యాలయంతో కాంటాక్ట్‌లో ఉండాలి" అని తెలిపింది.

రాజస్థాన్‌లోనూ ప్రభుత్వ పాఠశాలల్లో వార్తాపత్రికల పఠనం తప్పనిసరి

జైపుర్: విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంచడంతో పాటు పఠనాసక్తిని పెంపొందించేందుకు రాజస్థాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజూ వార్తాపత్రికలు చదవడాన్ని తప్పనిసరి చేసింది. విద్యార్థుల పదజాలం మెరుగుపరచడం, లోకజ్ఞానం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వారం క్రితమే ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ ఇటువంటి నిర్ణయాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ప్రతిరోజు ఉదయం పాఠశాల అసెంబ్లీలో కనీసం 10 నిమిషాల పాటు విద్యార్థులతో వార్తాపత్రికలు చదివించాలని ప్రభుత్వం డిసెంబరు 31న ఉత్తర్వులు జారీ చేసింది. తరగతుల వారీగా విద్యార్థులను విభజించి సంపాదకీయం, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, క్రీడల గురించి చదివి వినిపించాలని పేర్కొంది. పత్రికల చందా ఖర్చులను రాజస్థాన్ పాఠశాల విద్యామండలి భరించనుంది.



పిల్లల కన్నా ఫోన్ ముఖ్యమా?

తల్లిదండ్రుల దృష్టి తమ మీదే ఉండాలని పిల్లలు కోరుకుంటారు. వారి కళ్లలోకి చూస్తూ, వారి ముఖ కవళికలను చూడటానికి తపిస్తుంటారు. అమ్మానాన్నలు లాలనగా మాట్లాడే మాటలు వారి ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే పిల్లలు తమ పక్కన ఉన్నప్పుడు కూడా తల్లిదండ్రులు ఫోన్ చూస్తూ పరధ్యానంతో ఉంటే వారిపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇప్పటికైనా ఈ విషయంలో జాగ్రత్తపడండి.

– అమీ, పేరెంటింగ్ కోచ్

వెనెజువెలాను మేమే పరిపాలిస్తాం

• ట్రంప్ స్పష్టీకరణ

వాషింగ్టన్: సురక్షితంగా అధికారాల బదిలీ జరిగేదాకా వెనెజువెలాను తామే నడిపిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇప్పటికే అక్కడ అమెరికా ప్రాతినిధ్యం ఉందని తెలిపారు. 'దేశం సురక్షితమని భావించే వరకూ, సరైన, న్యాయమైన అధికారాల బదిలీ జరిగే వరకూ మా పాలనే ఉంటుంది. అమెరికా సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేవారికి, అమెరికా ప్రజల జీవితాలను ప్రమాదంలో పడేసే వారికి ఇదో హెచ్చరిక. అత్యంత విజయవంతమైన ఆపరేషన్‌ను నిర్వహించాం' అని ట్రంప్ పేర్కొన్నారు. అవసరమైతే వెనెజువెలాపై మరింత పెద్ద దాడి చేస్తామని తెలిపారు. ఫ్లోరిడాలోని తన మార్-ఎ-లాగో రిసార్టులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. క్రిస్మస్ సెలవుల కోసం ఆయన అక్కడికి వెళ్లారు.

■ వెనెజువెలాలో చమురు వ్యాపారం అస్తవ్యస్తంగా ఉందని, అమెరికాలోని పెద్ద కంపెనీలు అక్కడికి వెళ్లి మౌలిక వసతులను కల్పించి దేశం కోసం ఆదాయాన్ని సంపాదిస్తాయని ట్రంప్ వివరించారు.

■ ఈ దాడులను గతంలో ఇరాన్‌పై చేసిన దాడులతో ట్రంప్ పోల్చారు. శనివారం అమెరికా సాధించిన విజయాన్ని ప్రపంచంలోని ఏ దేశమూ సాధించలేదని స్పష్టం చేశారు.


ఫ్లోరిడాలో మీడియాతో మాట్లాడుతున్న ట్రంప్

■ వెనెజువెలా సైన్యాన్నంతా నిర్వీర్యం చేశామని ట్రంప్ తెలిపారు. లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకునేందుకు దాడుల సమయంలో కారకాస్‌లో విద్యుత్తును నిలిపేశామని వెల్లడించారు.

■ మదురోకు మద్దతిచ్చే నేతలను ట్రంప్ హెచ్చరించారు. నియంత, ఉగ్రవాది అయిన మదురో వెళ్లిపోవడంతో వెనెజువెలా ప్రజలకు స్వేచ్ఛ లభించిందని తెలిపారు. ఆ దేశ ప్రజలను సంపన్నులుగా మారుస్తామని వివరించారు. స్వతంత్రంగా బతికేలా చేస్తామని తెలిపారు.

యుద్ధ నౌకలో మదురో దంపతులు

న్యూయార్క్: వెనెజువెలా అధ్యక్షుడు మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోర్‌లను అమెరికా యుద్ధ నౌక ఐవో జిమాలో న్యూయార్క్‌కు తరలిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అక్కడే వారికి ప్రాసిక్యూట్ చేస్తామని వెల్లడించారు. అమెరికా చట్టాల ప్రకారం మదురో దంపతులను శిక్షిస్తామని తెలిపారు. నౌకలో మదురో ఉన్న చిత్రాలను ట్రంప్ విడుదల చేశారు. అందులో మదురో.. కళ్లకు గంతలు ధరించారు. హెడ్‌ఫోన్లు పెట్టుకున్నారు. చేతిలో మంచినీటి సీసా ఉంది. గ్రే ట్రాక్‌సూట్ ధరించి ఉన్నారు.

■ వెనెజువెలాపై దాడుల సమయంలో కొంతమంది అమెరికా సైనికులు గాయపడ్డారని, ఎవరూ మరణించలేదని ట్రంప్ తెలిపారు.

■ అమెరికా దాడి సమయంలో మదురో దంపతులు.. ఎఫ్‌టీ.టివునా సైనిక స్థావరంలోని ఇంట్లో ఉన్నట్లు వెనెజువెలా అధికార పార్టీ నేత నహూమ్ ఫెర్నాండెజ్ తెలిపారు. దానిపై అమెరికా బాంబులు వేసిందని వెల్లడించారు.

అమెరికాది దురాక్రమణే

• రష్యా స్పష్టీకరణ
• ఖండించిన చైనా, క్యూబా, ఇరాన్
• మధ్యవర్తిత్వానికి సిద్ధమన్న ఈయూ దేశాలు

వాషింగ్టన్: వెనెజువెలాపై అమెరికా దాడుల మీద మిశ్రమ స్పందన వ్యక్తమైంది. రష్యా, చైనా, క్యూబా, ఇరాన్ వంటి దేశాలు ఖండించగా.. అర్జెంటీనా మద్దతు తెలిపింది. మధ్యవర్తిత్వం వహిస్తామని స్పెయిన్ ముందుకొచ్చింది.

■ 'వెనెజువెలాపై అమెరికా వైమానిక దాడులు సైనిక దురాక్రమణ కిందకే వస్తాయి. విధ్వంస చర్యలకు తావులేకుండా.. విదేశీ సైనిక జోక్యం లేని విధంగా వెనెజువెలా తన సొంత భవితను నిర్ణయించుకునే హక్కుండాలి. పరిస్థితి మరింత దిగజారకుండా సంప్రదింపుల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి. వెనెజువెలా ప్రజలకు, ప్రభుత్వానికి మా మద్దతు ఉంటుంది. ఈ విషయమై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండు చేస్తున్నాం' అని రష్యా విదేశాంగశాఖ స్పష్టం చేసింది.

■ అంతర్జాతీయ చట్టాలను అమెరికా ఉల్లంఘించిందని చైనా స్పష్టం చేసింది. ఆ దేశం జరిపిన వైమానిక దాడులను ఖండించింది. ఈ ఘటనతో దిగ్భ్రాంతి చెందామని చైనా విదేశాంగశాఖ వ్యాఖ్యానించింది. వెనెజువెలాతో తమకు వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని స్పష్టం చేసింది. గత రెండు దశాబ్దాలుగా వెనెజువెలాకు అతి పెద్ద చమురు కొనుగోలుదారుగా చైనా ఉంది.

■ వెనెజువెలాపై దాడులమీద అంతర్జాతీయ సమాజం స్పందించాలని అమెరికా వ్యతిరేకి, వెనెజువెలాకు చిరకాల మిత్రుడిగా భావిస్తున్న క్యూబా డిమాండు చేసింది. ఇది నేరపూరిత దాడి అని ఆ దేశాధ్యక్షుడు మిగెల్ డియాజ్-కానెల్ బెర్ముడెజ్ స్పష్టం చేశారు. తమ ప్రాంతంలో శాంతిని అమెరికా దారుణంగా భగ్నం చేసిందని ఆరోపించారు.


ప్యూర్టో రికోలోని సీబాలో మోహరించిన అమెరికా యుద్ధ విమానాలు

■ అమెరికా దాడులను అర్జెంటీనా ప్రశంసించింది. 'లాంగ్ లివ్ ఫ్రీడం' అని ఆ దేశాధ్యక్షుడు జేవియర్ మిలే వ్యాఖ్యానించారు.

■ వెనెజువెలాపై దాడులమీద స్పందించేందుకు ఆ దేశ ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడో అధికార ప్రతినిధి నిరాకరించారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో..


ఎన్నికల శిక్షణకు రాలేదని మృతులకు నోటీసులు!

పురపాలక ఎన్నికల విధుల్లో పాల్గొనాల్సిన సిబ్బందికి నిర్వహించిన శిక్షణకు హాజరుకానందుకు 1,200 మంది ఉపాధ్యాయులకు 'ఛత్రపతి శంభాజీనగర్ నగరపాలక సంస్థ' కమిషనర్ నోటీసులు జారీ చేశారు. మరణించిన ఇద్దరు ఉపాధ్యాయులు కూడా ఈ జాబితాలో ఉండటం విశేషం. వీరిలో రాజేశ్ బస్వే 13 నెలల క్రితం, సంభాజీ కార్డిలే మూడు నెలల క్రితం చనిపోయారు. ఆ విషయం తెలియక ఈ ఇద్దరికి కూడా ఎన్నికల విధులు కేటాయించారు. నోటీసులు అందుకున్న మృతుల కుటుంబాలు ఆశ్చర్యపోయాయి. దేన్నికైనా మంచిదని మరణ ధ్రువీకరణ పత్రాలను సంబంధిత అధికారులకు సమర్పించాయి. సాంకేతిక లోపం కారణంగా పొరపాటు జరిగిందని అధికారులు తెలిపారు.

ఈటీవీ భారత్

బుద్ధుడు అందరివాడు: మోదీ

దిల్లీ: బుద్ధ భగవానుడి వివేకం, ఆయన చూపిన మార్గం యావత్ ప్రపంచానికి చెందుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 1898లో భారత్, నేపాల్ సరిహద్దులోని పిపరహ్వా వద్ద బయటపడిన బుద్ధ అవశేషాల అంతర్జాతీయ ప్రదర్శనను శనివారం ఆయన ప్రారంభించారు. "ద లైట్ అండ్ ద లోటస్: ద రెలిక్స్ ఆఫ్ ద అవేకన్డ్ వన్" అనే శీర్షికతో దక్షిణ దిల్లీలోని కిలా రాయ్ పిథౌరాలో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు ప్రజలందరి సమైక్యతా సాధకుడన్నారు. "భారత దేశానికి సంబంధించినంత వరకూ బుద్ధ భగవానుడి అవశేషాలు కేవలం కళాఖండాలు మాత్రమే కావు.. అవి మన ఘనమైన వారసత్వ సంపద, నాగరికతలో భాగం" అని ప్రధాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బౌద్ధ పండితులు, వివిధ దేశాల దౌత్యవేత్తలు, ప్రముఖులు పాల్గొన్నారు. దాదాపు 125 ఏళ్ల అనంతరం ఈ పవిత్ర అవశేషాలు భారత్‌కు తిరిగి వచ్చాయని ప్రధానమంత్రి అన్నారు. ఈ అవశేషాలు బౌద్ధ జనాభా అధికంగా ఉన్న వియత్నాం, థాయ్‌లాండ్ తదితర దేశాల్లో ప్రదర్శితమయ్యాయని తెలిపారు. భారతదేశం కేవలం బౌద్ధ అవశేషాల సంరక్షకురాలే కాదు, బౌద్ధ సంస్కృతిని సజీవంగా ముందుకు తీసుకువెళ్లే బాధ్యతనూ నిర్వర్తిస్తోందని చెప్పారు. బుద్ధుడు తన ప్రవచనాలను వినిపించడం కోసం ఉపయోగించిన పాలీ భాషకు తమ ప్రభుత్వం శాస్త్రీయ భాషగా ప్రత్యేకస్థాయి కల్పించిందన్నారు.


ప్రదర్శనను తిలకిస్తున్న ప్రధాని మోదీ


675 కిలోల 'ఓపియం' పొట్టు స్వాహా చేసిన మూషికాలు!



ఝార్ఖండ్ రాజధాని నగరమైన రాంచీకి సమీపంలోని నామ్‌కుమ్ పోలీసుస్టేషను పరిధిలో ఓ వింత సంఘటన జరిగింది. సాక్ష్యాలను భద్రపరచడంలో పోలీసుల నిర్లక్ష్యానికి తోడు ప్రాసిక్యూషను వాదనలో లొసుగుల కారణంగా.. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను నిర్దోషులుగా కోర్టు విడుదల చేయాల్సి వచ్చింది. సాక్షుల వాంగ్మూలాలతోపాటు చూపిన ఆధారాల్లోనూ వైరుధ్యాలు ఉన్నట్లు జడ్జి పేర్కొన్నారు. మాదకద్రవ్యాల తయారీలో వాడే డోడా పొదరు (ఓపియం/అఫీమ్)తో 2019 మే నెలలో నిందితులు పట్టుబడ్డారు. 45 సంచుల్లోని 675 కిలోల డోడా పొదరును పోలీసులు ఠాణాలో ఆరుబయట నిల్వ చేయగా.. ఎలుకలు దాన్ని స్వాహా చేశాయని వెలుగులోకి వచ్చింది.

రామాయణ చిత్రాలతో 20 దేశాల పోస్టల్ స్టాంపులు!

మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్‌లో జరుగుతున్న ప్రపంచ రామాయణ సదస్సులో రామాయణ ఇతివృత్తాలతో 20 దేశాలు విడుదల చేసిన స్టాంపుల ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఈ స్టాంపుల్లో సీతారాములతోపాటు రావణుడు, మేఘనాథుడు, హనుమంతుడు వంటి పాత్రలు కూడా ఉన్నాయి. జబల్‌పుర్‌కు చెందిన సతీశ్‌కుమార్ శ్రీవాస్తవ ఉద్యోగ విరమణ తర్వాత ఫిలాటెలిస్టుగా (స్టాంపుల సేకర్తగా) మారి రామాయణ సంబంధిత పోస్టల్ స్టాంపుల సేకరణలో నిమగ్నమయ్యారు. భారత్‌తో పాటు నేపాల్, భూటాన్, శ్రీలంక, థాయ్‌లాండ్, ఇండోనేసియా, మారిషస్ వంటి



దేశాలకు రామాయణంతో బలమైన సాంస్కృతిక సంబంధాలున్న విషయం తెలిసిందే. ఈ దేశాలన్నీ రామాయణ సన్నివేశాలతో వివిధ సందర్భాల్లో విడుదల చేసిన స్టాంపులను సతీశ్‌కుమార్ సేకరించి ప్రదర్శిస్తున్నారు. అయోధ్యలోని రామ్‌లల్లాపై లావోస్ విడుదల చేసిన పోస్టల్ స్టాంపు సైతం ఇందులో ఉంది. ఇతర దేశాల పోస్టల్ స్టాంపులు ఆర్డర్ చేసినప్పుడు ఒక్కరెండు కాకుండా.. మొత్తం సిరీస్ కొనాల్సి ఉంటుంది. రామాయణంపై ఉన్న ఆసక్తితో ఖర్చుకు వెనుకాడకుండా సతీశ్ వీటిని సేకరిస్తున్నారు.

ఈటీవీ భారత్

EENADU Vol: 52, Issue: 145 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
ఆదివారం జనవరి 4, 2026





EENADU Classifieds

BUSINESS SERVICES

COURIERS

USA,UK, కెనడా, ఆస్ట్రేలియా & ఇతర దేశాలకు పచ్చళ్ళు, స్వీట్స్, బట్టలు, డాక్యుమెంట్స్, మెడిసిన్స్, మొ|| కొరియర్ చేయబడును. SV Express - ICL కొరియర్. గురునానక్ నగర్, VJA. 94410 27788

BUSINESS OFFER

TVR SPICES వారి సాంబార్ కారం హోల్‌సేల్‌గా సప్లై చేయబడును. కృష్ణ ఎంటర్‌ప్రైజెస్ గుంటూరు. 86881 26202.

EV రీఛార్జింగ్ స్టేషన్లకు ఇన్వెస్టర్స్ నెట్‌వర్క్ లీడర్స్ 1 లక్ష నుండి 5 కోట్లు పెట్టుబడిదారులు కావలెను. కాల్ చేయండి ✆ 63743 92489.

FOR SALE

తెనాలి ఆటోనగర్ సమీపంలో మా వద్ద ఐరన్ గడర్‌లు ఛాయిసీస్‌లు అమ్మకానికి కలవు. Ph: 93466 75992.

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001: 2015 certified Co. House hold goods shifting any time any where. ✆ 97043 64389.

BUILDING CONSTRUCTION

RK కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ కాంట్రాక్టర్ మీకు నచ్చే మీరు మెచ్చే విధంగా 100% వాస్తు, లేటెస్ట్ కబోర్డ్స్, క్వాలిటీతో బిల్డింగ్ నిర్మించబడును. ✆ 97043 63336.

TDR
AP & TELANGANA BONDS BUY & SALE
KAMESH
92 92 15 15 15

BPS & LRS ద్వారా అనధికార బిల్డింగ్స్ & లేఅవుట్స్ క్రమబద్ధీకరించేందుకు సంప్రదించండి ANCISON ఇన్‌ఫ్రాటెక్ AP ఆర్కిటెక్ట్స్ & ఇంజినీర్స్ ✆ 94917 55456.

WATER PROOFING

Tarun Slab Leakage Works ★ 25 Yrs Exp. ★ 5Yr Waranty ★ Bathroom Leakage Grouting Epoxy Works ✆94940 02285, 99516 07504

EDUCATION

HOME TUITIONS

ప్రత్యూష (ఆన్‌లైన్ & హోమ్) ట్యూషన్స్ LKG to PG All Objective సబ్జెక్ట్స్. NEET, IIT ట్యూటర్స్‌కు ✆ 92900 05677, 74165 35749.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఉభయగోదావరి జిల్లాల్లో, వైజాగ్, విజయవాడ అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి బ్యాంక్, ✆ 93969 99669

మీ ఇళ్ళు, బిల్డింగ్స్, కాంప్లెక్స్‌ల మీద తనఖా పద్ధతిలో రూ.1 వడ్డీకి ఫైనాన్స్ ఇప్పించబడును. వేరే ఏ బ్యాంకులో ఉన్ననూ విడిపించబడును. ✆ 83099 11995.

PVT/GOVT ఎంప్లాయిస్ (20K. M.Sal) పర్సనల్, బిజినెస్, హౌసింగ్‌లోన్ (2 టు 50లక్షలు), టేకోవర్, టాప్‌అప్, నో ITR నో ప్లాన్, లోసిబిల్ కూడా. ✆ 70957 91736

HEALTH & CARE

హోం విజిట్స్ ఆఫర్: బరువు, పొట్ట, లావు తగ్గించుకోండి. కీళ్ల నొప్పులు, డయాబెటిస్ రివర్సల్. Dr. R.K.Sharma. వెంటనే బుక్ చేసుకోండి. ✆ 79935 22774.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

HOME NEEDS

MOSQUITO SCREENS

మెష్‌డోర్స్, కర్టెన్ రాడ్స్, కర్టెన్స్, కప్‌బోర్డ్స్, UPVC విండోస్ బ్లైండ్స్, వాల్‌పేపర్, Anti Bird మెష్. ఇన్విజిబుల్ గ్రిల్స్, దుర్గాప్రసాద్. 98495 69111.

PEST CONTROL

Tarun Pest ★25Yrs Exp. 5Yrs Warranty ★ Smell Less ★ Bayers Chemicals (Pest & Other Insects Control). ✆94940 02285, 99516 07504

REAL ESTATE

గుంటూరుసిటీ, గోరంట్ల, రెడ్డిపాలెం,లాం, అగతవరప్పాడు, వెనిగండ్ల, నంబూరు, పెదకాకాని, కొప్పురావూరు, కంతేరు, కాజాలలో ప్లాట్లు అమ్మాలన్నా/ కొనాలన్నా సంప్ర॥ 73823 96677.

గుంటూరుసిటీలో, గోరంట్లలాం, JKCరోడ్డు, ఇన్నర్‌రింగ్ వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజా, మంగళగిరి, తాడికొండలోని ప్లాట్లు అమ్మదలచినవారు సంప్ర: 93999 55545.

DEVELOPMENT/ OUT RATE
480 SQYDS SITE,
18 Feet Road
3rd Bit on Bunder Road
Kanur Jn, VIJAYAWADA
9246676131

హరివిల్లు వారి CRDA అప్రూవ్డ్ ప్లాట్స్ ఇండిపెండెంట్ ఇళ్ళు పెనమలూరు, గండిగుంటలలో ప్రారంభ ధర: గజం 9999/-. ✆ 85008 30038.

అమరావతి రాజధానిలో గల ల్యాండ్ పూలింగ్ ప్లాట్లు, పొలాలు విజయవాడ- గుంటూరు మధ్య అన్ని వెంచర్లలో ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన. Ph: 77949 12324.

FLAT FOR SALE

KANURU

3BHK - 1470SFT North, 2BHK-1240SFT East, ready to move at Srinivasa Residency, Near sitapuram colony, aravapalli purnaiah veedhi, opp: priya foods, poranki, Vijayawada. Ph :77028 76445

కానూరు బల్లెంవారి వీధిలో Occupancyకి సిద్ధముగా 1700 S.ft న్యూ 3 BHK లగ్జరీ ఫ్లాట్స్ E/W కబోర్డ్స్ 100% లోన్‌తో ✆ 76719 22845.

కానూరు, మురళీనగర్, బల్లెంవారివీధిలో అక్షయమెడోస్ నందు న్యూ 3BHK (1400 S.Ft.,) ఫ్లాట్స్ అన్ని సౌ॥తో 53లక్షలు. ✆ 8919570872/ 96428 47736

3BHK తూర్పు ఫేస్ డీలక్స్ ఫ్లాట్స్ అన్ని సౌకర్యములతో & బ్యాంక్ లోన్‌తో కలవు. గౌరి శంకర్ నగర్, కానూరు. ✆ 97017 98726, 89196 79256

TADIGADAPA

బందరురోడ్డు సిద్ధార్థ Eng.కాలేజి ఎదురు, తాడిగడప, పద్మజానగర్ కాలనీలో న్యూ 3BHK ఫ్లాట్ (1800S.Ft) అమ్మకానికి కలదు. (ఫ్లోర్‌కి 1ఫ్లాట్) ✆ 94400 31268

RAMAVARAPPADU

VJA ప్రసాదంపాడు 1st ఫ్లోర్‌లో 2 BHK ఫ్లాట్ (Rs. 22.50) 100% వాస్తు, ఫుల్ ఫాల్ సీలింగ్ ఉన్నరూములతో ఫుల్ కబోర్డ్స్. హైవేకి వాక్‌బుల్ ✆96422 44567

GENERAL

East Face 3BHK New Independent 2nd Floor Sale 2325 S.Ft at R.R Gardens. Near Gurunanak Colony, Patamata, VJA. ✆ 92472 55826

సింగ్‌నగర్ తోటవారి వీధి 9వ లైన్ శ్రీ లక్ష్మీ నరసింహ రెసిడెన్సీ నందు న్యూ 2BHK ఫ్లాట్స్ తక్కువ ధరకే అమ్మబడును. సంప్ర: 98662 01239.

గన్నవరం ప్రీమియం లగ్జరీ 2BHK ఇండిపెండెంట్ ఫ్లోర్స్ ఫ్లాట్స్ అమ్మకం. బుకింగ్ ఆఫర్స్, ఫుల్లీఫర్నిష్డ్. మెటీరియల్ కాంట్రాక్ట్‌తో కట్టించిఇస్తాం 98666 69123

VJA కేదారేశ్వరపేట 5వ లైను లోటస్‌ల్యాండ్ మార్క్ 2వ గేటు దగ్గర E/F 1వ ఫ్లోరు మెయిన్‌రోడ్ ఫేస్‌తో న్యూ 2BHK1240 చ॥అ॥ అమ్మకము. ✆93948 70425.

కాటూరు నుండి గుడివాడ రోడ్డు ముదునూరు గ్రామంలో 2ఎకరాల వ్యవసాయ భూమి డొంక రోడ్డు ఫేస్ అమ్మకానికి కలదు. సంప్ర: ✆ 99517 77775.

పోరంకి సాయినగర్‌లో 2BHK ఫ్లాట్ 35లక్షలకే. కార్ పార్కింగ్, లోన్ సౌకర్యంతో కలదు. ✆ 94402 58716

Moghalrajapuram, Madhu Gardens, Flat. A2 (2 BHK), Old Bhanu Apartments, A-Block, Vijayawada. Ph: 7893977344.

3 BHK Flat Loyola Gardens near Loyola College Main Gate, Full Cupboards, Lift, Generator, Car Parking ₹88 Lakhs. Ph: 81848 38980

FLATS for SALE
4 BHK Premium FLATS - 2850 Sft.
(2 Cars Parking)
beside Bhashyam School, KANURU
✆ 9989855219 8977162616

మచిలీపట్నం గుండుపాలెం (రుద్రవరం పంటకాలువ డొంకరోడ్డు కృష్ణ యూనివర్సిటీ దగ్గర) 12.5 ఎకరాల పొలం అమ్మకం ✆ +9199499 88829 (Whatsap)

మధురానగర్ దగ్గర GVRనగర్‌లో 180 చ॥గ॥ల్లో ఫ్లోర్‌కి ఒక 3 BHK న్యూ డీలక్స్ ఫ్లాట్ చొప్పున నిర్మించిన ఫ్లాట్స్ అన్ని సౌకర్యములతో అమ్మకం. ✆ 96662 11349.

3&4 BHK Deluxe Floorwise FLATS for SALE
Near Kennedy School, Kanuru.
G+2 Independent House for Sale in 154 Sq.yds
(Lift & 2 Car Parking) @ Tadigadapa.
✆7075017255

పటమట NSM స్కూల్‌కి దగ్గరలో 2BHKలగ్జరీ ఫ్లాట్స్ ఈస్ట్ నార్త్ ఫేసింగ్‌లతో అమ్మకానికి కలవు ✆ 93810 79649, 76808 56103.

3BHK సూపర్‌డీలక్స్ ఫ్లాట్ E/F 3 బెడ్‌రూమ్స్ 3 బాత్‌రూమ్స్ 3 బాల్కనీస్ 60.5 గజాలు UDA షేర్, 2030 SFT, 75SFT పార్కింగ్ 4A/Cs 9 ఫ్యాన్స్ 20 సీలింగ్ లైట్స్, 25 Lt గీజర్, చిమ్నీ అన్నిరూమ్స్‌లో కాబినెట్స్ బాల్కనీలో స్లయిడ్ గ్లాస్ డోర్స్ ఆటోనగర్ బస్టాప్‌కు 100 మీ॥లో వశిష్ట ఎన్‌క్లేవ్ నందు అమ్మకం ✆ 98663 09134

ఫుల్లీఫర్నిష్డ్ 3 BHK
VJA కనకదుర్గానగర్, మెయిన్ రోడ్డు F.No:109, 509 నందు
2110 Sft, UDS 72 చ॥గ॥లు
2 కార్ల పార్కింగ్‌తో తూర్పు ఫేస్
3 BHK ఫ్లాట్స్-2 అమ్మకం
✆63051 43789 81253 97979

విజయవాడ, గొల్లపూడి, జైన్‌కాలనీలో వెంకటసాయిదుర్గా రెసిడెన్సీలో పడమర ఫేసింగ్‌గల ఫ్లింత్ ఏరియా 900 చ॥అ॥లు, కామన్‌ఏరియా 191 చ॥అ॥లు, కార్‌పార్కింగ్ 80 చ॥అ॥లు గల ఫ్లాట్. FF5 (2BHK) అమ్మకం. 94451 41689

సీతారాంపురంలో ఫ్లోర్‌కి ఒకటి చొప్పున నూతనంగా నిర్మించిన ఉత్తరం ఫేస్ ఇండివిడ్యువల్ ఫ్లాట్స్ అమ్మకం. బ్యాంక్ లోన్ @ 7% ✆ 98483 48759

అయోధ్యానగర్, లోటస్‌ల్యాండ్‌మార్క్ సెక్టార్- 1లో 166 చ॥గ॥లలో ఇల్లు మరియు న్యూ 4BHK ఫ్లాట్ మరియు సత్యనారాయణపురం శ్రీనగర్ కాలనీలో న్యూ 3BHK ఫ్లాట్ అమ్మబడును ★ సత్యనారాయణపురం చుట్టు ప్రక్కల 2/3 BHK ఫ్లాట్స్ కొత్తవి, పాతవి అమ్మబడును ✆ 94901 98654.

పోరంకి టెలిఫోన్ ఎక్స్చేంజ్ రోడ్డులో కబోర్డ్ వర్క్, కార్ పార్కింగ్, CRDA అపూవల్‌తో 2 BHK ఫ్లాట్ అమ్మకమునకు కలదు. ✆ 79939 45588.

VJA RTC కాలనీ, 2వ లైన్ శ్రీజయదుర్గా నందు 3rd ఫ్లోరు 1432SFt గల 3BHK లిఫ్ట్, కార్ పార్కింగ్ సౌ.లతో అమ్మకం. ✆ 94404 88334

HOUSE FOR SALE

TADIGADAPA

150 చ॥గ॥ల G+1 ఇండిపెండెంట్ హౌస్ (E/F) తాడిగడప మనోజ్‌నగర్‌లో అమ్మకానికి కలదు. కబోర్డ్స్ & కార్ పార్కింగ్ సౌకర్యం. ✆ 98851 22909.

GENERAL

సింగ్‌నగర్,సైపులరోడ్, రామాలయం దగ్గర, 130 గజాల స్థలంలో ఈస్ట్‌ఫేస్ (అపార్ట్‌మెంట్ మోడల్) ఇండిపెండెంట్ హౌస్ 2BHKపైన 1BHK రేకుల ఇల్లుతో కలిపి అమ్మబడును. నో బ్రోకర్స్. ✆ 92909 56677

బిల్డింగ్ ఫర్ సేల్ విజయవాడ ప్రభుత్వ హస్పిటల్ ఎదురుగా మహానాడు రోడ్‌లో G స్క్వేర్ హోటల్ ఎదురుగా 92 గ॥ 3 ఫ్లోర్స్ ఉత్తరం ఫేసింగ్ బిల్డింగ్ అమ్మబడును. కమర్షియల్ & రెసిడెన్షియల్ Contact: 94417 48191

కానూరు PVP Engg కాలేజ్ ఎదురు తూర్పుఫేస్ 260చ॥గ॥ల్లో 4 స్టేర్స్ బిల్డింగ్ 80అ॥ రోడ్డుకి 2వ బిట్టు ఒక్కొక్క ఫ్లోరు 2400 Sftతో అమ్మకం.✆ 70132 37076, 92939 57777.

విజయవాడ కేదారేశ్వరపేట 5వ లైను సెంటర్‌నందు 280గ॥లలో ఉన్న 4 పోర్షన్ల బండి లక్ష్మయ్యగారి బిల్డింగ్ అమ్మకం✆ 94405 18956, 94408 20351

VJA- Bharathi Nagar Road No.10, Duplex Model House, East Facing, Servant Pent House for Sale. ✆ 98661 92045, 83418 35845.

Independent house (G+1) for sale, 77 sq.yards, North face, Near Railway station, Purnanadapet, vijayawada. Contact: 79819 42399

For Sale on Plot 426 Sq.yards with duplex house, F/N Dasapalla Hills, Visakhapatnam (No Middleman Please) Cont: 76748 38202.

బందరురోడ్డులో తుర్లపాటి కుటుంబరావు వీధిలో సెమీ కమర్షియల్ 209గ. స్థలంలో 3 ఫ్లోర్లు గల బిల్డింగ్ ఈస్ట్ ఫేసింగ్ అమ్మకానికి కలదు. నో బ్రోకర్స్. సంప్ర. ✆ 98481 93191

బిల్డింగ్ అమ్మకము
విజయవాడ, కరెన్సీనగర్‌లో (NH-16 కు 200మీ॥ల దూరంలో) 378 చ॥గ॥లు విస్తీర్ణం గల స్థలంలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్న ఒక్కొక్క ఫ్లోర్‌లో సుమారు 2,400చ॥అ॥లు విస్తీర్ణం గల 3BHK ఫ్లాట్స్, 5 ఫ్లోర్స్ & పెంట్ హౌస్ (E/F) బిల్డింగ్ మొత్తము అమ్మకమునకు కలదు.
94401 51179 94408 96594

201 చ.గ.లలో గల రేకుల ఇల్లు అమ్మబడును. ఆంధ్రప్రభ కాలనీ, విజయవాడ. NRIs, బ్యాంక్ లోన్‌కి వెళ్ళువారు సం.ప్ర. 89193 86329. No mediators.

VJA దేవినగర్‌లో 150 చ॥గ॥లలో 2 ఇండివిడ్యువల్ ఇళ్ళు అమ్మబడును. G+1 & G తూర్పుఫేస్, దక్షిణం రోడ్. ✆ 99124 92331.

గూడవల్లి శ్రీభ్రమర టౌన్‌షిప్‌లో 183 చ॥గ॥లలో వెస్ట్ ఫేస్ న్యూ ఇండిపెండెంట్ 2 BHK హౌస్ అమ్మకంనకు కలదు. రేటు 65 లక్షలు. ✆ 97031 63198

సూర్యారావుపేట, పీసపాటివారివీధి 225 చ॥గ॥లు E/F పాతడాబా ఇల్లు & అంబాపురం నవరంగ్ టీస్టాల్ వెనుక N/E రోడ్స్ కల 800 చ॥గ॥ ఖాళీస్థలం. ✆ 90596 38778.

విజయవాడ దేవీనగర్ 1వ రోడ్‌లో ఇండిపెండెంట్ 1BHK ఇల్లు ఉత్తర ముఖం అమ్మకానికి కలదు. సంప్రదించండి ✆ 98853 55538.

రాణీగారితోటలో నెలకు 18000/- అద్దె వచ్చు 2 అంతస్తుల 36 Sq.Yd. నార్త్ ఫేస్ బిల్డింగ్ అమ్మకానికి కలదు. 50 లక్షలు మాత్రమే. సంప్ర: ✆ 98495 02550/ 81255 64777

LAND FOR SALE

కృష్ణాజిల్లా పామర్రు మండలం పెదమద్దాలి గ్రామంలో యలమర్రు రోడ్డులో 3 ఎకరముల పొలము అమ్మబడును. ✆ 94406 55141.

Two acres Land abutting main road at Kodali is for sale. Contact: 80080 16379/ 89788 23464

గుడివాడ మండలం కొమరవోలు శివారు తటివర్రు గ్రామము నందు 20 ఎకరముల మాగాణి పొలము అమ్మకం. సంప్ర: 93462 81147, 83676 38755.

కొబ్బరితోట అమ్మకం
2.1 ఎకరాల ఫామ్ హౌస్
2 బోర్లు, చుట్టూ ఫెన్సింగ్
చందర్లపాడు మండలం
బొబ్బిళ్ళపాడు గ్రామ పరిధిలో N.T.R. జిల్లా.
Cell: 81219 17794 86887 23704

కృష్ణాజిల్లా పమిడిముక్కల (మం), కృష్ణాపురం (గ్రా)లో తారు రోడ్డు ఫేసింగ్‌తో 2.34 ఎకరాల మాగాణి పొలం అమ్మబడును. ✆ 80080 50435.

కృష్ణాజిల్లా ఉయ్యూరు ప్రక్కన, తాడంకి గ్రామం కపిలేశ్వరపురం రోడ్డుకి 2వ బిట్టు 95 సెంట్ల వ్యవసాయ భూమి అమ్మకం. ✆ 939210 7970, 83286 53001

కృష్ణాజిల్లా, యాకమూరులో గరికపర్రు డొంకవైపు పడమర ఫేస్‌తో ఎకరం పొలము అమ్మకమునకు కలదు. వివరాలకు సంప్రదించండి. ✆ 94401 73535.

మైలవరం, సజ్జాపాడు రోడ్డులోని అయ్యప్పనగర్‌లో 40 అ॥ల తారు రోడ్డు ఫేస్‌తో 12 షాపులకు సరిపడే 28 సెంట్ల స్థలం అమ్మకము. ✆ 94401 73535.

450 ఎకరాల్లో మెగా అవకడో పామ్‌ల్యాండ్‌లో 11 సెంట్లు, 6 లక్షలకే 11 సెంట్లు తీసుకొన్నవారికి 133 గజాలు ప్లాట్ ఫ్రీ. 5వ సం. నుండి సం.కి 2 లక్షల ఆదాయం. 91335 74455

గన్నవరం to ఆగిరిపల్లి రోడ్డులో గెస్ట్‌హౌస్‌లకు అనువైన 1 ఎ., 2 ఎ., 10 ఎ. వరకు మామిడితోటలు అమ్మకమునకు కలవు. ✆ 98496 01589.

పొలం అమ్మకం
నున్న గ్రామంలో అమెరికన్ హాస్పిటల్ అనాథ ఆశ్రమం గేట్ ఎదురురోడ్‌లో
2 యకరాల కొబ్బరి, మామిడితోట
2 రోడ్ల సౌకర్యం ఉన్నది అమ్మకమునకు కలదు.
9848111211

PLOT FOR SALE

TADIGADAPA

పోరంకి నిడమానూరు రోడ్డులో 1254,400 & 300 గజాలు, 53సెంట్లు పొలం నిడమానూరులో మరియు నారాయణపురంకాలనీలో 250 గజాలు. ✆ 98495 05854

CURRENCY NAGAR

విజయవాడ భారతీనగర్‌లో 150 చ॥గ॥ల స్థలం అమ్మకము. East 30 Feet రోడ్డు & North 40 Feet రోడ్డు ✆ 94903 53541.

విజయవాడ, భారతీనగర్‌లో నార్త్ & తూర్పు ఫేసింగ్‌తో 451 చ॥గ॥ల స్థలం అమ్మకం లేదా 150 చ॥గ॥లలో 3 విల్లాలు కట్టించి అమ్మబడును ✆ 93946 26067

RAMAVARAPPADU

Vja, Ramavarappadu ring E/F G+1+1 house in 215 Syd & 190 Syd plot for sale. Ph: 9880079199, 9740605740

TADEPALLI

హ్యాపీక్లబ్ వెనుక శాంతిహౌసింగ్ అమరావతి టౌన్ షిప్, రాజధాని చినకాకాని కాజ రామకృష్ణ హౌసింగ్ - మంగళగిరి చుట్టుప్రక్కల ప్లాట్లు అమ్మదలచినవారు ✆ 98485 87376.

GOLLAPUDI

గొల్లపూడి వెస్ట్‌బైపాస్ దాటి CA కన్వెన్షన్ ఫంక్షన్‌హాల్ ప్రక్కరోడ్డులో 209, 207 చ॥గ॥ లే అవుట్ ప్లాట్లు, గజం: 25000/- సంప్ర. ✆ 92907 63488.

GENERAL

Guntur to Vijayawada Highway. Rain Tree Building Opposite. 310 Sq.Yds. ✆ 70983 99999 Owner.

200 అ॥బందరురోడ్డుకి దగ్గర కంకిపాడు వద్ద తూర్పుఫేస్ 178చ॥గ॥లు, పడమర ఫేస్ 194 చ॥గ॥ల ప్లాట్లు అమ్మకం. లోన్ సౌకర్యం కలదు. ✆98668 14557

ఈడుపుగల్లు జనచైతన్య వెస్ట్‌ఫేస్ 196 చ॥గ॥ 25L పునాదిపాడు to కోలవెన్ను తారురోడ్డుఫేస్ 165 చ॥గ॥ 25L అమ్మకం. ✆ 73824 22777, 94942 87778

ఉయ్యూరు దగ్గర అప్రూవ్డ్ లేఅవుట్‌లో 224 గ॥లు మరియు కురుమద్దాలి మెయిన్ రోడ్ ఫేసింగ్‌తో 7 1/2 సెంట్లు అమ్మకమునకు కలవు. ✆ 99481 74488.

49 లక్షలకే ఇండిపెండెంట్ హౌస్ మరియు పోరంకి, ఆకునూరు, పామర్రు, కంచికచర్లలో తక్కువ ధరకే open ప్లాట్లు అమ్మకం. ✆ 99481 10645.

విజయవాడ ఇన్నర్‌రింగు రోడ్డులో ఫ్లైఓవర్ నుండి ముస్తాబాద వెళ్ళు దారిలో ఈస్ట్‌ఫేస్ 2516 చ॥గ॥లు స్థలము అమ్మకమునకు కలదు. Cont ✆ 76610 34433

విజయవాడ- నూజివీడు రోడ్డులో నున్న గ్రామంలో 1306 చదరపు గజముల స్థలము వెస్ట్ ఫేస్, అమ్మకమునకు కలదు. Contact: 76610 34433.

పోరంకి సాలిపేట రోడ్డులో 195 చ॥గ॥లు మరియు పోరంకి to నిడమానూరు రోడ్డులో నార్త్‌ఫేస్ 850 చ॥గ॥లు అమ్మకమునకు కలవు. ✆ 93476 00733.

VJA పటమట బందరురోడ్డుకి దగ్గరగా కోనేరువారివీధిలో నార్త్- ఈస్ట్ కార్నర్ 25x25 కొ॥తో 69 చ॥గ॥లు 48 లక్షలకే అమ్మకం. ✆ 94927 32208.

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని అగిరిపల్లి ఇళ్ళు పక్కనే గజం కేవలం 5500/- మాత్రమే. Cont: 7396779997.

తాడిగడప చైతన్యకాలేజ్ 100అ॥ రోడ్డుకి దగ్గరగా 200 & 630చ॥గ॥ లేఅవుట్ ప్లాట్లు మరియు పోరంకి సీతాపురం కాలనీ వెనుక 200 గజాల తూర్పుఫేస్ ప్లాటు అమ్మకం. ✆ 92907 63488

కంకిపాడు బైపాస్ శ్రీచైతన్య కాలేజ్ ఎదురు 300 గజాల ఉడా లేఅవుట్ ప్లాటు గజం 12,000/- & వణుకూరు ఊళ్ళో 200గ. ఉడా లేఅవుట్ ప్లాటు గజం: 9,000/-లకే ✆92907 63488

కంకిపాడు బందరురోడ్డుకి 6లైన్స్ హైవేకి దగ్గరలో ప్రో.100FT రోడ్డుని ఆనుకొని CRDA ప్లాట్ అమ్మకం 80% బ్యాంక్‌లోన్ గజం18K మాత్రమే 9490514626

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ ఆకునూరు మరియు పోరంకిలో (మున్సిపల్ లిమిట్స్) 32యు॥లలో CRDA గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ 4వ తారీకున గొప్ప లాంచింగ్ మరియు బుకింగ్స్ ప్రారంభం. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. ప్లాట్స్ కావలసిన వారు. సంప్ర : ✆ 93924 64555.

Plot for sale in sita ram nagar near Ramachandra nagar. north face 273 yards.. Contact: 98854 64849

600 to 700 గజాలు
కుంచనపల్లి Arena Drive inn దగ్గర
600 చ॥గ॥ నుండి 700 చ॥గ॥లు అమ్మకం
✆ 76763 04629

కుంచనపల్లి 40ft రోడ్‌ఫేసింగ్ హైవేకి 1.5 Kmదూరంలో 26 సెంట్లస్థలం & గుంటూరు IRRకు 1 Kmదూరంలో 40ft రోడ్‌ఫేసింగ్ 500 చ॥గ॥ స్థలం అమ్మకం. 9908188946

పోరంకి పెనమలూరు గోసాలలో 194, 200, 270, 300గ॥, గుణదలలో 480గ॥, చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద హైవేఫేస్ 7 ఎకరాలు అమ్మకం. ✆ 9440789749

విజయవాడ, బందరు రోడ్డు, పెనమలూరు CRDA LP No: 104/25, ప్లాట్లు, హౌసెస్, విల్లాలు ★ బ్యాంక్‌లోన్ ★ స్పాట్ రిజి. ✆9553129369, 9705433765

కానూరులో 80 అ॥ రోడ్డు దగ్గర N/E కార్నర్ మరియు ఉత్తర ఈశాన్యం వీధిపోటు ఉన్న 1225 గజముల స్థలం అమ్మకం. గజం: 35K. ✆ 94915 86009/ 88856 12999.

VJA రామవరప్పాడు LP No.62/2024, గేటెడ్ కమ్యూనిటీలో ప్లాట్లు, హౌసెస్, విల్లాలు ★ బ్యాంక్ లోన్ ★ స్పాట్ రిజి. ✆ 95531 29369, 97054 33765.

కాలేజి, హాస్పిటల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు అనువైన 10 సెంట్ల స్థలం కోడూరు మెయిన్ రోడ్ ప్రక్కన అమ్మకానికి కలదు. ✆ 986629 9687, 94904 43879

హరివిల్లు వారి అన్ని CRDA లేఅవుట్‌లో పెనమలూరు, కంకిపాడు, గండిగుంటలో, 240, 300, 400, చ॥గల మంచి ప్లాట్లు కంపెనీ డైరెక్ట్ సేల్‌కై ✆92464 73929

బందరురోడ్ నేషనల్ హైవే ఫేసింగ్ నార్త్ సైడ్ కంకిపాడు దగ్గరలో 450 చ॥గ॥ ప్లాట్ అమ్మకమునకు కలదు. సంప్రదించండి ✆ 98483 43355

గొల్లపూడి ఖలీల్‌భాయ్ రెస్టారెంట్ ఎదురు రోడ్డులో E/S ఫేస్ 42x53 కొ॥తో 247చ॥గ॥ల లేఅవుట్ ప్లాటు గజం: 35000/-లకే. (నో బ్రోకర్స్). ✆ 81429 75999

మచిలీపట్నం బస్టాండ్ దగ్గర, ఈడేపల్లి గానుగ కొట్టు సమీపంలోని బుక్కా వారి వీధిలో W/F గల 160 గజాల స్థలం అమ్మకం. ✆ 94944 72627.

బందరురోడ్డులో పోరంకి, ఆకునూరులలో శ్రీ భ్రమరవారి ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్స్, హౌస్‌లు & వినుకొండ బొల్లాపల్లిలో ఫామ్‌లాండ్స్ అమ్మకం. ✆ 97012 84449

కొండపల్లి ఖిల్లా రోడ్ ఏరియాలో 410 చ॥గ॥ స్థలం మరియు బ్యాంకు సెంటర్‌లో 286 చ॥గ॥ స్థలంలో RCC బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ✆ 98491 52902

విజయవాడ గూడవల్లిలో, Jasper టాటా మోటార్స్ ఎదురుగా, చైతన్య కాలేజ్ వెనకాల, NH హైవే నుండి 200 మీటర్ల దూరంలో 202 గ.జ.తూర్పు ఫేసింగ్ లేఅవుట్ స్థలం అమ్మకం. ✆ 82475 88099.

హరివిల్లు వారి 18వ ప్రాజెక్ట్ విజయవాడ 20ని॥లో అమరావతి ORR 1KMలో 20లక్షలు గల ప్లాటు 18లక్షలకే. ఆటో, బస్ సౌ॥ నో బ్రో॥ ✆ 9550763551

విజయవాడ సిటీ రామవరప్పాడులో 350ఎ॥ మెగాగేటెడ్ కమ్యూనిటీలో 1st ఫేజ్ నందు 258 చ॥గ॥ నుండి CRDA లేఅవుట్ ప్లాట్లు అమ్మకం. ✆ 80966 13134

గన్నవరంకి 17km వీరవల్లి టు కొమ్మూరు తారురోడ్డు పక్కన 3.20ఎ. కన్వర్షన్ చేసిన భూమి అమ్మకానికి/ వెంచర్ డెవలప్‌మెంట్‌కి ఇవ్వబడును 94901 79329

ఈడుపుగల్లు డాక్టర్స్‌కాలనీ వెస్ట్ 200 చ॥గ॥ నాన్ లేఅవుట్ ప్లాట్ అమ్మకం. ఈడుపుగల్లు, కంకిపాడు, పోరంకి, పునాదిపాడులో ప్లాట్లు అ॥ కొ॥ సంప్ర ✆ 8885766889

విజయవాడ రూరల్ నున్నలో ప్రభుత్వ ధర 8000/- సంక్రాంతి సందర్భంగా కేవలం 6,999/- మాత్రమే ఓపెన్ ప్లాట్లు ✆ 99668 85515, 95057 96745

కామినేని హాస్పిటల్ రోడ్డు కానూరు పోరంకి రాఘవ ఎస్టేట్స్ జనచైతన్య ఈడుపుగల్లు కంకిపాడు చుట్టుప్రక్కల ప్లాట్లు అమ్మదలచినవారు డైరెక్ట్‌పార్టీ సంప్ర✆ 9848587376

బందరురోడ్డుకి దగ్గరగా పోరంకి పద్మావతిగార్డెన్స్‌లో తూర్పు ఫేస్ 270 చ॥గ॥ పడమర ఫేస్ 198 చ॥గ॥ల ప్లాట్లు అమ్మకం చ॥గ॥ 42,000/- (నో బ్రోకర్స్) ✆ 93462 22427.

VJA సూర్యారావుపేట పుష్పాహోటల్ వెనుక Ch.V.కృష్ణయ్య వీధిలో Dr.No: 33-18-19/1 నందు తూర్పు/ఉత్తరం 140గ॥ ✆ 90009 00559/ 99596 48467

COMMERCIAL SPACE FOR SALE

Hyd, నేషనల్ హైవే, భవానీపురంలో 1050 చ॥గ॥లో అప్రూవల్ ప్లాన్ గల బ్యాంక్ లోన్ నందు ఉన్న గోడౌన్ అమ్మకం ధర 6.5 కోట్లు. 9246476079.

Bank Auction.201 Sq.yd, E/F, G+3 Building. 5400 sft. Rent Rs.1 L @ Paadivari Street, I Town, Vijayawada.Rs.2.25 Cr. Loan. 9440338285

LEASE/ RENT

VJA భవానిపురం రామాలయం దగ్గర, ఐరన్ యార్డ్‌లో 1st ఫ్లోర్ 28X70 (2000 S.F.T) Plot No: 12. ఆఫీస్/ గోడౌన్‌లకు లీజు/రెంట్‌కు ఇవ్వబడును. సంప్ర: ✆ 9246344405.

VJA లబ్బీపేటలో కాలేజీలకు బ్యాంక్‌లు, గోడౌన్లు, గోల్డ్‌షాపులు, డిజిటల్ మార్కెటింగ్ ఆఫీసులకు హాస్పిటల్‌లకు అద్దెకు/ లీజుకు 94410 04393, 77027 99355

PROPERTY FOR SALE

విజయవాడ, 1టౌన్ కెనాల్ రోడ్డులో, నెమళ్ళ బిల్డింగ్ ప్రక్కన, తూర్పు, 1st ఫ్లోర్‌లో-5 షాపులు మరియు 2nd ఫ్లోర్ (టెర్రస్+ హాలు) అమ్మకం. ✆ 98490 83118

REPAIRS

షట్టర్స్ రిపేరింగ్, గ్రీజ్, సర్వీసింగ్, పెయింటింగ్ చేయబడును. ఆటోనగర్, విజయవాడ వివరాలకు సంప్రదించండి. ✆ 85004 88956.

TO LET

VJA Satyanarayanapuram New 3BHK Flat for Rent Video Security Parking Etc Only for Vegetarians. ✆ 99498 46721, 97030 65461

Film Colony Plot No:3 Ind House (3BHK) With Car Parking Besides VMC Park LIC Colony Vijayawada. 94919 29136, 98664 42593.

Independent 2B/R House with 1A/c for rent at Ahyodhyanagar, Lotus Landmark, Sec-1. Govt Employees only ✆ 94901 90739.

2BHK Independent House 2nd Floor For Rent. Near Nalanda School, Beside Trendset Mall, Benz Circle, VJA. ✆ 99497 76210

3 BHK IND House Gr Flr Near Mandela Park LIC Colony Vijayawada. Ph: 9440772381, 9440656508

సింగ్‌నగర్, నందమూరి నగర్ తోటవారివీధి, 11వ లైన్ 2BHK E/F, GF, FF, 1250 S.Ft. కారు పార్కింగ్‌తో అద్దెకు ✆ 98450 94698, 89514 40755

VJA ,బందరురోడ్డు, మురళీఫార్చ్యూన్ హోటల్‌రోడ్డులో, సత్యఅపార్ట్‌మెంట్ నందు 1st ఫ్లోర్‌లో 3 B/R ఫ్లాట్, లిఫ్ట్, కార్‌పార్కింగ్‌తో ఆఫీసు రెసిడెన్సీలకు అద్దెకు.✆ 98481 22773

రామచంద్రనగర్ ఆయుష్ హాస్పిటల్ వెనుక గెలాక్సీ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో 3 BHK ఫ్లాట్ పుల్లీ ఫర్నీషింగ్ SUV కార్ పార్కింగ్‌తో అద్దెకు ✆99663 52288

విజయవాడ BRTS రోడ్‌ప్రక్కన పున్నయ్యకాలనీ మధు మేన్షన్‌లో 3 BHK ఇండిపెండెంట్ హౌస్ 2,000 Sft. 2nd ఫ్లోర్ కార్ పార్కింగ్‌తో అద్దెకు కలదు. ✆ 88863 21042, 77998 00325.

విజయవాడ కృష్ణలంక గీతానగర్‌లో గ్రౌండ్ ఫ్లోరు నందు 2BHK ఇండిపెండెంట్ ఫ్లాట్ కమర్షియల్‌కు/ ఫ్యామిలీస్‌కు అద్దెకు ✆ 83416 78727.

COMMERCIAL

తాడిగడపలో బందరురోడ్డుకి వాక్‌బుల్ డిస్టెన్స్‌లో ఈస్ట్‌ఫ్లోర్ 1800Sft కలిగిన ఇండిపెండెంట్ బిల్డింగ్ 5 ఫ్లోర్ల 9000 Sft పార్కింగ్, లిఫ్ట్, జనరేటర్ & ట్రాన్స్‌ఫార్మర్‌తో అద్దెకు.✆ 93464 82022, 92464 82022

VJA బందర్ రోడ్ NTR సర్కిల్ 360 sft గ్రౌండ్ ఫ్లోర్ షాప్ రెంట్‌కు ఉన్నది. Ph.99088 19301, 96404 16219

ఆఫీస్/ కమర్షియల్
VJA పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్, సిద్ధార్థ నగర్, 4వ లైను
1800 sft. కమర్షియల్ స్పేస్
F/F ఆఫీసులకు, హాస్పిటల్స్, బొటిక్స్, ఇనిస్టిట్యూషన్స్ etc. మొత్తంగా / విడిగా కాని అన్ని సౌకర్యాలతో అద్దెకు
✆ 98481 21161

కంకిపాడు కరూర్ వైశ్యా బ్యాంక్ పైన 1st ఫ్లోర్ షాపు 24 పొడవు, 12 వెడల్పు మరియు 2 BHK ఫ్లాట్ అద్దెకు కలదు. ✆ 90009 28927.

విజయవాడ, మాచవరండౌన్, ఏలూరురోడ్ ఫేసింగ్‌తో కమర్షియల్ బిల్డింగ్ నందు 1st, 2nd, 3rd ఫ్లోర్లు అద్దెకు ఇవ్వబడును.✆ 98481 20142, 98492 86877

VJA టిక్కిల్‌రోడ్, D.V.మానర్ వెనుక 1409 చ.అ.లు S/F, ఫస్ట్ ఫ్లోరు కమర్షియల్స్ ఆఫీసుల నిమిత్తం అద్దెకు ఇవ్వబడును. ✆ 99852 95566

Ware House / Godown for Rent 3300 Sqft Site in Prajasakthi Nagar, Payakapuram, Vijayawada Cont: 90301 99299, 92900 03169

గెస్ట్ హౌస్‌లకు/ విడిదిలకు
లబ్బీపేట, కళానికేతన్ వెనుక, శ్రీ వశిష్ట కాలేజ్ ఎదురుగా, **3 BHK** ఫ్లాట్స్ -8, కార్ పార్కింగ్, లిఫ్ట్ సౌకర్యంతో గెస్ట్ హౌస్‌లకు, హాస్టల్స్‌కు, కాలేజీలకు, ఆఫీసులకు మొత్తంగా/ ఫ్లోర్ వారీగా అద్దెకు ఇవ్వబడును.
✆ 81063 61550 99002 66955

2,600 SFt Ground and 1st Floor Hospital / Office Space for Rent. Near Suryaraopet, Vijayawada. ✆ 91606 83161, 63052 76554

AC Sheet Shed With Varanda 2700 S.Ft With 60HP Power @Nidamanuru Opp: Ele. Substation, Vijayawada. ✆ 97034 24999.

TO-LET COMMERCIAL
బెంజిసర్కిల్ దగ్గర, నేషనల్ హైవే సర్వీస్ రోడ్ నందు వెస్ట్ ఫేస్ **2100** చ॥అ॥ల ప్లింత్ ఏరియాగల 2వ ఫ్లోర్ లిఫ్ట్ & కార్ పార్కింగ్‌తో
మరియు
గాయత్రినగర్, 1వ లేన్ నందు రెండు రోడ్ల కార్నర్ నందు **1300** చ॥అ॥ల పెంట్‌హౌస్ ఫుల్ ఫర్నీచర్‌తో, లిఫ్ట్ & కార్ పార్కింగ్ సౌకర్యంతో ఆఫీసులకు అద్దెకు కలదు.
✆9948142499

VJA గవర్నరుపేట బకింగ్‌హామ్ పోస్టాఫీస్ ఎదురు గ్రౌండ్ ఫ్లోర్ 1షాపు, 1వఫ్లోర్‌లో 2షాపులు ATM/ గోల్డ్/ సిల్వర్‌కు అనువుగా అద్దెకు కలవు. ✆ 94403 68181

VJA, కామయ్యతోపు, చలసానినగర్ గోపాళం శివన్నారాయణ హాస్పిటల్ ప్రక్కరోడ్డులో 3స్టేర్స్ బిల్డింగ్ ఒక్కోఫ్లోర్ 2000 S.Ft. అద్దెకు. 63034 98345, 94410 83767

WANTED

బిల్డింగ్ అద్దెకు కావలెను. హాస్టల్ కొరకు సూర్యారావు పేట, లబ్బీపేట, కస్తూరిబాయిపేట ఏరియాలలో బిల్డింగ్ అద్దెకు కావలెను. ✆ 99127 82209.

GODOWN REQUIRED
3000 s.ft. Ground Floor
HAVING FIRE LICENCE
for godown in and around Vijayawada
Please contact
9108283273

JOBS

Wanted Jr.Accountant (Tally / Zoho books), Sr. Accountant (Tally/ Zoho books). Salary: 20,000 to 45,000 for Accountants. Wanted Lecturers for CSE, ECE, MATHS, PHY, CHE, ENG. N/W Administrators. Salary as Per norms and Free Transport Facility. Contact: Amrita Sai, Autonomous, Paritala. Send Biodata to ceo@amritasai.org.in. ✆ 99482 30222

Tele-callers, counsellors & Principals (MPC Teacher), (M/F), Qualifications : inter to PG, 15k -1.5Lakh /month. Ph: 9884394035

Wanted Civil Autocad Operators, B.Tech or Diploma for Railway Rob Projects in AP. Accountant, Office Assistant any Degree (Female). ✆ 96429 62619

Hydసిటీలో బ్రాహ్మణ కుటుంబానికి వంటచేయడానికి ఇద్దరు బ్రాహ్మణ స్త్రీలు & 1 బ్రాహ్మణ స్త్రీ కేర్‌టేకర్ కావలెను మంచిజీతం, భోజనం, వసతి ✆ 9866252220

ప్రముఖ గైనకాలజీ హాస్పిటల్‌కు అనుభవం గల లేడీస్ సిస్టర్స్, ఆయాలు, కంప్యూటర్ నాలెడ్జ్ గల రిసెప్షనిస్ట్ ఫార్మసిస్ట్ కావలెను. సూర్యారావుపేట. ✆ 8331836499

విజయవాడలోని శ్రీడోర్స్ కంపెనీ నందు డోర్ to డోర్ మార్కెటింగ్ చేయుటకు అనుభవం గల యువకులు కావలెను. సంప్ర: 95423 86899

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు రిసెప్షనిస్ట్/ టెలీ కాలర్స్/ మార్కెటింగ్ అడ్వయిజర్స్ కావలెను. జీతం + ఇన్సెంటివ్స్+ కమీషన్ ✆ 99510 51111.

ప్రముఖ టూ-వీలర్ ఫైనాన్స్ కంపెనీ పటమట విజయవాడ నందు పనిచేయుటకు సేల్స్/ కలెక్షన్ సిబ్బంది కావలెను. 2/3 సం॥ అనుభవం కుపల్సరి ✆ 88866 55588.

Wanted Engineers/ Executives Managers for Accounts/ Admin/ Commercial/ Sales & Mkt./ Materials & Purchase for Electrical Transformers Mfg. Unit, Autonagar, VJA. 5-15 Years Exp. email: headoffice@vcspl.com 96765 99644

సన్‌సిరి ప్రాజెక్ట్స్
వారి CRDA లేఅవుట్ ప్లాటు మార్కెటింగ్ కొరకు
మార్కెటింగ్ సిబ్బంది
M/F కావలెను. పటమట, VJA.
✆62811 01979 73862 04849

Job Vacancies at Plastic Industry. ITI- 5 Posts, Diploma -5 Posts, Mechanical Engineers-2 Posts, Degree B.com/ BBA - 2 Posts Email : infoampp2016@gmail.com ✆ 62810 45178. Address: Amaravathi Poly pack; #25-38, 4th Cross Road, Kabela Industrial; Vijayawada-520 012.

Wanted Telecallers for Gates Institute of Management & Sciences, VJA. Qual: Inter / Degree. Contact: ✆ 86449 93322

WANTED
LOOKING FOR PART -TIME APPAREL DESIGNER FOR OUR BUSINESS IN INDIA
CONTACT
VPC HOLDINGS INDIA (P)LTD VIJAYAWADA
SEND YOUR RESUME TO
associate@vpcholdings.com
PH : +1 706-664-3415

Wanted Telecallers for University Office in Vijayawada. Eligibility Degree/ B.Tech, Age: 18- 25 Years (Only). ✆ 77027 54944

Wanted Marketing Managers to Work in a Reputed N.G.O. with Salary 32,000/- Near Benzi Circle, Vijayawada. 63043 28479.

Wanted Mobile Technician with S/W Skills, Vijayawada. Contact. ✆ 85004 99396.

Wanted Office Assistants (F) any Degree Computer knowledge is must with min. exp. Call: 90320 41574.

WANTED
Fiber Technician/ Sales Executives
Qualification : ITI/ Polytechnic / Graduation.
Interested Candidates can Apply
Address : 40-1-70, 3rd floor, Opp Eenadu, Bandar Road, Vijayawada. PH: 9705822223
BROADBAND
hr@e-net.in

Wanted Electrician, Lorry Drivers with experience for a Construction Company, Vijayawada, Cell: 93900 40925.

Wanted Male Admin Incharges Qualification any Degree, Age Limit: 25 to 45 Years (Must be Married) Salary upto: 20,000/-. Working Location: Master Minds College, Vijayawada. Contact: 9676196218.

Sales Managers Wanted for INVO Solar. AP & TS States All Areas. Qua: MBA. CVs to Whats App. ✆ 94912 58135 (TS)/ 98598 00069(AP).

Technicians for Battey/ Diesel Forklift/ Repairs ITI Preffed Mail: sales@horizonhyd.com ✆ 94400 66721/ 92473 15197.

Wanted Marketing Executive (M/F) for Coaching Centre. Contact: 98481 28173, 63034 97656

కొత్తగా ప్రారంభిస్తున్న SVS సెక్యూరిటీ సర్వీసెస్ & హౌస్‌కీపింగ్ VJA కొరకు అన్నిరకాల స్టాఫ్ కావలెను. భో+వ+మంచిజీతం. ✆ 96764 91122, 96769 01122

విజయవాడనందు గల ప్రముఖ డయాగ్నొస్టిక్ సెంటర్‌నందు పనిచేయుటకు ఫిమేల్ కంప్యూటర్ ఆపరేటర్లు కావలెను. ✆ 94907 55383.

WANTED
▸ **Project Manager**
▸ **Civil Engineer**
▸ **Fabrication Engineer** *for work shop*
▸ **Civil Supervisor**
B.E/B.Tech/Diploma With Relevant Exp.In **Railway Projects.**
▸ **Electrician**
Koneru Constructions Pvt.Ltd.
Patamata, Vijayawada-8
Cell/Whatsapp
93900 40925
koneruconstructionspvtltd@gmail.com

డోర్స్ & విండోస్ సేల్స్‌లో అనుభవమున్న మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 2 వీలర్ మస్ట్. Sal+ TA+ DA. Biodata Send to. ✆ 70329 95715

విజయవాడలో ప్రముఖ ఆఫ్సెట్ ప్రింటింగ్ ప్రెస్ నందు పనిచేయుటకు డేటా ఇంజినీర్, డిజైనర్ & అక్కౌంటెంట్ అనుభవం కల్గినవారు కావలెను ✆98490 82202

ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను/ పేషంట్స్‌ని/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం,జీ: 18-20k ✆ 89776 39662, 89776 39663

ఇంటిపని, వంటపని చేయుటకు ఏ బాదరబందీలేని స్త్రీ కావలెను. ఉ. 11 గం.ల నుండి 1:00 లోపు కాల్‌చేయండి. ✆ 99127 82209.

ప్రముఖ షోరూం నందు లోడర్స్ బాయ్స్ కావలెను. 9 గంటలు పని EPF ESI W/O కలదు 12k జీతం. కాల్: ✆ 88855 53652, 80994 44758

విజయవాడలో ప్రముఖ లి॥ కంపెనీకి జిల్లాల్లో అన్ని ఏరియాలకు వాక్చాతుర్యం, ఉత్సాహవంతులైన స్త్రీ/పు ఎగ్జిక్యూటివ్స్, టీమ్‌లీడర్స్, నెట్‌వర్క్ లీడర్స్, టెలీకాలర్స్ కావలెను. రోజు ఆదాయం, జీతం: 30వేలు+ ఇన్సెంటివ్ ✆ 72075 72235

CCTV Technicians, Electricians కావలెను.Q: Dip or ITI Electrician, Exp.1-3yrs ✆ 93987 28839, 63007 40378

విజయవాడ సూర్యారావుపేట, వెంకటరత్నం వీధిలో ప్రముఖ హాస్పిటల్ నందు ఫార్మసీలో పనిచేయుటకు ఫార్మసిస్ట్/ స్టాఫ్ కావలెను. ✆ 98856 66640.

ఎలక్ట్రీషియన్స్ మరియు హెల్పర్స్ కావలెను. వయస్సు: 18-30 సం॥లోపు హౌస్ వైరింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. సంప్ర॥ ✆ 93921 33234.

ప్రముఖ ఆర్కిటెక్ట్ & సర్వేయర్ కంపెనీ నందు పనిచేయుటకు 2 సం॥ అనుభవం గల డ్రాఫ్ట్‌మెన్ సివిల్ (Auto Cad), సర్వేయర్ (D.G.P.S./ E.T.S.) మరియు ఆఫీస్ బాయ్/ ప్రిసమ్ బాయ్ కావలెను. ✆: 9705777688.

మచిలీపట్నం నందు ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు అనుభవం కలిగిన B.Pharm, B.Sc., Lab Tech. సెక్యూరిటీ కావలెను. Contact No. 70755 11614.

స్వదేశీ నాటుకోడి గుడ్ల అమ్మడం కోసం ఆసక్తిగల వర్కర్స్ కావలెను. రోజుకు రూ. 1000/- ఇవ్వబడును. వివరాలకు సంప్రదించవలసిన ఫోన్: 97014 08937.

విజయవాడలో కేటరింగు సంస్థ నందు పనిచేయుటకు చదువుకున్న 40 సం॥లోపు వయస్సు కలిగిన వారు కావలెను. ✆ 99122 53355 కాల్ చేయు సమయం: 8 AM to 10 AM మరియు6 PM to 8 PM

విజయవాడలో అనుభవం కలిగిన కారు డ్రైవరు కావలెను. 40 సం॥ లోపు వయస్సు కలిగి, కనీసం చదువుకున్న స్థానికులై వుండవలెను. ✆ 99122 53355. కాల్ చేయు సమయం: 8 AM to 10 AM మరియు 6 PM to 8 PM

తాడేపల్లిలో త్వరలో ప్రారంభించబోవు ప్రముఖ హోటల్ నందు పని చేయుటకు ★ మేనేజర్ ★ రిసెప్షనిస్ట్ ★ రూమ్ సర్వీస్ బాయ్స్ కావలెను. ✆ 91696 55555

ప్రముఖ కంపెనీకి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. మంచి జీతం ఇన్సెంటివ్‌లు మరియు ప్రయాణ భత్యాలు. ✆ 79970 18666.

Exp. నర్సులు/ ఆయాలు/ వార్డ్ బాయ్స్ కావలెను. జీతం: 25,000/- నుండి 30,000/- (జనవరి ఆఫర్) ఇవ్వబడును. కూకట్‌పల్లిలో, Hyd. ✆ 99665 68882/ 99634 89661.

MORE CLASSIFIEDS ON PAGES 16

పిల్లల ప్రపంచం.. పుస్తకమయం 10లో
పలుకులో తెలుగు.. మోములో వెలుగు.. 18లో

తెలుగు వైభవం.. పుస్తక రాజసం..

ఈనాడు, అమరావతి

'సంక్రాంతికి ముందే.. రాజధాని ప్రాంతానికి పండగొచ్చింది. ఒకటి కాదు ఏకంగా రెండు పండుగలు ఒకేసారి పలకరించాయి. గుంటూరులో మూడో ప్రపంచ తెలుగు

సంక్రాంతికి ముందే పండగొచ్చింది...

మహాసభలు.. విజయవాడలో 36వ పుస్తక మహోత్సవంతో సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. ఒకవైపు తెలుగుకు వెలుగులు అద్దేందుకు దేశ విదేశాల నుంచి తరలివచ్చిన మాతృభాషాభిమానులతో సందడి నెలకొంది. మరోవైపు పుస్తకానికి పట్టం కట్టేందుకు తండోపతండాలుగా తరలివస్తున్న పుస్తక ప్రియులతో పండగే.. పండగ. గుంటూరులో ఉదయాన్నే తెలుగు మహాసభల్లో పాల్గొంటూ.. సాయంత్రానికి విజయవాడలోని పుస్తక మహోత్సవ ప్రాంగణానికి చేరుకుంటున్నారు. భాషకు బాసటగా నిలుస్తూ పుస్తకానికి జైకొడుతున్నారు.



గుంటూరు: తెలుగుతల్లి విగ్రహానికి నమస్కరిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ, చిత్రంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, జస్టిస్ రఘురామ్, గజల్ శ్రీనివాస్, మాశర్మ, రామచంద్రరాజు, తోటకూర ప్రసాద్, చలసాని ఆంజనేయులు



తెలుగు మహాసభల వేదికపై సాంస్కృతిక ప్రదర్శన



విజయవాడ: 'మీరూ శ్రీలు కావచ్చు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, చిత్రంలో రచయిత అద్దంకి శ్రీధర్‌బాబు, ఎమెస్కో విజయ్‌కుమార్, వల్లూరి శివప్రసాద్



స్టాళ్ల వద్ద పుస్తక ప్రియుల సందడి

మహోత్సవంలో 'ఈనాడు'..

సాయంత్రం 6గంటలకు: భాజపా జాతీయ నేత.. రామ్‌మాధవ్ రచించిన.. 'ముక్కలైన స్వాతంత్ర్యం', 'మన రాజ్యాంగం-మన ఆత్మగౌరవం'.. రెండు పుస్తకావిష్కరణలు. **7గంటలకు:** 'విద్యార్థులు-సాహిత్యం' సదస్సు. ★ **ప్రదర్శన వేళలు:** ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9గంటల వరకు..

పుస్తక ప్రపంచం పిలుస్తోంది.. కదలిరా!

ఈనాడు, అమరావతి

విజయవాడ 36వ పుస్తక మహోత్సవం రెండో రోజు సందర్శకుల హడావుడి పెరిగింది. విజయవాడ ఇందిరాగాంధీ మైదానంలోని పుస్తక మహోత్సవాన్ని శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9గంటల వరకు తెరిచి ఉంచారు. వారాంతం కావడంతో పుస్తక ప్రియులు భారీగా తరలివచ్చారు. నేడు కూడా ఆదివారం పెద్దసంఖ్యలో సందర్శకులు తరలిరానున్నారని.. పుస్తక మహోత్సవం నిర్వాహకులు వెల్లడించారు.

కథలు.. పురాణాలు...

పుస్తక ప్రాంగణంలోని అన్ని స్టాళ్లలో కలిపి కనీసం ఏడు నుంచి పది లక్షల పుస్తకాలు కొలువుదీరినట్టు అంచనా. దీంతో ఎటుచూసినా పుస్తక ప్రపంచమే కనిపిస్తోంది. స్టాళ్లలో వేల మంది నిలబడి.. పుస్తకాలను చదువుతూ.. కొనుగోళ్లు చేస్తూ కనిపించారు. అన్నిరకాల పుస్తకాలు ఉండేలా విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం ప్రతినిధులు జాగ్రత్త పడ్డారు. ☆ సాహిత్యం, నవలలు, వ్యక్తిత్వ వికాసం, భారతం, రామాయణం, భగవద్గీత సహా ఆధ్యాత్మిక గ్రంథాలు కొలువుదీరాయి.
☆ పంచతంత్రం సహా అన్ని రకాల బాలల కథల పుస్తకాలున్నాయి.
☆ ఇంగ్లీషు ప్రచురణ సంస్థల స్టాళ్లలోనూ అన్ని రకాల పుస్తకాలు దర్శనమిస్తున్నాయి. దేశంలోని ప్రముఖ పుస్తక ప్రచురణ సంస్థలకు చెందిన వ్యక్తిత్వ వికాసం, ఆంగ్ల సాహిత్యం, కథలు, నవలలు వేల సంఖ్యలో ఈ స్టాళ్లలో ఉంచారు.
☆ ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు, మెడికల్, ఇంజినీరింగ్ సహా అన్ని పాఠ్య పుస్తకాలూ తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో అందుబాటులో ఉన్నాయి.

సిద్ధమైన స్టాళ్లు..

పుస్తక మహోత్సవ ప్రాంగణంలో 300కు పైగా స్టాళ్లు శనివారానికి సిద్ధమయ్యాయి. తొలి రోజు ప్రారంభోత్సవం, పుస్తకాలను స్టాళ్లలో పెట్టడానికే రాత్రి వరకూ సమయం పట్టింది. రెండో రోజు మాత్రం పూర్తిస్థాయిలో స్టాళ్లు.. లక్షల పుస్తకాలతో సిద్ధమయ్యాయి. పిల్లలతో కలిసి తల్లిదండ్రులు భారీగా ప్రదర్శనకు తరలివస్తున్నారు.

తొలగనున్న విద్యుత్తు కష్టాలు

విమానాశ్రయంలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ సిద్ధం



ప్రారంభానికి సిద్ధమైన ఉప కేంద్రం ఇదే

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసింది. విమానాశ్రయంతో పాటు పరిసరాల్లోని పరిశ్రమలు ఎదుర్కొంటున్న విద్యుత్తు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా విమానాశ్రయం ఆవరణలో రూ.30.65 కోట్ల వ్యయంతో చేపట్టిన 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. 50 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఆధునిక నియంత్రణ వ్యవస్థతో నూతన సబ్‌స్టేషన్ నిర్మించారు. ఈనెల 5న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌తో గన్నవరం, విజయవాడ రూరల్, ఉంగుటూరు మండలాలకు నాణ్యమైన విద్యుత్తు సరఫరాతోపాటు దాదాపు 3.5 లక్షల మంది వినియోగదారులకు మేలు జరుగుతుందని ఆశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. విద్యుత్తు సదుపాయాల్లో నూతన సబ్‌స్టేషన్ మైలురాయిగా నిలవనుందని తెలిపారు.



బాధ్యతల స్వీకరణ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పి.సత్యానందం శనివారం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్బీలో సీఐగా పనిచేస్తున్న ఆయన.. ఇటీవల ఏసీపీగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీపీని కలిసి, పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

సీపీ రాజశేఖరబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏసీపీ సత్యానందం



ముగ్గులను తీర్చిదిద్దుతున్న విద్యార్థినులు



విజేతలతో ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, డైమండ్ నెక్స్ మేనేజర్ సయ్యద్ నజీర్ అహ్మద్, పద్మజా సుజుకీ బ్రాంచి మేనేజర్ ఉష

సంక్రాంతి కళ.. రంగవల్లులు భళా..!

రామవరప్పాడు, న్యూస్‌టుడే: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం 'ఈనాడు-ఈఎఫ్ఎం 91.9' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల రంగులతో తీర్చిదిద్దిన రంగవల్లులు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రాంగణంలో పండగ వాతావరణం ఏర్పడింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ టి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థినుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. తమ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించిన 'ఈనాడు'కు అభినందనలు తెలిపారు. పోటీల్లో జె.ప్రమీళ, ఎం.వాసంతి, ఎస్.శ్రీచందన వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ టి.వెంకటేశ్వరరావు, పద్మజాసుజుకీ ఎనికేపాడు శాఖ బీఎం ఎ.ఉష, డైమండ్ నెక్స్ మేనేజర్ సయ్యద్ నజీర్ అహ్మద్ బహుమతులు అందజేసి అభినందించారు. మెయిన్ స్పాన్సర్‌గా డైమండ్ నెక్స్, సపోర్ట్ స్పాన్సర్‌గా పద్మజాసుజుకీ, అసోసియేట్ స్పాన్సర్‌గా ప్రియా ఫుడ్స్ వ్యవహరించాయి.



ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తాం

ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్



నూతన కార్యవర్గ సభ్యులతో విద్యాసాగర్ తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి కార్యాలయం వరకు ఉద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 75 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో చారిత్రక ఘట్టాలకు సంఘం సాక్ష్యంగా నిలిచిందన్నారు. నేడు ఉద్యోగులు పొందుతున్న సౌకర్యాల్లో సింహ భాగానికి సంఘం అవిరళ కృషేనని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛన్ల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందే ఉంటుందని పేర్కొన్నారు. గత ఎనిమిది నెలల్లో ప్రభుత్వంతో చర్చల ద్వారా రూ.13వేల కోట్ల మేర ప్రయోజనాలు సాధించగలిగామని తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ కృషిచేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీ నుంచి అసోసియేషన్‌లో ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గం ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉందన్నారు. ఎంతో మంది అగ్ర నాయకులుగా ఎదిగారని గుర్తు చేశారు.

జిల్లా శాఖ కార్యవర్గం ఏకగ్రీవం: సంఘం ఎన్టీఆర్ జిల్లా శాఖ ఎన్నికల్లో 17 పోస్టులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలయ్యింది. దీంతో ఎన్నిక ఏకగ్రీవమయ్యింది. అధ్యక్షుడిగా బి.సత్యనారాయణరెడ్డి, సహాధ్యక్షుడిగా వి.వి.ప్రసాద్, కార్యదర్శిగా పి.రమేష్, కోశాధికారిగా బి.సతీష్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా బి.వి.రమణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వి.నాగార్జున, ఎం.గోపాలకృష్ణ, జి.రామకృష్ణ, ఆర్.శ్రీనివాసరావు, షేక్ జానీపాషా, మహిళా సహాధ్యక్షురాలిగా కె.శివలీల, సంయుక్త కార్యదర్శులుగా ఎం.రాజబాబు, సి.హెచ్.దిలీప్‌కుమార్, డి.విశ్వనాథ్, సి.హెచ్.మధుసూదనరావు, ఎం.శ్రీనివాసరావు, మహిళా సంయుక్త కార్యదర్శిగా సి.హెచ్.శ్రీదేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె.జగదీశ్వరరావు ప్రకటించారు. నూతన కార్యవర్గంతో విద్యాసాగర్ ప్రమాణస్వీకారం చేయించారు. సహాయ ఎన్నికల అధికారిగా బి.జానకి, పర్యవేక్షకులుగా వి.సుబ్బారెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ నాయకులు, జేఏసీ నాయకులు, నగర సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్రాంతి వరకు కాల్వలకు నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు సంక్రాంతి పండగ వరకు సాగునీటిని విడుదల చేయనున్నారు. ప్రస్తుతం అపరాలు తదితరాలకు నీటిని వినియోగిస్తున్నారు. తర్వాత అవసరాలను బట్టి. విజ్ఞప్తులు వస్తే మరో వారం రోజుల పాటు నీటి విడుదల ఉంటుంది. ఈ నెలలో కాల్వల కట్టివేత అనంతరం తాగునీటి అవసరాల కోసం మార్చి నెలలో మళ్లీ నీటి విడుదల ఉంటుంది. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ వద్ద సుమారు 3 టీఎంసీలు, పులిచింతల ప్రాజెక్టులో 40.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అందుబాటు ధరల్లో నాణ్యమైన వస్త్రాలు



మాట్లాడుతున్న నిధి అగర్వాల్

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : విజయవాడ ఎంజీ రోడ్డులోని స్వాతి షాపింగ్ మాల్‌లో సినీ హీరోయిన్ నిధి అగర్వాల్ శనివారం సందడి చేసింది. షోరూమ్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా.. నూతనంగా ఏర్పాటు చేసిన మెన్స్, కిడ్స్ వేర్ విభాగాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం వస్త్రాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. సంక్రాంతి పండగ సందర్భంగా స్వాతి షాపింగ్ మాల్ నిర్వాహకులు వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు ఇచ్చి అందుబాటు ధరల్లో నాణ్యమైన వస్త్రాలు అందించడం అభినందనీయమన్నారు. రాజా సాబ్ సినిమా ఈ నెల 9న విడుదల కానుందని, ఆ చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరారు. శనివారం మూడో పాట విడుదల చేస్తున్నట్లు తెలిపారు. షాపింగ్ మాల్ అధినేతలు రమణబాబు, సాత్విక్, సాకేత్ మాట్లాడుతూ.. మాల్ ద్వితీయ వార్షికోత్సవం, సంక్రాంతి సందర్భంగా [illegible] రూ.25కే చీర ఇస్తున్నట్లు ప్రకటించారు.



ధర వరలు

వంకాయలు-20/24, టమాటా-44, బెండ-28, పచ్చిమిర్చి-36, కాకర-48, బీర-36, క్యాలీ ఫ్లవర్-20/25, క్యాబేజి-22, క్యారెట్-35, దొండ-32, బంగాళదుంప-22, ఉల్లిపాయలు-30, గోరుచిక్కుళ్లు-34, దోస-30/38, సొర-20, పొట్ల-32, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-74, మునగ-10/12, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-42, బీట్‌రూట్-28, కీరదోస-30, బీన్స్-60, క్యాప్సికమ్-56, చింతకాయలు-60, నిమ్మ (డజను)-22/18, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22 **(నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.**

- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

కలిసి కట్టుగా సైబర్ నేరాలు నియంత్రిద్దాం



బ్యాంకు, పోలీసు అధికారులతో మాట్లాడుతున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ నేరవార్తలు: డిజిటల్ అరెస్టు, పెట్టుబడుల మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటిని కట్టడి చేసేందుకు బ్యాంకర్లు సహకరించాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు కోరారు. ప్రజలను అవగాహన కల్పించడం, ఏ ఒక్కరూ సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీసులు చేపట్టిన 'సైబర్ సురక్ష'పై శనివారం సీపీ కార్యాలయంలో బ్యాంకు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. [illegible] ప్రశ్నావళి ఉంటుందని చెప్పారు. ఏఐ సాంకేతికతతో పని చేసే ఈ సైట్.. నగదు జమ చేసేందుకు వచ్చిన ఖాతాదారుల నుంచి సంతృప్తికరమైన సమాధానాలను రాబడుతుందని, ఆ తర్వాతే నగదు బదలాయించాలని సూచించారు.

రూ.50వేలు దాటితే...: నగదు బదిలీ చేయమని ఎవరైనా బ్యాంకుకు వస్తే వారిని నిశితంగా గమనించాలని కోరారు. రూ.50 వేలు దాటి నగదు బదిలీ చేసేందుకు వచ్చిన [illegible] మంది ఖాతా వివరాలు తెలుసుకోకుండానే సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాలకు నగదు జమ చేసేందుకు వస్తారని చెప్పారు. కొందరు బంధువులకు పంపుతున్నామంటూ బుకాయిస్తారని.. ఖాతాదారుడి పేరు, ఎక్కడ ఉంటారో ప్రశ్నిస్తే.. సరైన సమాధానం చెప్పలేరని.. తద్వారా అసలు విషయం గుర్తించవచ్చన్నారు. సైబర్ క్రైం డీసీపీ కె.కృష్ణప్రసన్న, ఏసీపీ రాజశేఖర్, సీఐలు శ్రీనివాస్, శివాజీ పాల్గొన్నారు.



దుర్గగుడి విద్యుత్తు సర్‌ఛార్జి రూ.43.9 లక్షలు!

అధికారుల తప్పిదంతో దేవస్థానానికి నష్టం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం విద్యుత్తు బిల్లుల బకాయిలు రోజుకో వ్యవహారం వెలుగు చూస్తోంది. దేవస్థానం రూ.3.08 కోట్లు బకాయిలు చెల్లించాలని విద్యుత్తు శాఖ అధికారులు లెక్కలు చెబుతున్నారు. ఈ బకాయిల వ్యవహారంలో దుర్గగుడికి విద్యుత్తు సరఫరాను అధికారులు నిలిపివేశారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. తాజాగా దుర్గగుడి చెల్లించాల్సిన రూ.3.08 కోట్ల బకాయిల్లో విద్యుత్తు సర్‌ఛార్జి రూ.43.9లక్షలు ఉందని దుర్గగుడి హెచ్‌టీ సర్వీస్ వీజేఎ257 బిల్లు చెబుతోంది. బిల్లులు సకాలంలో చెల్లించకపోతే విద్యుత్తు సంస్థ విధించే అపరాధ రుసుమునే సర్‌ఛార్జి అంటారు. దేవస్థానం 2023 నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్తు సంస్థ విధించిన సర్‌ఛార్జిలు తడిచి మోపెడై ఈ నెలకు రూ.43.9 లక్షలకు చేరింది.

ఎవరు కట్టాలి? : ఈ విద్యుత్తు సర్‌ఛార్జి దుర్గగుడికే భారమని అధికారులు అంటున్నారు. సర్‌ఛార్జి తొలగింపు అనేది దాదాపు అసాధ్యమని విద్యుత్తు అధికారులు చెబుతున్నారు. దుర్గగుడి తప్పకుండా చెల్లించాల్సిందేనని, అధికారులు చేసిన తప్పిదం వల్ల ఈ భారం దుర్గమ్మపై పడిందని పేర్కొంటున్నారు. దీన్ని దుర్గగుడి కడుతుందా.. లేక తప్పు చేసిన అధికారుల నుంచి వసూలు చేస్తారా? అనేది తేలాల్సి ఉందని విద్యుత్తు అధికారులు అంటున్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

సత్తా చాటి.. బహుమతి పట్టి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక శ్రీశ్రీనివాస జూనియర్ కళాశాలలో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో జరిగిన క్విజ్ పోటీల్లో సీనియర్ ఇంటర్ విద్యార్థులు జడ వెంకటేశ్వరరావు, ఓరుగంటి భానుతేజ, సీహెచ్.పెంచ్య వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి కళాశాల ప్రిన్సిపల్ ఎం.పూర్ణచంద్రరెడ్డి బహుమతులు అందజేశారు. అధ్యాపకులు ఎం.వెంకటేశ్వరరావు, బి. హరిబాబు, డి.వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో పూర్ణచంద్రరెడ్డి, వెంకటేశ్వరరావు, హరిబాబు, వేణుబాబు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

• తిరువూరు 12వ వార్డులోని డ్రెయిన్‌లో వ్యర్థాలు పేరుకు పోయాయని స్థానికుడు మల్లేశ్వరావు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్లు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు.



• తిరువూరు 14వ వార్డులోని డ్రెయిన్‌లో మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుని మురుగు పారుదల లేదని స్థానికుడు ప్రభాకరావు 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

సమస్యలు పరిష్కరించాలి

తిరువూరు : రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాలను సంబంధించిన పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5న సహకార సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు జేసీస్ సభ్యుడు, లక్ష్మీపురం సొసైటీ మేనేజరు జొల్లినేని రఘురామ్ తెలిపారు.

కంప్యూటర్ వితరణ

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని కోడూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు స్కోర్ ఇంగ్లిష్ ల్యాబ్‌కు అవసరమైన కంప్యూటర్‌ను తెలంగాణకు చెందిన ప్రవాస భారతీయుడు వి.ఇంద్రసేన రెడ్డి శనివారం వితరణ చేశారు.

వేగాన్ని నియంత్రించుకోపోతే చర్యలు

ఇబ్రహీంపట్నం: టిప్పర్లు, లారీలు, ఓవర్ లోడింగ్ వాహనాలు వేగాన్ని నియంత్రించుకోపోతే చర్యలు తప్పవని ఏఎంవీఐ జి.రామకృష్ణ హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలో ఆ వాహనాల డ్రైవర్లతో ఆయన సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జాతీయ రహదారులపై అతి వేగంతో ప్రమాదాలు అధికమవుతున్నాయన్నారు. జీపీఎస్ సిస్టం ప్రతి వాహనానికి ఏర్పాటు చేసి యాజమాన్యాలు డ్రైవర్లను పర్యవేక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏవీఐ దుర్గారావు, రామచంద్రరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా నెమలి కృష్ణుని మాస కల్యాణం


ఉత్సవమూర్తులు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి మాస కల్యాణం ప్రధానార్చకుడు టి.గోపాలాచార్యులు ఆధ్వర్యంలో రుత్విక బృందం శనివారం నిర్వహించారు. రుక్మిణీ, సత్యభామా సమేత శ్రీకృష్ణపరమాత్మ ఉత్సవమూర్తులను యాగశాలకు తీసుకొచ్చి కల్యాణం జరిపించారు. పలు గ్రామాలకు చెందిన దంపతులు కన్యాదాన క్రతువులో పాల్గొన్నారు. తెదేపా నాయకులు బెల్లం మధుసూదనరావు, వి.రాజశేఖర్, వి.దినకరరావు తదితరులు పాల్గొన్నారు.


వెంకటాచల స్వామి

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరులోని వెంకటాచల స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పర్వతం.శ్రీనివాసరావు పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

ఇల్లాలి చదువు.. సమాజాభివృద్ధికి తొలి అడుగు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

మహిళల్లో అక్షరాస్యత శాతం పెంచేందుకు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న అక్షరాంధ్ర కార్యక్రమంలో నియోజకవర్గంలోని మహిళలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు, సమాజాభివృద్ధికి తొలి అడుగు అనే ప్రభుత్వ లక్ష్య సాధన దిశలో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు మైలవరం నియోజకవర్గంలో రెండో దశ కార్యక్రమం అధికారులు చర్యలు చేస్తున్నారు. అక్షరాలు రాయడం, చదవడం, అంకెలపై పట్టు, డిజిటల్ నగదు లావాదేవీలపై అవగాహన ఉండేలా మహిళలను మెరుగుపర్చాలని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం పేరే 'ఉల్లాస్'. దీంతో నియోజకవర్గంలో వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటింటా సర్వే చేసి నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించారు. ఈ కార్యక్రమం నాలుగు మండలాల్లో విజయవంతం చేసేందుకు 1,490 అక్షర కేంద్రాలను అక్షరాంధ్ర పేరుతో నిర్వహిస్తున్నారు. వీటిల్లో 9,400 మంది అక్షరాలు దిద్దుతున్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సెప్టెంబర్ 8న వీటిని ప్రారంభించి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు.


మైలవరం అక్షర కేంద్రంలో చదువుతున్న మహిళలు

పాఠాలు బోధన..: డ్వాక్రా, మెప్మా తదితర విభాగాల్లో అక్షరాలు నేర్చుకోవాల్సిన మహిళలను గుర్తించారు. వారికి రెండో దశ కార్యక్రమంలో భాగంగా పాఠాలు బోధిస్తున్నారు. నియోజకవర్గంలో ఈ కార్యక్రమం అమలు తీరును ఎన్‌సీఈఆర్టీ బృందం ఇటీవల పరిశీలించింది. కోర్సులు పూర్తి చేశాక పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉత్తీర్ణులకు ధ్రువ పత్రాలు అందజేస్తారు.

రోజు రెండు గంటలు: జీవన, పుస్తక పఠనానికి ఆయా సంఘాల్లో చదువుకున్న వారిని వాలంటీర్లుగా ఎంపిక చేశారు. వీరు అక్షరాలు రాయడం, పదాలు పలకడం వంటివి నేర్పుతారు. రోజూ సాయంత్రం అయిదు నుంచి ఏడు గంటల మధ్య ఆయా ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక భవనాలు, పాఠశాలలతో పాటు అనువైన చోట చెబుతారు. మండల పరిధిలోని ఎంపీడీవోలు, సచివాలయ కార్యదర్శులతో పాటు ఇతర అధికారులు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు. మొత్తం వంద గంటల కార్యక్రమం ఇది. అక్షర కేంద్రాలను పర్యవేక్షిస్తున్నట్లు వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి జి. ప్రసాదరావు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : సీఎం సహాయ నిధితో పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తోందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. శనివారం రెడ్డిగూడెంలో సీఎం ఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలను లబ్ధిదారులకు ఆయన అందజేసి మాట్లాడారు. తాజాగా నియోజకవర్గంలో 79 మందికి 87 లక్షలు సీఎంఆర్ఎఫ్ మంజూరైనట్లు తెలిపారు. వీటిని అందరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.


రెడ్డిగూడెం: లబ్ధిదారులకు చెక్కులు ఇస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

✦ రెడ్డిగూడెం మండలం ముచ్చనపల్లికి చెందిన తెదేపా నాయకుడు చీఫ్ కృష్ణ, చెన్నారావు గ్రామంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ముందుగా స్వామి వారిని దర్శించుకుని అన్నదానం ప్రారంభించారు.

మత్స్యకార కుటుంబాలకు అండ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి కల్పించడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ కృష్ణా నదిలో 7.5 లక్షల చేప పిల్లలను ఆయన శనివారం వదిలారు. కొండపల్లి పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, కొన్నిబుట్లు, తెదేపా, జనసేన నాయకులు సీతారామయ్య, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

భద్రతే వాహనదారుల లక్ష్యం

ఇబ్రహీంపట్నం: భద్రతే లక్ష్యంగా వాహనదారులు వాహనాలను నడపాలని ఎన్‌హెచ్ఏఐ అధికారి రాజారావు సూచించారు. 37వ జాతీయ రహదారి మాస ఉత్సవాలను ఇబ్రహీంపట్నం రింగుకూడలిలో ఎన్‌హెచ్ఏఐ శనివారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణలో పౌరస్పృతి అవసరని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలతో పాటు వ్యక్తిగత భద్రతను పాటిస్తూ వాహన చోదనం చేస్తే ఎటువంటి ప్రమాదాలు సంభవించవని తెలిపారు. అనంతరం ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలకు కరపత్రాలు పంపిణీ చేశారు. రాజారావు, జయప్రకాష్, శ్రీనివాస్, బాలాజీశర్మ, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీయడానికి బాలోత్సవాలు దోహదం

తిరువూరు, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి బాలోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వాహిని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన బాలోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు చిన్నారుల్లోని సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఆయన చెప్పారు. అనంతరం వివిధ రకాల పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పాఠశాలల అభివృద్ధికి చేయూత అభినందనీయం

గంపలగూడెం: మండలంలోని కనుమూరు అత్తునూరి చెన్నారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ నుంచి రూ.4.25 లక్షల విలువైన సామగ్రిని శనివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో డి.సాంబశివరావు అధ్యక్షతన పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో దాతలైన రోటరీ క్లబ్ ప్రతినిధులు వి.బాలకోటిరెడ్డి, చక్రవర్తిరెడ్డి, వి.లక్ష్మి, పి.కల్యాణ్ పాల్గొని ఆయా సామగ్రిని ప్రారంభించారు. ప్రభుత్వ బడుల అభివృద్ధికి దాతలు అందించిన చేయూతను వక్తలు కొనియాడారు. ఎంఈవో నరసింహారావు, హెచ్‌ఎం వి.నాగలక్ష్మి, ఎస్ఎంసీ అధ్యక్షురాలు కె.వెంకటమ్మ, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు జె.చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దాతలు, రోటరీ క్లబ్ ప్రతినిధులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

సావిత్రీ బాయి ఫులే ఆశయ సాధనకు కృషి

గొల్లపూడి, న్యూస్‌టుడే : మహిళల విద్య కోసం సావిత్రీ బాయి ఫులే విశేష కృషి చేశారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. సావిత్రీ బాయి ఫులే జయంతిని గొల్లపూడిలోని బీసీ భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ కుల వ్యవస్థ నిర్మూలన, మహిళల హక్కుల కోసం పోరాటం చేసిన ధీశాలి సావిత్రీ బాయి అన్నారు. అనంతరం ఏపీ బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సవిత

నైపుణ్యాల సాధనే ప్రగతికి సోపానాలు

మైలవరం, న్యూస్‌టుడే : కళాశాల దశ నుంచే ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యాలు సాధించి ప్రగతికి సోపానాలుగా మలచుకోవాలని పెన్వెట్ టెక్నాలజీస్ డైరెక్టర్ దట్ల రవివర్మ సూచించారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో లక్ష్య2k26 పేరిట శనివారం జాతీయ సదస్సు నిర్వహించారు. అందులో మొత్తం 62 విభాగాల్లో వివిధ రకాల పోటీలు పెట్టారు. కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీసీటీఈ- ఐడియా ప్రయోగశాలను ప్రారంభించారు.అనంతరం పలు పోటీల్లో విజేతలైన 140 మంది విద్యార్థులకు రూ.3.5 లక్షల నగదు పురస్కారాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల గౌరవ ఛైర్మన్ జయప్రకాశరెడ్డి, కళాశాల ట్రస్టీ లకిరెడ్డి హనిమిరెడ్డి, అధ్యక్షుడు జి.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపల్ కె.అప్పారావు, ఉప ప్రిన్సిపల్ రమేష్ రెడ్డి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

మురుగు ఇలా.. నడిచేదెలా..?



జి.కొండూరు టమాటా మార్కెట్ సమీపంలో సీసీ రోడ్డుపై మురుగు నిలిచి స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఇంతకు ముందు ఉన్న మురుగు కాలువ నిర్వహణ లేక పూడిపోవడంతో జనాలు వాడుకున్న నీరంతా రహదారిపైకి చేరి దుర్వాసన వస్తోంది. దీనిపై అధికారులకు పలుమార్లు వినతిపత్రం అందజేసిన ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలువను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి మురుగు పారేందుకు చర్యలు చేపడితే మేలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, జి.కొండూరు

విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు



విస్సన్నపేట టీచర్స్ కాలనీలోని విద్యుత్తు స్తంభాలకు, కాలనీ సూచిక బోర్డులకు పిచ్చితీగలు, పొదలు దట్టంగా అల్లుకున్నాయి. దీంతో విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు రావడం వల్ల నివాసాల్లోని బల్బులు, ఫ్యాన్లు తదితర సామగ్రి తరచుగా పాడైపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కాలనీలో పలు చోట్ల ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు కనిపించకుండా పొదలు పెరగడంతో కొత్తవారికి చిరునామా అర్థం కావడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

వంతెన నిర్మించారు.. అప్రోచ్ వదిలేశారు!



కొండపల్లి పురపాలిక శివారు ఈలప్రోలు వద్ద బుడమేరుపై నిర్మించిన వంతెన అప్రోచ్‌కు మోక్షం కలగడం లేదు. దీంతో కొండపల్లి నుంచి ఈలప్రోలు, గుంటుపల్లి, రాయనపాడు, విజయవాడకు రాకపోకలు సాగించే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కార్లు, ఇతర వాహనాలు పాత వంతెనపై వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఆ మార్గంలో దాదాపుగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు సైతం రాళ్ల వంతెనపైనే భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చొరవ చూపి అప్రోచ్ పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కొండపల్లి

విశాఖపట్నం తరలిన సీఐటీయూ శ్రేణులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : సీఐటీయూ అఖిల భారత మహాసభల సందర్భంగా విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగ సభకు విస్సన్నపేట నుంచి సీఐటీయూ శ్రేణులు శనివారం తరలివెళ్లారు. సీఐటీయూ మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు, గెద్దల రామకృష్ణ, మర్రిబోయిన అప్పారావు, గంజినబోయిన రాము, పొట్లపల్లి బాబు, కార్మికులు పాల్గొన్నారు.

ఇరుముడితో శబరిమలకు పయనం


కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

గంపలగూడెం: స్థానిక చంద్రమౌళీశ్వర స్వామి గుడిలో శనివారం అయ్యప్ప స్వామి దీక్షదారుల ఇరుముడి కార్యక్రమం జరిగింది. గంపలగూడెం తదితర గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు ఇరుముడి స్వీకరించి శబరిగిరీశుని దర్శనానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా గంపలగూడెం శివాలయంలో అయ్యప్ప స్వామి భక్తులు, బంధుమిత్రులతో సందడి నెలకొంది.


కొండపల్లి : మాట్లాడుతున్న న్యాయవాది సురేష్


మైలవరంలో నివాళులర్పిస్తున్న తెదేపా నాయకులు


పెనుగొలనులో ఉపాధ్యాయినులకు సత్కారం


చెవుటూరులో..


రెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో..

సావిత్రీ బాయి ఫులే సేవలు ఎనలేనివి

జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో శనివారం నిర్వహించారు. భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీ బాయి ఫులే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, బృందం


కేతనకొండలో..


తిరువూరులో..


గొల్లపూడిలో దేవినేని ఉమా..


నరసాపురంలో..

వాస్తవ సమాచారంతో కొత్త పుస్తకాల ముద్రణ


గంపలగూడెం: ప్రసంగిస్తున్న ఆర్డీవో మాధురి, వేదికపై అధికారులు, నాయకులు


వినగడపలో భూ యజమాని హక్కు పత్రాలతో రైతులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ప్రభుత్వం రైతులకు ఇస్తున్న కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు సందేహాలకు తావివ్వకుండా క్షేత్ర స్థాయిలోని వాస్తవ సమాచారంతో రాజముద్రతో ఉన్నాయని తిరువూరు ఆర్డీవో కె.మాధురి స్పష్టం చేశారు. సాగు భూముల రీసర్వే పూర్తి అయిన గంపలగూడెంలో 1,040 మంది రైతులకు విడుదలైన కొత్త భూ హక్కు పత్రాల పంపిణీని ఆమె శనివారం ప్రారంభించారు. తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి, సర్పంచి కె.పుల్లమ్మ, ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఆర్.లక్ష్మీఅనిత, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.సత్యంబాబు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే : వినగడపలో తహసీల్దార్ వి.రాజకుమారి ఆధ్వర్యంలో గ్రామంలోని 1306 మంది రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి నిర్వహించిన సభలో తెదేపా మండల సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కోటగిరి శ్రీనివాసరావు, ఆర్ఐ ఎం. వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని పెదకొమిర ఏపీ ఆదర్శ పాఠశాలలో ఇంటరు విద్యార్థులకు పౌరశాస్త్రం బోధించేందుకు అతిథి అధ్యాపకుని పోస్టు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.సుధాకర్ తెలిపారు. ఎంఏ పాలిటిక్స్, బీఈడీ విద్యార్హత అభ్యర్థులు దరఖాస్తు చేయవచ్చన్నారు. నెలకు రూ. 12 వేలు వేతనం చెల్లిస్తారన్నారు.

సంఘటితమైతేనే సమాజానికి మేలు

మైలవరం, న్యూస్‌టుడే : సమాజం, ప్రజలు బాగుండాలన్నా అంతా సంఘటితమవ్వాలని శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి సూచించారు. స్థానిక ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశభక్తి లేని వారు దేశంలో ఉండటానికే అర్హులు కాదని తెలిపారు. క్రమశిక్షణ, శ్రద్ధ కలిగితేనే సాంప్రదాయాల పాటించడం సాధ్యమన్నారు. హిందూ చైతన్య వేదిక వ్యవస్థాపకుడు లలిత్‌కుమార్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ పటిష్ఠ సంస్థ అని, 75 వేల సమ్మేళనాలను నిర్వహించారని వివరించారు. అంతకు ముందు పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట హిందువులు జైశ్రీరామ్ నినాదాలతో ప్రదర్శన, కోలాట ప్రదర్శనలు చేశారు.


తిరువూరు: హిందూ సమ్మేళనంలో పాల్గొన్న అతిథులు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మండలం చింతలపాడు గ్రామంలో శనివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ, సాంస్కృతిక విలువలు పరిరక్షణపై వక్తలు ప్రసంగించారు. అనంతరం భజనలు, ధార్మిక గీతాలు, ఉపన్యాసాలు చేశారు. కార్యక్రమంలో శ్రీ నరసింహాచార్య స్వామిజీ, భరద్వాజ ఆనంద భారతి స్వామిజీ, పిన్నం.వెంగళరావు, కంభంపాటి మాధవి, అరిపిరాల.అప్పయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.


మైలవరం : సభలో మాట్లాడుతున్న శివస్వామి

ఘనంగా శివ ముక్కోటి పూజలు

మైలవరం : శివ ముక్కోటిని పురస్కరించుకుని మండలంలోని శివాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక భ్రమరాంబిక సమేత మల్లేశ్వర స్వామి ఆలయం, వెల్వడం శివాలయంలో అభిషేకాలు చేశారు. వెల్వడం ఆలయం వద్ద దీపాలతో శివలింగాకారంలో పూజించారు.


వెల్వడంలో శివలింగ ఆకారంలో వెలుగులు

కంభంపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని కంభంపాడు గంగా విజయదుర్గా సమేత నాగమల్లేశ్వర స్వామి దేవస్థానంలో శివ ముక్కోటి వేడుకలు నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో భక్తులకు కైలాస ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాటు చేశారు.

ఆలయానికి విరాళం అందజేత

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి గుడికి పలువురు భక్తులు రూ.35 వేలు వితరణగా అందించారని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు తెలిపారు. రాజవరం గ్రామ వాస్తవ్యులు నాళ్లా శ్రీనివాసరావు, సౌజన్య దంపతులు రూ.25 వేలు, ఊటుకూరు వాస్తవ్యులు నేరెళ్ల రోశయ్య, విజయకుమారి దంపతులు రూ.10 వేలు అందజేశారు. దాతలు తమ విరాళాన్ని ఆలయాభివృద్ధికి వినియోగించాలని కోరారు.

ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల్లో ఎన్టీటీపీఎస్ యాజమాన్యం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య సూచించారు. మూలపాడు ప్రాథమిక పాఠశాలలో ఎన్టీటీపీఎస్ యాజమాన్యం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ సూచనల మేరకు ఎన్టీటీపీఎస్ యాజమాన్యం సామాజిక బాధ్యతగా కాలుష్య ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తూ వైద్య సేవలను అందిస్తుందని చెప్పారు


పర్యవేక్షిస్తున్న జంపాల, ఎంపీడీవో శకుంతల తదితరులు

ప్రకటన

నా క్లయింటు కొండపల్లి గ్రామ కాపురస్తురాలైన వెంకటేశ్వరరావు గారి భార్య నాగరాణి గారి సూచన ప్రకారము తెలియజేయునది ఏమనగా.. నా క్లయింటు కొండపల్లి గ్రామ R.S. No. 438/1 D.No: 3-66 దాఖలా ఆస్తికి కామందులై ఉన్నారు. సదరు ఆస్తిని నా క్లయింటు దస్తావేజు నెం. 3625/2018 (SRO Ibrahimpatnam) రీత్యా సంక్రమించినది. సదరు ఆస్తికి ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 830/99 Dt. 22-4-1999 (SRO Ibrahimpatnam) ను మరికొన్ని దస్తావేజులను Photostat నిమిత్తము ది. 31-12-2025వ తేదీన కొండపల్లి Main Road లో గల Xerox Shopకు తీసుకుని వెళుతుండగా సదరు దస్తావేజులు గల బ్యాగు గైరువీలు అయినది. కావున ఎవరికైననూ సదరు బ్యాగు, అందులోని ఒరిజినల్ దస్తావేజు దొరికిన యెడల క్రింది అడ్రస్సులో ఇచ్చి తగిన బహుమతి పొందగోరియున్నారు. అట్లు కాక సదరు ఒరిజినల్ దస్తావేజుతో ఎవరైననూ ఆస్తిని అన్యాక్రాంతములు చేసిన యెడల నా క్లయింటు వారిపై తగు Civil, Criminal చర్యలు తీసుకొనెదరని మరియు నా క్లయింటును గాని, సదరు ఆస్తిని గాని బైండు చేయజాలవు.

T.V.N. Vasudevarao, Advocate
Gudivada Vari Street, Vijayawada-520 001. A.P



ప్రపంచ తెలుగు మహాసభల ప్రారంభ వేదికపై మహా సహస్రావధాని కడిమిళ్ల వరప్రసాద్, మహాసభల సమన్వయకర్త రామచంద్రరాజు, తానా పూర్వ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, ఆధ్యాత్మిక గురువు విశ్వయోగి విశ్వంజీ, నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ పూర్వ డైరెక్టర్ జస్టిస్ రఘురామ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ, రాష్ట్ర శాసనసభాపతి సీహెచ్ అయ్యన్నపాత్రుడు, సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ, కొప్పరపు పీఠం వ్యవస్థాపకుడు మాశర్మ, విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తదితరులు



శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద చిన్నారుల స్వీయచిత్రం

పలుకులో తెలుగు.. మోములో వెలుగు


✦ ఘనంగా ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారంభం

✦ తరలివచ్చిన అతిథులు.. సందడిగా ప్రాంగణాలు

అక్షరం అలరించింది... పదం పులకరించింది. అమృత తుల్యమైన భాష ఇలా, ఆకట్టుకునే ప్రసంగాలతో అడుగడుగునా తెలుగుదనం ఉట్టిపడింది. సంప్రదాయ వస్త్రధారణల్లో మాతృభాషాభిమానుల సందడి ఓ వైపు.. సంస్కృతిని ప్రతిబింబించే నృత్య రూపకాలు మరోవైపు.. ఆ మధ్యన సుమధుర గీతాలాపనలతో మనసు దోచుకున్న గాయకులు ఇంకోవైపు.. ఇలా ఎన్నో ప్రత్యేకతలతో మూడో ప్రపంచ తెలుగు మహాసభల ప్రాంగణం అలరారింది. ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ సాగిన ఆధ్యాత్మిక క్రతువులు మన ఆచార, వ్యవహారాలను చాటిచెప్పగా.. 'ఈనాడు' వ్యవస్థాపకులు దివంగత రామోజీరావు హస్తకళల ప్రదర్శనల ప్రాంగణంలోని కళాఖండాలు మన కళాకారుల సృజన, నైపుణ్యాలకు అద్దం పట్టాయి. మొత్తంగా తొలిరోజు కార్యక్రమాలు అశేష అమరావతి ప్రజల గుండెను తాకాయి. గర్తపురి ఘనచరిత్రలో సరికొత్త పేజీని లిఖించాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని ఏటుకూరు బైపాస్ రోడ్డులోని సత్యసాయి ఆధ్యాత్మిక నగరిలో మూడో ప్రపంచ తెలుగు మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఘంటసాల, ఎస్పీ బాలు వేదికపై చత్తీస్‌గఢ్, బెంగళూరు, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి వచ్చిన గాయకులు తెలుగు పాటలతో అలరించారు. శ్రీనాథ కవి సార్వభౌమ వేదికపై కవి సమ్మేళనాలు, పద్య సదస్సులు తెలుగు భాష మాధుర్యాన్ని రుచి చూపించాయి.



తెలుగుతల్లి విగ్రహం వద్ద హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల శేషసాయి, టీడీ జనార్దన్, శాసనసభ స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు, గజల్ శ్రీనివాస్



వివిధ కళల సమాహారం

తెలుగుపై మమకారం.. అమ్మోరు తల్లి నృత్యం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: దశాబ్దాలుగా దిల్లీలో ఉన్నా... తెలుగు భాషపై వారికున్న మమకారం గుంటూరు రప్పించింది. తెలుగు ఖ్యాతిని, సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ ప్రపంచ తెలుగు మహాసభల్లో అమ్మోరు తల్లి నృత్యం చేసేందుకు దిల్లీ నుంచి వచ్చామని లలిత కళావాహిని సంస్థ నిర్వాహకులు మున్నంగి కుసుమ, పార్వతీరెడ్డి తెలిపారు. రాష్ట్రేతర తెలుగు సమాఖ్య తరఫున తమకు అవకాశం కల్పించారని ఆమె వివరించారు. ఇప్పటికీ ఇక్కడి పండగలను మన సంస్కృతి, ప్రతిబింబించేలా నిర్వహించుకుంటామని, అక్కడి వారందరికీ ఆ సంప్రదాయాలను తెలియజేస్తున్నామన్నారు. తెలుగు పండగలు, మాతృ భాష అంటేనే ఒళ్లు పులకరించిపోతుందన్నారు.



లలిత కళావాహిని సంస్థ బృంద ప్రదర్శన

సంగీత చక్రం

72 జనక రాగాలతో తయారీ

స్వరాలు ఏడే అయినా సంగీతం ఒక సముద్రం. కర్ణాటక సంగీతమైతే మహా సముద్రమే. ఇందులో 72 జనక రాగాలతో 'శ్రీ స్వర సంగీత 72 మేళకర్త చక్రం' స్వహస్తాలతో రూపొందించారు చెన్నైకి చెందిన లేళ్లపల్లి శేషాచల రమేష్, శ్రీదేవి దంపతులు. జనక రాగాలనే మేళకర్త రాగాలు అంటారు. 72 మేళకర్త రాగాలను ఎలాంటి వారికైనా ఎంతో సులభంగా అర్థమయ్యేలా తీర్చిదిద్దారు. చక్రాన్ని రెండు భాగాలుగా విభజించారు. ఒక్కో వైపు ఆరు చక్రాలుంటాయి. ఒక్కో చక్రంలో 6 రాగాలుంటాయి. వాటి స్వరస్థానాలు కీబోర్డ్ మీద చుక్కల(డాట్స్) రూపంలో సూచించారు. వీటిని చూసి స్వరాన్ని అనుభూతి చెంద వచ్చు. దృశ్యీకరణ చేయవచ్చు. ఈ చక్రంలో కర్ణాటక రాగాలతో కాకుండా హిందుస్థానీ, వెస్టర్న్ స్కేల్స్ కూడా ఉంటాయి. వెస్టర్న్ స్కేల్స్‌తో కర్ణాటక రాగాలను అనుసంధానం చేస్తే తేలిగ్గా నేర్చుకోవచ్చని రమేష్ వివరించారు.





సీతా సమేత శ్రీరామ లక్ష్మణ హనుమ వేషధారణ

విద్యార్థుల కోలాహలం

ఉమ్మడి జిల్లా నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీగా తరలివచ్చారు. స్టాళ్లను సందర్శించి పుస్తకాలు, పురాతన నాణేలు, ఛాయాచిత్రాలను ఆసక్తిగా తిలకించారు. తెలంగాణ, గుజరాత్, కేరళ, కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాలతోపాటు అమెరికా నుంచి కూడా ప్రవాసాంధ్రులు హాజరయ్యారు. వీరిలో 60 నుంచి 80 సంవత్సరాల్లోపు వృద్ధులు ఉండటం గమనార్హం.

డెన్మార్క్‌లో మన సంస్కృతి



పూర్ణకుంభ పురస్కారం అందుకుంటున్న పొట్లూరి అమర్నాథ్

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఉద్యోగరీత్యా డెన్మార్క్‌లో స్థిరపడ్డ పొట్లూరి అమర్నాథ్ తెలుగు భాషపై మమకారంతో 'మన సంస్కృతి' అనే సంస్థను స్థాపించి తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెబుతున్నారు. డెన్మార్క్ తెలుగు బాషా సంఘం అధ్యక్షుడిగా ప్రస్తుతం కొనసాగుతున్న ఆయన ప్రతి ఆదివారం తెలుగు భాషపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సంప్రదాయ పండగలను నిర్వహిస్తూ అక్కడి వారికి మన సంస్కృతి చాటి చెబుతున్నారు. గుంటూరు వేదికగా జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో పూర్ణకుంభ పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు మహాసభల వేదికగా పురస్కారం అందుకోవడం అత్యంత ఆనందంగా ఉందని అమర్నాథ్ తెలిపారు.

వేయి నామాల వాడ.. వేయి గళముల తోడ..!

అన్నమయ్య సంకీర్తనల సహస్ర గళార్చనతో ఆకట్టుకున్న చిన్నా పెద్దలు



వేయి నామాల వాడైన ఆ వేంకటేశ్వరుణ్ని సహస్ర గళాలతో కీర్తించారు.. చిన్నాపెద్దా అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పదం పలికి, స్వరం కలిపి రమ్యంగా స్తుతించారు.. కళ్ల ముందు ఆజానుబాహుడిగా కొలువుదీరిన వెంకన్న విగ్రహం ఎదుట అన్నమయ్య సంకీర్తనల ప్రవాహాన్ని వినిపించారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభల ప్రారంభ కార్యక్రమం ఇందుకు వేదిక కాగా.. సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ సుమధుర యజ్ఞంలో అనేక అన్నమయ్య సంకీర్తనలను గానం చేయడం విశేషం. అదివో అల్లదివో శ్రీహరివాసము.. పదివేల శేషుల పడగలమయము.. అదె వేంకటాచల మఖిలోన్నతము.. అంటూ పిల్లలు పాడుతుంటే పెద్దలు గొంతు కలిపారు. ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు.. దిద్దరాని మహిమల దేవకీ సుతుడు.. అంటూ బాలకృష్ణుడిని వర్ణించిన తీరు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంది. - ఈనాడు, అమరావతి

మూడు రోజులు.. నిరంతర పాటల ప్రవాహం



గాయకుల గీతాలాపన

ఘంటసాల-బాలు 'పాడనా తెలుగు పాట' వేదిక కమ్మని పాటలతో మార్మోగింది. వివిధ రాష్ట్రాల నుంచి 180 మందికి పైగా తెలుగు గాయకులు తరలివచ్చారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి సోమవారం రాత్రి వరకు నిరంతరాయంగా ఈ పాటల వెల్లువ కొనసాగనుంది. పాత, కొత్త చిత్రాల నుంచి తెలుగు సాహిత్యం ప్రధానంగా ఉన్న పాటలను ఎంచుకుని ఆలపించారు. ఇలా మూడు రోజుల పాటు నిరంతరాయంగా పాటల ప్రవాహం కొనసాగడం ఇదే ప్రథమం అని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈనాడు - అమరావతి న్యూస్‌టుడే - గుంటూరు సాంస్కృతికం, జిల్లా పరిషత్తు, కలెక్టరేట్, కార్పొరేషన్, గుంటూరు నగరం, రూరల్, మంగళగిరి అర్బన్, తెనాలి

జగన్మాత సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాతను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. వారికి అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, ఏఈవో వెంకటరెడ్డి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ సుజాతకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ రంగారావు

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.3.06 కోట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో శుక్రవారం లెక్కించారు. కానుకల్లో రూ.3,06,65,288 నగదుతోపాటు 341 గ్రాముల బంగారం, 3.586 కిలోల వెండి వస్తువులు భక్తులు మొక్కుల రూపంలో చెల్లించారు. అమెరికన్ డాలర్లు 6523, ఇంగ్లాండ్ ఫౌండ్స్ 1060, కువైట్ దీనార్లు 322, ఆస్ట్రేలియా డాలర్లు 19, కెనడా డాలర్లు 340, హాంకాంగ్ డాలర్లు 100 వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. సీసీ కెమెరాల నిఘాతో కానుకల లెక్కింపును సెక్యూరిటీ, ఎస్పీఎఫ్, వన్‌టౌన్ పోలీసులు పరిశీలించారు. కానుకల లెక్కింపును దేవస్థానం ఈవో శీనానాయక్ పర్యవేక్షించారు.



కానుకలు లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది

కనులపండువగా ఆది దంపతుల గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో పౌర్ణమిని పురస్కరించుకొని ఆదిదంపతుల గిరిప్రదక్షిణను కనుల పండువగా శుక్రవారం నిర్వహించారు. గంగా పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా పూజ నిర్వహించారు. అనంతరం దుర్గగుడి టోల్ గేటు సమీపంలోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి ఊరేగింపును ఈవో శీనా నాయక్ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటరు, సితార సెంటరు, పాల ఫ్యాక్టరీ, నెహ్రూ బొమ్మ సెంటరు, రథం సెంటరు మీదుగా తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుకుంది. దారి పొడవున భక్తులు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. సంప్రదాయ కోలాటం, డప్పు నృత్యాలు ఊరేగింపునకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వర్ణ కవచాలంకృత రూపంలో ఉన్న దుర్గమ్మను దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు.



ఊరేగింపు ప్రారంభిస్తున్న ఈవో శీనానాయక్

7న ప్రతిభ గల క్రికెటర్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో అండర్-14 ప్రతిభ గల క్రికెటర్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఆ సంఘం కార్యదర్శి ఎం.రవీంద్రచౌదరి తెలిపారు. జిల్లా అండర్-14 జట్టు(15 మంది)లో లేని క్రీడాకారులు మాత్రమే ఈ ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. ఏసీఏ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు, అండర్-14 జిల్లా జట్లలో స్థానం లభించని వారిని ఎంపిక చేయడానికి పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 6వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. నవంబరు ఒకటి, 2011 తర్వాత జన్మించిన వారై ఉండాలని ఆయన సూచించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో చిరునామా గల ఆధార్ కార్డు, తెల్లని దుస్తులు, సొంత క్రికెట్ కిట్‌తో 7వ తేదీ ఉదయం 8 గంటలకు స్టేడియంలోని జిల్లా క్రికెట్ సంఘ కార్యాలయంలో రిపోర్టు చేయాలని తెలిపారు.

'వైకాపా నాయకుల నుంచి ప్రాణహాని ఉంది'

గాంధీనగర్, న్యూస్‌టుడే : వైకాపా నాయకుల నుంచి తనకు ప్రాణహాని ఉందని.. ప్రభుత్వం రక్షణ కల్పించాలని ప్రసాదంపాడుకు చెందిన బాధితుడు దివాకరుణి శ్రీరామ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రసాదంపాడుకు చెందిన వైకాపా నాయకుడు కొమ్మ కోటేశ్వరరావు అనుచరులు ఇమ్మడి శ్రీను, అతని తండ్రి వెంకటేశ్వరరావులు తన ఇంటి ముందుకు వచ్చి దుర్భాషలాడుతున్నారని చెప్పారు. తన కుటుంబ సభ్యులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఇప్పటి వరకు న్యాయం జరగలేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న శ్రీరామ్‌కుమార్

హత్యాయత్నం కేసులో వంశీ అనుచరులకు రిమాండ్

ఈనాడు, అమరావతి: హత్యాయత్నం కేసులో వైకాపా నేత వల్లభనేని వంశీ అనుచరులు ఇద్దరిని మాచవరం పోలీసులు పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరుపర్చారు. సత్యవర్ధన్‌పై దాడి, అపహరణ కేసులో నెల్లూరు కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న కొమ్మా కోట్లు, తేలప్రోలు రామును శనివారం విజయవాడ తెచ్చి కోర్టులో హాజరుపర్చారు. వీరికి న్యాయాధికారి ఈనెల 16వ తేదీ వరకు రిమాండ్ విధించడంతో తిరిగి నెల్లూరు కారాగారానికి తరలించారు. ఈ కేసులో వంశీ ఏ1గా ఉన్నారు. తొందరపాటు చర్యలు వద్దని వంశీకి హైకోర్టు నుంచి ఉపశమనం లభించింది. గత ఏడాది ఎన్నికల అనంతరం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అనుచరుడిపై తీవ్రంగా దాడి చేసి.. హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో ఇటీవల బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మిగిలిన నిందితుల కోసం మాచవరం పోలీసులు గాలిస్తున్నారు.

మేనత్త ఇంటికే కన్నమేశాడు!

జల్సాలకు అలవాటుపడి చోరీలు

పాయకాపురం, న్యూస్‌టుడే : జల్సాలకు అలవాటు పడిన ఓ యువకుడు.. సొంత మేనత్త ఇంట్లోనే రూ.లక్షలు విలువ చేసే బంగారాన్ని కాజేశాడు. సాంకేతిక ఆధారాలతో క్రైం సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ వెంకటేశ్వర్లు శనివారం నున్న పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. వాంబేకాలనీకి చెందిన అరుణ విజయవాడ నగరపాలక సంస్థలో స్వీపర్‌గా పని చేస్తున్నారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి స్థానికంగా ఉన్న చర్చిలో వంట పని నిమిత్తం వెళ్లారు. తర్వాత ఆమె పెద్దకుమారుడు ఇంటికి వచ్చారు. వెనుక వైపు తలుపు పగలకొట్టి, బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో బంగారు ఆభరణాలు మాయమైనట్లు గుర్తించి తల్లికి ఫోన్ చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీలు ఎక్కువగా జరుగుతుండడంతో పోలీసులు నిఘా పెట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా అనుమానితులను గుర్తించే పనుల్లో నిమగ్నమయ్యారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

ఆదాయం సరిపోవడం లేదని..

గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన గండికోట మనోజ్‌కుమార్ (19) తన తండ్రితో కలిసి విగ్గుల వ్యాపారం చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడ్డాడు. మద్యానికి బానిసయ్యాడు. వచ్చే ఆదాయం సరిపోక దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో వాంబేకాలనీలో ఉండే మేనత్త అరుణ ఇంట్లో బంగారం ఉందని తెలుసుకుని ఇక్కడికి వచ్చాడు. వారి కదలికలను గమనించాడు. డిసెంబరు 31వ తేదీ రాత్రి ఆమె చర్చికి వెళ్లిన తర్వాత.. ఇంటి వెనుక తలుపులు పగలకొట్టి లోపలికి వెళ్లాడు. బీరువాలోని బంగారం, వెండి నగలు అపహరించాడు. వాటిని అమ్మేందుకు శనివారం సాయంత్రం వన్‌టౌన్, పాత శివాలయం సమీపంలోని బంగారు దుకాణాల వద్దకు వెళ్లాడు. క్రైం సీసీఎస్ పోలీసులకు అందిన సమాచారంతో అక్కడ తనిఖీలు చేపట్టారు. అనుమానంగా తిరుగుతున్న మనోజ్‌కుమార్‌ను పట్టుకుని విచారించగా.. చేసిన దొంగతనాన్ని ఒప్పుకున్నాడు. అతడి వద్ద సుమారు రూ.23 లక్షల విలువైన 123 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. విలేకర్ల సమావేశంలో క్రైం సీసీఎస్ సీఐ శ్రీనివాసరావు, పీసీఎస్‌లు ప్రకాష్, రాజు, అప్పలరాజు, ఫణిరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులను ప్రోత్సహిద్దాం

పటమట, న్యూస్‌టుడే: ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తులను ప్రోత్సహించి గాంధీజీ కలలు కన్న గ్రామీణ భారతాన్ని నిర్మిద్దామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. పంట కాలువ రోడ్డులోని స్టెల్లా ఆడిటోరియంలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఖాదీ మహోత్సవ్ 2025-26ని శనివారం ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయవాడలో ఏర్పాటు చేసిన ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అనేక మంది హస్త కళాకారులు, పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారని తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే ప్రధాని మోదీ ఆశయానికి, సీఎం చంద్రబాబు 'స్వర్ణాంధ్ర' లక్ష్యానికి లోకల్ బ్రాండ్‌లను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. ఖాదీ పరిశ్రమల రాష్ట్ర సంచాలకుడు ఎస్.గ్రీప్ మాట్లాడుతూ.. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్, భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో పీఎంఈజీపీ ఖాదీ మార్కెటింగ్ ఎగ్జిబిషన్ ప్రారంభించినట్లు తెలిపారు. ఎగ్జిబిషన్ 10 రోజుల పాటు నగర ప్రజలకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ మాట్లాడుతూ... ఖాదీ గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి ఫలాలు సామాన్యులకు అందేలా ప్రతిఒక్కరూ సహకారం అందించాలని సూచించారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ సహాయ సంచాలకుడు ఆర్.ఎల్.ఎన్.మూర్తి, కార్పొరేటర్ దేవినేని అపర్ణ, పరిశ్రమల శాఖ స్పెషల్ డైరెక్టర్ ఎ.రామ లింగేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎంపీ శివనాథ్, గ్రీప్, గద్దె అనురాధ తదితరులు

క్రీడలతో మానసికోల్లాసం

మధురానగర్, న్యూస్‌టుడే : క్రీడలు మానసిక ఉల్లాసం కలుగుతుందని, బృంద స్ఫూర్తిని కలిగిస్తాయని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ బి.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయంలో శనివారం స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. వక్తలతో కలిసి పావురాలు, బెలూన్లు ఎగురవేసి పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల విధి నిర్వహణలో చురుకుగా ఉండొచ్చన్నారు. శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని చెప్పారు. ఉద్యోగులు ప్రతిభ చాటాలని సూచించారు. మధుమేహ వైద్య నిపుణుడు కె.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. క్రీడలతో చక్కని ఆరోగ్యం సొంతమవుతుందని, డయాబెటిస్ వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని వివరించారు. ముద్రణాలయం డీజీఎం ఎల్.మోహన్‌కుమార్ మాట్లాడుతూ.. చరవాణులకు బానిస కాకుండా ఇలాంటి పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కమాండెంట్ ఎం.శంకరరావు మాట్లాడుతూ.. వాలీబాల్ పోటీలను రెండు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాగవరపు శరత్, అసిస్టెంట్ కమాండెంట్ పి.హేమసుందరరావు, సి.హెచ్.విజయ్‌కుమార్, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పావురాలు ఎగురవేస్తున్న డాక్టర్ వేణుగోపాలరెడ్డి, ఐజీ వెంకటరామిరెడ్డి. పక్కన డీజీఎం మోహన్‌కుమార్, కమాండెంట్ శంకరరావు

ఇంజెక్షన్ కోసం డబ్బులు కడితే నిలువునా మోసం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : మధుమేహానికి వినియోగించే ఇంజెక్షన్ ధర రూ.17,500. ఆన్‌లైన్‌లో రూ.13వేలకే దొరుకుతుందంటే.. 'బిజినెస్ టు బిజినెస్' అనే సంస్థ వెబ్‌సైట్‌ను పరిశీలించారు. మరుక్షణం దేశం నలుమూలల నుంచి ఇంజెక్షన్ విక్రయిస్తామంటూ ఫోన్లు వచ్చాయి. ఒకరికి రూ.13వేలు కట్టి మోసపోయిన యువకుడు సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... కంసాలిపేటకు చెందిన శరత్ అనే యువకుడు మధుమేహానికి వినియోగించే ఇంజెక్షన్ కోసం శుక్రవారం మధ్యాహ్నం పేరొందిన బిజినెస్ సంస్థ వెబ్‌సైట్‌ను క్లిక్ చేశారు. ఆ వెంటనే ముంబయి, దిల్లీ, చెన్నై తదితర ప్రాంతాల నుంచి డీలర్లు ఫోన్లు చేసి తాము పంపిస్తామన్నారు. దూర ప్రాంతాలు కావడంతో కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపలేదు. ఈ లోగా ఒక వ్యక్తి హైదరాబాద్ నుంచి అంటూ ఫోన్ చేసి, హిందీలో మాట్లాడాడు. శనివారం ఉదయం కల్లా పంపిస్తానని హామీ ఇచ్చాడు. ఆ వ్యక్తి చెప్పిన సంస్థ 'బిజినెస్ టు బిజినెస్'.. వెరిఫైడ్ సప్లయిర్ అని ఉండడంతో నమ్మి ఫోన్ పేలో డబ్బులు కట్టేశారు. కులదీప్ అనే పేరు మీద డబ్బులు బదిలీ అయ్యాయి. శనివారం ఉదయం కొరియర్ కోసం ఎదురు చూసినా రాలేదు. దీంతో సదరు నంబరుకు ఫోన్ చేశారు. ఒక యువతి ఫోన్ ఎత్తారు. వివరాలు చెప్పగానే స్పందించడం మానేశారు. మోసపోయినట్లు గుర్తించిన యువకుడు విజయవాడ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అక్కడి సిబ్బంది స్పందించలేదని చాలా సేపు ఎదురు చూసి.. తానే స్వయంగా సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేసుకున్నానని బాధితుడు శరత్ తెలిపారు.

ఈనాడు సినిమా

తిరిగెళ్లే ఆలోచనే లేదు..


విజయ్

"ప్రజలకు మంచి చేస్తానంటూ ఇందులోకి రాకు.. నిన్ను నువ్వు కాపాడుకొని పారిపో.." అంటూ విజయ్‌కు సవాల్ విసురుతున్నాడు ప్రతినాయకుడు. మరి దీన్ని ఆయనెలా తిప్పికొట్టారో తెలియాలంటే 'జన నాయకుడు' సినిమా చూడాల్సిందే. విజయ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి హెచ్.వినోద్ దర్శకత్వం వహించారు. పూజా హెగ్డే, మమితా బైజు, బాబీ దేఓల్ కీలక పాత్రలు పోషించారు. శనివారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. "చితక్కొట్టడంలో కూడా రికార్డు ఉన్న వాడి పేరు విన్నావా? అతనే దళపతి.. ముట్టుకోకు ముక్కలు చేసేస్తాడు" అంటూ తండ్రీకూతుళ్ల అనుబంధం, రాజకీయాలు లాంటి అంశాల చుట్టూ తిరుగుతున్న ఈ ట్రైలర్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. 'నిన్ను నాశనం చేస్తాను.. అవమానిస్తాను అని ఎవడు చెప్పినా తిరిగెళ్లే ఆలోచనే లేదు.. ఐయామ్ కమింగ్' అని ఆఖర్లో విజయ్ చెప్పిన డైలాగ్ సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ఈ నెల 9న థియేటర్లలోకి రానుంది.

మౌన పోరాటం


అదితీరావ్ హైదరీ


విజయ్ సేతుపతి

సినిమా ప్రపంచం అంటేనే మాటలు.. పాటలు. కానీ మాటలు లేకుండా భావాలను చెప్పొచ్చని చూపించిన 'పుష్పక విమానం' సినిమా భారతీయ సినీ చరిత్రలోనే ఓ అద్భుతమైన ప్రయోగం. అగ్రహీరో కమల్ హాసన్ నటించిన ఈ మూకీ చిత్రం మాస్టర్ పీస్‌గా నిలిచింది. ఇప్పుడీ బాటలోనే 'గాంధీ టాక్స్' అనే మరో సినిమా రాబోతుంది. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి, అదితీరావ్ హైదరీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. కిశోర్ పాండురంగ్ బేలేకర్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలు అందుకుందీ సినిమా. తాజాగా దీన్ని ఈ నెల 30న థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "వారు మౌనంగా ప్రేమిస్తారు. మౌనంగానే పాపం చేస్తారు.. ఇబ్బందులు కూడా పడతారు" అనే వ్యాఖ్యను జోడించింది. నేటి సమాజంలో డబ్బు, అవసరాలు, విలువలు మనిషిని ఎలా ప్రభావితం చేస్తున్నాయో చూపిస్తున్న ఈ టీజర్‌కు ఏఆర్ రెహమాన్ నేపథ్య సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సిద్ధార్థ్ జాదవ్ కీలక పాత్ర పోషించారు. మరి పాన్ ఇండియా, భారీ బడ్జెట్లు అంటూ జోరుమీదున్న ఈ చిత్రసీమలో ఈ సినిమా ప్రయోగం ప్రేక్షకుల్ని మెప్పిస్తుందో లేదో చూడాలి.

రజనీ 173.. దర్శకుడు ఖరారు


రజనీ కాంత్


కమల్ హాసన్

కథానాయకుడు రజనీకాంత్ 173వ చిత్రాన్ని కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకి తొలుత సి.సుందర్‌ను దర్శకుడిగా ప్రకటించినప్పటికీ ఆ తర్వాత తను దర్శకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో ఇప్పుడీ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశాన్ని 'డాన్' ఫేమ్ శిబి చక్రవర్తి అందుకున్నారు. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ శనివారం అధికారికంగా ప్రకటించింది. ఇది మంచి ఎంటర్‌టైన్‌మెంట్, అద్భుతమైన విజువల్స్‌తో ప్రపంచవ్యాప్తంగా ఉన్న రజనీ అభిమానులకు స్పెషల్ ట్రీట్‌గా ఉంటుందని.. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ మొదలవుతుందని.. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకొస్తుందని చిత్ర వర్గాలు తెలిపాయి. దీనికి అనిరుధ్ సంగీతమందిస్తున్నారు. ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.

'దిల్ దియా'... ఓ నగ్న సత్యం!


చైతన్యరావు, సందీప్‌రెడ్డి, కె.క్రాంతిమాధవ్

ఆధునిక సంబంధాల్ని నిజాయతీగా ఆవిష్కరించే ప్రయత్నమే మా చిత్రం అంటున్నారు పూర్ణనాయుడు. ఆయన నిర్మాతగా... చైతన్యరావు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'దిల్ దియా'. ఏ నేక్డ్ ట్రూత్... అనేది ఉపశీర్షిక. కె.క్రాంతిమాధవ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇరా, సఖి, జెస్సీ కథానాయికలు. మణిచందన, ప్రమోదిని, వీరశంకర్ కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం చిత్రీకరణ చేసుకొంటున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేశారు. పోస్టర్ చాలా ఆసక్తికరంగా, లోతైన భావాన్ని చెప్పేలా ఉందంటూ అభినందించారు. 'ఓనమాలు'తో ప్రయాణం మొదలుపెట్టిన క్రాంతిమాధవ్ 'వరల్డ్ ఫేమస్ లవర్' తర్వాత తెరకెక్కిస్తున్న చిత్రమిది. ప్రేమ, మోహం, వైఫల్యం, సాన్నిహిత్యం, ఆత్మగౌరవం తదితర అంశాలతో ముడిపడిన కథని నేటి తరానికి నచ్చేలా దర్శకుడు చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని, ప్రేమ, భావోద్వేగాల సంక్లిష్టతని ఇందులో ఆవిష్కరించే తీరు బాక్సాఫీస్‌కి కొత్త భాషను పరిచయం చేసేలా ఉంటుందని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: పి.జి.విందా, సంగీతం: ఫణికల్యాణ్, కూర్పు: రా - షా (రవి - శశాంక్), ప్రొడక్షన్ డిజైన్: చిన్నా.

చంద్రిక బతికే ఉందా?


'కానిస్టేబుల్ కనకం 2'

"చంద్రిక లేదు.. ఇక రాదని మన డిపార్ట్‌మెంట్‌తో పాటు ఊరంతా నమ్ముతున్నారు.. నీకెందుకు ఈ విషయం అర్థం కావట్లేదు" అంటూ కనకమహాలక్ష్మికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాడు ఓ వ్యక్తి. మరి ఊరంతా నమ్ముతుంది అబద్ధమని ఈ లేడీ కానిస్టేబుల్ ఎలా నిరూపించింది? ఇంతకీ చంద్రిక బతికే ఉందా? లేదా? అనేది తెలుసుకోవాలంటే 'కానిస్టేబుల్ కనకం 2' సిరీస్ చూడాల్సిందే. వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 8న ఈటీవీ విన్‌లో రాబోతుందీ సిరీస్. ఈ నేపథ్యంలోనే శనివారం దర్శకుడు నాగ్‌అశ్విన్ ఈ సిరీస్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 'అడవి గుట్ట రహస్యాన్ని ఛేదించిన లేడీ కానిస్టేబుల్ కనకమహాలక్ష్మి' అంటూ ఆద్యంతం మలుపులతో ఆసక్తికరంగా సాగుతోందీ ట్రైలర్. రాజీవ్ కనకాల, మేఘలేఖ, శ్రీనివాస్ అవసరాల తదితరులు కీలక పాత్రలు పోషించారు.


అనుపమ్ ఖేర్ @ 550


అనుపమ్ ఖేర్

తన కెరీర్‌లో ఈ మైలురాయి కేవలం ఒక ఇంటర్వెల్ పాయింట్ లాంటిదని అంటున్నారు బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్. దశాబ్దాలుగా చిత్రసీమలో రాణిస్తున్న ఆయన.. కొత్త ఏడాది సందర్భంగా తన 550వ సినిమా 'ఖోస్లా కా ఘోస్లా 2' షూటింగ్‌ను ప్రారంభించారు. ఆయన ప్రధాన పాత్రలో ఉమేశ్ బిస్ట్ తెరకెక్కిస్తున్నారు. దిల్లీలో ఈ సినిమా పట్టాలెక్కినట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టారు అనుపమ్. "మీరు భారతీయ సినిమాకు చెందిన మారథాన్ మ్యాన్ అన్నమాట' అని గతేడాది కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో నేను నటించిన సినిమాల సంఖ్య చెప్పినప్పుడు ఓ అంతర్జాతీయ దర్శకుడు నాతో అన్న మాట ఇది. ఈరోజు నా 550వ సినిమాను మొదలుపెట్టినప్పుడు.. మనసు కృతజ్ఞతతో నిండిపోయింది. 1981 జూన్ 3న కలల నగరం అయిన ముంబయిలో అడుగుపెట్టినప్పుడు ఈ మైలురాయిని చేరుకుంటానని ఊహించలేదు. నాలో ఇంకా చేయాలనే తపన ఉంది. కానీ ఇన్నేళ్లుగా నేను చిత్రసీమలో నిలదొక్కుకోవడానికి కారణం నా నిర్మాతలు, దర్శకులు, సహనటులు.. అన్నికంటే ముఖ్యంగా ప్రేక్షకుల ప్రేమ" అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

బెల్లంకొండ.... 'రామమ్'

గత ఏడాది 'కిష్కింధపురి'తో విజయాన్ని అందుకున్నారు యువ కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఈ ఏడాది వరస సినిమాలలో సందడి చేయడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. శనివారం సాయి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఆయన సినిమాలకు సంబంధించిన కొత్త విశేషాలను వెల్లడించాయి ఆయా చిత్రబృందాలు. శ్రీనివాస్ హీరోగా 'రామమ్' అనే కొత్త చిత్రాన్ని ప్రకటించారు. లోకమాన్య దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. ఇది ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. సాయి శ్రీనివాస్ ఇందులో అకీరా అనే పాత్రలో కనిపించనున్నట్లు శనివారం విడుదల చేసిన ప్రీలుక్‌తో స్పష్టత ఇచ్చారు. సాయి శ్రీనివాస్ నటిస్తోన్న మరో చిత్రం 'హైందవ'. లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని మహేశ్ చందు నిర్మిస్తున్నారు. సంయుక్తా మేనన్ కథానాయిక. ఈ సినిమా నుంచి కొత్త లుక్‌ని విడుదల చేశారు. అందులో తను ఓ చేతిలో గొడ్డలి.. మరో చేతిలో మండుతున్న ముసుగుతో యాక్షన్ కోణంలో కనిపించారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మెరిసే కళ్లతో దూసుకొస్తున్న వరాహరూపం ఆసక్తి రేకెత్తించింది. ఆయన నటిస్తోన్న మరో చిత్రం 'టైసన్ నాయుడు' నుంచీ ఓ కొత్త స్టిల్ విడుదలైంది.


'హైందవ'లో సాయి శ్రీనివాస్

యాలో ఈ గుబులే ఏలో


మహేంద్రన్, సాహితి


శ్రద్ధా దాస్, మాస్టర్ మహేంద్రన్, అజయ్, సాహితి ప్రధాన పాత్రధారులుగా మణి తెల్లగూటి తెరకెక్కించిన చిత్రం 'త్రికాల'. రాధిక శ్రీనివాస్ నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల దీని నుంచి "యాలో ఈ గుబులే ఏలో.." అనే పాటను విడుదల చేశారు. హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరాలందించిన ఈ గీతానికి రాకేందు మౌళి సాహిత్యమందించగా.. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. "ఇది పురాణాలతో ముడిపడిన థ్రిల్లర్ చిత్రంగా ముస్తాబైంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చిత్ర బృందం తెలిపింది.

'జెట్లీ'తో మార్నింగ్ షోనే ఫుల్‌మీల్స్ పెడతాం!


రితేశ్ రానా, సత్య, రియా సింఘా, చెర్రీ, హేమలత

"విశ్వదాభిరామా.. ఇంతకీ నేనెవడ్రా మామా" అంటున్నారు సత్య. ఇప్పుడాయన హీరోగా రితేశ్ రానా తెరకెక్కిస్తున్న చిత్రం 'జెట్లీ'. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో చిరంజీవి, హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. రియా సింఘా కథానాయిక. వెన్నెల కిశోర్, అజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా వేసవికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి హైదరాబాద్‌లో గ్లింప్స్ విడుదల చేశారు. ఆద్యంతం రితేశ్ మార్క్ సెటైరికల్ కామెడీతో.. సత్య కామెడీ టైమింగ్‌తో గ్లింప్స్ ఆద్యంతం నవ్వించింది. ఈ ప్రచార చిత్రం ఆఖర్లో వెన్నెల కిశోర్ "నువ్వు హీరోవా.. టైర్ వన్నా.. టైర్ టూనా.. టైర్ త్రీనా" అని ప్రశ్నించగా.. సత్య "జనరల్ కంపార్ట్‌మెంట్" అని బదులివ్వడం నవ్వులు పూయించింది. ఈ సందర్భంగా దర్శకుడు రితేశ్ రానా మాట్లాడుతూ.. "ఒక దర్శకుడిగా నాకు జన్మనిచ్చింది సత్య. తన అభిమానులందరికీ ఒక మాట చెప్తున్నా. మీకు ఉదయం హెవీ బ్రేక్ ఫాస్ట్ చేసే అలవాటు లేకపోతే మార్నింగ్ షోకి రాకండి. ఎందుకంటే ఈ చిత్రంతో మేము మార్నింగ్ షోనే ఫుల్ మీల్స్ పెడతాం" అన్నారు. "వినూత్నమైన కాన్సెప్ట్‌తో రూపొందుతున్న చిత్రమిది. సినిమా అంతా విమానంలోనే చిత్రీకరిస్తున్నాం. ఇప్పటికే 60శాతం చిత్రీకరణ పూర్తయింది. వేసవిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు. హీరో సత్య మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో హీరో అంటూ ఏమీ ఉండదు. యాక్షన్‌లోనూ కామెడీని ఫీల్ అవుతారు. ఈ సినిమా కోసం నాన్‌చాక్ నేర్చుకున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో రియా సింఘా, చెర్రీ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ ప్రేక్షకులకు నచ్చితే విజయమే!


రామ్‌కిరణ్, మహదేవ్ గౌడ్, రాజేంద్రప్రసాద్, ఉదయ్‌శర్మ

"కుటుంబ కథ అంటే చాలు.. తెలుగు ప్రేక్షకులు ఆదరించడానికి సిద్ధంగా ఉంటారు. 'సఃకుటుంబానాం' చిత్రాన్ని చూసేందుకు కుటుంబాలు కలిసి థియేటర్లకి వస్తున్నాయి. ఇలాంటి మంచి కథలతో మరిన్ని చిత్రాలు రావాలని కోరుకుంటున్నా" అన్నారు ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్. ఆయన ఓ ప్రధాన పాత్రధారిగా... రామ్‌కిరణ్, మేఘ ఆకాశ్ జంటగా నటించిన చిత్రమే 'సఃకుటుంబానాం'. ఉదయ్‌శర్మ దర్శకత్వం వహించగా, మహదేవ్ గౌడ్, నాగరత్న సంయుక్తంగా నిర్మించారు. జనవరి 1న ప్రేక్షకుల ముందుకొచ్చిందీ చిత్రం. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో చిత్ర విజయోత్సవాన్ని నిర్వహించారు. నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "నేను 48 ఏళ్లుగా అందరికీ ఓ కుటుంబ సభ్యుడిలా ఉన్నా. మంచి ఫ్యామిలీ కథతో తెరకెక్కిన ఈ చిత్రం విజయవంతం కావడం నాకు మరింత ఆనందాన్నిచ్చింది. ఈ సినిమాకి థియేటర్లు పెరుగుతూనే ఉన్నాయంటే ఎంత పెద్ద విజయం సాధించిందో అర్థం చేసుకోవచ్చు" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "2026లో తొలి విజయం మా సినిమాతో నమోదు కావడం ఎంతో ఆనందంగా ఉంది. ఒక సినిమా కుటుంబ ప్రేక్షకులకు నచ్చిందంటే అది పెద్ద విజయం సాధించినట్టు లెక్క" ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

ఆశ్చర్యపరిచే రెబెకా


తారా సుతారియా

యశ్ 'టాక్సిక్' చిత్ర ప్రపంచంలోని ఒక్కో కథానాయికను ప్రేక్షకులకు పరిచయం చేస్తూ వస్తోంది ఆ చిత్ర బృందం. ఇప్పటికే ఈ సినిమా నుంచి కియారా, నయనతార, హ్యూమా ఖురేషీ పాత్రలు బయటకు రాగా.. శనివారం తారా సుతారియా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఆమె ఇందులో రెబెకా అనే యాక్షన్ కోణంలో సాగే పాత్రలో కనువిందు చేయనున్నట్లు ప్రచార చిత్రంతో స్పష్టత ఇచ్చారు. ఈ సందర్భంగా దర్శకురాలు గీతూ మోహన్ దాస్ మాట్లాడుతూ... "రెబెకా పాత్రలో తారా అద్భుతంగా జీవించింది. అది నన్నెంతో ఆశ్చర్యపరిచింది. అంతేకాదు ఆమె అభినయం థియేటర్లలో ప్రేక్షకులకు కూడా ఆ అనుభూతే కలుగుతుందనడంలో సందేహం లేదు" అన్నారు. కథానాయకుడు యశ్.. దర్శకురాలు గీతూ కాంబోలో రూపొందుతున్న ఈ బహుభాషా చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఉలవచారు బిర్యానీ.. ముద్దపప్పు ఆవకాయలా....



శ్యామ్ సుందర్‌రెడ్డి, నందు, యామినీ, వరుణ్‌రెడ్డి

"మా సినిమాలో ప్రథమార్ధం ఉలవచారు బిర్యానీలా వైవిధ్యంగా సాగితే... ద్వితీయార్ధమేమో ముద్దపప్పు ఆవకాయలా అందరికీ నచ్చుతోంది. మొత్తంగా ప్రేక్షకుల్లో ఓ చర్చనైతే లేవనెత్తింది. ఒక సినిమా గురించి ఇలా చర్చ జరగడం మంచి పరిణామం" అన్నారు శ్రీనందు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'సైక్ సిద్ధార్థ'. యామినీ భాస్కర్ కథానాయిక. వరుణ్‌రెడ్డి దర్శకత్వం వహించారు. శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి సంయుక్తంగా నిర్మించారు. సురేశ్ ప్రొడక్షన్స్ నుంచి జనవరి 1న విడుదలైందీ చిత్రం. శనివారం హైదరాబాద్‌లో విజయోత్సవాన్ని నిర్వహించింది చిత్రబృందం. ఈ సందర్భంగా కథానాయకుడు మాట్లాడుతూ "విజయం అంటే డబ్బుతో పాటు... అవకాశాలు రావడం. 'సైక్ సిద్ధార్థ' విడుదల తర్వాత నాతోపాటు, మా సాంకేతిక బృందంలోని చాలామందికి మంచి అవకాశాలు వస్తున్నాయి. ప్రేక్షకులు థియేటర్లలో ఒక మాస్ సినిమాలా ఆద్యంతం ఆస్వాదిస్తున్నార"న్నారు. కథానాయిక యామినీ భాస్కర్ మాట్లాడుతూ "నా పాత్రకు ప్రేక్షకులు ఎంతగానో కనెక్ట్ అవుతున్నారు. శ్రావ్య పాత్రకీ మంచి స్పందన లభిస్తోంది. నందు, దర్శకుడు వరుణ్‌తోపాటు చిత్రబృందం పడిన కష్టానికి తగ్గ ఫలితం లభించడం ఆనందంగా ఉంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రేక్షకుడు థియేటర్లో కూర్చుని తెరపై కనిపించే ఓ పాత్ర తాలూకు జీవితాన్ని పూర్తిగా అనుభవించాలనేది సినిమా వెనక ఉద్దేశం. ఆ ఉద్దేశాన్ని పూర్తిగా నెరవేర్చిన సినిమా ఇది. థియేటర్లలో అరుపులు, కేకలతో సినిమాలు చూసే ప్రేక్షకులకు ఈ చిత్రం అంకితం. ఈ సినిమాకు వచ్చిన కొన్ని సమీక్షలు చూసి భావోద్వేగానికి గురయ్యాను. ప్రేక్షకుల స్పందన ఇంకా గొప్ప సమీక్షల్లా అనిపించాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ నిర్మాత వెంకట్ సిద్ధారెడ్డితోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

ఈనాడు బిజినెస్ వారాంతం

రూపాయి.. ఈ ఏడాది ఎందాకా?

- క్షీణిస్తే రూ.93కు.. పుంజుకుంటే రూ.87.50కు
- అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంతోనే దిశానిర్దేశం
- విశ్లేషకుల అంచనా



భారత్‌పై అమెరికా భారీగా విధించిన సుంకాల ప్రభావంతో 2025లో డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ సుమారు 5% పతనమైంది. గత మూడేళ్లలోనే దేశీయ కరెన్సీకి ఇదే అత్యధిక క్షీణత. ఆసియాలో పేలవ ప్రదర్శన కనబరచిన దేశాల కరెన్సీల్లో ఒకటిగానూ రూపాయి నిలిచింది. డిసెంబరులో రూ.91.0775 వద్ద కొత్త జీవనకాల కనిష్ఠాన్ని కూడా తాకింది. భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం సాధ్యమైనంత త్వరగా కుదరకపోతే.. రూపాయి బలహీనతలు ఇక్కడితో ఆగక పోవచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

2026లో ఎలా ఉండొచ్చు..

ప్రస్తుత సంవత్సరంలో రూపాయి కదలికలకు ప్రధానంగా భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన పరిణామాలే దిశానిర్దేశం చేయనున్నాయి. ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదరకపోతే.. 2026లో డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 89-93 శ్రేణిలో చలించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ ఒప్పందం కుదిరితే 87.50-88కు పుంజుకునే అవకాశం ఉంటుందంటున్నారు. వాణిజ్య ఒప్పందం కుదిరినా.. భారత వస్తువులపై సుంకాలను 15-20 శాతానికి అమెరికా తగ్గించినప్పుడే సానుకూల పరిణామంగా చూడాలని అభిప్రాయపడుతున్నారు.

ఆర్‌బీఐ జోక్యం మాటేమిటి?

అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి నెలకొన్న తరుణంలో.. రూపాయి కదలికల విషయంలో ఆర్‌బీఐ జోక్యం ఎలా ఉండొచ్చన్నదే కీలకం కానుంది. గతేడాది రూపాయి విషయంలో జోక్యం చేసుకునేందుకు సమర్థ వ్యూహాలను ఆర్‌బీఐ అనుసరించిందనే అభిప్రాయం ఉంది. అయితే ఆర్‌బీఐ వద్ద విదేశీ మారకపు నిల్వలు భారీగా తగ్గడం, డాలరుకు అధిక గిరాకీ నేపథ్యంలో ఒకవేళ అమెరికా అధిక సుంకాలు కొనసాగితే రూపాయి విలువను ఆర్‌బీఐ మరింత పడనిచ్చే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

కోడి గుడ్డు

4న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లు రూపాయలలో)

హైదరాబాద్	610
వరంగల్	612
విజయవాడ	620
తూ/ప గోదావరి	625
విశాఖపట్నం	610
చిత్తూరు	683

ఒప్పందం కుదిరినా..

అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం కుదిరినప్పటికీ.. రూపాయి మారకపు విలువ పెరిగే విషయంలో మరీ అంత సానుకూల అంచనాలు లేవని కొందరు విశ్లేషకులు అంటున్నారు. ఎందుకంటే.. ఒప్పందం అనంతరం ఒకవేళ రూపాయి పుంజుకున్నా, విదేశీ మారకపు నిల్వలను పెంచుకునే ఉద్దేశంతో డాలరు కొనుగోళ్లకు ఆర్‌బీఐ ప్రాధాన్యం ఇస్తుందని చెబుతున్నారు. ఈ కారణం వల్ల రూపాయి విలువ పుంజుకోవడం పరిమితంగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

కోటి ఉద్యోగాల కొత్త సంవత్సరం

నియామకాల బాటలో కార్పొరేట్ సంస్థలు

భారీ ప్రణాళికల్లో గోద్రేజ్, టాటా, మోతీలాల్ ఓస్వాల్



కొత్త ఏడాదిలో భారీ సంఖ్యలో నియామకాలకు దేశంలోని కంపెనీలు సిద్ధమవుతున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది ఉద్యోగాల సృష్టి అధికంగా ఉండొచ్చని స్టాఫింగ్ సేవల సంస్థ టీమ్‌లీజ్ అంచనా వేస్తోంది. బృందాల విస్తరణ, క్యాంపస్ నియామకాల పునరుద్ధరణ, వైవిధ్యమైన లక్ష్యాలపై కంపెనీలు దృష్టి పెట్టడం ఇందుకు కారణమని చెబుతోంది.

అన్ని విభాగాల్లోనూ సందడి

2026లో 1-1.2 కోట్ల ఉద్యోగాలను దేశీయ కార్పొరేట్ రంగం సృష్టించొచ్చని పేర్కొంది. 2025లో ఈ అంచనా 80 లక్షలు - కోటి మధ్య ఉంది. కొత్త నైపుణ్యాలకు ఉన్న గిరాకీకి అనుగుణంగా నియామక ప్రణాళికలను కంపెనీలు విస్తృతం చేస్తున్నాయని, అదే సమయంలో అన్ని విభాగాల్లో ఉద్యోగులను పెంచుతున్నట్లు హెచ్‌ఆర్ వర్గాలు వెల్లడించాయి.

ఈవై ఇండియాలో..

భారీ సంఖ్యలో నియామకాల కోసం చూస్తున్న సంస్థల్లో నైపుణ్య సేవల కంపెనీ ఈవై ఇండియా ఉంది. 2026 జూన్ కల్లా 14,000-15,000 మందిని నియమించుకోవడానికి సన్నాహాలు చేస్తున్నట్లు కంపెనీ చీఫ్ హెచ్‌ఆర్ అధికారి ఆర్తి దువా తెలిపారు. కంపెనీకి క్యాంపస్ నియామకాలు ఎప్పుడూ కీలకమన్నారు. బిజినెస్ స్కూళ్లు, ఇంజినీరింగ్ కళాశాలలు, లా కాలేజీలు, అండర్ గ్రాడ్యుయేట్ కార్యక్రమాల నుంచి ఏటా 2,000 మందిని కంపెనీ నియమించుకుంటుంది. ప్రస్తుతం కంపెనీకి దేశంలో 50,000 మంది ఉద్యోగులు ఉన్నారు.

డియాజియోలో..

డిజిటల్, సరఫరా కార్యకలాపాలు, విభాగాల విస్తరణ వంటి వృద్ధికి సంబంధించిన అంశాల్లో సామర్థ్యాలకు అనుగుణంగా నియామకాలు ఉంటాయని డియాజియో ఇండియా సీహెచ్‌ఆర్ఓ శిల్పా పేర్కొన్నారు. లింగ వైవిధ్యాన్ని మెరుగుపరచాలని కంపెనీ చూస్తోంది. ప్రస్తుతం కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల్లో 30%, నాయకత్వ పదవుల్లో 31% చొప్పున మహిళలు ఉన్నారు.

ఇతర కంపెనీలు సైతం..

✦ వర్ధమాన, భవిష్యత్‌కు అవసరమైన ఉద్యోగాల నియామకాలకు టాటా మోటార్స్ మొగ్గుచూపుతోంది. బ్యాటరీ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వాహనాలు, హైడ్రోజన్ ఇంధనం, ఇంజినీరింగ్, ఆర్ అండ్ డీ, వాణిజ్య కార్యకలాపాలు, కస్టమర్ సర్వీస్ వంటి విభాగాల్లో నియామకాలపై దృష్టి పెట్టింది.

✦ నియామకాల వ్యూహంలో భాగంగా వైవిధ్యమైన శ్రామికశక్తిని గోద్రేజ్ కన్జూమర్ ప్రోడక్ట్స్ ఆశిస్తోంది. దివ్యాంగులు, ఎల్‌జీబీటీక్యూ, సిస్ మహిళల ప్రాతినిధ్యాన్ని 31% నుంచి 2026-27కు 33 శాతానికి పెంచాలని భావిస్తోంది.

✦ టెక్, డేటా సైన్స్, ఏఐ, సపోర్ట్ ఉద్యోగుల కోసం చూస్తున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్లడించింది. నాయకత్వ పదవుల్లో మహిళలను పెంచాలని భావిస్తున్నట్లు తెలిపింది.

✦ కొత్త నియామకాలతో పాటు ప్రస్తుత ఉద్యోగుల నైపుణ్యాలను పెంచడానికి పెట్టుబడులు కొనసాగిస్తామని ఎక్కువ శాతం కంపెనీలు స్పష్టం చేశాయి.

ఈవీ బ్యాటరీలకూ ఆధార్!

- ప్రతిపాదించిన కేంద్ర రవాణా శాఖ
- బ్యాటరీల పనితీరు, రీసైక్లింగ్ పర్యవేక్షణే లక్ష్యం



ఈనాడు, హైదరాబాద్: దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, వాటిలో కీలకమైన బ్యాటరీల భద్రత, పారదర్శకత కోసం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వినూత్న ప్రతిపాదనను తీసుకొచ్చింది. మనకు ఆధార్ కార్డు తరహాలోనే, ప్రతి బ్యాటరీ ప్యాక్‌కు ఒక విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించాలని నిర్ణయించింది. 'బ్యాటరీ ప్యాక్ ఆధార్ నంబరు' (బీపీఏఎన్) పేరుతో పిలిచే ఈ 21 అంకెల కోడ్ ద్వారా బ్యాటరీ తయారీ నుంచి అది రీసైక్లింగ్ అయ్యే వరకూ ప్రతి దశనూ పర్యవేక్షించవచ్చు.

ఈ నూతన నిబంధనల ప్రకారం.. బ్యాటరీ ఉత్పత్తిదారులు లేదా దిగుమతిదారులు తాము మార్కెట్లోకి ప్రవేశపెట్టే ప్రతి బ్యాటరీకి తప్పనిసరిగా బీపీఏఎన్ కేటాయించాల్సి ఉంటుంది. ఇది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు. బ్యాటరీకి సంబంధించిన సమస్త సమాచారం ఇందులో నిక్షిప్తమై ఉంటుంది. బ్యాటరీకి వాడిన ముడి పదార్థాలను ఎక్కడి నుంచి సేకరించారు, తయారీ విధానం, వినియోగం, రీసైక్లింగ్ వరకూ ప్రతి సమాచారాన్ని దీనిద్వారా తెలుసుకోవచ్చు. ఈ వివరాలన్నింటినీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అధికారిక పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయడం తప్పనిసరి.

చెరిగిపోకుండా..

బీపీఏఎన్ సంఖ్య బ్యాటరీపై అందరికీ కనిపించేలా, స్పష్టంగా ఉండాలి. కాలక్రమేణా అది చెరిగిపోకుండా తయారీ కంపెనీలు ముందే జాగ్రత్తలు తీసుకోవాలి.

✦ ఒకవేళ బ్యాటరీని రీసైక్లింగ్ చేసినా, లేదా ఇతర అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసినా, దానికి కొత్త గుర్తింపు సంఖ్యను కేటాయించాల్సి ఉంటుంది.

✦ పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించే 2 కిలోవాట్ అవర్(కేడబ్ల్యూహెచ్) కంటే అధిక సామర్థ్యం ఉన్న బ్యాటరీలకూ ఈ నిబంధనలు వర్తిస్తాయి. ప్రస్తుతం దేశంలో లిథియం-అయాన్ బ్యాటరీల గిరాకీలో 80-90 శాతం ఈవీల నుంచే వస్తుండటంతో తొలి ప్రాధాన్యం విద్యుత్ వాహనాలకే ఇవ్వనున్నారు.

వీటికి వర్తించదు: వాహనాలను స్టార్ట్ చేసేందుకు వినియోగించే ఎస్ఎల్ఐ బ్యాటరీలు, చిన్న పోర్టబుల్ బ్యాటరీలు ఈ నిబంధనల పరిధిలోకి రావు.

ఎలా చూడొచ్చు..

వినియోగదారులు, సంబంధిత అధికారులు మూడు విధానాల్లో ఈ సమాచారాన్ని పరిశీలించేందుకు వీలుంటుంది.

✦ **ఆల్ఫాన్యూమరిక్ కోడ్:** ఇది నేరుగా బ్యాటరీపై ఉంటుంది. ఇంటర్నెట్ లేకపోయినా ప్రాథమిక వివరాలను తెలుసుకోవచ్చు.

✦ **క్యూఆర్ కోడ్:** బ్యాటరీలోని పదార్థాలు, కర్బన ఉద్గారాల గురించి రీసైక్లింగ్ చేసే సంస్థలు చూడొచ్చు.

✦ **సర్వర్ ఆధారిత డేటా:** ఇది కేవలం అధీకృత వ్యక్తులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. పాత బ్యాటరీలను కొనేవారు దాని నాణ్యతను సర్వర్ ద్వారా తనిఖీ చేయొచ్చు.

ఇది ఒక విప్లవాత్మక మార్పు

ఈ కొత్త విధానం ద్వారా బ్యాటరీల పనితీరును కచ్చితంగా అంచనా వేయడమే కాకుండా, పర్యావరణంపై వాటి ప్రభావం ఎంత అన్నదీ తెలుసుకునే వీలుంది. ముఖ్యంగా రెండోసారి వినియోగించే బ్యాటరీల విషయంలో ఇది కీలకపాత్ర పోషించనుంది. ఈ మొత్తం ప్రక్రియను ఆటోమోటివ్ ఇండస్ట్రీ స్టాండర్డ్స్ (ఏఐఎస్) మార్గదర్శకాల ప్రకారం అమలు చేయాలని రవాణా శాఖ ప్రతిపాదించింది. వీటి కింద ఏర్పడే కమిటీలో బ్యాటరీ, ఈవీ తయారీదారులు, రీసైక్లర్లు, ఇతర నియంత్రణ సంస్థ ప్రతినిధులు సభ్యులుగా ఉండి, సాంకేతిక అంశాలను పర్యవేక్షిస్తుంటారు. గృహ, పారిశ్రామిక అవసరాలకు బ్యాటరీల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఆధార్ తరహా గుర్తింపు సంఖ్య ఒక విప్లవాత్మకమైన మార్పుగా నిలుస్తుందని పరిశ్రమ నిపుణులు భావిస్తున్నారు.

టైటన్ ఐప్లస్ కళ్లద్దాలకు ఫొటోఫ్యూజన్ ఎక్స్ సాంకేతికత

హైదరాబాద్: వినియోగదార్ల కళ్ల సంరక్షణకు, కంటి చూపును మరింత మెరుగుపర్చే ఉద్దేశంతో జీస్ ఇండియా విజన్ కేర్‌తో టైటన్ ఐప్లస్ జట్టుకట్టింది. ఇందులో భాగంగా జీస్‌కు చెందిన ఫొటోఫ్యూజన్ ఎక్స్ ఫొటోక్రోమిక్ లెన్స్ సాంకేతికతను ఉపయోగించుకోనుంది.



దేశవ్యాప్తంగా ఉన్న తన విక్రయ కేంద్రాల్లోని లెన్స్ విభాగాలకు దీనిని అందుబాటులోకి తెచ్చినట్లు టైటన్ ఐప్లస్ తెలిపింది. వెలుతురు పరిస్థితులకు తగ్గట్లుగా అంటే.. ఎండలో వెళ్తున్నప్పుడు సన్‌గ్లాసెస్‌లా, ఇంట్లో ఉన్నప్పుడు క్లియర్ గ్లాసెస్‌లా కళ్లద్దాలు మారేందుకు ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది. కళ్లకు హానికరమైన బ్లూలైట్, అల్ట్రావైలట్ (యూవీ) రేడియేషన్ నుంచి రక్షణ కల్పించేందుకు కూడా ఇది తోడ్పడుతుందని టైటన్ సీఈఓ(ఐ కేర్) ఎన్ ఎస్ రాఘవన్ తెలిపారు. జీస్ ఫొటోఫ్యూజన్ ఎక్స్ సాంకేతికతను టైటన్ ఐప్లస్ ఉపయోగించుకోవడం వల్ల దేశవ్యాప్తంగా ఫొటోక్రోమిక్ లెన్సెస్ లభ్యత పెరుగుతుందని, భారత వినియోగదార్ల రోజువారీ కళ్లద్దాల ఎంపికలో ఒక కీలక మార్పుగానూ ఇది నిలుస్తుందని జీస్ ఇండియా విజన్ కేర్‌కు చెందిన రోహన్ పాల్ తెలిపారు.

ఐటీ.. మెట్రోల నుంచి చిన్న నగరాలకు

నియామకాల్లో వృద్ధి అక్కడే



దేశీయ ఐటీ రంగ నియామకాల్లో చిన్న నగరాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఇప్పటికే పెద్ద నగరాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న అంతర్జాతీయ సంస్థలు, దేశీయ దిగ్గజాలు.. ఇప్పుడు చిన్న నగరాలకు విస్తరిస్తున్నాయి. జనవరిలో నియామకాల కోసం ఐటీ రంగ కంపెనీల నుంచి వస్తున్న ప్రకటనలు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి. గతేడాది జనవరి కంటే, ఈ నెలలో ఐటీ ఉద్యోగ నియామక ప్రకటనల్లో 24% తగ్గుదల నమోదైంది. 2021 జనవరి తర్వాత టెక్ నియామకాలు ఈ స్థాయిలో పడిపోవడం ఇది రెండోసారి. ఉద్యోగ నియామకాల సంస్థ ఎక్స్‌ఫెనో విడుదల చేసిన 'యాక్టివ్ టెక్ జాబ్స్ ఔట్‌లుక్-ఇండియా' తాజా నివేదిక 'ఐటీ రంగంలో నియామక ప్రక్రియ ఇంకా మందగమనంలోనే ఉందని' పేర్కొంది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 1.03 లక్షల ఐటీ ఉద్యోగాలే భర్తీకి అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది.

✦ 2022లో ఐటీ నియామకాలు గరిష్ఠ స్థాయిలో ఉన్నప్పుడు, జనవరిలోనే దాదాపు 2.60 లక్షల ఉద్యోగాలు అందుబాటులో ఉండేవి. అప్పటితో పోలిస్తే, ప్రస్తుతం నియామకాల ప్రకటనలు 60% క్షీణించాయి. 2025 డిసెంబరుతో పోల్చి చూసినా జనవరిలో ఉద్యోగాల సంఖ్య 1% తగ్గిందని నివేదిక పేర్కొంది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి, ఐటీ వ్యయాల్లో కోత వంటివే నియామకాల తగ్గుదలకు కారణమని నివేదిక పేర్కొంది.

✦ మొత్తం ఖాళీల్లో 79,000 వరకు పూర్తి స్థాయి ఉద్యోగాలున్నాయి. వీటి సంఖ్య నెలవారీగా 5%, వార్షిక ప్రాతిపదికన 24% తగ్గింది. ప్రారంభ స్థాయి తాజా నియామకాలు కొంత ఊరట కలిగిస్తున్నాయి. జనవరిలో 14,000 ఉద్యోగాలు నమోదైనా, గత ఏడాది ఇదే కాలంలో పోలిస్తే ఇవీ 18% తక్కువగా ఉన్నాయి. ఐటీ సేవల కంపెనీల్లో నియామకాలు 18% తగ్గి, 41,000 ఖాళీలకు పరిమితమయ్యాయి.

జీసీసీలే ఆశాకిరణం

ఈ పరిస్థితుల్లోనూ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) నుంచి ఉద్యోగ నియామకాల్లో సానుకూలత కనిపిస్తోంది. నెలవారీగా 13%, వార్షికంగా 7% వృద్ధితో 17,000 ఉద్యోగాలను భర్తీ చేసే ఆలోచనతో ఇవి ఉన్నాయి. ఇంజినీరింగ్, కోర్, టెక్ విభాగాలు నియామకాల్లో ఆధిపత్యం కొనసాగిస్తున్నా.. డిమాండ్ ఏడాది కాలంలో 37 శాతానికి పడిపోయింది. కన్సల్టింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ వంటి అనుబంధ విభాగాల్లోనూ ఉద్యోగాలు తగ్గాయి.

చిన్న నగరాల్లో 30% వృద్ధి

ప్రధాన ఐటీ హబ్‌లైన హైదరాబాద్, బెంగళూరు, దిల్లీ-ఎన్‌సీఆర్ వంటి నగరాల్లో నియామకాలు 49% తక్కువగా ఉన్నాయని నివేదిక తెలిపింది. అయితే రెండో, మూడో శ్రేణి నగరాల్లో నియామక ప్రకటనలు 30% పెరగడం గమనార్హం. ఐటీ ఉద్యోగాలు, మెట్రో నగరాల నుంచి చిన్న పట్టణాలకు విస్తరిస్తున్నాయనే దానికి ఇది సంకేతమని నివేదిక పేర్కొంది.

ఆఫీసుకు రావాల్సిందే

పని విధానంలోనూ భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉద్యోగాల్లో 70 శాతానికి పైగా ఆఫీసు నుంచే పని చేయాలనే నిబంధన విధిస్తున్నాయి. ఐటీ నియామకాల మందగమనానికి అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులూ కారణమని, ఎక్స్‌ఫెనో సహ వ్యవస్థాపకుడు కమల్ కారంత్ విశ్లేషించారు. గతంలో ఉన్న నియామక వేగాన్ని మళ్లీ అందుకోవడం ఇప్పట్లో కష్టంగానే కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.

సాంకేతిక లోపంతో ఖాతాలో రూ.40 కోట్లు.. నిమిషాల్లో రూ.1.75 కోట్ల లాభం

ఓ ట్రేడర్ ఖాతాలో సాంకేతిక లోపం వల్ల రూ.40 కోట్లు పడగా.. వాటితో స్టాక్ మార్కెట్లో 20 నిమిషాల్లో ఏకంగా రూ.1.75 కోట్ల లాభం వచ్చింది. తమ డబ్బుతో ట్రేడర్ లాభాలు పొందారంటూ కోటక్ సెక్యూరిటీస్ కోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో ఈ వ్యవహారం వైరల్‌గా మారింది.

ఇదీ జరిగింది.: 2022లో కోటక్ సెక్యూరిటీస్‌లో తలెత్తిన సాంకేతిక లోపం వల్ల ఓ స్టాక్ ట్రేడర్ ఖాతాలో కోటక్‌కు చెందిన రూ.40 కోట్లు జమయ్యాయి. ఈ డబ్బును స్టాక్స్‌లో పెట్టడంతో కేవలం 20 నిమిషాల్లోనే అతడికి రూ.1.75 కోట్ల లాభం వచ్చింది. అనంతరం తమ వ్యవస్థలో తప్పిదాన్ని గుర్తించిన కోటక్ సెక్యూరిటీస్ ట్రేడర్‌ను సంప్రదించడంతో కొంతకాలం తర్వాత అతడు కోటక్ నుంచి జమ అయిన రూ.40 కోట్లను తిరిగి ఇచ్చాడు. అయితే రూ.40 కోట్లతో పాటు వాటిని స్టాక్స్‌లో పెట్టి ఆర్జించిన రూ.1.75 కోట్ల లాభాన్ని కూడా తమకే ఇవ్వాలని కోటక్ డిమాండ్ చేసింది. అందుకు అతడు అంగీకరించకపోవడంతో ఇరువర్గాలు బాంబే హైకోర్టును ఆశ్రయించాయి.

దీనిపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం.. కోటక్ సెక్యూరిటీస్ నుంచి వచ్చిన డబ్బుతో స్టాక్ ట్రేడర్ సంపాదించిన రూ.1.75 కోట్ల లాభం అతడికే చెందుతుందని తీర్పునిచ్చింది. దీనివల్ల సంస్థకు ఎలాంటి నష్టం కలగలేదని.. ఇది అన్యాయంగా సంపాదించిన డబ్బు కూడా కాదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ట్రేడర్ సొంత రిస్క్‌పై స్టాక్స్‌లో పెట్టినందువల్ల లాభం కూడా అతడికే సొంతమవుతుందని తెలిపింది. విచారణలో భాగంగా ట్రేడర్ తమ డబ్బుతో సంపాదించిన మొత్తాన్ని తమకు ఇచ్చేస్తే అతడికి రూ.50 లక్షలు ఇస్తామని కోటక్ సెక్యూరిటీస్ ఆఫర్ ఇవ్వగా అందుకు అతడు తిరస్కరించాడు. ఈ కేసుపై తదుపరి విచారణను ఫిబ్రవరి 4కు వాయిదా వేస్తున్నట్లు బాంబే హైకోర్టు వెల్లడించింది.

గిగ్ నమూనాతో రైడర్లపై ఒత్తిడి లేదు

- ఎటర్నల్ సీఈఓ దీపిందర్ గోయల్
- ప్రమాద బీమా కోరుతున్న యూనియన్లు



దిల్లీ: ఎటర్నల్ యాజమాన్యంలోని జొమాటో, బ్లింకిట్ సంస్థల వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ గిగ్ వర్క్ నమూనాను మరోసారి వెనకేసుకొచ్చారు. గిగ్ వర్కర్ల వేతనం, పని పరిస్థితులపై వరుసగా ఎక్స్‌లో పోస్టులు పెట్టారు. రైడర్లపై ఈ నమూనాతో ఒత్తిడి లేదని, సౌకర్యవంతమైన షెడ్యూళ్లు, సంక్షేమ ప్రయోజనాలు గిగ్ పనిని చాలా మందికి నమ్మకమైన ఆదాయ వనరుగా మారుస్తాయని తెలిపారు. ఇటీవల గిగ్ వర్కర్ల సమ్మెలో భాగంగా 10 నిమిషాల డెలివరీ సేవలను రద్దు చేయాలన్న డిమాండ్ వినిపించింది. దీనిపై ఆయన తన ఎక్స్ పోస్ట్‌లో సమర్థించుకున్నారు. తక్కువ వేతనం, సామాజిక భద్రత వంటి అంశాలు చర్చకు రాగా వాటిపైనా తాజాగా వివరణ ఇస్తూ వరుస పోస్టులు పెట్టారు. '2025లో జొమాటో, బ్లింకిట్‌లు డెలివరీ భాగస్వాములకు బీమా కవరేజీ కోసం రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేశాయి. 2025లో జొమాటోలో డెలివరీ భాగస్వామికి టిప్స్ మినహా సగటు గంట ఆదాయం (ఈపీహెచ్) రూ.102గా ఉంది. 2024లో రూ.92తో పోలిస్తే ఇది 10.9 శాతం ఎక్కువ. సుదీర్ఘకాలంలో కూడా ఈపీహెచ్ స్థిరమైన వృద్ధిని కనబరిచింద'ని పోస్టు చేశారు.

బీమా మద్దతు ఎందుకు అందలేదు?

దీపిందర్ గోయల్ పోస్టులపై తెలంగాణ గిగ్ వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) స్పందించింది. జొమాటో/బ్లింకిట్ గిగ్ నమూనా, వేతన చెల్లింపులు, 10 నిమిషాల్లో డెలివరీలు తదితర వాటిపై టీజీపీడబ్ల్యూయూ అధ్యక్షుడు షేక్ శాలుద్దీన్ విమర్శించారు. నికర ఆదాయం, ప్రయోజనాల లేమి, భద్రతా ఒత్తిళ్లు, ఆలస్య మద్దతు వంటి వాటిపై దృష్టి సారించాలని సూచించారు. ఇంధనం/నిర్వహణ ఖర్చులు 20 శాతం తీసివేస్తే నికర ఆదాయం గంటకు రూ.81 వస్తోందని తెలిపారు. అంటే రోజుకు 10 గంటల పాటు నెలలో 26 రోజులు పని చేస్తుంటే నెలకు రూ.21,000 లభిస్తోందని వివరించారు. పీఎఫ్/ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా పథకాలు వర్తించడం లేదన్నారు. పెయిడ్ లీవ్, గ్యారెంటీడ్ ప్రమాద బీమా కూడా లేవని పేర్కొన్నారు. ఇటీవల 10 నిమిషాల డెలివరీ ఒత్తిడితో హైదరాబాద్‌లో ఒక రైడర్ ప్రమాదం బారిన పడితే 24 గంటలు గడిచినా బీమా మద్దతు లభించలేదన్నారు. 10 నిమిషాల్లో డెలివరీ రైడర్లపై ఒత్తిడి సృష్టించనపుడు ప్రమాద బీమా మద్దతు 10 నిమిషాల్లో ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు.

సౌర, పవన విద్యుత్ ఒకేచోట

- హైబ్రిడ్ పద్ధతే కీలకం
- కేపీ గ్రూపు ఛైర్మన్ ఫరూక్ జి.పటేల్



ఈనాడు, హైదరాబాద్: పర్యావరణహితంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా మారుతోందని కేపీ గ్రూపు ఛైర్మన్ ఫరూక్ జి.పటేల్ అన్నారు. గతంలో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులు విడివిడిగా ఉండేవని, రాబోయే దశాబ్దంలో హైబ్రిడ్ పద్ధతి ఈ రంగాన్ని సమూలంగా మారుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇంధన ఉత్పత్తిలో ఉండే అంతరాయాలను ఈ వ్యవస్థలు తొలగిస్తాయన్నారు. ఫలితంగా గ్రిడ్ నిర్వహణ సులభతరం అవుతుందన్నారు. పారిశ్రామిక అవసరాల కోసం నిరంతర హరిత ఇంధన సరఫరా జరుగుతుందని వివరించారు. భారత సౌర విద్యుత్ రంగంలో అధిక విద్యుత్ సామర్థ్యంతో ఉన్న బైఫేషియల్ మాడ్యూళ్లు (రెండు వైపుల నుంచీ సౌర శక్తిని గ్రహించేవి) కీలకం కానున్నాయని పేర్కొన్నారు. దీంతో పాటు విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు స్థల ఎంపిక దగ్గర్నుంచి, వాతావరణ అంచనాలు, నిర్వహణ ఖర్చులను తగ్గించడంలో కృత్రిమ మేధ పాత్ర పెరగనుందని తెలిపారు. పగలు ఉత్పత్తి అయ్యే విద్యుత్తును నిల్వ చేసి, అవసరమైనప్పుడు వాడుకునేందుకు బ్యాటరీ వ్యవస్థలూ ముఖ్యమని పేర్కొన్నారు. 2030 నాటికి స్వచ్ఛ ఇంధన లక్ష్యాన్ని చేరుకోవాలంటే, పరిశ్రమ వర్గాలు కేవలం ప్రాజెక్టుల విస్తరణకే పరిమితం కావద్దన్నారు. సరఫరా వ్యవస్థను స్థానికీకరించడంపైనా దృష్టి పెట్టాలని సూచించారు. దేశీయంగా తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా అంతర్జాతీయ ధరల హెచ్చుతగ్గుల ప్రభావం తగ్గుతుందని పేర్కొన్నారు. నైపుణ్యమున్న శ్రామిక శక్తిని తయారు చేయడం, డిజిటల్ సామర్థ్యాలను పెంచుకున్నప్పుడే అంతర్జాతీయ సంస్థలతో భారతీయ కంపెనీలు పోటీ పడగలవని ఫరూక్ పటేల్ విశ్వాసం వ్యక్తం చేశారు.

సింధుదుర్గ్ విమానాశ్రయ కార్యకలాపాలు 24 గంటలూ

డీజీసీఏ నుంచి అనుమతి

ముంబయి: రోజంతా విమానాశ్రయాన్ని నిర్వహించడానికి విమానయాన నియంత్రణాధికార సంస్థ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి అనుమతి లభించినట్లు ఐఆర్‌బీ సింధుదుర్గ్ విమానాశ్రయం తెలిపింది. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ లిమిటెడ్ ఈ విమానాశ్రయాన్ని 2021 అక్టోబరు నుంచి నిర్వహిస్తోంది. అన్ని రకాల ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఈ విమానాశ్రయాన్ని 24 గంటలు నిర్వహించే ప్రతిపాదనకు డీజీసీఏ ఆమోదం తెలిపినట్లు పేర్కొంది.

వాహన పీఎల్ఐ పథకంతో రూ.35,657 కోట్ల పెట్టుబడులు

48,974 ఉద్యోగాల సృష్టి: కేంద్రం

దిల్లీ: వాహన రంగానికి ప్రకటించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం ద్వారా ఈ ఏడాది సెప్టెంబరు వరకు రూ.35,657 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, మొత్తం విక్రయాలు రూ.32,879 కోట్లుగా నమోదయ్యాయని ప్రభుత్వం తెలిపింది. అలాగే 48,974 ఉద్యోగాలనూ సృష్టించిందని పేర్కొంది. పీఎల్ఐ పథకాన్ని తొలుత వాహన రంగానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. 2023-24 నుంచి 2027-28 వరకు ఈ పథకం అమల్లో ఉంటుంది. అయితే ఈ పథకం కింద ఇప్పటివరకు ఎటువంటి పెట్టుబడులు పెట్టని 10 సంస్థల బ్యాంక్ గ్యారెంటీలను ఇన్వోక్ చేసే యోచనలో భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొత్తంగా ఐదు సంస్థలకు రూ.1,999.94 కోట్ల ప్రోత్సాహకాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. వీటిల్లో టాటా మోటార్స్, బజాజ్ ఆటో, మహీంద్రా అండ్ మహీంద్రా, టీవీఎస్ మోటార్, ఓలా ఎలక్ట్రిక్ టెక్ ఉన్నాయి.


ఈ పథకం కింద ఇప్పటివరకు 10,42,172 విద్యుత్ ద్విచక్ర వాహనాలకు; 2,38,385 విద్యుత్ త్రిచక్ర వాహనాలకు; 79,540 విద్యుత్ నాలుగు చక్రాల వాహనాలకు; 1,391 విద్యుత్ బస్సులకు ప్రోత్సాహకాలను అందించినట్లు భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. పీఎల్ఐ పథకం ద్వారా వాహన, వాహన విడిభాగాల పరిశ్రమకు ప్రోత్సాహకాల కోసం రూ.25,938 కోట్ల కేటాయింపులను ప్రభుత్వం చేసింది. నవంబరు 30 వరకు 82 దరఖాస్తులకు ఈ పథకం కింద ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అలాగే వాహన పీఎల్ఐ పథకం కింద 2025 డిసెంబరు 31 వరకు మొత్తంగా రూ.2,321.94 కోట్ల ప్రోత్సాహకాలను పంపిణీ చేసిందని ఓ అధికారిక ప్రకటన వెల్లడించింది.

ప్రాక్టీస్ బిట్స్ — ఇండియన్ పాలిటీ

1. ఏ లోక్‌సభ ఎన్నిక అనంతరం కేంద్రంలో తొలిసారిగా భారతీయ జనతా పార్టీ అటల్ బిహారీ వాజ్‌పేయీ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది?
   1) పదకొండో లోక్‌సభ
   2) పన్నెండో లోక్‌సభ
   3) పదమూడో లోక్‌సభ
   4) పద్నాలుగో లోక్‌సభ
2. అత్యధికంగా ఎనిమిది సార్లు అవిశ్వాస తీర్మానాలను ఏ లోక్‌సభ కాలంలో ప్రవేశపెట్టారు?
   1) తొమ్మిదో లోక్‌సభ
   2) పదో లోక్‌సభ
   3) పదకొండో లోక్‌సభ
   4) పన్నెండో లోక్‌సభ
3. పన్నెండో లోక్‌సభలో అతి తక్కువ కాలం కొనసాగింది. అది ఎంతకాలం?
   1) 8 నెలలు 2) 12 నెలలు 3) 13 నెలలు 4) మూడేళ్లు
4. ఏ లోక్‌సభ కాలంలో 2001లో భారత పార్లమెంటుపై ఉగ్రవాదుల దాడి జరిగింది?
   1) పన్నెండో లోక్‌సభ
   2) పదమూడో లోక్‌సభ
   3) పద్నాలుగో లోక్‌సభ
   4) పదిహేనో లోక్‌సభ
5. ఏ లోక్‌సభ కాలంలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రభుత్వం కేవలం ఒక ఓటు తేడాతో అధికారాన్ని కోల్పోయింది?
   1) పన్నెండో లోక్‌సభ
   2) పదమూడో లోక్‌సభ
   3) పద్నాలుగో లోక్‌సభ
   4) పదిహేనో లోక్‌సభ

సమాధానాలు 1-1; 2-2; 3-3; 4-2; 5-1.

సృష్టిలో ప్రతి పదార్థం అణువులు, పరమాణువులతోనే నిర్మితమై ఉంటుంది. ఆ పరమాణు కేంద్రకం, దానిలో భాగాలు, వాటి పరస్పర చర్యల గురించి తెలిపే భౌతిక శాస్త్ర విభాగమే కేంద్రక భౌతిక శాస్త్రం. పదార్థం ప్రాథమిక నిర్మాణాన్ని అర్థం చేసుకోవడానికి, విశ్వంలో అపారశక్తి జనకాలను గుర్తించి వాటిని నియంత్రిత పద్ధతుల్లో మానవ ప్రయోజనాలకు వినియోగించుకోవడానికి ఈ శాస్త్రం ఉపయోగపడుతుంది. అణువిద్యుత్తు ఉత్పత్తి, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, అంతరిక్ష పరిశోధన లాంటి వివిధ రంగాల్లో కీలకమైన ఈ అంశంపై పోటీ పరీక్షార్థులకు తగిన పరిజ్ఞానం ఉండాలి. నిత్యజీవిత సాంకేతికల నుంచి విశ్వం రహస్యాలను ఛేదించడం వరకు దారిచూపే కేంద్రక విచ్ఛిత్తి, కేంద్రక సంలీనం ప్రక్రియలపై జరిగిన ప్రయోగాలు, వాటి ఫలితాలపై అవగాహన పెంచుకోవాలి.




జనరల్ స్టడీస్ — భౌతిక శాస్త్రం


ముక్కలైనా.. ఒక్కటైనా
అనంత శక్తి ప్రవాహమే!

కేంద్రక భౌతిక శాస్త్రం

(కేంద్రకం – పరమాణు సంఖ్య – ద్రవ్యరాశి సంఖ్య)

సహజ రేడియోధార్మికతను హెన్రీ బెక్వెరెల్ కనుక్కున్నాడు. అయితే కేంద్ర భౌతిక శాస్త్ర పితామహుడిగా రూథర్‌ఫర్డ్ ప్రసిద్ధికెక్కాడు. ఈయన కృత్రిమ పరివర్తనం, ప్రోటాన్‌ను కనుక్కున్నాడు. న్యూట్రాన్ ఉనికిని ఊహించాడు. మేడం క్యూరీ కృత్రిమ రేడియోధార్మికతను కనుక్కున్నారు.


హెన్రీ బెక్వెరెల్


రూథర్‌ఫర్డ్


మేడం క్యూరీ

రేడియోధార్మికత ప్రమాణాలు: బెక్వెరెల్, రూథర్‌ఫర్డ్, క్యూరీ.
1 క్యూరీ = 3.7×10^{10} విఘటనాలు/సెకను.

1 రూథర్‌ఫర్డ్ = 10^6 విఘటనాలు/సెకను. 1 బెక్వెరెల్ = 1 విఘటనం/సెకను.

కేంద్రకంలో ప్రోటాన్లు, న్యూట్రాన్లు ఉంటాయి. ప్రోటాను సంఖ్య(Z)ను పరమాణు సంఖ్య అంటారు. ప్రోటాను, న్యూట్రాన్ల మొత్తం సంఖ్యను పరమాణు ద్రవ్యరాశి సంఖ్య(A) అంటారు.

★ $^{238}_{92}U$ అనే కేంద్రకంలో 92 ప్రోటాన్లు, 238 – 92 = 146 న్యూట్రాన్లు ఉంటాయి. కేంద్రకంలో ప్రోటాన్ల సంఖ్య సమానంగా ఉండి, న్యూట్రాన్ల సంఖ్యలో తేడా ఉంటే వాటిని 'ఐసోటోపులు' అంటారు.

ఉదా: ^1_1H, ^2_1H, ^3_1H ఇవి హైడ్రోజను ఐసోటోపులు. న్యూట్రాన్ లేని పరమాణువు - హైడ్రోజన్.
^2_1H - డ్యూటీరియం.
^3_1H - ట్రిటియం-ఇది రేడియోధార్మిక మూలకం.

కేంద్రక విచ్ఛిత్తి- అణు బాంబు

ఐన్‌స్టీన్ చెప్పిన శక్తి తుల్యతా నియమం $E = mc^2$ ఆధారంగా అమెరికాలో 1942లో ఓపెన్ హైమర్ ఆధ్వర్యంలో మాన్ హట్టాన్ అనే ప్రాజెక్ట్‌లో అణుబాంబు తయారీని ప్రారంభించారు. ఓపెన్ హైమర్‌ను 'అణుబాంబు పితామహుడు' అంటారు. అనియంత్రిత కేంద్రక విచ్ఛిత్తుల శ్రేణినే 'అణుబాంబు' అంటారు. థర్మల్ న్యూట్రాన్లను కేంద్రక విచ్ఛిత్తికి ఉపయోగిస్తారు. ప్రతి కేంద్రక విచ్ఛిత్తిలో 3 న్యూట్రాన్లతో పాటు 200 MeV శక్తి విడుదలవుతుంది. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై ఆగస్టు 6, 9వ తేదీల్లో 'లిటిల్ బాయ్, 'ఫ్యాట్ బాయ్' అనే అణుబాంబులను అమెరికా వేయడంతో ఈ ప్రాజెక్టు పూర్తయింది.

1942లో ఎన్రికో ఫెర్మి న్యూక్లియర్ రియాక్టర్‌ను తయారు చేశారు. ఇందులో నియంత్రిత కేంద్రక విచ్ఛిత్తి చర్య జరుగుతుంది. బోరాన్, కాడ్మియం కడ్డీలను వాడి న్యూక్లియర్ రియాక్టర్‌ను నియంత్రిస్తారు.

★ భారతదేశం మొదటి అణు బాంబు పరీక్షను 'బుద్ధుడు నవ్వాడు' పేరుతో 1974, మే 18న రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో చేపట్టింది. ఇందులో 12 టన్నుల శక్తిని పరీక్షించారు. 1998, మే 13న రెండో అణుపరీక్ష 'శక్తి-98' పేరుతో జరిగింది. దేశంలో హోమీ జహంగీర్ బాబా ఆధ్వర్యంలో మూడు అంచెల అణుశక్తి విధానాన్ని 1950లో ప్రారంభించారు. అణుశక్తి తయారీలో స్వయంసమృద్ధే దీని ఉద్దేశం. దేశంలో థోరియం నిల్వలు ఎక్కువగా కేరళ, ఝార్ఖండ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ల్లో ఉన్నాయి.

★ ఆసియాలోనే మొదటి అణుశక్తి కేంద్రం 1957, జనవరి 20న అప్సర పేరుతో జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు. ఇదే రోజు బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్ (BARC) నెలకొల్పారు. ఇందులో అప్సర, సిరస్, ధ్రువ అనే మూడు పరిశోధక రియాక్టర్లు ఉన్నాయి. (2010 నుంచి సిరస్‌ను నిలిపివేశారు)



అర్ధజీవిత కాలం

ఒక రేడియోధార్మిక పదార్థం సగం విఘటనం చెందడానికి పట్టే కాలం. $\frac{N}{N_o} = \left(\frac{1}{2}\right)^n$

C^{14} అర్ధజీవిత కాలం = 5,728 ఏళ్లు.
$^{235}_{92}U$ అర్ధజీవిత కాలం = 4.47×10^9 సంవత్సరాలు

$^{89}_{36}Kr$ అర్ధజీవిత కాలం - 3.16 నిమిషాలు.
న్యూట్రాన్ అర్ధజీవిత కాలం = 12 నిమిషాలు, సగటు జీవితకాలం 1000 సెకన్లు.
న్యూట్రాన్ వేగాన్ని భారజలం, పారాఫిన్ మైనం, గ్రాఫైట్ లాంటివి తగ్గిస్తాయి. అందుకే వీటిని మితకారులు అంటారు. వేగం తగ్గిన న్యూట్రాన్లు (థర్మల్ న్యూట్రాన్లు) కేంద్రక విచ్ఛిత్తిలో పాల్గొంటాయి.

కేంద్రక సంలీనం

1962లో చేసిన అణు నియంత్రిత చట్టం భారత్‌లో అణుశక్తిని శాంతియుత ప్రయోజనాల కోసం వాడాలని చెబుతోంది.

భూమిపై జీవరాశి మనుగడకు ఆధారమైన సూర్యుడి లాంటి నక్షత్రాల్లో కేంద్రక సంలీనం ద్వారా శక్తి జనిస్తుంది. సూర్యుడి కేంద్రకం వద్ద 15 మిలియన్ డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. ఈ ఉష్ణోగ్రత వద్ద రెండు హైడ్రోజన్ కేంద్రకాలు కలిసి హీలియం కేంద్రకంగా మారినప్పుడు 25.71 MeV శక్తి విడుదల అవుతుంది. దీనినే ప్రోటాన్ చక్రం అంటారు.
$_1H^2 + {_1H^3} \rightarrow {_2He^4} + {_0n^1}$. దీనికి 10^6 K కంటే ఎక్కువ ఉష్ణోగ్రత కావాలి.

★ అనియంత్రిత కేంద్రక సంలీన చర్యల శ్రేణినే 'హైడ్రోజన్ బాంబు' అంటారు. తొలిసారిగా ★ ఎడ్వర్డ్ టెల్లర్‌ను హైడ్రోజన్ బాంబు పితామహుడు అంటారు. ★ 1952లో అమెరికా హైడ్రోజన్ బాంబును ivy mike టెస్ట్ పేరుతో పరీక్షించింది. హైడ్రోజన్ బాంబు వల్ల ప్లాస్మా స్థితిలో ఉండే పదార్థం ఏర్పడుతుంది. ★ చైనా కేంద్రక సంలీనం పద్ధతిలో కృత్రిమ సూర్యుడిని తయారు చేస్తోంది.

ఐసోటోపుల ఉపయోగాలు

వైద్యం: I^{131} - మెదడులో కణుతులను గుర్తించి, చికిత్స చేయడం. గుండె, థైరాయిడ్ గ్రంథి పరిశీలన, సామర్థ్యాన్ని గుర్తించడం. Na^{24} - రక్త సరఫరాలో అడ్డంకుల గుర్తింపు. Co^{60} - క్యాన్సర్ వ్యాధి గుర్తింపు, చికిత్స P^{32} - ల్యూకేమియా గుర్తింపు




వ్యవసాయం: P^{32} -మొక్కలు ఫాస్ఫరస్‌ను శోషించుకునే సామర్థ్యాన్ని అంచనా వేయడం. S^{34} - మొక్కల్లో లవణాల సరఫరా అధ్యయనం. C^{60} - γ విఘటనకు గురిచేయడం ద్వారా పంటఉత్పత్తి పెంచడం.

భూగోళ శాస్త్రం: C^{14} - శిలాజాల వయసు కనుక్కోవడం. U^{238}, Pb^{206} - శిలల వయసు కనుక్కోవడం.

రేడియోధార్మికత: కేంద్రకం ద్రవ్యరాశి లోపం దాని స్థిరత్వానికి కొలమానం (ఐన్‌స్టీన్)
$E = mc^2$, 1 Kg ద్రవ్యరాశి = 9×10^{16}J
1 amu = 931.5 MeV ★ ఇనుము స్థిరత్వం ఎక్కువ. కేంద్రకం ద్రవ్యరాశి పెరిగితే దాని స్థిరత్వం తగ్గి దాని నుంచి α, β, γ అనే రేడియోధార్మిక కిరణాలు విడుదలై నాలుగు రేడియోధార్మిక శ్రేణులు ఏర్పడతాయి. దీన్ని సులువుగా AUNT ద్వారా గుర్తించుకోవచ్చు.

A ఆక్టినోయురేనియం - 4n + 3
U యురేనియం - 4n + 2
N నెప్ట్యూనియం - 4n + 1 (కృత్రిమ రేడియోధార్మిక శ్రేణి). T థోరియం - 4n

అన్ని శ్రేణులు సీసంతో అంతం అవుతాయి. $_{82}Pb$ అనేది చివరి స్థిరమూలకం.


రచయిత: మధు కుమార్

JUNIOR INTER Chemistry — Chemical Bonding and Molecular Structure

1. What is Octet rule? **2 marks**

A: Every atom must possess 8 electrons in its outer most energy level for its stability. Atoms combine in two ways to get octet, either by transfer of electrons (or) by mutual sharing of electrons. They can attain ns^2np^6 configuration.
The tendency of an atom to achieve eight electrons in their outer most shell is known as octet rule.

2. What do you understand by Hybridisation?

A: Hybridisation is defined as the process of mixing of atomic orbitals of nearly equal energy of an atom to give the same number of new set of orbitals of equal energy and shapes. Depending on the number and nature of orbitals involving hybridisation it is classified into different types.

3. What is meant by the term Bond order?

A: **Bond order:** The half of the difference between the no.of bonding electrons and anti bonding electrons is known as Bond order.

Final Exams-2026 IMPORTANT Q&A

1. State Fajan's rules and give suitable examples. **4 marks**

A: **Fajan's rules:**
1. Ionic nature of the bond increases with increase in the size of cation.
e.g.: The ionic nature increases in the order $Li^+ < Na^+ < K^+ < Rb^- < Cs^+$
2. The formation of ionic bond is favoured with the decrease of the size of anion.
e.g.: CaF_2 is more ionic than CaI_2.
3. If the charge on cation (or) anion (or) both is less, then they can form ionic bonds.
e.g.: The ionic nature increases in the order $AlCl_3 < MgCl_2 < NaCl$
Al^{3+} Mg^{2+} Na
4. Cations with inert gas configurations form ionic compounds, while those cations with pseudo-inert gas configurations favour covalent bond formation.
e.g.: Na^+ in Na^+Cl^- has an inert gas configuration. So Na^+Cl^- is ionic. But CuCl is more covalent because Cu^+ has not acquired inert gas configuration in this compound, instead it has acquired pseudo inert gas configuration.

More Imp Q & Ans


Writer: Dr.P.Trinadha Raja

ముఖ్యాంశాలు

◆ సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) నూతన ఛైర్మన్‌గా డిసెంబరు 1న వివేక్ చతుర్వేది బాధ్యతలు స్వీకరించారు.

◆ 26వ హార్న్‌బిల్ ఫెస్టివల్ డిసెంబరు 1 నుంచి 10 వరకు నాగాలాండ్‌లోని కోహిమాలో నిర్వహించారు.

◆ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉషా జానకి రామన్ డిసెంబరు 1న బాధ్యతలు చేపట్టారు.

◆ దేశంలో ప్రతి 811 మంది ప్రజలకు ఒక అర్హత ఉన్న వైద్యుడు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది.

◆ పాకిస్థాన్ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ (సీడీఎఫ్)గా మాజీ ఆర్మీ అధిపతి, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ నియమితులయ్యారు. పాకిస్థాన్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దళాలను ఏకీకృతం చేసేందుకు పాకిస్థాన్ ప్రభుత్వం 27వ రాజ్యాంగ సవరణ ద్వారా సీడీఎఫ్ పదవిని సృష్టించింది.

◆ భారత పర్యటనకు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో డిసెంబరు 5న సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య 11 కీలక ఒప్పందాలు కుదిరాయి. భారత్ - రష్యా బిజినెస్ ఫోరమ్‌లోనూ మోదీ - పుతిన్ పాల్గొన్నారు.

◆ బిహార్ ముఖ్యమంత్రిగా ఇటీవల పదో విడత ప్రమాణస్వీకారం చేసిన నీతీష్ కుమార్ లండన్‌కు చెందిన 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటుపొందారు.

◆ అగోచర సాంస్కృతిక వారసత్వం (ఐసీహెచ్) అంతర ప్రభుత్వ కమిటీ 20వ సదస్సును డిసెంబరు 7 నుంచి 13 వరకు దిల్లీలోని ఎర్రకోట సముదాయంలో నిర్వహించారు. యునెస్కోకు చెందిన ఈ కమిటీ సదస్సుకు భారత్ ఆతిథ్యమివ్వడం ఇదే తొలిసారి.

◆ సముద్రాల్లో నివసించే సూక్ష్మజీవులపై అధ్యయనం చేసేందుకు 'డీప్ సీ మెరైన్ మైక్రోబియల్ రిపాజిటరీ' కేంద్రాన్ని నెల్లూరులో ఏర్పాటు చేస్తున్నట్లు 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ' ప్రకటించింది. దేశంలో ఈ తరహా కేంద్రాల్లో ఇది మొదటి పరిశోధనా కేంద్రంగా వార్తల్లో నిలిచింది.

◆ యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితాలో దీపావళిని చేర్చారు. దిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించిన ఐసీహెచ్ సమావేశంలో యునెస్కో డిసెంబరు 10న ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో భారత్‌కు చెందిన 15 అంశాలకు యునెస్కో వారసత్వ గుర్తింపు పొందినట్లయింది. వీటిలో కుంభమేళా, కోల్‌కతా దుర్గాపూజ, గుజరాత్ గర్బా నృత్యం, యోగ, వేద పఠన సంప్రదాయం, రామాయణ గాథను ప్రదర్శించే రామ్‌లీల సంప్రదాయ ప్రదర్శనలు ఉన్నాయి.

స్క్వాష్ ప్రపంచకప్ - 2025ను భారత జట్టు గెలుచుకుంది. చెన్నైలో డిసెంబరు 14న జరిగిన ఫైనల్లో భారత్ 3-0తో హాంకాంగ్‌పై ఘన విజయం సాధించింది. దీంతో స్క్వాష్ ప్రపంచకప్‌ను సొంతం చేసుకున్న తొలి ఆసియా జట్టుగా భారత్ రికార్డులకెక్కింది.




బాహుబలి ప్రయోగంతో ఇస్రో రికార్డు!

రష్యా అధ్యక్షుడు పుతిన్ గత డిసెంబరులో భారత్‌లో రెండు రోజులు పర్యటించి పలు కీలక ఒప్పందాలను కుదుర్చుకున్నారు. తన త్రివిధ దళాలను ఏకీకృతం చేస్తూ పాకిస్థాన్ ఒక పదవిని సృష్టించింది. ప్రపంచ చరిత్రలో మునుపెన్నడూ ఎవరికీ సాధ్యం కానంత నికర సంపద కలిగి ఉన్న వ్యక్తిగా ఎలాన్ మస్క్ రికార్డు నెలకొల్పారు. యునెస్కో వారసత్వ గుర్తింపు జాబితాలో దీపావళి పండగ చేరింది. హైడ్రోజన్ ఇంధనంతో నడిచే పడవ గంగానది జలాలపై అందుబాటులోకి వచ్చింది. స్క్వాష్ ప్రపంచ కప్‌ను భారత్ జట్టు సొంతం చేసుకుంది. ఉపాధిహామీ పథకం స్థానంలో తీసుకొచ్చిన 'వీబీ-జీ-రాంజీ' బిల్లుతో పాటు అణురంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ప్రధాని మోదీ జోర్డాన్, ఇథియోపియా, ఒమన్‌లలో పర్యటించారు. గాంధీజీ మెప్పు పొందిన పొందూరు ఖాదీకి జీఐ ట్యాగ్ లభించింది. నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించింది. గడిచిన ఏడాది చివరి నెలలో చోటుచేసుకున్న ఇలాంటి వర్తమాన వ్యవహారాలు, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు, వార్తల్లో నిలిచిన అంశాలను పోటీ పరీక్షార్థులు తప్పకుండా గుర్తు చేసుకోవాలి.

కరెంట్ అఫైర్స్ — రౌండప్ - 2025 — డిసెంబరు

◆ మధ్యప్రదేశ్‌కు చెందిన మూడేళ్ల సర్వాగ్య సింగ్ కుష్వాహా ప్రపంచంలో అతి పిన్న వయస్కుడిగా అధికారిక రేటింగ్ పొందిన చెస్ ఆటగాడిగా ఘనత సాధించాడు. కేవలం 3 సంవత్సరాల 7 నెలల 20 రోజుల వయసులో కుష్వాహా 1572 రేటింగ్‌తో అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఎఫ్‌ఐడీఈ) రికార్డుల్లో ప్రవేశించాడు.

తమిళనాడు పర్యావరణం, వాతావరణ మార్పులు, అటవీశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహూ ఐక్యరాజ్య సమితి అత్యున్నత పురస్కారమైన 'ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ 2025' అవార్డు గెలుచుకున్నారు.



◆ బాలీవుడ్ నటి రవీనా టాండన్ 2025 సంవత్సరానికి 'పెటా ఇండియా పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా పురస్కారం గెలుచుకున్నారు.

◆ ప్రసిద్ధ హాలీవుడ్ నటుడు లియోనార్డో డికాప్రియోను టైమ్ మ్యాగజైన్ 'ఎంటర్‌టైనర్ ఆఫ్ ద ఇయర్'గా ప్రకటించింది.

◆ కేంద్ర మాజీ మంత్రి, మాజీ లోక్‌సభ స్పీకర్, కాంగ్రెస్ దిగ్గజ నేత శివరాజ్ పాటిల్ (90) డిసెంబరు 12న మహారాష్ట్రలోని లాతూర్‌లో మరణించారు. ఆయన లాతూర్ నుంచి ఏడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు.

◆ హైడ్రోజన్‌తో నడిచే తొలి స్వదేశీ పడవను భారత్ డిసెంబరు 11న గంగానది జలాలపై ఆవిష్కరించింది. దీంతో హైడ్రోజన్ శక్తితో పడవలు, ఓడలు నడుపుతున్న చైనా, నార్వే, నెదర్లాండ్స్, జపాన్ దేశాల సరసన భారత్ నిలిచింది.

◆ జూనియర్ హాకీ ప్రపంచకప్-2025 విజేతగా జర్మనీ నిలిచింది. ఫైనల్లో జర్మనీ షూటౌట్‌లో 3-2తో స్పెయిన్‌పై నెగ్గింది. మూడో స్థానం కోసం జరిగిన పోరులో ఆతిథ్య భారత్.. అర్జెంటీనాను ఓడించి కాంస్య పతకం గెలుచుకుంది.

◆ 2025కు 'పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా 'ఆర్కిటెక్ట్స్ ఆఫ్ ఏఐ (ఏఐ సృష్టికర్తలు)'ను ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ టైమ్ ప్రకటించింది. 2025ను ఏఐ ఏడాదిగా టైమ్ అభివర్ణించింది.

◆ 'ద గోట్ ఇండియా టూర్'లో భాగంగా డిసెంబరు 13న ఫుట్‌బాల్ దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సీ కోల్‌కతా, హైదరాబాద్‌ల్లో పర్యటించారు.

◆ సమాచార ప్రధాన కమిషనర్ (సీఐసీ)గా మాజీ ఐఏఎస్, న్యాయశాఖ మాజీ కార్యదర్శి రాజ్‌కుమార్ గోయల్ డిసెంబరు 15న ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం 8 మంది నూతన సమాచార కమిషనర్లతో గోయల్ ప్రమాణం చేయించారు. వీరిలో ఏపీకి చెందిన రేలంగి సుధారాణి ఉన్నారు.

◆ డిసెంబరు 15న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోర్డాన్ పర్యటనలో భాగంగా ఆ దేశ రాజు అబ్దుల్లా-2 ఇబిన్ అల్ హుసేన్‌తో భేటీ అయ్యారు. భారత్-జోర్డాన్ మధ్య దౌత్య సంబంధాలు మొదలై 75 ఏళ్లు అవుతున్న తరుణంలో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

◆ డిసెంబరు 16న ప్రధాని మోదీ ఇథియోపియాలో పర్యటించారు. ఆ దేశ ప్రధానమంత్రి డాక్టర్ అబి అహ్మద్ అలీతో సమావేశమయ్యారు. ఇథియోపియా అత్యున్నత పురస్కారం 'గ్రేట్ ఆనర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా'తో మోదీని సత్కరించారు.

2025 ఫార్ములా వన్ డ్రైవర్ ఛాంపియన్‌షిప్‌ను మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ కైవసం చేసుకున్నాడు. నోరిస్‌కు కెరీర్‌లో ఇదే తొలి ఫార్ములావన్ డ్రైవర్ టైటిల్. గత నాలుగేళ్లు వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) విజేతగా నిలిచాడు.




◆ డిసెంబరు 17, 18 తేదీల్లో మోదీ ఒమన్‌లో పర్యటించారు. చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై ఇరుదేశాలు డిసెంబరు 18న సంతకాలు చేశాయి. ఒమన్ అత్యున్నత పౌర పురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను ఆ దేశ సుల్తాన్ హైథమ్ బిన్ తారిఖ్ మోదీకి అందజేశారు.

◆ ప్రముఖ భారత శిల్పి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత రామ్ వాంజీ సుతార్ (100) డిసెంబరు 18న నోయిడాలో మరణించారు. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన విగ్రహం 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' (సర్దార్ వల్లభాయ్ పటేల్), పార్లమెంటు ముందు కూర్చొని ఉండే మహాత్మా గాంధీ, ఛత్రపతి శివాజీ విగ్రహం లాంటి ఎన్నో ప్రసిద్ధ శిల్పాలను సుతార్ రూపొందించారు.

◆ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్‌ల 26వ జాతీయ సదస్సును డిసెంబరు 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్వహించారు.

◆ ఇరాక్ మాజీ అధ్యక్షుడు బర్హమ్ సలీహ్‌ను ఐక్యరాజ్య సమితి శరణార్థి సంస్థ తదుపరి అధిపతిగా ఐరాస జనరల్ అసెంబ్లీ ఆమోదించింది. 1970ల తర్వాత పశ్చిమాసియాకు చెందిన వ్యక్తి మొదటిసారి ఈ పదవికి ఎంపికయ్యారు.

ప్రపంచంలోకెల్లా అత్యంత పొడవైన ఎక్స్‌ప్రెస్‌వే సొరంగాన్ని 'తియాన్షన్ షెంగ్లీ' పేరుతో చైనా ప్రారంభించింది. ఈ సొరంగం పొడవు 22.13 కిలోమీటర్లు.



◆ ట్రాన్స్‌జెండర్స్ జాతీయ క్రీడలను ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పుర్‌లో నిర్వహించారు.

◆ 'ఆసియా పవర్ ఇండెక్స్ - 2025'లో భారత్ 40 స్కోరుతో మూడో స్థానంలో 'మేజర్ పవర్'గా నిలిచింది. 80.4 స్కోరుతో అమెరికా సూపర్ పవర్‌గా, 73.7 స్కోరుతో చైనా సూపర్ పవర్‌గా వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచాయి.

◆ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రిసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) నూతన డైరెక్టర్ జనరల్‌గా సురేష్ గోయల్ నియమితులయ్యారు. 2026, జనవరి 5 నుంచి ఈయన పదవీకాలం అమలులోకి వస్తుంది.

◆ భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ తన ఆత్మకథను 'ది వన్: క్రికెట్, మై లైఫ్ అండ్ మోర్'ను న్యూదిల్లీలో ఆవిష్కరించారు. హార్పర్ కాలిన్స్ ఇండియా సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించింది.

◆ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సంప్రదాయ పొందూరు ఖాదీ భారత ప్రభుత్వం నుంచి భౌగోళిక సూచిక (జీఐ) ట్యాగ్‌ను పొందింది. స్వాతంత్ర్య పోరాట సమయంలో మహాత్మా గాంధీ స్వావలంబన, స్వదేశీ చిహ్నంగా పొందూరు ఖాదీ ఉత్పత్తి, వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఇది ప్రాముఖ్యతను సంతరించుకుంది.

◆ ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విని కుమార్ తివారీ పదవీకాలాన్ని భారత ప్రభుత్వం 2027, డిసెంబరు 31 వరకు రెండేళ్ల పాటు పొడిగించింది.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) (వీబీ-జీ రాం జీ) బిల్లు చట్టంగా మారింది. పార్లమెంటు ఉభయసభల ఆమోదం పొందిన ఈ బిల్లుకు డిసెంబరు 21న రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు.



◆ భారత్ తన మొదటి అటవీ విశ్వవిద్యాలయాన్ని గోరఖ్‌పుర్(యూపీ)లో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

◆ న్యూదిల్లీలో జరిగిన రెండో 'డబ్ల్యూహెచ్‌ఓ గ్లోబల్ సమ్మిట్ ఆన్ ట్రెడిషనల్ మెడిసిన్‌'లో ప్రధాని మోదీ భారత్‌లోని అత్యంత ప్రసిద్ధ ఔషధ మొక్కల్లో ఒకటైన అశ్వగంధపై స్మారక పోస్టల్‌స్టాంపును విడుదల చేశారు.

◆ భారత నౌకాదళానికి 40 ఏళ్ల పాటు సేవలందించిన జలాంతర్గామి ఐఎన్ఎస్ సింధు ఘోష్‌ను నేవీ నుంచి లాంఛనంగా ఉపసంహరించారు. ముంబయిలో ఈ కార్యక్రమం జరిగింది.

◆ ఒక ఏడాదిలో మిలియన్ డాలర్ల నగదు బహుమతిని గెలుచుకున్న తొలి బ్యాడ్మింటన్ ప్లేయర్‌గా దక్షిణ కొరియా క్రీడాకారిణి ఆన్ సెయంగ్ ఘనత సాధించింది.


◆ భారతదేశంలో ఒకప్పుడు రేడియో సిలోన్‌గా గుర్తింపు పొందిన శ్రీలంకలోని రేడియో సర్వీసు 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

◆ అణురంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించేందుకు వీలుగా తీసుకొచ్చిన సస్టైనబుల్ హార్నెస్సింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా(శాంతి) బిల్లుకు రాష్ట్రపతి ముర్ము డిసెంబరు 21న ఆమోదం తెలిపారు. ఈ కొత్త చట్టం రాకతో ద ఆటమిక్ ఎనర్జీ చట్టం-1962, సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజీ చట్టం-2010 రద్దవుతాయి.

◆ ప్రపంచంలోనే తొలిసారిగా 700 బిలియన్ డాలర్లకు పైగా నికర సంపద ఉన్న వ్యక్తిగా ఎలాన్ మస్క్ ఘనత సాధించారు. ఈయన సంపద విలువ 749 బిలియన్ డాలర్ల (రూ.67.41 లక్షల కోట్లు)కు చేరింది.

◆ దిత్వా తుపాను కారణంగా అతలాకుతలమైన శ్రీలంకకు భారత్ 45 కోట్ల డాలర్ల ఆర్థికసాయం ప్రకటించింది.

◆ దేశ చరిత్రలో తొలిసారిగా 6,100 కిలోల బరువైన బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి డిసెంబరు 24న అత్యంత శక్తిమంతమైన బాహుబలి రాకెట్ ఎల్‌వీఎం3-ఎం6 ద్వారా ఇస్రో నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టింది.


రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

విలీనం.. బదిలీ.. ఏదైనా.. అంతిమ నిర్ణయం పార్లమెంట్‌దే!

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ ప్రత్యేకం. ఈ భూమి అనేక మతాలు, భాషలు, సంస్కృతికి నిలయంగా ఉంది. భారత రాజ్యాంగం దేశాన్ని రాష్ట్రాల సమాఖ్యగా పేర్కొంది. భారత భూభాగం పరిధి అంటే దేశ సార్వభౌమాధికారం వర్తించే వరకు అని అర్థం. దేశం అఖండమైంది. కేవలం పరిపాలనా సౌలభ్యం, ప్రాంతీయ ప్రజల కోరిక, ఇతర కారణాల వల్ల దేశాన్ని పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పాటు చేశారు. రాజ్యాంగంలో 1 నుంచి 4 వరకు ఉన్న నిబంధనలు భారత యూనియన్, దాని భూభాగం గురించి వివరిస్తాయి.

భారత భూభాగం - రాష్ట్రాలు

మొదటి భాగం: 1 - 4 నిబంధనలు

రాజ్యాంగ నిర్మాణసభలో దేశం పేరును నిర్ణయించే విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదు. కొంతమంది సభ్యులు సంప్రదాయ నామం భారత్‌ని సూచించగా, మరికొందరు ఇండియాని సమర్థించారు. దీంతో రాజ్యాంగ నిర్మాణ సభ రెండు పేర్లను కలిపి, ఇండియా అంటే భారత్ అని పేర్కొంది.

1వ నిబంధన

భారతదేశం రాష్ట్రాల కలయిక (యూనియన్) అని 1వ నిబంధన పేర్కొంటోంది. ఈ నిబంధన భారతదేశాన్ని ఇండియా అంటే భారత్‌గా అభివర్ణించింది. భారత రాజ్యాంగంలో సమాఖ్య లక్షణాలు ఉన్నప్పటికీ సమాఖ్య అనే పదాన్ని రాజ్యాంగంలో ఎక్కడా చేర్చలేదు. సమాఖ్యకు బదులుగా యూనియన్ అనే పదం ఉపయోగించారు. ఈ పదాన్ని కెనడా నుంచి గ్రహించారు. సమాఖ్యను ఆంగ్లంలో ఫెడరేషన్ అంటారు, ఇది ఫోడస్ అనే పదం నుంచి ఉద్భవించింది. ఫోడస్ అంటే ఒప్పందం అని అర్థం. భారత్ పరిపూర్ణమైన సమాఖ్య కాదు. కేవలం పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పడిన సమాఖ్య మాత్రమే. భారత్‌లోని రాష్ట్రాలు యూనియన్ నుంచి విడిపోవడం కుదరదు. 1వ నిబంధన ప్రకారం భూభాగాన్ని మూడు రకాలుగా విభజించవచ్చు. అవి: 1) రాష్ట్రాల భూభాగాలు 2) కేంద్రపాలిత ప్రాంతాలు 3) ఆర్జిత ప్రాంతాలు

- భారతదేశం విభజిత రాష్ట్రాలను కలిగిన అవిభాజ్య రాజ్యం. ఇక్కడ ఒక రాష్ట్రం ఎన్ని రాష్ట్రాలుగానైనా విడిపోవచ్చు. కానీ దేశం నుంచి భౌగోళికంగా విడిపోయే అధికారం లేదు. అవిభాజ్య రాజ్యం అంటే విడదీయడానికి వీలు లేనిదని అర్థం.
- 1974లో సిక్కిం భారత్‌లో విలీనమవడం, దాద్రానగర్ హవేలి, గోవా, డయ్యూ డామన్, పుదుచ్చేరిల విలీనం ఆర్జిత ప్రాంతాలకు ఉదాహరణలుగా చెప్పవచ్చు.
- భారత యూనియన్ అనే భావన కంటే భారత భూభాగం అనే భావన విస్తృతమైంది. భారత యూనియన్‌లో రాష్ట్రాలు మాత్రమే ఉంటాయి. కానీ భారత భూభాగం అనే భావనలో రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలు, ఆర్జిత ప్రాంతాలు కూడా ఉంటాయి.
- 1994లో సుప్రీంకోర్టు ఎస్.ఆర్ బొమ్మై కేసులో సమాఖ్య విధానం రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని పేర్కొంది.

2వ నిబంధన

దేశంలో అంతర్గతంగా భూభాగాల విషయంలో మార్పులు చేయడంతో పాటు దేశ భూభాగాలను ఇతర దేశాలకు బదిలీ చేయడం, ఇతర దేశాల భూభాగాలను భారతదేశంలో విలీనం చేయడం లాంటి నిర్ణయాల్లో పార్లమెంట్‌దే అంతిమ నిర్ణయం.

- ఆర్జిత ప్రాంతాల విలీనం విషయంలోనూ అంతిమ నిర్ణయం పార్లమెంట్‌దే.
- విదేశీ రాజ్యాలను చేర్చుకోవడానికి లేదా స్థాపించడానికి పార్లమెంట్‌కు మాత్రమే అధికారం ఉంటుంది.
- 1960లో బెరు-బారి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి భారతదేశ భూభాగాన్ని ఇతరులకు బదిలీ చేసే సందర్భంలో, ఇతర దేశ భూభాగాలను భారతదేశంలో విలీనం చేసేటప్పుడు రాజ్యాంగ సవరణ ద్వారా మాత్రమే మార్పులు, చేర్పులు చేయాలి.
- 9వ రాజ్యాంగ సవరణను అనుసరించి 1960లో బెరు-బారి ప్రాంతాన్ని పాకిస్థాన్‌కు బదిలీ చేశారు.
- 36వ రాజ్యాంగ సవరణను అనుసరించి 1974లో సిక్కింను భారత్‌లో విలీనం చేశారు.



రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

3వ నిబంధన

భారత్‌లో రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ విషయంలో అంతిమ అధికారం పార్లమెంట్‌దే.

- రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ అంటే నూతన రాష్ట్రాల ఏర్పాటు, రాష్ట్రాల సరిహద్దులు, పేర్లను మార్చడం, రాష్ట్రాల భూభాగాల్లో మార్పు చేయడం.
- ఈ పునర్ వ్యవస్థీకరణ బిల్లును రాష్ట్రపతి ముందస్తు అనుమతితో పార్లమెంట్‌లో ఏ సభలోనైనా ముందుగా ప్రవేశపెట్టవచ్చు. అయితే దీన్ని ఉభయసభలు సాధారణ మెజార్టీతో ఆమోదించాలి.
- పునర్ వ్యవస్థీకరణ బిల్లుపై పార్లమెంట్ చేసిన తీర్మానాన్ని రాష్ట్రపతి తప్పనిసరిగా ఆమోదించాలి. అంటే పునఃపరిశీలనకు పంపరాదు.
- ఈ బిల్లును ప్రవేశపెట్టే దశలో పునర్ వ్యవస్థీకరించే రాష్ట్ర అభిప్రాయాన్ని రాష్ట్రపతి తప్పనిసరిగా తెలుసుకోవాలి. అయితే రాష్ట్రాల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవడం తప్పనిసరికాదు. 5వ రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్రం తన సొంత నిర్ణయాన్ని అమలుపరచవచ్చు.
- రాష్ట్రపతి ఎంత సమయంలో తన నిర్ణయాన్ని తెలపాలనేది రాజ్యాంగంలో పేర్కొనలేదు.

బాబులాల్ VS స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర: ఈ కేసులో ఏదైనా రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ బిల్లుపై ఆ రాష్ట్ర శాసనసభ అభిప్రాయాన్ని కోరుతూ రాష్ట్రపతి ఆ రాష్ట్ర శాసనసభకు పంపిస్తారు. శాసనసభ తన అభిప్రాయాన్ని కేంద్రానికి తెలుపుతుంది. ఆ తర్వాత పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు కేంద్ర ప్రభుత్వం ఆ బిల్లులో ఏదైనా సవరణలు చేసినట్లయితే తిరిగి శాసనసభ అభిప్రాయం కోరాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది.

4వ నిబంధన

రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ జరిపినప్పుడు మొదటి షెడ్యూల్‌లో మార్పులు చేయాలి.

- నూతన రాష్ట్రాలు ఏర్పర్చినప్పుడు, పేర్లు మార్చినప్పుడు 4వ షెడ్యూల్‌ను తప్పనిసరిగా సవరించాలి.
- విదేశ భూభాగాలు భారత్‌లో విలీనమైనప్పుడు లేదా స్వదేశీ భూభాగాలను బదిలీ చేసినప్పుడు తప్పనిసరిగా రాజ్యాంగాన్ని సవరించాలని 1960లో సుప్రీంకోర్టు బెరు-బారి కేసులో తీర్పునిచ్చింది.

రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ

1950లో రాజ్యాంగం అమలు నాటికి భారతదేశంలోని భూభాగాన్ని నాలుగు విభాగాలుగా ఏర్పాటు చేశారు.

పార్ట్-ఎ రాష్ట్రాలు: గతంలో బ్రిటిష్ పాలిత ప్రాంతాలుగా ఉన్న వాటిని ఈ విభాగంలో చేర్చారు. వీటి సంఖ్య-9.

పార్ట్-బి రాష్ట్రాలు: ప్రత్యేకమైన శాసనసభలను కలిగి ఉన్న స్వదేశీ సంస్థానాలను ఈ విభాగంలో చేర్చారు. వీటి సంఖ్య-9.

పార్ట్-సి: కొన్ని స్వదేశీ సంస్థానాలు, గతంలో ఉన్న చీఫ్ కమిషనరేట్ ప్రాంతాలు. వీటి సంఖ్య-10.

పార్ట్-డి రాష్ట్రాలు: అండమాన్ నికోబార్ దీవులను ఈ భాగంలో చేర్చారు.

- భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు రాష్ట్రాల సంఖ్య-29.

1950లో భారతదేశంలో భూభాగాలు

పార్ట్-ఎ	పార్ట్-బి	పార్ట్-సి	పార్ట్-డి
అస్సాం	మైసూర్	భోపాల్	అండమాన్ నికోబార్ దీవులు
బెంగాల్	హైదరాబాద్	కచ్	
బిహార్	జమ్మూకశ్మీర్	ఢిల్లీ	
బొంబాయి	మధ్యభారత్	మణిపూర్	
పంజాబ్	రాజస్థాన్	హిమాచల్‌ప్రదేశ్	
మధ్యప్రదేశ్	ట్రావెన్‌కోర్	అజ్మీర్	
ఒడిస్సా	సౌరాష్ట్ర	కూచ్ బిహార్	
మద్రాస్	పటియాలా	బిలాస్‌పూర్	
యునైటెడ్ ప్రావిన్సెస్	వింధ్యప్రదేశ్	కూర్గ్	
		త్రిపుర	

- భారతదేశంలో రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ భాషా ప్రాతిపదికన జరగాలని 20వ శతాబ్దం మొదటి నుంచి డిమాండ్ ఉంది. ముఖ్యంగా దక్షిణ భారతదేశం నుంచి ఎక్కువగా ఉంది.

881 Word of the Day

Bonhomie

Telugu meaning: కలుపుగోలుతనం, ఉల్లాసం

English meaning: The word bonhomie (బానోమీ) is a noun that describes cheerful friendliness, good-naturedness, and pleasant social behaviour.

Synonyms: Cordiality, Warmth ***Antonyms:*** Rudeness, Harshness

Usage: **1.** His natural bonhomie made him popular among colleagues, as he always greeted everyone with a warm smile.

2. The festival was filled with laughter and bonhomie, creating an atmosphere of unity and celebration.

Current Affairs



On 2 January 2026, the government announced a Rs.7,295 crore export support package, comprising a Rs.5,181 crore interest subvention scheme along with a Rs.2,114 crore collateral support, to improve exporters' access to credit. Both measures will be rolled out over a period of six years (2025-31).

- Under the interest subvention scheme, exporters will get a subsidy on pre- and post-shipment export credit.



Assam became the first state in India to constitute an 8th State Pay Commission, just as the 7th Pay Commission's provisions are set to expire on January 1, 2026. The development comes amid growing anticipation among government employees and pensioners for clarity on pay hikes.

The Government of India launched the Market Access Support (MAS) Intervention under the Export Promotion Mission (EPM), a flagship initiative approved by the Union Cabinet on 12 November 2025. The MAS Intervention is being implemented under the NIRYAT DISHA sub-scheme of EPM and is aimed at strengthening international market access for Indian exporters, particularly MSMEs, first-time exporters and firms from priority sectors.

The Telecom Regulatory Authority of India (TRAI) announced, India crossed 100 crore Internet connections in November 2025. In the last 10 years, the Broadband subscriber base in India has increased by more than six times. There were 131.49 million (13.15 crore) broadband subscribers at the end of November 2015, which grew to 1 billion (100.37 crore) at the end of November 2025, according to the Ministry of Communications.

For more Current Affairs: Scan QR code

ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం

జనవరి 4
చరిత్రలో ఈనాడు

మానవులు చూడటం ద్వారానే చదవడం, నేర్చుకోవడం చేస్తుంటారు. కళ్లతో పదాలను తెలుసుకుని రాస్తుంటారు. మరి అంధులు లేదా దృష్టి లోపం ఉన్నవారి పరిస్థితి ఏంటి? వారు చదువుకోవడం ఎలా? అనే ప్రశ్నలకు సమాధానమే బ్రెయిలీ లిపి. చేతి వేళ్ల స్పర్శతో అక్షరాలను గుర్తించడం దీని ప్రత్యేకత. దీన్ని కనిపెట్టింది ఫ్రెంచ్ విద్యావేత్త అయిన లూయిస్ బ్రెయిలీ. చూపులేని వారి కష్టాలు ఈయనకు స్వయంగా తెలుసు. కాబట్టే వాటిని అధిగమించి, తేలిగ్గా నేర్చుకునేలా ఈ లిపిని రూపొందించారు. అంధుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపిన ఆయన జన్మదినమైన జనవరి 4న 'ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం'గా (World Braille Day) నిర్వహిస్తారు. దృష్టి లోపం ఉన్నవారికి కమ్యూనికేషన్, సాధికారత కల్పించే సాధనంగా బ్రెయిలీ పోషించే పాత్రను చాటి చెప్పడంతోపాటు అంధుల హక్కులను కాపాడటం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

లూయిస్ బ్రెయిలీ

ఈయన ఫ్రాన్స్‌లోని పారిస్ నగరానికి దగ్గర్లో ఉన్న క్రూవే గ్రామంలో 1809, జనవరి 4న జన్మించారు. మూడేళ్ల వయసులో ప్రమాదవశాత్తు రెండు కళ్లను కోల్పోయారు. తల్లిదండ్రులు ఆయన్ను దగ్గర్లోని పాఠశాలలో చేర్పించారు. అందులో తాను నేర్చుకునేలా సౌకర్యాలు లేకపోవటంతో రాయల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ బ్లైండ్ యూత్‌లో చేరారు.

- లూయిస్ అందులో చేరి అప్పటికే అమల్లో ఉన్న 'లైన్ టైప్' పద్ధతిలో చదువుకున్నారు. ఈ వ్యవస్థను వాలెంటైన్ అభివృద్ధి చేశారు. ఈ లిపి చదవడానికే పనికొచ్చేది కానీ రాయడానికి వీలయ్యేది కాదు. ఉబ్బెత్తు అక్షరాలను ముద్రించటానికి పెద్ద ప్రింటింగ్ ప్రెస్ అవసరమయ్యేది. దీంతో అంధుల కోసం సరళమైన కొత్త లిపి అవసరమని లూయిస్ గుర్తించారు.

చారిత్రక నేపథ్యం: ప్రపంచవ్యాప్తంగా ఉన్న చూపులేని వారికి బ్రెయిలీ లిపితో చదువుకోవడానికి అవకాశం కల్పించిన వ్యక్తి లూయిస్. ఆయన సేవలను




స్మరించుకునేందుకు ఏటా ఆయన పుట్టిన రోజైన జనవరి 4న 'ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం'గా నిర్వహించాలని ఐరాస జనరల్ అసెంబ్లీ 2018లో తీర్మానించింది. 2019 నుంచి ఏటా దీన్ని జరుపుతున్నారు.

బ్రెయిలీ లిపి, ఇతర విశేషాలు, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - జాగ్రఫీ

ఆసియా ఖండం



ప్రపంచంలో మొత్తం ఏడు ఖండాలు ఉన్నాయి. అవి.. ఆసియా, ఆఫ్రికా, ఐరోపా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా, అంటార్కిటికా. అనేక వైవిధ్యాలకు నెలవైన ఆసియా ఖండం విస్తీర్ణంలో ప్రపంచంలోనే పెద్దది. జనాభా పరంగానూ అన్నింటికంటే ముందుంది. విశాలమైన పర్వత శ్రేణులు, మైదానాలు, పీఠభూములు, ఎడారులు ఈ ఖండంలో ఉన్నాయి. ఆయా అంశాలతో పాటు శీతోష్ణస్థితి, ఖనిజాలు, నదులు, వ్యవసాయం తదితరాలపై పోటీపరీక్షార్థులు దృష్టిసారించాలి.

హద్దులు

- తూర్పున - పసిఫిక్ మహాసముద్రం, పడమరన - యూరల్ పర్వతాలు, కాస్పియన్ సముద్రం, ఉత్తరాన - ఆర్కిటిక్ మహాసముద్రం, దక్షిణాన - హిందూ మహాసముద్రం ఆసియా ఖండానికి హద్దులుగా ఉన్నాయి.

ఆసియాలోని ఎడారులు

- థార్ ఎడారి - భారతదేశం, అరేబియన్ ఎడారులు - ఇరాక్, ఇరాన్, సిరియా ఎడారులు - ఉష్ణ ఎడారులు.

దీవుల సముదాయం

- హిందూ, పసిఫిక్ మహాసముద్రాల్లో అనేక దీపతోరణాలు, ప్రవాళ దీవులు ఉన్నాయి.

ఉనికి, నదులు, భౌతిక స్వరూపం, శీతోష్ణస్థితి, వర్షపాతం, జనాభా మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సుల్లో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

ఆధార్ సూపర్‌వైజర్/ ఆపరేటర్ ఉద్యోగాలు

సీఎస్‌సీ ఈ-గవర్నెన్స్ సర్వీస్ ఇండియా లిమిటెడ్ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని జిల్లా కేంద్రాల్లో ఆధార్ సూపర్‌వైజర్/ఆపరేటర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 282. అర్హులైన అభ్యర్థులు 2026 జనవరి 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ట్రైనీ ఇంజినీర్ ఉద్యోగాలు

బెంగళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) తాత్కాలిక ప్రాతిపదికన కొట్ద్వారా యూనిట్‌లో ట్రైనీ ఇంజినీర్, ట్రైనీ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 51. దరఖాస్తు ఫీజు రూ.150. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ 15 జనవరి 2026.

ముంబయి పోర్ట్ అథారిటీలో ఉద్యోగాలు

ముంబయి పోర్ట్ అథారిటీ (ఎంపీఏ) ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ ప్రొఫెషనల్ ఇంటర్న్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 10. అర్హులైన అభ్యర్థులు 2026 జనవరి 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ ప్రవేశాలకు నేడే (జనవరి 4) చివరి తేదీ

- సీఎస్ఐఆర్ - ఏఎంపీఆర్ఐలో 13 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు. డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.
- సీయూఈటీ పీజీ 2026 ప్రవేశాలు. బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- టీఆర్ఏఐలో టెక్నికల్ ఆఫీసర్ పోస్టులు. బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams
Reasoning

Syllogisms

Directions (Qs. 1 - 9): *In question, some statements are given, followed by two or three conclusions I, II, III. You have to consider the statements to be true, even if they seem to be at variance from commonly known facts. You have to decide which of the given conclusions, if any, follow from the given statements. Indicate your answer.*

1. Statements: A few bottles are not sofa.
All sofa are car.
No car is plastic.
Conclusions: I. No plastic is a sofa.
II. No bottle is plastic.
III. Some sofa are not bottle.
A) Only C1 follows
B) Either C1 or C2 follows
C) Only C2 and C3 follow
D) All follow

2. Statements: No lory is hole.
Not a single hole is well.
Every well is road.
Conclusions:
I. Some road which are well are lory also.
II. No lory is a well.
III. Some road are not hole.
A) All follow
B) Either C1 or C2 follows
C) Only C2 and C3 follow
D) Only C3 follows

3. Statements: No plate is fork.
Not a single fork is knife.
Every knife is spoon.
Conclusions:
I. Some spoon which are knife are plate as well.
II. No plate is a knife.
III. Some spoon are not fork.
A) Only C3 follows
B) Either C1 or C2 follows
C) Only C2 and C3 follow
D) All follow

4. Statements:
A few paint are not painter.
All painter are brush.
No brush is wall.
Conclusions: I. No wall is a painter.
II. No paint is wall.
III. Some painter are not paint.
A) Only C2 and C3 follow
B) Either C1 or C2 follows
C) Only C1 follows
D) All follow

5. Statements: No water is a tank.
All tank are sand.
All sands are trucks.
Conclusions: I. All tanks are trucks.
II. At least some trucks are sand.
A) Neither I nor II follows
B) Only I follows
C) Either I or II follows
D) Both I and II follow

6. Statements: All woman are grapes
No grapes is papaya.
All papaya are avocado.
Conclusions:
I. All woman are avocado.
II. Some avocado are grapes.
A) Neither I nor II follows
B) Only I follows
C) Either I or II follows
D) Both I and II follow

7. Statements: Some wheel are spokes.
Some spokes are wood.
All wood are road.
Conclusions: I. Some road are spokes.
II. All wheel being road is a possibility.
A) Neither I nor II follows
B) Only I follows
C) Either I or II follows
D) Both I and II follow

8. Statements:
At least some conjunction are verb.
Every conjunction is an pronoun.
No pronoun is an noun.
Conclusions:
I. All pronoun being verb is a possibility.
II. Some conjunction can be noun as well.
III. No noun is a verb.
A) Only I follows
B) I and III follow
C) I and II follow
D) All I, II and III follow

9. Statements: No grass is an plant.
No plant is a tree.
All trees are shrubs.
Conclusions:
I. Some tree may be grass.
II. All shrubs being plants is a possibility.
III. No tree is a grass.
A) Either I or III follows
B) I and III follow
C) Only I follows
D) All I, II and III follow

Scan the QR code for Key

These model questions were prepared by subject experts





డెల్టా ధాటికి ప్రత్యర్థి బోల్తా!


వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను కస్టడీలోకి తీసుకున్నట్లు ప్రకటించడం ద్వారా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ సైనిక స్థావరంలో ఉన్న ఒక దేశాధ్యక్షుడిని నిర్బంధించడం నివ్వెరపరిచింది. అమెరికాకు చెందిన సుశిక్షిత 'డెల్టా ఫోర్స్' ఈ ఆపరేషన్‌ను నిర్వహించింది. ప్రమాదకరమైన ఆపరేషన్లు నిర్వహించడం ఈ కమాండోలకు వెన్నతో పెట్టిన విద్య!

ఏమిటీ దళం?

1970లలో ప్రపంచంలో పలుచోట్ల ఉగ్రవాద ముప్పు వేగంగా విస్తరించడం మొదలైంది. దీన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యేక దళం అవసరమని నాడు అమెరికా సైనిక ఉన్నతాధికారి చార్లీ బెక్‌విత్ గుర్తించారు. అప్పట్లో ఆయన 22వ బ్రిటిష్ స్పెషల్ ఎయిర్ సర్వీస్ (ఎస్ఏఎస్)తో కలిసి పనిచేసిన అనుభవంతో 1977లో డెల్టా ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని అధికారికంగా ఫస్ట్ స్పెషల్ ఫోర్సెస్ ఆపరేషనల్ డిటాచ్‌మెంట్- డెల్టా (ఎస్ఎఫ్ఓడీ-డీ)గా వ్యవహరిస్తారు. కంబాట్ అప్లికేషన్స్ గ్రూప్ (క్యాగ్), ఆర్మీ కంపార్ట్‌మెంటెడ్ ఎలిమెంట్స్ (ఏసీఈ), టాస్క్‌ఫోర్స్ గ్రీన్, ద యూనిట్ వంటి అనేక పేర్లతోనూ దీన్ని పిలుస్తుంటారు. ఇది అమెరికా జాయింట్ స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్ (జేఎస్ఓసీ) కిందకి వస్తుంది. దేశంలోని సుశిక్షిత, అత్యున్నత స్థాయి ప్రత్యేక దళాల్లో ఒకటిగా ఇది గుర్తింపు పొందింది. ఉత్తర కరోలినాలోని ఫోర్ట్ బ్రాగ్‌లో దీని ప్రధాన కార్యాలయం ఉంది.

రహస్య కార్యకలాపాలు..

ఉగ్రవాదంపై పోరు డెల్టా ఫోర్స్ ప్రధాన లక్ష్యం. అమెరికా శత్రువులుగా పరిగణించే అత్యున్నత స్థాయి వ్యక్తులను పట్టుకోవడానికి లేదా తుదముట్టించడానికి, ఉగ్రవాద ముఠా నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడానికి అమెరికా ప్రభుత్వం ఈ దళాన్ని వాడుతుంది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు జరిగే ప్రదేశాల్లో అమెరికా సీనియర్ నేతలు పర్యటిస్తున్నప్పుడు వారికి రక్షణగా కూడా ఈ కమాండోలు రంగంలోకి దిగుతుంటారు. బందీలను విడిపించడం, కవర్ట్ కార్యకలాపాలు వంటివి చేస్తుంటారు. చాలా సందర్భాల్లో అమెరికా గూఢచార సంస్థ సీఐఏతో సమన్వయం చేసుకుంటూ ఆపరేషన్లు సాగిస్తుంటారు. సంప్రదాయేతర యుద్ధంలోనూ ఈ కమాండోలు సుశిక్షితులు. విమానాలు, రైళ్లు, నౌకలు, వాహనాల్లో ఆపరేషన్లు నిర్వహించగలరు.



కఠోర శిక్షణ

డెల్టా ఫోర్స్‌లో చేరాలనుకునేవారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. సైన్యంలోని ప్రత్యేక దళాలు (గ్రీన్ బెరె), 75వ రేంజర్ రెజిమెంట్‌కు చెందినవారిని దీనికోసం ఎంచుకుంటుంటారు. ఎంపిక ప్రక్రియ 3-4 వారాలు కొనసాగుతుంది. అది చాలా కఠినంగా ఉంటుంది. ప్రతి 100 మందిలో 90 మంది విఫలమవుతుంటారు. 16 కిలోల బరువుతో రాత్రివేళ 27 కిలోమీటర్ల పరుగు, 20 కిలోల బరువుతో 60 కిలోమీటర్ల దూరం పాటు ఎగుడు దిగుడు నేలపై పరుగులు తీయడం వంటివి చేయాల్సి ఉంటుంది. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారు ఆపరేటర్ ట్రైనింగ్ కోర్స్ (ఓటీసీ)లోకి ప్రవేశిస్తారు. అది ఆరు నెలలపాటు కొనసాగుతుంది. అనంతరం వారు సుశిక్షిత డెల్టా ఫోర్స్ కమాండోగా తయారవుతారు.

డెల్టా ఫోర్స్‌లో 4 ప్రధాన స్క్వాడ్రన్లు ఉంటాయి. ఒక్కో స్క్వాడ్రన్‌లో రెండు విభాగాలు ఉంటాయి.

రెక్కీ/స్నైపర్ ట్రూప్: ఇది నిఘా సమాచారాన్ని సేకరించడం, మాటువేసి ప్రత్యర్థిని మట్టుబెట్టడం వంటి పనులను నిర్వర్తిస్తుంది.

డైరెక్ట్ యాక్షన్, అసాల్ట్ ట్రూప్: నిర్దేశిత లక్ష్యాలపై దాడి, ప్రమాదకర ఆపరేషన్ల నిర్వహించడం వంటివి ఈ విభాగం చేస్తుంది.

గోప్యంగా ఆపరేషన్లు

డెల్టా ఫోర్స్ ఆపరేషన్లు చాలావరకు గోప్యంగా ఉంటాయి. అందులో కొన్ని మాత్రమే ఆ తర్వాత వెలుగు చూశాయి. 2001లో అంతర్జాతీయ ఉగ్రవాది బిన్ లాడెన్ కోసం వేట, బాగ్దాద్‌పై వైమానిక దాడి, ఇరాక్‌లో బందీలను విడిపించడం వంటివి ఇందులో ప్రముఖమైనవి.

➜ 2019లో డెల్టా ఫోర్స్.. ఐసిస్ ఉగ్రమూక నాయకుడు అబు బాకర్ అల్ బాగ్దాదీని పట్టుకునేందుకు ఆయన ప్రాంగణాన్ని చేరింది. దీంతో అతడు తనను తాను పేల్చేసుకున్నాడు.

➜ 1990 జనవరి 3న డెల్టా ఫోర్స్.. పనామా ఆక్రమణలో కీలక పాత్ర పోషించింది. సైనిక పాలకుడు మాన్యుయేల్ నోరీగా నిర్బంధంలో సాయపడింది.

➜ 1993లో సోమాలియాలో సాయుధ ముఠా నాయకులపై దాడులు చేసింది.

➜ అమెరికాలో సెప్టెంబరు 11 దాడుల తర్వాత అఫ్గానిస్థాన్‌లో ఉగ్రవాదంపై పోరుకు దిగిన సంగతి తెలిసిందే. ఇందులో అఫ్గానిస్థాన్, ఇరాక్, సిరియాల్లో ప్రమాదకరమైన ఆపరేషన్లను నిర్వహించింది. ఉగ్రవాద నెట్‌వర్క్‌లను ధ్వంసం చేసింది. సీనియర్ ఉగ్రవాదులను హతమార్చింది.

➜ 1979లో ఇరాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో 53 మంది దౌత్యవేత్తలు, బందీలను విడిపించేందుకు డెల్టాఫోర్స్ నిర్వహించిన ఆపరేషన్ విఫలమైంది. నాడు వైమానిక వ్యవస్థ, ఆపరేటర్ తప్పిదాల కారణంగా అమెరికా సైనికులు 8 మంది చనిపోయారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఆపరేషన్లకు అవసరమైన వైమానిక తోడ్పాటును అందించేందుకు ప్రత్యేకంగా 160వ స్పెషల్ ఆపరేషన్స్ ఏవియేషన్ రెజిమెంట్ ఏర్పడింది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

డ్రగ్స్ సరఫరాకు
వెనెజువెలా సహకరిస్తుందా?

- మదురోపై 50 మిలియన్ డాలర్ల అమెరికా రివార్డు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపిస్తున్నట్లుగా వెనెజువెలా పాలకుడు నికోలస్ మదురో మాదక ద్రవ్యాల ముఠాలో 'కార్టెల్ ఆఫ్ ద సన్స్'కు స్వయంగా నేతృత్వం వహిస్తున్నారా? ఈ ముఠాలో వెనెజువెలా ఉన్నతాధికారులు కూడా భాగస్వాములైనని అమెరికా విదేశాంగ శాఖ చెబుతోంది. అంతేకాకుండా కొలంబియాలోని రివల్యూషనరీ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (ఎఫ్ఏఆర్సీ)తో కుమ్మక్కై డ్రగ్స్ ఉగ్రవాదానికి మదురో ఊతమిస్తున్నారని పేర్కొంటోంది. కొకైన్‌ను భారీ మొత్తాల్లో నౌకల్లో తరలించి సంపాదించిన సొమ్మును సైన్యం వాడే స్థాయి ఆయుధాలను ఎఫ్ఏఆర్సీకి సమకూర్చుతున్నారని విమర్శిస్తోంది. హోండురాస్ తదితర దేశాలతో నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేస్తున్నారని ధ్వజమెత్తింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ తొలి పదవీ కాలం సమయంలో మదురోపై మన్‌హటన్ ఫెడరల్ కోర్టులో కేసు దాఖలైంది. మదురోను అరెస్టు చేసిన వారికి 15 మిలియన్ డాలర్ల రివార్డును అమెరికా ప్రభుత్వం అప్పుడు ప్రకటించింది. జో బైడెన్ ప్రభుత్వం ఆ మొత్తాన్ని 25 మిలియన్ డాలర్లకు పెంచింది. కార్టెల్ ఆఫ్ సన్స్‌ను ప్రపంచ స్థాయి ఉగ్రవాద సంస్థగా అమెరికా ట్రెజరీ విభాగం గత ఏడాది జులై 25న ప్రకటించింది. దీంతో మదురోను అరెస్టు చేసిన వారికి రివార్డు మొత్తం 50 మిలియన్ డాలర్లకు పెరిగింది. ఒక దేశ అధ్యక్షుడిని మాదకద్రవ్య ముఠా నేతగా పేర్కొంటూ ఇంత పెద్ద మొత్తంలో ఆతనిపై రివార్డు ప్రకటించడం చరిత్రలో ఇదే తొలిసారి. అమెరికా చేస్తోన్న ఈ ఆరోపణలను మదురో ఖండిస్తూ వస్తున్నారు.

- నేషనల్ డెస్క్

ప్రపంచాన్ని శాసించడానికి
అమెరికా మళ్లీ తహతహ!

వాషింగ్టన్: వెనెజువెలా అధ్యక్షుడు మదురోను ఆ దేశ గడ్డ మీద నుంచి అపహరించడం ద్వారా ప్రపంచాన్ని శాసించాలన్న తహతహను అమెరికా మరోసారి చాటుకున్నట్లయిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. నిశ్చయాత్మకంగా, ఆక్రమణకారి ధోరణులు తీసుకుని తమ విదేశాంగ విధాన లక్ష్యాలను చేరుకుంటానని అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ తెల్చిచెప్పారు. మనుపటి సంప్రదాయాలు, తన చర్యలకు పర్యవసానాలు, అంతర్జాతీయ చట్టాలు.. ఇవన్నీ ఎలా ఉన్నా తాను అనుకున్నదే చేస్తానని ఆయన కుండబద్దలుగొడుతున్నారు. మాదక ద్రవ్యాల రవాణా, చమురు నిక్షేపాలు, ప్రాంతీయ సమీకరణాలు.. ఇలా కారణం ఏమైనా వెనెజువెలాపై అమెరికా ఎప్పటినుంచో దృష్టి ఉంది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక ఇప్పుడు అది నెరవేరింది. గనితాలలో, జలమార్గాల ద్వారా డ్రగ్స్ చేరవేత కొనసాగుతోందని నిర్ధారించారు. ఈ విషయంలో మెక్సికో, కొలంబియాలను తప్పుపట్టే కాకపోయినా వాటిపై అమెరికా సైన్యం అంతగా దృష్టి సారించలేదు. అమెరికా హైడ్రోకార్బన్ల మార్కెట్‌కు కీలకం కావడం, అమెరికాలో శరణార్థులుగా ఉన్న లక్షలమంది వెనెజువెలా వాసుల్ని వెనక్కి పంపించేందుకు అవకాశం ఉండటం వంటి కారణాలతో ఈసారి ఆ దేశాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు చెబుతున్నారు. ఇప్పుడు తదుపరి అడుగు ఏమిటనేది స్పష్టంకావాల్సి ఉంది. మదురోను తీసుకువెళ్లడం ట్రంప్ విజయంగా కనిపిస్తున్నా.. ఆ తర్వాత వెనెజువెలాలో తలెత్తే పరిస్థితులు మాత్రం అనేక అంశాలపై ప్రభావం చూపనున్నాయి.

అమెరికాను కొన్ని దేశాలు అనుసరించే ప్రమాదం

- ఇదొక దుస్సంప్రదాయం: నిపుణులు

దిల్లీ: వెనెజువెలాపై అమెరికా చేసిన దాడి అంతర్జాతీయ సంబంధాల్లో ఒక దుస్సంప్రదాయాన్ని నెలకొల్పే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరించారు. మరికొన్ని దేశాలూ.. అగ్రరాజ్యం దారిలో దూకుడుగా వెళితే చాలా ఇబ్బందులు తలెత్తుతాయని అంటున్నారు. "ఈ దాడిని అమెరికా కాంగ్రెస్ అంగీకరిస్తుందని అనుకోను. ఎందుకంటే కొన్ని దేశాలు.. ఇదే మార్గం అనుసరించే ప్రమాదం ఉంది. ట్రంప్ ప్రవేశపెట్టిన ఈ విధానం మంచిది కాదు" అని భారత మాజీ దౌత్యవేత్త డోగ్రా పేర్కొన్నారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రపంచం కుదుపులకు లోనవుతుందని అన్నారు. "వెనెజువెలా, అమెరికా మధ్య జరుగుతున్న ఘర్షణ కొత్తది కాదు. బైడెన్ హయాం నుంచీ జరుగుతోంది. కానీ ట్రంప్ యంత్రాంగం చాలా దూకుడుగా వ్యవహరించింది. ఇది చాలా ప్రమాదం" అని విశ్రాంత బ్రిగేడియర్ రాహుల్.కె.భోంస్లే పేర్కొన్నారు.

అగ్రరాజ్యం గుప్పిట లాటిన్ అమెరికా

- ఆ దేశాల్లో వందలసార్లు అమెరికా సైనిక జోక్యం
- భూభాగాల ఆక్రమణతో పాటు ప్రభుత్వాధినేతల తొలగింపు

బ్రిటిష్ పాలన నుంచి 1776లో స్వాతంత్ర్యం ప్రకటించుకున్న అమెరికా... ఆ తర్వాత కాలంలో లాటిన్ అమెరికా దేశాలపై ఉక్కు పిడికిలి బిగించింది. 1798 మొదలు తాజాగా వెనెజువెలా ఉదంతం వరకు 700లకు పైగా సందర్భాల్లో సైనిక జోక్యం చేసుకుంది. మెక్సికో, పనామా దేశాల భూభాగాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు పలు దేశాల్లో ప్రభుత్వాధినేతలను మార్చడం, తనకు అనుకూలమైన వ్యక్తులను అధికారంలోకి తీసుకురావడానికి అమెరికా బలప్రయోగానికి పాల్పడింది. ఈ క్రమంలో లాటిన్ అమెరికా, కరీబియన్ దీవుల్లో 65వేల మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారని చరిత్రకారులు చెబుతున్నారు. అదృశ్యమైన వ్యక్తులు, గణాంకాల్లో చేరని మరణాలు దీనికి అదనం. అమెరికా పార్లమెంటుకు చెందిన 'కాంగ్రెషనల్ రెసెర్చ్ సర్వీస్' వెల్లడించిన వివరాల ప్రకారం లాటిన్ అమెరికా దేశాలపై అగ్రరాజ్య సైనిక జోక్యాల చరిత్రలోని ముఖ్యమైన ఘటనలు ఇవీ...

✦ మెక్సికన్-అమెరికన్ యుద్ధం (1846-1848)లో 55 శాతం భూభాగాన్ని మెక్సికో కోల్పోయింది. 25వేల మంది మెక్సికన్లు మృతి చెందారు.

✦ గల్ఫ్ ఆఫ్ మెక్సికోలోని నికరాగువాపై 1853, 1854, 1909, 1912-1933లలో అమెరికా సైనిక దాడులకు పాల్పడింది. హాండూరాస్‌పై 1903, 1907, 1911, 1912, 1919, 1924లలో అమెరికా దండెత్తింది.

✦ పనామా భూభాగాల్లో 1903-1914 మధ్య కాలంలో యూఎస్ సైనికులు పలుమార్లు కదం తొక్కారు.

✦ 1898-1902 మధ్య కాలంలో క్యూబా, ప్యూర్టో రికో దేశాలు అమెరికా ఆధిపత్యంలోనే ఉన్నాయి. 1906-1909, 1917లోనూ క్యూబా వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకుంది. 1961లో కొత్తగా ఏర్పడిన ఫిడెల్ కాస్ట్రో ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రయత్నించింది. ఆ తర్వాతా అనేక ప్రయత్నాలు చేసింది.

✦ హైతీపై 1915-1934, 1994-1995, 2004లలో దండెత్తింది. ఇప్పటికీ హైతీపై నియంత్రణను కలిగి ఉంది.

✦ డొమినికన్ రిపబ్లిక్‌ను 1916, 1924, 1965లలో అమెరికా ఆక్రమించింది.

✦ దక్షిణ, మధ్య అమెరికాలోని అర్జెంటీనాపై 1831లో, పరాగ్వేపై 1859లో, ఉరుగ్వేపై 1855, 1858, 1868లలో అమెరికా సైన్యం జోక్యం చేసుకుంది.

✦ చిలీ, బ్రెజిల్, బొలీవియా దేశాలలోని నియంతలకు అమెరికా మద్దతుగా నిలిచింది. వెనెజువెలా, ఈక్వడార్, కొలంబియా, పెరూలలో కమ్యూనిస్టు వ్యతిరేక శక్తులకు సహకారాన్ని అందించింది.

✦ 1954లో గ్వాటెమాలా అధ్యక్షుడిపై తిరుగుబాటుకు మద్దతిచ్చి ప్రభుత్వాన్ని కూలదోసింది.

✦ 1964లో బ్రెజిల్ అధ్యక్షుడు జావో గౌలర్ట్ ప్రభుత్వం కూల్చివేత. సైనిక నియంత పాలనకు మద్దతు.

✦ 1973లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన చిలీ అధ్యక్షుడు అలెండీని పదవీచ్యుతుడిని చేసింది.

✦ 1980లో నికరాగువా, 1983లో కరీబియన్ దీవి గ్రెనెడా, 1989లో పనామా, 1994లో హైతీ, 2002లో వెనెజువెలా, 2009 నికరాగువాలలో తిరుగుబాట్లకు, ప్రభుత్వాల కూల్చివేతకు అమెరికా ప్రత్యక్ష, పరోక్ష సహకారాలను అందించింది.

- నేషనల్ డెస్క్

దక్షిణ యెమెన్‌కు ప్రత్యేక రాజ్యాంగం ప్రకటించిన ఎస్టీసీ

ఎడెన్: అరబ్బు జగతిలో అతిపేద దేశమైన యెమెన్‌లో ఆగని మారణకాండకు కారణమైన అంతర్యుద్ధం మరో మలుపు తిరిగింది. వేర్పాటువాద ఉద్యమంలో భాగమైన సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ (ఎస్టీసీ) దక్షిణ యెమెన్ ప్రాంతానికి ప్రత్యేక రాజ్యాంగాన్ని ప్రకటించుకుంది. ఇది దక్షిణ యెమెన్‌కు స్వాతంత్ర్యం ప్రకటించడంతో సమానమని యూఏఈ మద్దతుతో నడుస్తున్న ఎస్టీసీ స్పష్టం చేసింది. ఈ రాజ్యాంగాన్ని కేవలం లాంఛనప్రాయంగా ప్రకటించారా.. లేదా దాన్నే అమలుపరుస్తారా అన్నది చూడాల్సి ఉంది. ఇరాన్ మద్దతుతో పనిచేస్తున్న హూతీలకు వ్యతిరేకంగా సౌదీ సాయంతో తొలుత ఒక సమైక్య బలగం ఏర్పడింది. హూతీలు కూల్చివేసిన యెమెన్ ప్రభుత్వాన్ని పునరుద్ధరించడమే లక్ష్యంగా ఆ కూటమి ఆవిర్భవించింది. కాల క్రమంలో సౌదీ అరేబియా మద్దతు కలిగివున్న బలగాలకు, యూఏఈ సాయమందిస్తున్న ఎస్టీసీకి మధ్య వైరం ఏర్పడి హూతీ వ్యతిరేక కూటమి చీలికలు పేలికలుగా మారే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో అంతర్యుద్ధంలో యెమెన్ దేశం కూడా చీలికలయ్యే పరిస్థితులు తలెత్తాయి. యెమెన్ ఉత్తర భాగంలో హూతీలు పూర్తి ఆధిక్యం సాధించగా దక్షిణ ప్రాంతంపై పైచేయి కోసం ఇతర వర్గాలు పోరాడుతున్నాయి. దక్షిణ యెమెన్ కోసం తాము ప్రకటించిన రాజ్యాంగం రెండేళ్లపాటు అమలులో ఉంటుందని ఎస్టీసీ అధినేత ఐడారూస్ అల్ జుబైద్ ప్రకటించారు.

భారత్, పాక్‌ల నడుమ చైనా మధ్యవర్తిత్వం నిజమే

- పాక్ విదేశాంగ మంత్రి తాహిర్ స్పష్టీకరణ

ఇస్లామాబాద్: 'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్- పాకిస్థాన్‌ల నడుమ ఉద్రిక్తతలను తగ్గించేందుకు మధ్యవర్తిత్వం నడిపినట్లు చైనా చేసిన ప్రకటనను పాక్ సమర్థించింది. శాంతి స్థాపన కోసం సాగిన అంతర్జాతీయ దౌత్య ప్రయత్నాల్లో భాగంగానే చైనా చొరవ చూపిందని పాక్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి తాహిర్ అంద్రాబీ వెల్లడించారు. "గత ఏడాది మే 6వ తేదీ నుంచి 10వ తేదీల మధ్య ఇరుదేశాల తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చైనా ప్రభుత్వం మా నేతలతో నిత్యం సంప్రదింపులు జరిపింది. భారత నేతలతో కూడా పలుమార్లు మాట్లాడింది. నాటి దౌత్య సంప్రదింపుల కారణంగానే ఉద్రిక్తతలు తగ్గి శాంతి పునరుద్ధరణ జరిగింది" అని తాహిర్ తెలిపారు. 2025లో భారత్- పాక్ మధ్య ఉద్రిక్తతలు సహా పలు అంతర్జాతీయ విషయాల్లో తమ దేశం మధ్యవర్తిత్వం చేసిందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి ప్రకటించిన నేపథ్యంలో తాహిర్ ఈ మేరకు స్పందించారు.

ఆపరేషన్ 'ఆబ్జల్యూట్ రిజాల్వ్' ఎలా చేశారంటే..

- పకడ్బందీగా అమెరికా ప్లాన్

వాషింగ్టన్: వెనెజువెలా అధ్యక్షుడు మదురోను బంధించడానికి అమెరికా పెద్ద కసరత్తే చేసింది. అమెరికా నిఘా అధికారులు తొలుత ఆయన వ్యవహారశైలిపై కన్నేశారు. ఆయన అలవాట్లేంటి.. ఏం తింటారు.. ఎక్కడ నిద్రిస్తారు అనే వివరాలను సేకరించారు. అనంతరం ఆధునిక ప్రపంచ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఆపరేషన్‌ను అందరూ ఆశ్చర్యపోయేలా అమెరికా నిర్వహించగలిగింది. 'దాడి ప్రణాళిక గురించి ఆలోచిస్తాం. దానిని మరింతగా అభివృద్ధి చేస్తాం. శిక్షణ ఇస్తాం. పదే పదే రిహార్సల్స్ చేస్తాం. ఆపరేషన్ నుంచి సరైన ఫలితాన్ని పొందడానికి కాదు. తప్పుల్లేకుండా చూసుకోవడానికి' అని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ డాన్ కెయిన్ తెలిపారు. మదురో పెంపుడు జంతువులు, ఆయన ధరించే దుస్తుల గురించీ సమాచారం సేకరించామని వెల్లడించారు. మదురో ఉన్న ఇంటి లాంటి నమూనా ఇంటిని నిర్మించి అమెరికా బలగాలు ఆపరేషన్ సాధన చేశాయని ట్రంప్ తెలిపారు. ఆపరేషన్‌ను చీకట్లోనే నిర్వహించామని వివరించారు. అయితే కారకాస్‌లో విద్యుత్తు సరఫరాను ఎలా నిలిపివేశారో చెప్పలేదు. స్టీల్‌తో నిర్మించిన అధ్యక్షుడి నివాసంలో బలగాలు ప్రవేశించి వాటిని కత్తిరించి లోపలికి ప్రవేశించాయని ట్రంప్ తెలిపారు. తాము ఏ యుద్ధ విమానాన్నీ కోల్పోలేదని, కానీ ఒక హెలికాప్టర్ భారీగా దెబ్బతిందని వెల్లడించారు. అయితే అందులో ఎంత మంది గాయపడింది వెల్లడించలేదు. ఆపరేషన్ మొత్తంమీద ఇద్దరికి గాయాలయ్యాయని ట్రంప్ తెలిపారు. వాతావరణం అనుకూలించే వరకూ వేచి ఉన్నామని తెలిపారు. నాలుగు రోజులు అదను కోసం చూశామని, 4, 3, 2 రోజుల కిందటే దాడి చేయాలనుకున్నామని, కానీ చివరకు శనివారం చేశామని వెల్లడించారు.



వెనెజువెలాపై దాడిని ఫ్లోరిడా పామ్‌బీచ్‌లోని తన రిసార్టు నుంచి పర్యవేక్షిస్తున్న అధ్యక్షుడు ట్రంప్. చిత్రంలో సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, రక్షణమంత్రి పీట్‌హెగ్సెత్

శుక్రవారం రాత్రి కొంత అనుకూలించిందని, అయితే అత్యంత నిపుణులైన వారే అలాంటి సమయంలో హెలికాప్టర్లను నడపగలరని, సముద్ర ఉపరితలానికి అత్యంత దగ్గరి నుంచి అవి వెళ్లాయని, వాటికి యుద్ధ విమానాలు రక్షణగా ఉన్నాయని కెయిన్ తెలిపారు. వెనెజువెలాపై ఆపరేషన్‌కు 'ఆబ్జల్యూట్ రిజాల్వ్' అని పేరు పెట్టామని వివరించారు. పశ్చిమార్ధగోళం నుంచి ఎఫ్-18, ఎఫ్-22, ఎఫ్-35 ఫైటర్ జెట్లు, బీ-1 బాంబర్లు, డ్రోన్ల వంటి 150 గగనతల ఎయిర్‌క్రాఫ్ట్‌లను పంపామని తెలిపారు. అమెరికా కాలమానం ప్రకారం.. శుక్రవారం రాత్రి 10.46 గంటల సమయంలో ట్రంప్ అనుమతి ఇచ్చారని, కారకాస్‌లోని మదురో ఇంటి దగ్గరకు తెల్లవారుజామున 1.01 గంటలకు బలగాలు చేరుకున్నాయని, తిరిగి 3.29కల్లా సముద్ర జలాలపైకి తిరిగొచ్చాయని వివరించారు. 20 నుంచి 49 ఏళ్ల మధ్య వయసున్న సిబ్బంది ఇందులో పాల్గొన్నారని తెలిపారు.

అల్లర్లు సృష్టించేవారిని అదుపులో పెట్టండి

- భద్రత బలగాలకు ఇరాన్ సుప్రీంనేత ఖమేనీ ఆదేశం

దుబాయ్: ఆర్థిక వ్యవస్థ పతనం, ధరలు పెరగడం తదితర కారణాలతో వారం రోజులుగా ఇరాన్‌లో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆ దేశ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ తొలిసారి స్పందించారు. నిరసనల్లో అల్లర్లు సృష్టించే వారిని అదుపులో పెట్టాలని భద్రత బలగాలను శనివారం ఆదేశించారు. ఈ మేరకు టెహ్రాన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. "నిరసనకారులతో మేం మాట్లాడుతాం. అధికారులు కూడా వారితో చర్చిస్తారు. అయితే.. అల్లర్లు సృష్టించే వారితో మాట్లాడినా ప్రయోజనం ఉండదు. అలాంటి వారిని భద్రత బలగాలు అదుపులో పెట్టాలి" అని ఖమేనీ స్పష్టంచేశారు. ఈ వీడియోను ఆ దేశ టెలివిజన్ ప్రసారం చేసింది. ఆందోళనలు ఆగకపోవడం, ఇప్పటి వరకు జరిగిన ఘటనల్లో సుమారు 10 మంది దాకా చనిపోవడంతో పాటు శాంతియుత నిరసనకారులను ఇరాన్ ప్రభుత్వం చంపాలని ప్రయత్నిస్తే.. వారిని కాపాడటానికి తమ బలగాలు వస్తాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఖమేనీ ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

మయన్మార్ ఎన్నికల్లో జుంటా మద్దతున్న పార్టీ ముందంజ

బ్యాంకాక్: మయన్మార్‌లో అందరూ ఊహించినట్లుగానే సైన్యం మద్దతు ఉన్న యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ (యూఎస్‌డీపీ) అధిక సీట్లను గెలుచుకుంటోంది. మూడు దశల్లో ఎన్నికలు జరుగుతుండగా మొదటి దశలో 102 సీట్లకు సంబంధించిన ఫలితాలను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇందులో 38 సీట్లను యూఎస్‌డీపీ గెలుచుకుందని జాతీయ మీడియా తెలిపింది. తాము మొత్తం 88 సీట్లలో ఆధిక్యంలో ఉన్నామని ఆ పార్టీ ప్రతినిధులు ప్రకటించుకున్నారు. సైనిక జుంటా పాలనకు వ్యతిరేకంగా ఉన్నవారు మాత్రం ఈ ఫలితాలను అంగీకరించడం లేదు. నియంతృత్వానికి ఓ మేలిమి ముసుగుగా ఎన్నికల ఫలితాలు ఉన్నాయని ఆక్షేపిస్తున్నారు. ప్రధాన పార్టీలు పోటీలో లేని ఈ ఎన్నికలను ఓటర్లు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. 330 సీట్లున్న మయన్మార్ దిగువసభలో మెజారిటీ సీట్లకు డిసెంబరు 28న ఎన్నికలు జరిగాయి. వాటి ఫలితాలు విడుదలైతే ప్రభుత్వ ఏర్పాటుపై స్పష్టత వచ్చే అవకాశముంది.

మహారాష్ట్రలో పోలింగుకు ముందే మహాయుతికి 68 సీట్లు

ముంబయి: మహారాష్ట్ర పురపోరులో పోలింగుకు ముందే భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమి పలు స్థానాల్లో విజయం సాధించింది. 68 స్థానాల్లో ఈ కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ప్రత్యర్థి పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు పోటీనుంచి వైదొలిగారు. బెదిరింపులు, ధనబలంతో బరినుంచి వైదొలగేలా అధికారపక్షం ఒత్తిడి చేసిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. గెలుపొందిన 68 సీట్లలో భాజపా 44, ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన 22, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ 2 స్థానాలను కైవసం చేసుకున్నాయి. కేంద్ర మంత్రి, భాజపా సీనియర్ నేత మురళీధర్ మోహోల్ స్పందిస్తూ పుణె తదుపరి మేయర్ తమ పార్టీ నుంచే ఉంటాడని ఆశాభావం వ్యక్తంచేశారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ శుక్రవారం రాత్రి వరకు కొనసాగిందని శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ ఆరోపించారు.

ఈసీఐనెట్ యాప్ మెరుగుకు సూచనలివ్వండి: ఈసీ

ఈనాడు, దిల్లీ: ఈసీఐనెట్ యాప్‌లో మెరుగుపరచాల్సిన అంశాలు సూచించాలని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ప్రజలకు పిలుపునిచ్చింది. యాప్‌లో ఉన్న 'సబ్మిట్ ఎ సజెషన్'ను నొక్కి ఎవరైనా ఈ నెల 10వ తేదీలోపు తమ సూచనలు, సలహాలు నమోదు చేయొచ్చని సూచించింది. ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న ఈసీఐనెట్ యాప్‌లో ఓటరుకు కావాల్సిన వివిధ సేవలు పొందుపరిచారు. దీనిద్వారా పోలింగ్ శాతం, సరళి, ఎన్నికలు పూర్తయిన 72 గంటల్లో ఇండెక్స్ కార్డులను వెల్లడిస్తున్నారు. ఇదివరకు ఇలాంటివాటి ప్రచురణకు నెలల సమయం పట్టేది. సీఈవోలు, డీఈవోలు, ఈఆర్‌వోల నుంచి నిరంతరం తీసుకుంటున్న సలహాలు, సూచనల ఆధారంగా ఈ యాప్‌ను మెరుగుపరుస్తూ వస్తున్నారు. ఇప్పుడు ప్రజలనుంచి కూడా సూచనలు స్వీకరించి మరింత సౌకర్యవంతంగా మార్చాలని నిర్ణయించినట్లు ఈసీ తెలిపింది. ఇవన్నీ పూర్తయిన తర్వాత ఈసీఐనెట్ యాప్‌ను ఈ నెలలో అధికారికంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఇదివరకు ఉన్న 40 వేర్వేరు యాప్‌ల స్థానంలో ఏకీకృత యాప్‌ను ఈసీ తీసుకొస్తోంది.

బంగ్లాదేశ్.. దాడిలో గాయపడ్డ హిందూ వ్యాపారి మృతి

ఢాకా: బంగ్లాదేశ్‌లో మరో హిందువు ప్రాణాలు కోల్పోయాడు. ఇటీవల ఖోకన్ చంద్రదాస్ (50) అనే వ్యాపారిపై కొందరు దుండగులు దాడిచేసి.. నిప్పంటించిన సంగతి తెలిసిందే. వారినుంచి తప్పించుకునేందుకు నాడు చెరువులో దూకిన ఆయన.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.

ప్రసవం కోసం 6 కి.మీ. నడక..
గిరిజన మహిళ, శిశువు మృతి



ఆశా సంతోష్ కిరంగ

ఈటీవీ భారత్: మహారాష్ట్రలోని గడ్చిరోలీ జిల్లాలో సరైన రోడ్డు, వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో ఓ నిండుగర్భిణి ప్రసవం కోసం 6 కిలోమీటర్లు నడిచివెళ్లింది. ఈ క్రమంలో తీవ్ర రక్తస్రావమై గర్భస్థ శిశువుతోపాటు ఆ మహిళ కూడా ప్రాణాలు కోల్పోయింది. గిరిజన ప్రాంతమైన ఎటాపల్లి తాలూకా ఆల్దండి టోలా గ్రామానికి చెందిన ఆశా సంతోష్ కిరంగ (24)కు నెలలు నిండటంతో ప్రసవం కోసం ఆసుపత్రిలో చేరేందుకు భర్తతో కలిసి అడవి మార్గంలో దాదాపు 6 కి.మీలు నడిచి పెథాలో ఉన్న సోదరి ఇంటికి చేరుకుంది. అక్కడే ఆమెకు పురిటినొప్పులు మొదలవడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆలస్యం కావడంతో కడుపులోనే శిశువు.. రక్తపోటు పెరగడంతో తల్లి కూడా మరణించారు. ఆమెను కాపాడేందుకు వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ ప్రతాప్ శిందే తెలిపారు. తాలూకా ఆరోగ్య అధికారి నుంచి వివరణ కోరామని, ఘటనపై విచారణ జరుపుతామన్నారు.

చోరీలు చేస్తున్న కొడుకును
గొలుసుతో కట్టేసిన దిన కూలీలు



ఇంటర్నెట్ డెస్క్: కూలి పనులు చేసుకొని బతికే ఆ దంపతులకు పన్నెండేళ్ల కుమారుడి తీరు తలనొప్పి వ్యవహారంగా మారింది. తరచూ ఇంటి నుంచి పారిపోవడం, ఇతరుల ఫోన్లు దొంగిలించడం వంటి అల్లరి చిల్లర పనులు ఎంతచెప్పినా మానుకోలేదు. పనికి వెళ్లకపోతే పూట గడవని పరిస్థితుల్లో కుమారుడి చర్యలను రోజంతా కనిపెట్టుకొని ఉండటం సాధ్యపడలేదు. అతడి ప్రవర్తనతో ఇతరులకు ఇబ్బంది కలగకూడదని పనులకు వెళ్లే సమయంలో ఇంటి ఆవరణలో గొలుసుతో బంధించి వెళ్లడం మొదలుపెట్టారు. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఇలా రెండు నెలలపాటు కొనసాగింది. స్థానికులు ఎవరో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరుకు ఫోను చేసి దీనిపై ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ఇంటికి చేరుకున్న శిశుసంక్షేమ కేంద్ర అధికారులు బాలుడిని గొలుసుల నుంచి విడిపించి సంక్షేమ కేంద్రానికి తరలించారు. చేతులు, కాళ్లకు గాయాలైన బాలుడిని మానసిక వైద్యుల పర్యవేక్షణలో ఉంచి, తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సావిత్రీబాయి ఫులే సేవలు నేటికీ ప్రేరణ: మోదీ

దిల్లీ: భారత్ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రీబాయి ఫులే జయంతి సందర్భంగా శనివారం ప్రధాని మోదీ ఆమెకు నివాళులర్పించారు. "విద్య ద్వారా సమాజాన్ని మార్చేందుకు జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత సంస్కర్త ఆమె. సమానత్వం, న్యాయం, కరుణ వంటి విలువలకు సావిత్రిబాయి కట్టుబడి ఉండేవారు. విద్యే సామాజిక మార్పునకు శక్తివంతమైన ఆయుధమని ఆమె నమ్మారు. అణగారిన, బలహీనవర్గాల సంక్షేమానికి ఆమె అందించిన సేవలు నేటికీ ప్రేరణగా నిలుస్తున్నాయి. సమ్మిళిత, సాధికార సమాజాన్ని నిర్మించడంలో ఆమె దార్శనికత మనకు మార్గదర్శనం చేస్తుంటుంది" అని ఎక్స్‌లో ఆయన పేర్కొన్నారు.

'వీబీ జీ రామ్‌జీ'కి వ్యతిరేకంగా 10 నుంచి కాంగ్రెస్ ఆందోళన

దిల్లీ: కొత్తగా తీసుకువచ్చిన 'వికసిత్ భారత్- గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం' (వీబీ జీ-రాంజీ)ను ఉపసంహరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఈ నెల 10 నుంచి ఫిబ్రవరి 25 వరకు దేశవ్యాప్తంగా 'ఎంజీనరేగా బచావో సంగ్రామ్'ను చేపట్టనున్నట్లు ప్రకటించింది. శనివారం విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్ మాట్లాడుతూ.. ఈ చట్టంతో ఉపాధి హక్కును కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు.

అమ్మభాషను మరవలేదు..
ఆవకాయను మానలేదు

- ఎల్లలు దాటినా తెలుగుదనంపై తగ్గని మమకారం
- భాష, సంస్కృతులకు వారధులుగా విదేశీ సంస్థలు


ప్రపంచ తెలుగు మహాసభలకు మారిషస్ నుంచి వచ్చిన ప్రవాసాంధ్రుల బృందం

ఈనాడు, అమరావతి: వారు దశాబ్దాల క్రితం మాతృభూమికి దూరమయ్యారు. కానీ మాతృభాషను పొత్తిళ్లలో పెట్టుకొని కాపాడుతున్నారు. విదేశాల్లో స్థిరపడ్డప్పటికీ తాతముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చిన సంస్కృతి, సంప్రదాయాల్ని కొనసాగిస్తున్నారు. ఆయా దేశాల్లో ఉన్నత స్థానాలకు ఎదిగినా, ఉద్యోగ, వ్యాపారాల్లో రాణిస్తున్నా తమ అమ్మభాష తెలుగేనని సగర్వంగా చెబుతున్నారు. అక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, ఆహార వ్యవహారాల్ని అనుసరిస్తున్నా తెలుగును ఆదరిస్తున్నారు. వారి పిల్లల పేర్లు మొదలు వంటల వరకూ అన్నింటా తెలుగుదనం ఉట్టిపడుతోంది. గుంటూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభలకు వివిధ దేశాల్లో స్థిరపడ్డ తెలుగు వాళ్లు విచ్చేశారు. మాతృభాషతో పెనవేసుకున్న అనుబంధాన్ని, తెలుగు నేలతో తెగని పేగుబంధాన్ని 'ఈనాడు'తో పంచుకున్నారు.

భజనలు, భక్తిగీతాలు తెలుగులోనే

–వీరజ్ ప్యాల్ రమణయ్య, వ్యాపారి

మా తాతముత్తాతలు చేసిన రామభజనను ఇప్పటికీ మేం ఇళ్లు, గుళ్లలో చేస్తున్నాం. తెలుగులో భజన పాటలు పాడుతున్నాం. తెలుగు.. మాకు భాష మాత్రమే కాదు, వారసత్వం, అస్తిత్వం, జీవన విధానం కూడా. మాకు తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల నుంచి డబ్బు అక్కర్లేదు. సాంస్కృతిక వారసత్వం కావాలి. ఇక్కడి కళలన్నీ అందించాలి. మా దేశ ప్రభుత్వం మారిషస్ తెలుగు మహాసభతో పాటు తెలుగు సాంస్కృతిక కేంద్రానికి ఏటా నిధులిస్తోంది.

మారిషస్‌లో ఉగాదికి అధికారిక సెలవు

–హేదియన్ గురయ్య, మారిషస్ తెలుగు మహాసభ అధ్యక్షుడు



మారిషస్‌లో తెలుగువారి జనాభా లక్ష వరకూ ఉంటుంది. మా దేశ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ మంత్రి లచ్మనారాజ్ పెంటియ్య తెలుగువారు. ఆయన తెలుగులో మాట్లాడగలరు. మా పూర్వీకులు శతాబ్దాల క్రితం తెలుగు నేల నుంచి వలసవెళ్లి అక్కడ స్థిరపడ్డారు. ఐదు తరాలుగా సంక్రాంతి, ఉగాది, శ్రీరామ నవమి పండుగలు చేస్తున్నాం. 40 రోజుల పాటు శ్రీవేంకటేశ్వరస్వామి వ్రతం ఆచరిస్తాం. ఉగాదిని మారిషస్ ప్రభుత్వం అధికారిక సెలవుగా ప్రకటించింది. అక్కడి తెలుగు పిల్లల కోసం 'సాయంత్రం బడులు' నిర్వహిస్తున్నాం. మా మహాసభకు 90 శాఖలు, ఏడు ప్రాంతీయ కమిటీలు, యువజన విభాగం ఉన్నాయి.

ఉపకార వేతనాలతో ప్రోత్సాహం

– డాక్టర్ రజ్యంతీ దాలయ్య, సీనియర్ లెక్చరర్, మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్, మారిషస్



చెరకు తోటల్లో పని చేయడానికి 1901లో మా ముత్తాతను బ్రిటిష్ వాళ్లు మారిషస్‌కు తీసుకెళ్లారు. ఆయన సన్నిహిత పుత్రుడు. మాది అక్కడ మూడో తరం. ఇంట్లో తెలుగులోనే మాట్లాడుకుంటాం. నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఏ, ఎంఏ, పీహెచ్‌డీ చదివాను. ఉంత్ర, తెలంగాణల్లో తెలుగులో డిగ్రీ కోర్సులు చదువుతున్న మా దేశ విద్యార్థులకు ఉపకార వేతనాలిస్తున్నాం. మారిషస్ రెండో అధికార భాషలు తెలుగు, హిందీ, తమిళ్, చైనీస్, ఇంగ్లిష్‌లలో ఏదైనా నేర్చుకోవచ్చు. ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయం వరకు తెలుగును ఓ పాఠ్యాంశంగా బోధిస్తున్నాం.

ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నాం

–వెంకప్ప భాగవతుల, ఖతార్



ఖతార్‌లో సుమారు 50 వేల మంది తెలుగు వాళ్లున్నారు. అక్కడి ఆంధ్ర కళావేదిక, తెలుగు కళాసమితి సంస్థల సౌజన్యంతో తెలుగు భాషా దినోత్సవం, అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవంతో పాటు మన పండుగలు సామూహికంగా నిర్వహిస్తున్నాం. కొవిడ్‌కు ముందు భౌతికంగా జరిగే తెలుగు పాఠాల బోధనను నేడు వారంలో ఒక రోజు ఆన్‌లైన్‌లో ఉచితంగా అందిస్తున్నాం. ఖతార్‌లో స్థిరపడిన తొలితరం తెలుగువాళ్లలో మా కుటుంబమొకటి.

మూడో భాషగా తెలుగు బోధన

–కోనేరు ఉమామహేశ్వరరావు, సౌదీ అరేబియా



సౌదీ అరేబియాలో రెండు లక్షలకు పైగా తెలుగు వాళ్లున్నారు. భారత రాయబార కార్యాలయం అక్కడ సీబీఎస్ఈ సిలబస్ పాఠశాలలను నిర్వహిస్తుంది. చాలా బడుల్లో తెలుగు మూడో భాష. బాషాభివృద్ధికి, సేవ కార్యక్రమాలకు సౌదీ అరేబియా తెలుగు సమాఖ్య, సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (సాటా) వంటి సంస్థలు పని చేస్తున్నాయి. పండుగలు సామూహికంగా జరుపుకొంటున్నాం.

మా సంఘానికి ప్రభుత్వ గుర్తింపు


–వెంజర్ల జగదీశ్, బహ్రెయిన్



బహ్రెయిన్‌లో సుమారు 50 వేల మంది తెలుగు వారున్నారు. బతుకమ్మ, బోనాలు, ఉగాది, సంక్రాంతి తదితర పండుగల నిర్వహణకు కృషి చేస్తున్న మా సంస్థ 'తెలుగు కళాసమితి'కి బహ్రెయిన్ ప్రభుత్వ గుర్తింపు ఉంది. పిల్లలకు తెలుగుపై వారాంతాల్లో ఆన్‌లైన్ పాఠాలు చెబుతున్నాం. ఏపీ ప్రభుత్వం మాకు తెలుగు పుస్తకాలు, వర్క్‌బుక్‌లు పంపుతోంది.

అమెరికాలో 18 ఏళ్లుగా 'సాహితీ వేదిక'

–ఊరిమిండి నరసింహారెడ్డి, డాలస్, అమెరికా



ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం ఆధ్వర్యంలో అమెరికాలో నెలనెలా సాహితీ వేదిక పేరుతో సదస్సులు నిర్వహిస్తున్నాం. 18 ఏళ్లుగా నిరంతరంగా 221 సదస్సులు నిర్వహించాం. పిల్లల కోసం తానా ఆధ్వర్యంలో పాఠశాల, సిలికానాంధ్ర ఆధ్వర్యంలో మనబడి, బాలబడి వంటి కార్యక్రమాలు చేస్తున్నాం. తెలుగు వర్ణమాల, పద్యాలు, కథలు, ఛందస్సు నేర్పిస్తున్నాం.

రామోజీరావు సేవలను స్మరించుకున్న సాహిత్య, భాషాభిమానులు

గుంటూరు (జిల్లాపరిషత్తు), న్యూస్‌టుడే: మాతృభాష పరిరక్షణలో 'ఈనాడు' గ్రూపు సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ రామోజీరావు సేవలను పలువురు ప్రముఖులు కొనియాడారు. తెలుగు మహాసభల్లో రామోజీరావు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దివంగత రామోజీరావు విగ్రహం వద్ద వారు నివాళులర్పించారు.

తెలుగు భాషకు విశేష సేవ

– ఎన్.ఎస్.లక్ష్మీనారాయణ, సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి, గుంటూరు

తెలుగు భాష అభివృద్ధికి రామోజీరావు విశేష సేవ చేశారు. ఈనాడు దినపత్రికతోపాటు చతుర, విపుల, తెలుగు వెలుగు మాస పత్రికల్లో మాతృభాష వ్యాప్తికి ప్రాధాన్యమిచ్చారు. 200 సంవత్సరాల కిందట కొప్పరపు కవులు, తిరుపతి వేంకట కవులు గుంటూరులో అవధానం చేశారు. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు కూడా గుంటూరులో సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అభ్యుదయ, ఆధునిక, సంప్రదాయ, నక్సల్ సాహిత్యాలు గుంటూరులోనే పురుడు పోసుకున్నాయి.

రామోజీరావు స్ఫూర్తితో..

– వాసిరెడ్డి విద్యాసాగర్, వీవీఐటీ విద్యా సంస్థల అధినేత

తెలుగు భాష వాడుక భాషగా మారాలి. ఆంగ్లంలో చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయనే భావన సరికాదు. తెలుగు భాష అంటేనే రామోజీరావు గుర్తుకొస్తారు. ఆయన స్ఫూర్తితో ఏటా బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. తెలుగు భాష, సాహిత్యానికి సంబంధించి పుస్తకాలు ముద్రిస్తున్నాం. వచ్చే ఏడాది నుంచి తెలుగు భాషా కోర్సులు నిర్వహించాలని యోచిస్తున్నాం.

రామోజీ విగ్రహాల ఏర్పాటుకు వినతులు

– రాజకుమార్ వడయార్, విగ్రహ శిల్పి

రామోజీరావు తెలుగు భాషతో పాటు తెలుగు ప్రజల జీవితాలపై ప్రత్యేక ముద్ర వేశారు. ఆయన మరణించిన తర్వాత రెండో రోజే ఆయన విగ్రహాన్ని తయారుచేసి ఆయన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అప్పజెప్పారు. 20 రోజుల్లోనే విగ్రహం రూపొందించాం. విశాఖపట్నంలో రామోజీరావు విగ్రహాన్ని ఏర్పాటు చేశాం. త్వరలో తిరుపతిలో పెట్టనున్నాం. వివిధ ప్రాంతాల్లో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేయాలంటూ విజ్ఞప్తులు వస్తున్నాయి.

పది మంది అవధానుల్ని సృష్టిస్తాం

- 15 ఏళ్లలోపు పిల్లల్ని ఆరునెలల్లో ఇందుకు ఎంపికచేస్తాం
- ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: ''ఆరు నెలల్లో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 15 ఏళ్లలోపు వయసున్న పిల్లలను ఎంపికచేస్తాం. వీరిలోంచి పది మంది అవధానుల్ని సృష్టిస్తాం. వేలమంది పిల్లలు కవితలు, నవలలు, కథలు, ఖండకావ్యాలు రాసేలా తీర్చిదిద్దుతాం'' అని ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరో శుభవార్త చెబుతానన్నారు. తన గొంతు, మాట విని జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ పి.ఎస్.నరసింహ లాంటి ముఖ్యులు ప్రోత్సహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. తాను మొదటిసారి ఏపీ శాసనసభాపతి అయ్యన్నపాత్రుణ్ని కలసినప్పుడు ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనాలని అసెంబ్లీలోని ప్రతి ఎమ్మెల్యేకు చెబుతానన్నారని గుర్తుచేశారు. ఆయన సలహా మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని అందరు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులకు లేఖలు రాశామన్నారు. వారంతా ఒక్క క్షణమైనా సభలకు హాజరై నందమూరి తారక రామారావు వేదిక వద్ద నివాళి అర్పిస్తారని ఆంధ్ర సారస్వత పరిషత్తు నమ్ముతున్నట్లు చెప్పారు.

తెలుగువారి సేవలో నాలుగు తరాలు

వారణాసి వాసికి పూర్ణకుంభ పురస్కార ప్రదానం


పూర్ణకుంభ పురస్కారం అందుకుంటున్న వేమూరి వెంకట సుందరశాస్త్రి

గుంటూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: వారణాసిలో నాలుగు తరాలుగా తెలుగువారికి విశిష్ట సేవలందిస్తున్నారు. తెలుగువారు వారణాసికి వస్తే.. ఇంటికొచ్చిన బంధువుల్లా వారికి సౌకర్యాలను కల్పిస్తూ.. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను విస్తరింపజేస్తున్నారు వేమూరి వెంకట సుందరశాస్త్రి. నాలుగు తరాలుగా ఆయన కుటుంబం అక్కడ సేవలందిస్తోంది. వారణాసి తెలుగుసమితిగా ఏర్పడి తెలుగు భాషకు, సంస్కృతీ సంప్రదాయాలకు సేవలందిస్తున్న వెంకట సుందరశాస్త్రికి గుంటూరులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభ వేదికగా పూర్ణకుంభ పురస్కారం దక్కింది. రాష్ట్ర శాసనసభ సభాపతి అయ్యన్నపాత్రుడు చేతులమీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగుభాషను ప్రపంచానికి చాటి చెప్పేలా ఇటువంటి కార్యక్రమం జరగడం, అందులో తనకు పురస్కారం లభించడం సంతోషంగా ఉందని సుందరశాస్త్రి తెలిపారు.


అయ్యన్నపాత్రుడి నుంచి పూర్ణకుంభ పురస్కారం అందుకుంటున్న దర్శకుడు కె.విశ్వనాథ్ తనయుడు నాగేంద్ర, తూర్పుభాగోతం కళాకారుడు శంకర్రావు, సినీనటుడు ఏడిద శ్రీరాం, బుర్రా సాయిమాధవ్, గద్దర్ కుమార్తె వెన్నెల, తోలుబొమ్మల కళాకారుడు చిదంబరం, పొత్తూరు రంగారావు

రాష్ట్రంలో డీసీసీ అధ్యక్షులు వీరే

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో 15 నగరాలు సహా మొత్తం 41 మంది డీసీసీ అధ్యక్షులను నియమిస్తూ ఏఐసీసీ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వివరాలిలా.. జిల్లా అధ్యక్షులుగా.. శతక బుల్లిబాబు (అల్లూరి సీతారామరాజు జిల్లా), బొడ్డు శ్రీనివాస్ (అనకాపల్లి), వై.మధుసూదన్‌రెడ్డి (అనంతపురం), గాజుల భాస్కర్ (అన్నమయ్య), ఆమంచి కృష్ణమోహన్ (బాపట్ల), దెయ్యాల రమేష్‌బాబు (చిత్తూరు), కొత్తూరి శ్రీనివాస్ (డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ), బోడ లక్ష్మీవెంకటప్రసన్న (తూర్పుగోదావరి), రాజనాల రామ్మోహన్‌రావు (ఏలూరు), ఎన్న సుధీర్‌బాబు (గుంటూరు), మాదేపల్లి సత్యానందరావు (కాకినాడ), అందె శ్రీరామమూర్తి (కృష్ణా), క్రాంతినాయుడు (కర్నూలు), వంగల దాలినాయుడు (మన్యం), గార్లపాటి మద్దులేటిస్వామి (నంద్యాల), బొర్రా కిరణ్ (ఎన్టీఆర్), అలెగ్జాండర్ సుధాకర్ (పల్నాడు), షేక్ సైదా (ప్రకాశం), నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి (ఎస్‌పీఎస్ నెల్లూరు), కేఎస్ షానవాజ్ (శ్రీసత్యసాయి), సనపల అన్నాజీరావు (శ్రీకాకుళం), బాలగురవం బాబు (తిరుపతి), అద్దాల వెంకటరామరాజు (విశాఖపట్నం), మరిపి విద్యాసాగర్ (విజయనగరం), అంకెం సీతారాం (పశ్చిమగోదావరి), విజయజ్యోతి (వైఎస్సార్ కడప) నియమితులయ్యారు.

- నగర జిల్లా అధ్యక్షులుగా.. షేక్ ఇమామ్‌వలి (అనంతపురం), జి.టికారాం (చిత్తూరు), పి.బాలవెంకట సుబ్రహ్మణ్యం (ఏలూరు), షేక్ మహమ్మద్ ఇఫ్తికార్ అహ్మద్ (గుంటూరు), సయ్యద్ గౌస్‌పీర్ (కడప), చెక్కా నూకరాజు (కాకినాడ), ఎస్.జిలాని (కర్నూలు), అబ్దుల్ మాటిన్ (మచిలీపట్నం), షేక్ అల్లాబక్ష్ (నెల్లూరు), దేవిరెడ్డి ఆదినారాయణ (ఒంగోలు), బి.మురళీధర్ (రాజమహేంద్రవరం), రేళ్ల సురేష్ (శ్రీకాకుళం), గౌడ పేరు చిట్టిబాబు (తిరుపతి), నరహరిశెట్టి నరసింహారావు (విజయవాడ), సనమునేటి శ్రీనివాసరావు (విజయనగరం)లను నియమించారు.

'ఉపాధి హామీ'పై ఏపీ క్యాబినెట్ తీర్మానం చేయాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసి, కేంద్రానికి పంపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం వల్ల ఉపాధి హామీ పథకం నీరుగారి పోవడమే కాదు.. ఏపీ ఎక్కువ నష్టపోతుందని పేర్కొన్నారు. గ్రామీణ పేదలు ఎక్కడికక్కడ దీన్ని ఎదుర్కొని, పాత చట్టం పునరుద్ధరణకు అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని కోరారు. 2013 భూసేకరణ చట్టాన్ని మార్చే ఉద్దేశంగానీ, సవరించే ఆలోచనగానీ కేంద్రానికి లేదని కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్ ప్రకటించినందున రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టానికి గతంలో చేసిన సవరణలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణా, గోదావరి జలాల వివాదాన్ని పరిష్కరించేందుకు కేంద్ర కమిటీ నియమించినందున రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ అమలును సమీక్షించి నిధులు కేటాయించేందుకు కేంద్రం ఉన్నత స్థాయి సమీక్ష కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు విజన్ వల్లే

పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ నంబర్ 1

- మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి



ఈనాడు, అమరావతి: చంద్రబాబు విజన్, మంత్రి లోకేశ్ పట్టుదల వల్ల రాష్ట్రానికి దిగ్గజ కంపెనీలు వస్తున్నాయని, పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ దేశంలోనే నంబర్ 1గా నిలిచిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. బ్యాంక్ ఆఫ్ బరోడా సీఎంఐఈ నివేదికలో పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ అగ్రస్థానంలో నిలవడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైకాపా ఐదేళ్ల విధ్వంస పాలనలో పరిశ్రమలు తరలిపోయాయని గుర్తుచేశారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 25 కీలకమైన పారిశ్రామిక విధానాలు అమలు చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని ప్రభుత్వం సంపాదించిందని తెలిపారు. విశాఖలో జరిగిన సీఐఐ సమిట్‌తో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగామని గుర్తుచేశారు.

అంబులెన్సులపై వైకాపా విషప్రచారాన్ని ఖండించిన కూటమి నేతలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 108 అంబులెన్సులపై వైకాపా నేతలు, సాక్షి మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని కూటమి నేతలు మండిపడ్డారు. 108 అంబులెన్సు ఆలస్యంగా రావడం వల్లే శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఓ వ్యక్తి మరణించినట్టు సాక్షి పత్రికలో తప్పుగా కథనాన్ని ప్రచురించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రణస్థలం ఘటనపై నిజానిజాల్ని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ''రణస్థలంలో రహదారి ప్రమాదంపై ఉదయం 8:05 గంటలకు కాల్‌సెంటర్‌కు ఫోన్ వచ్చింది. 8:07 గంటలకు అంబులెన్సు సిబ్బందికి విషయం తెలియజేశారు. 8:14 గంటలకు ఘటనాస్థలానికి అంబులెన్సు చేరుకుంది. నిబంధనల ప్రకారం పట్టణాల్లో 18 నిమిషాల లోపు, గ్రామాల్లో 23 నిమిషాల లోపు ఘటనాస్థలానికి అంబులెన్సు చేరుకోవాలి. ఇక్కడ ఏడు నిమిషాల్లోనే చేరుకుంది'' అని సత్యకుమార్ యాదవ్ వివరించారు. వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో 300 అంబులెన్సులు మూలన పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ●వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో కడప రిమ్స్‌లో మూలనపడ్డ అంబులెన్సులను ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డి మీడియాకు చూపించారు. కూటమి ప్రభుత్వంపై వైకాపా నేతలు, సాక్షి తప్పుడు ప్రచారాల్ని తిప్పికొట్టారు. ●కూటమి అధికారంలోకి వచ్చాక ఏలూరు జిల్లాకు కొత్తగా ఆరు అంబులెన్సులు వచ్చాయని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ విలేకరుల సమావేశంలో వివరించారు.

సీఎం విదేశీ పర్యటనపై వైకాపా దుష్ప్రచారం

- లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ విదేశీ పర్యటనపై వైకాపా నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు 75 ఏళ్ల వయసులోనూ రోజుకు 18 గంటలు పనిచేస్తున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తి కుటుంబంతో నాలుగు రోజులు విదేశాలకు వెళ్తే వైకాపా నాయకులు జీర్ణించుకోలేని పరిస్థితిలో ఉన్నారని విమర్శించారు. చంద్రబాబు విదేశాలకు వెళ్లినా రాష్ట్ర పరిస్థితులపై నిరంతరం సమీక్షిస్తున్నారని పేర్కొన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులకు కూడా అందుబాటులో లేరని ధ్వజమెత్తారు.

వెనెజువెలాపై అమెరికా దాడికి వ్యతిరేకంగా నిరసనలు: సీపీఎం

ఈనాడు, అమరావతి: వెనెజువెలాపై అమెరికా దాడికి వ్యతిరేకంగా రాష్ట్రంలో ఎక్కడికక్కడ నిరసన ప్రదర్శనలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానికంగా కలిసి వచ్చే ఇతర వామపక్ష, ప్రగతిశీల పార్టీలతో కలిసి నిరసన వ్యక్తం చేయాలని సూచించారు. వెనెజువెలాపై అమెరికా దాడి అప్రజాస్వామికమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఒక దేశ సార్వభౌమత్వంపై జరిగిన సామ్రాజ్యవాద దాడిగా దీన్ని ఆయన అభివర్ణించారు.

జ్యోతి యర్రాజికి రూ.5 లక్షల ఆర్థిక సాయం

- అందజేసిన మహారాష్ట్రలోని తెలుగువాళ్లు

ఈనాడు, అమరావతి: అర్జున్ అవార్డు గ్రహీత, అథ్లెటిక్ జ్యోతి యర్రాజికి మహారాష్ట్రలోని తెలుగువాళ్లు రూ.5,55,555 ఆర్థిక సాయం అందజేశారు. ముంబయిలో ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆమెకు ఈ నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆనంద నిలయం ఛైర్మన్ ఏపీ గుప్తా, ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధి గంజి జగన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.21,105 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీసీ ఆమోదం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 8 సంస్థలు కలిపి రూ.21,105 కోట్ల మేర పెట్టుబడులు పెట్టే ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్ఐపీసీ) ఆమోదించింది. ఆ వివరాలివి..

సంస్థల వారీగా పెట్టుబడులు ఇవీ..

సంస్థ/ కంపెనీ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి
వెబ్సోల్ రెనెవబుల్ ప్రైవేట్ లిమిటెడ్ సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్, నాయుడుపేట	3,538	1,980
టాటా పవర్ రెనెవబుల్ ఎనర్జీ 10 జీడబ్ల్యూ ఇన్‌గాట్, వాఫెర్ తయారీ యూనిట్, నెల్లూరు	6,675	1,000
రామ్‌కో సిమెంట్స్ లిమిటెడ్ సిమెంట్ ప్లాంట్ విస్తరణ, కల్వటల, నంద్యాల జిల్లా	1,500	300
షిర్డీసాయి ఎలక్ట్రికల్స్	5,571	5,000
కృష్ణ ఆగ్రో ఫ్యూయల్స్ లిమిటెడ్ గ్రెయిన్ బేస్డ్ ఇథనాల్ బయో రిఫైనరీ ఏర్పాటు	2,159	300
ఎన్ఏఎన్ గ్రీన్‌మెట్ లిమిటెడ్	1,366	340
వైజయంతి ఫుల్‌ఫిల్‌మెంట్ (ప్యాకింగ్ ఇండస్ట్రీ)	62	285
రాధిక వెజిటబుల్ ఆయిల్స్ లిమిటెడ్ పామాయిల్ ప్రాసెసింగ్ ప్లాంట్, కొట్టకి, విజయనగరం జిల్లా	234	165

ఏపీలో 'బీసీ రక్షణ చట్టం' చరిత్రాత్మకం

తెలంగాణలోనూ తీసుకురావాలి: ఆర్.కృష్ణయ్య


మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో సత్యం తదితరులు


హైదరాబాద్, న్యూస్‌టుడే: 'బీసీలపై అత్యాచారాలు, దౌర్జన్యాలు, తప్పుడు కేసులు అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొస్తున్న 'బీసీ రక్షణ చట్టం' చరిత్రాత్మకం. దేశంలో మొదటిసారిగా ఈ తరహా చట్టం అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం ఆదర్శం. అందుకు ఆ రాష్ట్ర మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకోవడం అభినందనీయం'అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఏపీలో తీసుకున్న నిర్ణయాన్ని స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణలో కూడా ఆ దిశగా అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. శనివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 14 బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడారు.

భూములు ఆక్రమించారు.. న్యాయం చేయండి

- తెదేపా ప్రజావేదికలో బాధితుల ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వంలో నాయకుల అండతో తన పొలంలోకి ఓ రౌడీషీటర్ చొరబడి వ్యవసాయం చేస్తున్నారని, పొలం దగ్గరకు వెళ్తే తప్పుడు కేసులు పెట్టారని బాపట్ల జిల్లా కావూరు గ్రామానికి చెందిన కోడూరి నాగమారుతి వాపోయారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజావేదికలో అర్జీ ఇచ్చి, న్యాయం చేయాలని కోరారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, ఏపీ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. తన భూమిని వేరొకరి పేరుతో దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేశారని కర్నూలు జిల్లా పిల్లిగుండ్లకు చెందిన బుడన్న అర్జీ ఇచ్చారు. తన తండ్రి పేరుతో ఉన్న 2.5 ఎకరాల వ్యవసాయ భూమిని కొందరు రాజకీయ పలుకుబడితో కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నమయ్య జిల్లా బలిజపల్లి గ్రామానికి చెందిన మోనీషా వినతిపత్రం అందించారు.

ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా డాక్టర్ రాజిరెడ్డి



ఈనాడు, హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చాడ రాజిరెడ్డి బెంగళూరులోని ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా ఎన్నికయ్యారు. రసాయన శాస్త్రంలో.. ప్రత్యేకించి ఆరోగ్య సంరక్షణ అనువర్తనాల కోసం ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో ఆయన చేసిన అత్యుత్తమ పరిశోధనలకు దక్కిన గుర్తింపు ఇది. భారత్ బయోటెక్ సంస్థ తయారు చేసిన కొవిడ్ టీకా కొవాగ్జిన్‌లో ఉపయోగించిన అడ్జువెంట్ మాలిక్యూల్ అభివృద్ధి ప్రక్రియలో పాల్గొన్న కీలక శాస్త్రవేత్తల్లో డాక్టర్ రాజిరెడ్డి ఒకరు. ఆయన రాసిన 193 పరిశోధన వ్యాసాలు అంతర్జాతీయంగా ప్రసిద్ధిచెందిన పలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. రాజిరెడ్డికి 16 పేటెంట్లు ఉన్నాయి.

రైతులకు అందుతున్న సేవలపై దృష్టిపెట్టండి

కిసాన్ మోర్చా నాయకులకు మాధవ్ సూచన

ఈనాడు, అమరావతి: జిల్లాల్లో వ్యవసాయ అనుబంధ రంగాల సేవలు రైతులకు అందుతున్న తీరుపై కిసాన్ మోర్చా నాయకులు దృష్టి సారించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సూచించారు. ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశం విజయవాడలో శనివారం నిర్వహించారు. మాధవ్ మాట్లాడుతూ.. ''కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల వ్యవసాయ, అనుబంధ రంగాల కార్యాలయాలను క్రమం తప్పకుండా సందర్శించాలి. జిల్లా రైతు సేవా కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాల పనితీరు, రైతులకు అందుతున్న సేవలను పర్యవేక్షించాలి'' అని చెప్పారు. సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్‌నాయుడు, ఎం.ప్రసాద్, కిసాన్ మోర్చా నాయకులు వైవీ సుబ్బారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి ఫులెకి సీఎం నివాళి

ఈనాడు, అమరావతి: మహిళా విద్యలో సావిత్రీబాయి ఫులె కీలకపాత్ర పోషించారని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ''మహిళలను విద్యావంతులుగా చేసేందుకు సమాజ కట్టుబాట్లను కాదనే సాహసాన్ని చేసి దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా పేరు పొందిన సావిత్రీ బాయి ఫులె జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. ఆనాడు ఆమె చేసిన సాహసం.. ఈనాడు మహిళలను విద్యావంతులుగా చేసింది'' అని 'ఎక్స్' వేదికగా సీఎం పేర్కొన్నారు.

దేవాదాయశాఖ సీఈగా శేఖర్

ఈనాడు, అమరావతి: దేవాదాయశాఖలోని సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) జీవీఆర్ శేఖర్‌కు చీఫ్ ఇంజినీర్ (సీఈ)గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. కాకినాడ ఎస్ఈగా ఉన్న ఆయన.. ప్రస్తుతం సీఈగా పూర్తి అదనపు బాధ్యతలు చూస్తున్నారు. తాజాగా ఆయనకు పూర్తిస్థాయి సీఈగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది.

రేహాన్ నిశ్చితార్థం.. ధ్రువీకరించిన ప్రియాంక



ఇంటర్నెట్‌డెస్క్: తమ కుమారుడు రేహాన్ వాద్రా నిశ్చితార్థాన్ని ధ్రువీకరిస్తూ కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీ తాజాగా ఇన్‌స్టాగ్రాం వేదికగా పోస్టు పెట్టారు. నిశ్చితార్థం జరిగినట్లు ఇటీవల వార్తలు వెలువడిన సంగతి తెలిసిందే. రేహాన్, వధువు అవీవా బేగ్‌లు చిన్నప్పటినుంచి మంచి స్నేహితులని ప్రియాంక తెలిపారు. వారి ఫొటోలను కూడా పంచుకున్నారు. వీటిలో రేహాన్, అవీవాబేగ్‌ల చిన్ననాటి ఫొటో కూడా ఉంది. ఏడేళ్ల నుంచి వీరు ప్రేమలో ఉన్నట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. రేహాన్ గతవారం పెళ్లి ప్రతిపాదన తీసుకురాగా.. ఇరు కుటుంబాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. మరికొన్ని నెలల్లో వీరి వివాహం జరగనుంది.

రోడ్డు విస్తరణ పనుల్లో.. మా మామ ఇల్లు తొలగించాం

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



గడ్కరీ దంపతులతో ఫరా ఖాన్

ఇంటర్నెట్ డెస్క్: విధుల నిర్వహణలో తనకు అందరూ సమానమేనని కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. గతంలో ఒకసారి రోడ్డు విస్తరణ పనులు చేపట్టినప్పుడు అడ్డుగా ఉందని తన సొంత మామ ఇంటినే తొలగించినట్లు వెల్లడించారు. బాలీవుడ్‌కు చెందిన ప్రముఖ కొరియోగ్రాఫర్ ఫరా ఖాన్ యూట్యూబ్ వ్లాగులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన సహాయకుడు దిలీప్‌తో కలిసి ఫరా కేంద్ర మంత్రి నివాసాన్ని సందర్శించగా.. గడ్కరీ, కంచన్ దంపతులు వారి అనుభవాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా తమ గ్రామంలో రోడ్డు వేయాలని గడ్కరీని దిలీప్ అభ్యర్థించారు. "అయితే అతడి ఇంటి మీదుగా రోడ్డు వేయండి" అంటూ ఫరా ఖాన్ సరదాగా అన్నారు. అక్కడే ఉన్న మంత్రి సతీమణి కంచన్ మాట్లాడుతూ.. తమ ఇల్లు కూల్చిన ఘటనను వివరించారు. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉందని తన తండ్రి ఇంటినే కూల్చేశారని ఆమె చెప్పడంతో ఫరా ఆశ్చర్యపోయారు. దీనిపై గడ్కరీ కూడా వివరణ ఇచ్చారు. "మరి.. తర్వాత కొత్త ఇల్లు కట్టించారా?" అని ఫరా అడగ్గా.. అభివృద్ధి పనుల్లో ఇల్లు కోల్పోతే ప్రభుత్వం అందించే పరిహారం ఇచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు.

మండుతున్న అగ్నిపై పెట్రోల్ పోసినట్లే

మమ్దానీ నిర్ణయాలపై ఇజ్రాయెల్ ఆగ్రహం



మమ్దానీ

టెల్‌అవీవ్: ఇజ్రాయెల్ ప్రభుత్వం, న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ మధ్య వివాదం ముదిరింది. బహిష్కరణల ఆదేశాలు, యూదుల వ్యతిరేక వ్యాఖ్యలపై మమ్దానీ వైఖరిని ఇజ్రాయెల్ తీవ్రంగా తప్పుబట్టింది. శుక్రవారం ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా స్పందిస్తూ.. మమ్దానీ చర్యలను యూదుల వ్యతిరేకతను ప్రోత్సహించేవిగా అభివర్ణించింది. "బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే మమ్దానీ తన నిజమైన స్వభావాన్ని చూపించారు. యూదుల వ్యతిరేకతకు సంబంధించిన ఐహెచ్‌ఆర్ఏ నిర్వచనాన్ని రద్దుచేశారు. ఇజ్రాయెల్‌పై బహిష్కరణలకు ఉన్న ఆంక్షలను తొలగించారు. ఇది నాయకత్వం కాదు. ఇప్పటికే మండుతున్న అగ్నికి యూదుల వ్యతిరేకత అనే పెట్రోల్ పోయడం" అని 'ఎక్స్' వేదికగా మండిపడింది.



పుణ్యస్నానాల కోసం త్రివేణీ సంగమానికి భారీగా తరలివచ్చిన ప్రజలు

మొదలైన మాఘమేళా.. ప్రయాగ్‌రాజ్‌కు పోటెత్తిన భక్తులు

ప్రయాగ్‌రాజ్: పుష్య పౌర్ణమితో మొదలైన మాఘమేళా సందర్భంగా శనివారం ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో గడ్డకట్టే చల్లని నీటిలోనూ లక్షలమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. నెల రోజులు కల్పవాస్‌లో పాల్గొంటే పాపాలు తొలగుతాయని భక్తులు విశ్వసిస్తారు. ఇందులో భాగంగా.. పుష్య పౌర్ణమి మొదలుకొని నెల రోజులపాటు రోజుకు రెండుసార్లు గంగలో స్నానం చేస్తారు. ఒక్కపూట మాత్రమే ఆహారం తీసుకుంటారు. శనివారం ఉదయం 10 గంటల్లోపే దాదాపు 9 లక్షల మంది భక్తులు నదిలో స్నానాలు చేశారని, రోజు మొత్తంమీద ఇది 30 లక్షలకు చేరే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. మొదటి రోజు దాదాపు 5 లక్షల మంది భక్తులు కల్పవాస్ ప్రారంభించినట్లు త్రివేణి సంగమ హారతి సేవాసమితి అధ్యక్షుడు రాజేంద్ర మిశ్ర తెలిపారు.

పిండాలపై జన్యు పరీక్షతో ప్రయోజనం లేదు

- ఐసీఎంఆర్ స్పష్టీకరణ

దిల్లీ: కృత్రిమ గర్భధారణతో యువజంటలు సంతానం పొందే ప్రవృత్తి దేశంలో రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ ప్రక్రియలో సంతానం కోసం పిండాలను తల్లి గర్భంలోకి ప్రవేశపెట్టడానికి ముందు, వాటి జన్యు ఆరోగ్యాన్ని గుర్తించడం కోసం ఓ పరీక్షను నిర్వహిస్తారు. దీనిని నాన్ ఇన్వేసివ్ క్రోమోజోమల్ స్క్రీనింగ్ అని పిలుస్తారు. చికిత్స చేసేప్పుడు ఈ పరీక్షను నిర్వహించాల్సిన అవసరం లేదని ఇండియన్ సొసైటీ ఫర్ అసిస్టెడ్ రిప్రొడక్షన్(ఐఎస్ఏఆర్), భారత సంతాన సాఫల్య సంస్థ(ఐఎఫ్ఎస్), అకాడమీ ఆఫ్ క్లినికల్ ఎంబ్రియాలజిస్టులు స్పష్టంచేశాయి. దీనికి సంబంధించిన శాస్త్రీయ అధ్యయనానికి భారత వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్)కు చెందిన డాక్టర్ దీపక్ మోదీ నేతృత్వం వహించారు. కృత్రిమ గర్భధారణ పిండాలకు ఈ జన్యుపరీక్ష అవసరం లేదని ప్రపంచం నలుమూలల నుంచి సేకరించిన పలు వైద్య సాక్ష్యాలను అధ్యయనం చేసిన అనంతరం నిపుణులు నిర్ధారించారు. సాధారణ ఐవీఎఫ్ పద్ధతిలో పిండాల జన్యుపరమైన లోపాలను గుర్తించడానికి ప్రీ ఇంప్లాంటేషన్ జెనెటిక్ టెస్టింగ్ నిర్వహించేవారు. ఇందుకోసం పిండం బాహ్యపొర నుంచి కొన్ని కణాలు సేకరిస్తారు. ఈ పరీక్ష కోసం అత్యున్నత సాంకేతిక నైపుణ్యం అవసరం. అంతేకాక ఈ ప్రక్రియ నిర్వహించే క్రమంలో పిండానికి హాని జరిగే ప్రమాదమూ లేకపోలేదు. దీంతో పిండాన్ని తాకాల్సిన అవసరం లేని నాన్ ఇన్వేసివ్ జెనెటిక్ టెస్టింగ్ వైపు మొగ్గారు. అయితే ఈ పరీక్ష కచ్చితమైన ఫలితాలను ఇస్తుందా? అన్న అనుమానాలున్నాయి. అంతేకాక ఇది ఖర్చుతో కూడుకున్నది కూడా. ఈ నేపథ్యంలో అసలీ పరీక్ష అవసరమా? అని రూఢి చేసే అధ్యయనానికి నిపుణులు తెరతీశారు. ఇందు కోసం 3 వేల పిండాలపై ప్రయోగాలు నిర్వహించి, 24 అధ్యయనాల్లో పేర్కొన్న గణాంకాలను విశ్లేషించారు. ఈ పరీక్ష గర్భధారణకు గానీ ఇతర సంతాన సాఫల్యానికిగానీ దోహదపడదని తేల్చారు.

వందేభారత్ స్లీపర్ రైళ్లలో అధునాతన హంగులు



న్యూదిల్లీ రైల్వేస్టేషన్లో వందేభారత్ స్లీపర్ రైల్లో బెర్తుల్ని పరిశీలిస్తున్న రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

దిల్లీ: వందేభారత్ స్లీపర్ రైళ్లలో అధునాతన హంగులన్నింటినీ సమకూరుస్తున్నామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కోల్‌కతా-గువాహటి మార్గంలో త్వరలో పట్టాలెక్కబోతున్న బెర్తుల రైలును శనివారం న్యూదిల్లీ రైల్వేస్టేషన్లో ఆయన పరిశీలించారు. పెట్టెల్లో కలియతిరుగుతూ వాటిలో సౌకర్యాలను విలేకరులకు వివరించారు. వెడల్పైన ట్రే హోల్డర్, సర్దుబాటు చేసుకోగలిగేలా కిటికీలకు తెరలు, నీళ్లు బయటకు చిమ్మడానికి అవకాశమివ్వని లోతైన వాష్‌బేసిన్లు, చదువుకునేందుకు వీలుగా లైట్లు, హ్యాంగర్లు, మ్యాగజీన్లు ఉంచే ఏర్పాట్లు వంటివన్నీ వీటిలో కల్పించినట్లు చెప్పారు. 16 పెట్టెల రైళ్లలో ఒకదానిని గువాహటికి, రెండోదానికి కోల్‌కతాకు పంపిస్తామని తెలిపారు. సీట్ల సంఖ్యల్ని బ్రెయిలీ లిపిలోనూ రాయించినట్లు చెప్పారు. కుదుపుల్లేని రీతిలో రైలును మెరుగ్గా తీర్చిదిద్దామని, శబ్దం కూడా చాలా తక్కువగా వెలువడుతుందని, కవచ్ ఉంటుందని తెలిపారు. ఇన్ఫెక్షన్‌ను అడ్డుకునే సాంకేతికతను, అత్యవసర పరిస్థితుల్లో లోకోపైలట్‌తో మాట్లాడే ఏర్పాట్లను చేసినట్లు వివరించారు.

దిల్లీ అల్లర్ల కేసు నిందితుల బెయిలుపై 5న సుప్రీం వెల్లడి

దిల్లీ: దేశ రాజధాని నగరం దిల్లీలో 2020లో జరిగిన అల్లర్ల కేసు నిందితులైన ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమాం తదితరుల బెయిలు పిటిషన్లపై సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ నెల 5వ తేదీన నిర్ణయాన్ని వెలువరించనుంది. ఈ బెయిలు దరఖాస్తులను నిరుడు సెప్టెంబరు 2న దిల్లీ హైకోర్టు తిరస్కరించింది. దీన్ని నిందితులు సుప్రీంకోర్టులో సవాలు చేశారు.

తప్పు చేయకున్నా.. 12 ఏళ్లు జైలుశిక్ష

- విద్యుత్తు దొంగతనం కేసులో నిందితుడిని నిర్దోషిగా తేల్చిన కోర్టు

ఈటీవీ భారత్: చేయని తప్పునకు ఓ వృద్ధుడిని కోర్టు 12 ఏళ్లపాటు జైలు శిక్ష అనుభవించేలా చేసిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. విద్యుత్తు దొంగతనం కేసులో పేరులో జరిగిన పొరపాటుతో పోలీసులు ఓ రైతుని నిందితుడిగా భావించి అరెస్టుచేశారు. ఆ వృద్ధ రైతును 12 సంవత్సరాల తర్వాత ఆర్థిక నేరాల ప్రత్యేక న్యాయమూర్తి జ్ఞానేంద్రరావు నిర్దోషిగా ప్రకటించారు. పోలీసుల కథనం ప్రకారం.. విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడంతో 2012 నవంబర్ 22న సిద్ధార్థనగర్ జిల్లాలోని సాహి గ్రామంలో కొంతమంది ఇళ్లకు విద్యుత్తు కనెక్షన్‌లను అధికారులు తొలగించారు. వారిలో కొందరు అక్రమ కనెక్షన్‌లను ఉపయోగించి విద్యుత్తును దొంగిలించారు. దీనిపై విద్యుత్తు శాఖకు చెందిన జూనియర్ ఇంజినీర్ 2012 నవంబర్ 29న అచ్నేరా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి ఐదుగురు నిందితులను అరెస్టుచేశారు. విద్యుత్ శాఖ బృందం మోనా రామ్ కుమారుడు తుహీరామ్‌ను ఈ కేసులో నిందితుడిగా భావించి, 2014లో కోర్టు ద్వారా నోటీసులు పంపించింది. విచారణ అనంతరం కోర్టు తుహీరామ్‌కు జైలుశిక్ష విధించింది. 12 ఏళ్ల జైలు శిక్ష తర్వాత ప్రత్యేక కోర్టు అతడిని నిర్దోషిగా విడుదల చేసింది. పోలీసులు, విద్యుత్తుశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా 73 ఏళ్ల వయసులో జైలుశిక్ష అనుభవించానని తుహీరామ్ ఆవేదన వ్యక్తంచేశారు.

విపత్తుల్లో స్పందించేందుకు లక్షమంది క్యాడెట్లకు శిక్షణ


- ఎన్‌సీసీ డీజీ వెల్లడి



దిల్లీ: ప్రకృతి విపత్తుల సమయంలో వేగంగా స్పందించేందుకు లక్షమంది క్యాడెట్లకు 'యువ ఆపద మిత్ర'లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ వీరేంద్ర వత్స్ శనివారం వెల్లడించారు. వీరిని డేటాబేస్‌తో అనుసంధానిస్తామని చెప్పారు. దానివల్ల ఏదైనా విపత్తు సంభవించినప్పుడు వారి సేవలను వినియోగించుకునే వీలుంటుందని దిల్లీలో విలేకరుల సమావేశంలో తెలిపారు. దేశవ్యాప్తంగా నాలుగైదు హబ్‌లు ఏర్పాటుచేసి, ఎంపిక చేసిన క్యాడెట్లకు.. డ్రోన్, కౌంటర్ డ్రోన్ అంశాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు. అలాగే సైబర్ నేరాలకు చెక్ పెట్టేలా 10 వేలమంది క్యాడెట్లతో సైబర్ వారియర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. వీరిని కూడా డేటాబేస్‌తో అనుసంధానం చేయనున్నారన్నారు. ఈ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎన్‌సీసీ పరేడ్, కంటింజెంట్ కమాండర్లు తొలిసారి కత్తితో కవాతు చేయనున్నారని వెల్లడించారు.

దర్యాప్తు సంస్థలకు కోర్టులు గడువు విధించడం అరుదు

- సర్వోన్నత న్యాయస్థానం స్పష్టీకరణ



దిల్లీ: దర్యాప్తు సంస్థలకు న్యాయస్థానాలు కాల పరిమితులు విధించడమనేది అన్ని సందర్భాల్లో జరగదని, అది అసాధారణ పరిస్థితుల్లో ఇచ్చే మినహాయింపు మాత్రమేనని సుప్రీంకోర్టు శనివారం పేర్కొంది. దర్యాప్తు ఆలస్యమైనప్పుడు తప్ప, గడువు అనేది అది ప్రతి కేసులో అనుసరించాల్సిన నియమం కాదని అత్యున్నత ధర్మాసనం స్పష్టంచేసింది. అలహాబాద్ హైకోర్టు జారీచేసిన ఓ ఉత్తర్వుపై విచారణ జరిపిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కె. సింగ్‌ల ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. నకిలీ పత్రాలతో ఆయుధ లైసెన్సు పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక కేసులో ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు 90 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేయాలని, అంతవరకు నిందితులపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అలహాబాద్ హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. "విచారణలో ఆలస్యం జరిగి పక్షపాతం పైచేయి సాధిస్తున్న సందర్భాల్లో మాత్రమే కోర్టులు దర్యాప్తు సంస్థలకు గడువు విధిస్తుంటాయి. దర్యాప్తులో జరిగే ఆలస్యం వల్ల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతుందని భావించినప్పుడు మాత్రమే కోర్టులు జోక్యం చేసుకోవాలి. విచారణ ప్రారంభం కాకముందే కోర్టులు గడువు విధించవు. అలా చేయడం విచారణ సంస్థల పరిధిలోకి చొచ్చుకుపోవడమే అవుతుంది. నేర విచారణ అనేక అంశాలతో కూడుకొని ఉంటుంది. అందుకే న్యాయస్థానాలు విచారణ సంస్థలకు గణనీయ స్వేచ్ఛనిస్తాయి" అని ధర్మాసనం తెలిపింది.

కాలుష్యంలో హైదరాబాద్!

శనివారం 300 దాటిన వాయు నాణ్యత సూచీ

- కాదంటున్న సీపీసీబీ
- థర్డ్‌పార్టీ, గూగుల్ యాప్, సీపీసీబీ సూచీల్లో వ్యత్యాసాలతో అయోమయం
- ఆ గాలి పీల్చితే ప్రమాదకరమంటున్న శాస్త్రవేత్తలు



ఈనాడు, హైదరాబాద్

గాలిలో నాణ్యత పడిపోవడంలో హైదరాబాద్... దేశ రాజధాని దిల్లీతో పోటీ పడుతోంది. కొత్త ఏడాది తొలిరోజున పలు ప్రాంతాల్లో ఏక్యూఐ 300 వరకు చేరుకుంది. ఇది థర్డ్ పార్టీ, గూగుల్ యాప్‌లు, పరికరాల ద్వారా నమోదవుతున్న సూచీల లెక్క. కానీ సీపీసీబీ ఏర్పాటు చేసిన సూచీలలో కొత్త ఏడాది గరిష్ఠంగా 170 వరకే నమోదు కావడం గమనార్హం. సీపీసీబీ సూచించే కొలతల్లో కచ్చితత్వం లేదని కొందరు విశ్రాంత ఆచార్యులు చెబుతున్నారు. నగరంలోని 14 ప్రాంతాల్లో కాలుష్య నియంత్రణ మండలి ఏక్యూఐ పరికరాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా గరిష్ఠ, కనిష్ఠ సూచీలను వెల్లడిస్తోంది. ఏక్యూఐ 100 దాటితే ముప్పు పొంచి ఉన్నట్లే. డిసెంబరులో హైదరాబాద్‌లో గరిష్ఠంగా పీసీబీ లెక్కల ప్రకారం ఏక్యూఐ 132 మాత్రమే. థర్డ్ పార్టీ యాప్‌లలో నమోదైన ఏక్యూఐ 270 వరకు ఉంది. ఇంత వ్యత్యాసం ఉండకూడదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గాలి నాణ్యతను యురోపియన్ ప్రమాణాల మేరకు కొలిచే యంత్రాల ధర ఒక్కొక్కటి దాదాపు రూ.30 లక్షల వరకు ఉంటుంది. పీసీబీ వాడుతున్న పరికరాలు ఆ స్థాయిలో లేవని పరిశోధకులు చెబుతున్నారు.

మూడు రకాల గాలి కాలుష్యం

గాలిలో కాలుష్యాన్ని బయో, ఫిజికల్, కెమికల్ రియాక్టివ్‌లని మూడు రకాలుగా పరిగణనలోకి తీసుకుంటారు. గాలిలో తేమ, బ్యాక్టీరియా, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యర్థాల వాసనలన్నీ మొదటి రకంలోకి వస్తాయి. సూక్ష్మ ధూళి కణాలను రెండో రకంలోకి తీసుకుంటారు. రసాయన ప్రభావం కల్గించే కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, సల్ఫర్, మిథనాల్, బెంజిన్ తదితరాలను కెమికల్ రియాక్టివ్‌లో తీసుకుంటారు. ఇవన్నీ ప్రమాణాలను దాటితే ప్రజలకు ఊపిరితిత్తుల వ్యాధులు, క్యాన్సర్ వంటివి సోకుతాయి.

కేపీహెచ్‌బీలో ఏక్యూఐ 302

శనివారం ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలో గాలిలో వాయు నాణ్యత సూచీ 302 సూచించింది. ఇది దిల్లీలో ఏక్యూఐ(ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్)తో సమానం. కానీ, ఈ ప్రాంతంలో సీపీసీబీ(సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు)కు సంబంధించిన వాయు నాణ్యతను లెక్కించే సూచీలు లేవు. శనివారం సీపీసీబీ లెక్కల ప్రకారం హైదరాబాద్‌లోని బొల్లారం పారిశ్రామిక ప్రాంతంలో ఏక్యూఐ గరిష్ఠంగా 142, రామచంద్రాపురంలో కనిష్ఠంగా 73 నమోదైంది.

అమ్మో... 35 సిగరెట్లు తాగినట్లే!

గాలి నాణ్యత 100 దాటితేనే ప్రమాదకరం. ఒకవేళ 300లకు చేరితే.. ఆ గాలి పీల్చిన వారికి పలురకాల వ్యాధులు సంక్రమించే అవకాశముంది. దాన్ని పీలిస్తే రోజుకు 30-35 సిగరెట్లు కాల్చిన దానితో సమానమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. గాలి నాణ్యతను సీపీసీబీ నమోదు చేస్తున్నా.. ఎక్కడా కచ్చితమైన లెక్కలు రావడం లేదన్న విమర్శలున్నాయి. థర్డ్ పార్టీ, గూగుల్ యాప్, సీపీసీబీ ప్రకటిస్తున్న సూచీలకు చాలా వ్యత్యాసం ఉండటమే ఇందుకు కారణం.

నిత్యం రోడ్డెక్కుతున్న 50 లక్షల వాహనాలు!

హైదరాబాద్‌లో దాదాపు 80 లక్షల వాహనాలుంటే.. రోజూ సగటున 50 లక్షల వరకు రోడ్డెక్కుతున్నాయి. వీటి నుంచి వెలువడే పొగ గాలి నాణ్యతను ప్రభావితం చేస్తోంది. వీటితోపాటు భవన నిర్మాణాలు, చెత్తాచెదారం, మురుగు, పరిశ్రమల నుంచి వెలువడే ఘాటు వాసనలు వాయు నాణ్యతను క్షీణింపచేస్తున్నాయి.

అంతర్జాతీయ ప్రమాణాలే

– డాక్టర్ శరత్, పర్యావరణ శాస్త్రవేత్త, పీసీబీ

గాలిలో వివిధ అంశాల ఆధారంగా ఏక్యూఐని గణిస్తాం. జాతీయ స్థాయి గాలినాణ్యత ప్రమాణాల ప్రకారమే పీసీబీ లెక్కిస్తుంది. థర్డ్ పార్టీ యాప్‌లు యూఎస్‌ఈపీఏ ప్రమాణాల ప్రకారం లెక్కిస్తున్నాయి. దానివల్ల వ్యత్యాసం ఉంటుంది. కనిష్ఠాన్ని పరిగణనలోకి తీసుకోకుండా గరిష్ఠం మాత్రమే యాప్‌లు చూపిస్తున్నాయి. పీసీబీ మాత్రం సగటును తీసుకుంటుంది. మన జాతీయ ప్రమాణాలతో కాకుండా యూఎస్‌ఈపీఏ ప్రమాణాలతో పరిశీలిస్తే మన దగ్గర ఏక్యూఐ ఎక్కువగా ఉన్నట్లు వస్తోంది.

కచ్చితత్వం లేదు

– డాక్టర్ కె.ఎం.లక్ష్మణరావు, విశ్రాంత అధ్యాపకులు, జేఎన్‌టీయూ

పీసీబీ పరికరాల మీద నమ్మకం లేదు. గూగుల్ యాప్‌లో కొంతవరకు నిజమే ఉంటుంది. హైదరాబాద్‌లో వాయునాణ్యత దారుణంగా పడిపోతోంది. దీని మీద నేను పరిశోధన చేస్తున్నా. గాలి నాణ్యత కొలిచే పరికరాన్ని రూపొందించే పనిలో ఉన్నా. పూర్తయిన తర్వాత వెల్లడిస్తా. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారమే ఏక్యూఐ పరికరాలు ఉండాలనేది నా అభిప్రాయం.



ఐఐటీ బీహెచ్‌యూ విద్యార్థులు ఆర్క్య జ్యోతిఘోష్, సుప్రతిమ్ మహాపాత్రకు ప్రథమ బహుమతి అందజేస్తున్న జయేశ్ రంజన్, బీఎస్‌మూర్తి, బీవీఆర్ మోహన్‌రెడ్డి

లోతైన పరిశోధనలతో మెరుగైన ఫలితాలు

ఐఐటీహెచ్ 'ఇన్నోవేషన్ డే'లో జయేశ్ రంజన్



ఐఐటీ బీహెచ్‌యూ విద్యార్థులు రూపొందించిన సైంటిఫిక్ 3-డీ మైక్రోస్కోప్

ఈనాడు, సంగారెడ్డి: ఐఐటీ విద్యార్థులు పరిశోధన ఆధారిత ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ సూచించారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీహెచ్‌లో శనివారం నిర్వహించిన 'ఇన్నోవేషన్ డే' సందర్భంగా బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై యువ ఆవిష్కర్తలనుద్దేశించి మాట్లాడారు. పైపైన కాకుండా లోతైన పరిశోధనలతో కూడిన ఆవిష్కరణలపై దృష్టి పెడితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. విజేతలకు రూ.15 లక్షల నగదు బహుమతులను పంపిణీ చేశారు. ఐఐటీహెచ్ బోర్డు ఛైర్మన్ డా.బీవీఆర్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ బీఎస్ మూర్తి, డీన్ మల్లారెడ్డి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఐఐటీ బీహెచ్‌యూ విద్యార్థులు ఆర్క్య జ్యోతిఘోష్, సుప్రతిమ్ మహాపాత్రల ఆవిష్కరణ 3డీ సైంటిఫిక్ మైక్రోస్కోప్‌కు మొదటి బహుమతి(రూ.5 లక్షలు) లభించింది. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే మైక్రోస్కోప్ వ్యయం రూ.4 లక్షలపైనే ఉంటోంది. వీరు రూపొందించిన మైక్రోస్కోప్‌కు రూ.10,300 మాత్రమే ఖర్చవుతుంది. దీని ద్వారా 3డీ చిత్రాలను రూపొందించవచ్చు. 40 రెట్లు పెద్దవిగా చూపిస్తుంది. ఏఐతో అనుసంధానించిన ఈ పరికరాన్ని సైన్స్ ల్యాబ్‌లతో పాటు ఆసుపత్రుల్లో పరీక్షల నిమిత్తం వినియోగించవచ్చని విద్యార్థులు తెలిపారు. ఐఐటీ మద్రాస్‌కు చెందిన శ్రేయస్ బాలకార్తికేయన్ బృందం రూపొందించిన సింటాక్స్-ఏఐ(కరోనరి యాంజియోగ్రామ్)తో పాటు ఐఐటీహెచ్ విద్యార్థిని శ్రీలేఖ తయారుచేసిన ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు నుంచి కాపర్ వేరుచేసే ఆవిష్కరణలకు ద్వితీయ బహుమతులు లభించాయి.

చిరుధాన్యాల పోషకాహార కార్యక్రమాలకు ప్రోత్సాహం

- ఐఐఎంఆర్‌తో హరేకృష్ణ మూవ్‌మెంట్ అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలతో తారా సత్యవతి, సత్యగౌర చంద్రదాస, కౌంతేయ దాస

ఈనాడు, హైదరాబాద్– న్యూస్‌టుడే, నార్సింగి: చిరుధాన్యాల ఆధారిత పోషకాహార కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్(హెచ్‌కేఎంసీఎఫ్) భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ(ఐఐఎంఆర్)తో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకుంది. హైదరాబాద్ కోకాపేట్‌లోని హెచ్‌కేఎంసీఎఫ్ ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్, అక్షయపాత్ర ఫౌండేషన్‌ల అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభూజీ, ఐఐఎంఆర్ డైరెక్టర్ తారా సత్యవతి ఒప్పందంపై సంతకాలు చేశారు. చిరుధాన్యాల శుద్ధి, పోషక విలువల పెంపు, విలువ జోడింపు పరిజ్ఞానం బదిలీ, చిరుధాన్యాల ఆధారిత వంటకాల అభివృద్ధి, వంటశాలల సిబ్బందికి శిక్షణ, అవగాహన కార్యక్రమాల ద్వారా చిరుధాన్యాల ఆధారిత ఆహార కార్యక్రమాలను విస్తృతంగా ప్రోత్సహిస్తామని రెండు సంస్థలు ప్రకటించాయి. చంద్రదాస మాట్లాడుతూ.. "తెలంగాణలో ఇందిరమ్మ క్యాంటీన్లు, భోజనామృతం, ఏపీలో అన్న క్యాంటీన్లు వంటి పథకాల అమలులో భాగస్వామిగా హెచ్‌కేఎంసీఎఫ్ రోజూ సుమారు 2.5 లక్షల మందికి భోజనం అందిస్తోంది. ఐఐఎంఆర్‌తో ఒప్పందం ద్వారా మా ఆహార కార్యక్రమాల్లో చిరుధాన్యాలను సమ్మిళితం చేసి సమాజానికి మరింత మేలు చేకూర్చగలమని విశ్వసిస్తున్నాం" అని తెలిపారు. ఫౌండేషన్ సీఈవో కౌంతేయ దాస, శాస్త్రవేత్తలు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

త్వరలో ట్యాంక్‌బండ్‌పై ఫులే దంపతుల విగ్రహాలు

- సావిత్రిబాయి జయంత్యుత్సవంలో తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి



కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి. చిత్రంలో బెల్లం మాధవి, మణిమంజరి, శ్రీనివాస్‌గౌడ్, ఇందిరా శోభన్, జాజుల శ్రీనివాస్‌గౌడ్

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: అధికారపక్షంలో ఉన్నా, మంత్రిగా ఉన్నా వెనకబడిన జాతుల వెంట నడుస్తానని తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో సావిత్రిబాయి ఫులే జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వాకిటి శ్రీహరి మాట్లాడుతూ. . త్వరలో ట్యాంక్‌బండ్‌పై జ్యోతిరావు ఫులే, సావిత్రిబాయి ఫులే దంపతుల విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని, జిల్లా, మండల, గ్రామాల్లోనూ వారి విగ్రహాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, బీసీ ఐకాస ఛైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, నూతి శ్రీకాంత్, బాలలక్ష్మి, గుజ్జ కృష్ణ, మణిమంజరి, మీనగ గోపి బోయి, బెల్లం మాధవి, ఇందిరా శోభన్ తదితరులు పాల్గొన్నారు.

వటపత్రశయనుడిగా నరసింహుడు



యాదగిరిగుట్ట క్షేత్రంలో ఆలయ అధ్యయనోత్సవ పర్వంలో భాగంగా శనివారం స్తంభోద్భవుడిని వటపత్రశయనుడిగా అలంకరించి మాడ వీధుల్లో ఊరేగించారు. ప్రబంధ, విష్ణు పారాయణం నిర్వహించారు. రాత్రి వైకుంఠనాథుడి అలంకరణ జరిపి పరమ పదోత్సవం జరిపారు.

– న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట